

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 22 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 327
శనివారం 17-2-2024



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



మీ కిడ్నీలు కుశలమేనా?
-ఫ్యామిలీ / లైఫ్‌లో




వెడ్డింగ్ ప్లాన్ సింపుల్‌గా... సూపర్‌గా..!
-ఫ్యామిలీ / లైఫ్‌లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



69th ANNIVERSARY
₹1 డౌన్ పేమెంట్ | 36 నెలలు EMI
రిక్లయినర్ మేళా
69% వరకు తగ్గింపు
జీవిత కాలంలో ఒక్క సారి డీల్
ఎన్నడూలేని CRAZIEST డీల్స్!
17th శని వారం 18th ఆది వారం & 19th సోమ వారం
రిక్లైనర్ సోఫా సెట్ 3+2, 4 రిక్లైనర్స్‌తో
MRP ₹ 1,43,999 ₹ 59,999 PER DAY EMI ₹ 65
ఎల్ టైప్/లౌంజర్ సోఫా సెట్
MRP ₹ 43,999 ₹ 19,999 PER DAY EMI ₹ 22
సోఫా సెట్ 3+2+1
MRP ₹ 62,999 ₹ 29,999 PER DAY EMI ₹ 32
వెరోనా: ఆర్ట్ లెదర్ రిక్లైనర్ సోఫా సెట్ 3+1+1
MRP ₹ 83,499 ₹ 42,999 PER DAY EMI ₹ 46
ఆఫీస్ టేబుల్ 4'X2' 3 డ్రాస్‌తో + ఉచితం చైర్
MRP ₹ 17,490 ₹ 6,999 PER DAY EMI ₹ 8
బ్లూమ్స్‌బరీ రిక్లైనర్ సోఫా సెట్ : 3 సీటర్ 3 రిక్లైనర్స్‌తో + 2 సీటర్ 2 రిక్లైనర్స్‌తో
4 కప్ హోల్డర్స్ + 4 స్టోరేజ్ క్యాబినెట్స్ + ఉచితం సెంటర్ టేబుల్
MRP ₹ 1,89,999 ₹ 79,999 PER DAY EMI ₹ 86
ఉచితం
రిక్లైనర్ సోఫా సెట్ 3+2+1 (6 సీటర్)
MRP ₹ 1,44,999 ₹ 69,999 PER DAY EMI ₹ 75
కాగ్నాక్ బ్రాండెడ్ ఇటాలియన్ లెదర్ సోఫా సెట్ : 3+2
MRP ₹ 3,24,999 ₹ 1,49,999 PER DAY EMI ₹ 162
కేంబ్రిడ్జి సోఫా సెట్ 3+2+ ఉచితం 12 డబుల్ కలర్ పిల్లోస్ +
ఉచితం సెంటర్ టేబుల్ రూ. 10,000/- విలువ గలది
ఉచితం
MRP ₹ 1,24,999 ₹ 49,999 PER DAY EMI ₹ 54
మెలన్ సోఫా సెట్ : 3+2, 9 పిల్లోస్‌తో (5 ప్లెయిన్ మరియు 4 ఫార్ ఫర్)
MRP ₹ 1,01,499 ₹ 39,999 PER DAY EMI ₹ 43
బెడ్‌రూం సెట్ : కింగ్‌సైజ్ బెడ్
+ 2 బెడ్‌సైడ్ టేబుల్స్
+ 6 డోర్ వార్డ్‌రోబ్
+ 2 డ్రెస్సింగ్ మిర్రర్స్
MRP ₹ 1,74,990 ₹ 69,999 PER DAY EMI ₹ 75
ఇసబెల్లా లెదర్ ఎలక్ట్రికల్ రిక్లైనర్ సోఫా సెట్ 3+2+1
MRP ₹ 2,14,499 ₹ 99,999 PER DAY EMI ₹ 108
హ్యాంప్‌షైర్ డబుల్ మోటరైజ్డ్ రిక్లైనర్ సోఫా సెట్ 3+2+1
రీడింగ్ ల్యాంప్ వైర్‌లెస్ ఛార్జర్, ఎల్ఈడీ యాంబియంట్ లైట్ కంట్రోల్ బై బటన్ విత్ హైస్పీడ్ మోటార్
ఆమ్‌రెస్ట్ స్టోరేజ్ స్పేస్ 2 కప్ హోల్డర్స్ కన్సోల్ స్టోరేజ్ మెమొరీ ఫోమ్ కుషన్
MRP ₹ 3,19,999 ₹ 1,49,999 PER DAY EMI ₹ 162
ఎల్ టైప్ సోఫా సెట్ + ఉచితం సెంటర్ టేబుల్ రూ. 7,000 విలువ గలది
ఉచితం
MRP ₹ 52,999 ₹ 26,999 PER DAY EMI ₹ 29
లగ్జరీ ఇటాలియన్ మార్బుల్ డైనింగ్ టేబుల్ (సైజ్ 6X3 అడుగులు)
MRP ₹ 62,999 ₹ 19,999 PER DAY EMI ₹ 21
ప్రీమియం క్వాలిటీ బెడ్‌రూం సెట్ : హైడ్రాలిక్ బెడ్ 2 బెడ్‌సైడ్ టేబుల్స్‌తో +
డ్రెస్సింగ్ టేబుల్‌తోపాటు స్టూలు + 3 డోర్ వార్డ్‌రోబ్
MRP ₹ 2,16,999 ₹ 89,999 PER DAY EMI ₹ 97
బెండ్ గ్లాస్ డైనింగ్ టేబుల్ 4 చైర్లతో
MRP ₹ 23,999 ₹ 9,999 PER DAY EMI ₹ 11
యాంటియాక్ : సాలిడ్ ఉడెన్ డైనింగ్ టేబుల్ 6 సీటర్ (4 చైర్స్ + 1 బెంచ్)
MRP ₹ 54,999 ₹ 26,999 PER DAY EMI ₹ 29
సాలిడ్ ఉడెన్ డైనింగ్ టేబుల్
4 చైర్లతో
MRP ₹ 37,490 ₹ 14,999 PER DAY EMI ₹ 16
6 చైర్లతో
MRP ₹ 56,999 ₹ 19,999
బాటమ్ డ్రా స్టోరేజ్‌తో బెడ్
క్వీన్ సైజ్
MRP ₹ 42,499 ₹ 18,999 PER DAY EMI ₹ 20
కింగ్ సైజ్
MRP ₹ 43,999 ₹ 19,999
సింగిల్ సైజ్ MRP ₹ 10,499 ₹ 4,999
కింగ్ సైజ్ MRP ₹ 14,499 ₹ 6,999
మెటల్ కాట్
PER DAY EMI ₹ 5
ప్రీమియం ఉడెన్ డైనింగ్ టేబుల్
4 చైర్లతో
MRP ₹ 38,999 ₹ 15,999 PER DAY EMI ₹ 17
6 చైర్లతో
MRP ₹ 54,499 ₹ 21,999
MRP ₹ 13,499 ₹ 5,999 PER DAY EMI ₹ 6
సింగిల్ బెడ్
ఫ్రాన్స్ ప్రీమియం క్వాలిటీ స్టడీ టేబుల్
Credit Card EMI ₹ 146 (24 months)
MRP ₹ 7,490 ₹ 2,999
ప్రీమియం క్వాలిటీ వార్డ్‌రోబ్
PER DAY EMI ₹ 12
2 డోర్ MRP ₹ 27,449 ₹ 10,999
3 డోర్ MRP ₹ 39,990 ₹ 15,999
4 డోర్ MRP ₹ 54,990 ₹ 21,999
79950 00930
040-27841562
79933 33351
Scan to know more!
ఎక్స్చేంజ్ పాత ఫర్నీచర్ మరియు పొందండి 20% వరకు తగ్గింపు
An ISO-9001:2015 Certified Company
BANTIA Furnitures
Affordable Lifestyles Since 1955
ఎ.ఎస్.రావు నగర్
అత్తాపూర్
బోడుప్పల్
చందానగర్
దిల్‌సుఖ్‌నగర్
హైటెక్ సిటీ
జగిత్యాల
కర్మన్‌ఘాట్
కొంపల్లి
కూకట్‌పల్లి
నాగోల్
సికింద్రాబాద్
సిద్దిపేట
వరంగల్
www.bantia.in
బాంటియా ఎస్టేట్, సిఖ్‌రోడ్, సికింద్రాబాద్



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

2025.. దుబాయ్‌లో వచ్చేస్తోంది..





అదిగో ఫ్లయింగ్ ట్యాక్సీ.. ఇదిగో ఫ్లయింగ్ ట్యాక్సీ అనడమే తప్ప.. అవి వాస్తవ రూపంలోకి ఎప్పుడు వస్తాయన్నది మాత్రం ఇప్పటి వరకూ తేలలేదు. అయితే.. దుబాయ్‌లో వచ్చే ఏడాది నుంచి తాము ఈ సర్వీసులు నడపనున్నట్లు కాలిఫోర్నియాకు చెందిన జాబీ ఏవియేషన్ కంపెనీ ప్రకటించింది. ఈ మేరకు దుబాయ్ రోడ్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీతో ఆ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. దుబాయ్ ఎయిర్‌పోర్ట్, రైల్వే స్టేషన్ వద్ద ఇవి అందుబాటులో ఉంటాయి. ఎలక్ట్రిక్ మోటార్లతో నడిచే ఈ ట్యాక్సీల్లో పైలట్, మరో నలుగురు ప్రయాణించవచ్చు. దీనికి రన్‌వే అవసరం ఉండదు. హెలికాప్టర్ తరహాలో గాల్లోకి లేస్తుంది. ఒకసారి చార్జ్ చేస్తే.. 160 కిలోమీటర్ల దూరం వరకూ ప్రయాణించవచ్చు. గంటకు 320 కిలోమీటర్ల వేగంతో వెళ్తుంది. ఈ లెక్కన దుబాయ్ ఎయిర్‌పోర్ట్ నుంచి అక్కడి ప్రఖ్యాత పర్యాటక ప్రాంతం పామ్ జుమేరా(కృత్రిమ దీవులు)కు కేవలం 10 నిమిషాల్లో వెళ్లవచ్చు. రెగ్యులర్ ట్యాక్సీల్లో అయితే.. ఇందుకు 45 నిమిషాల సమయం పడుతుంది. టికెట్లను యాప్‌లో బుక్ చేసుకోవచ్చు. ధర విషయాన్ని ఇంకా ప్రకటించనప్పటికీ.. హెలికాప్టర్ ట్రిప్‌కు అయ్యే ఖర్చు కన్నా.. తక్కువే ఉంటుందని కంపెనీ తెలిపింది. విమానంలా కాకుండా.. ఒక ఎస్‌యూవీలో ప్రయాణిస్తున్న అనుభూతిని ఇది కలిగిస్తుందని జాబీ ఏవియేషన్ పేర్కొంది.

- కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో చర్యలు
- త్వరలో పర్యావరణ ప్రభావ అంచనా అధ్యయనం
- జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశంతో చర్యలు
- అప్పా కూడలి నుంచి మన్నెగూడ వరకు 46 కి.మీ. నిడివి ఆరులేన్లుగా విస్తరణ
- ఈ దారిలో 890 వరకు మర్రి వృక్షాలు



ఆ మర్రి వృక్షాలను కాపాడేందుకు రంగంలోకి నిపుణులు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నగర శివారులోని అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ కూడలి వరకు ఆరు వరుసల రోడ్డు నిర్మాణ విషయంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. అప్పా కూడలి నుంచి మన్నెగూడ వరకు ఉన్న 46 కి.మీ. నిడివిలో ఉన్న 890 మర్రి చెట్ల (ఈ సంఖ్య విషయంలో భిన్న లెక్కలున్నాయి) భవితవ్యం తేల్చేందుకు కేంద్ర పర్యావరణ,అటవీ మంత్రిత్వ శాఖ వచ్చే త్వరలో పర్యావరణ ప్రభావ అంచనా (ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్) అధ్యయనం నిర్వహించబోతోంది. జాతీయ హరిత ట్రిబ్యునల్ దక్షిణాది బెంచ్ ఈమేరకు ఇటీవల ఆదేశించటంతో కేంద్ర ప్రభుత్వం ఈమేరకు నిర్ణయం తీసుకుంది. ఇందుకు ప్రత్యేకంగా నిపుణులతో ఓ కమిటీని ఏర్పాటు చేస్తోంది. ఇటీవల నేషనల్‌హైవే అథారిటీ ఆఫ్ ఇండియా తెలంగాణ అధికారులతో ఓ సమావేశం నిర్వహించి ఈమేరకు చర్యలు ప్రారంభించింది. పక్షం రోజుల్లో అధ్యయనం పూర్తి చేసి, ఆ మర్రి చెట్ల పరిరక్షణకు సూచనలు చేయనుంది. గరిష్ట సంఖ్యలో వృక్షాలను కాపాడుతూ, రోడ్డు నిర్మాణంతో వాటికి అతి తక్కువ నష్టం వాటిల్లేలా ప్రత్యామ్నాయ చర్యలను ఈ అధ్యయనంలో నిర్ధారిస్తారు.

ఎందుకీ అధ్యయనం..

కొత్తగా ఓ రోడ్డు నిర్మించేటప్పుడు అక్కడ చెట్లు తొలగించాల్సి ఉంటే ముందస్తు సమాచారంతో గ్రామసభలు నిర్వహిస్తారు. ఇందులో పర్యావరణ వేత్తలు, స్థానిక ప్రజలు పాల్గొని.. ఆ చెట్ల తొలగింపుతో ఎదురయ్యే పరిణామాలను అధికారుల దృష్టికి తీసుకెళ్తారు. చెట్లను తొలగంచటం వల్ల ఎదురయ్యే దుష్ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రత్యామ్నాయంగా తీసుకునే చర్యలేంటో అధికారులు వివరిస్తారు. వృక్షాలకే కాకుండా అక్కడి జంతుజాలానికి కూడా నష్టం కాకుండా తీసుకునే చర్యలను వివరిస్తారు. కొత్తగా నిర్మించే గ్రీన్‌ఫీల్డ్ హైవేల్లో ఈ తరహా సమావేశాలు నిర్వహించటం తప్పనిసరి. కానీ, అప్పటికే ఉన్న రోడ్డును విస్తరించే సందర్భంలో వంద కి.మీ.లోపు నిడివి ఉంటే ఈ తరహా సమావేశాలు కచ్చితంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదు. మన్నెగూడ నుంచి పరిగి మీదుగా విస్తరణ పనులను ఆ విభాగం ఇప్పటికే చేపట్టింది. కానీ, నగర శివారులోని అప్పా జంక్షన్ నుంచి వికారాబాద్ రోడ్డు మీద ఉన్న మన్నెగూడ వరకు విస్తరణ పనులను ఎన్‌హెచ్ఏఐ చేపట్టాల్సి ఉంది. ఈ రోడ్డు మీద దాదాపు వందేళ్ల క్రితం నాటికి మర్రి వృక్షాలున్నాయి. గతంలో హైదరాబాద్ చుట్టూ అన్ని రోడ్ల మీద మర్రి వృక్షాలుండేవి. వాటి వయసు 80 ఏళ్ల నుంచి 120 ఏళ్ల వరకు ఉండేవి. కానీ రోడ్ల విస్తరణతో ఆ వృక్షాలు మటుమాయమయ్యాయి. నాటి వృక్షాలు ఉన్న ఏకైక రోడ్డు చేవెళ్ల హైవే మాత్రమే. ఇప్పుడు ఈ రోడ్డు విస్తరణలో ఆ వృక్షాలు కూడా మాయమయ్యే ప్రమాదం పొంచి ఉండటంతో పర్యావరణ వేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ నేషనల్ గ్రీన్‌ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు.ఏడాదిన్నర నుంచి వాదోపవాదాలు జరగ్గా, ఇటీవల ట్రిబ్యునల్ మధ్యంతర ఉత్తర్వు జారీ చేసింది. ఈ రోడ్డు విస్తరణలో కూడా కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ ప్రభావ అంచనా అధ్యయనం నిర్వహించాలని ఆదేశించింది. దీంతో ఇప్పుడు ఆ అధ్యయనం అనివార్యం కావటంతో కేంద్రప్రభుత్వం చర్యలు ప్రారంభించింది.

పనుల్లో మరింత జాప్యం..

ఈ రోడ్డు విస్తరణకు 2019లో కేంద్రప్రభుత్వం రూ.929 కోట్లు మంజూరు చేసింది. 60 మీటర్ల మేర విస్తరించి ఎక్స్‌ప్రెస్ వేగా మారుస్తారు. మొయినాబాద్, చేవెళ్ల పట్టణాలున్న చోట విస్తరణ సాధ్యం కానందున, ఆ రెండు చోట్ల ప్రత్యామ్నాయంగా బైపాస్‌లు నిర్మించనున్న విషయం తెలిసిందే. అన్ని సర్వేలు, టెండర్ల ప్రక్రియ పూర్తయి రోడ్డు నిర్మాణానికి సిద్ధమైన తరుణంలో ఈ కేసు అడ్డుపడింది. దీంతో అప్పటి నుంచి పనులు మొదలు కాలేదు. ఇప్పుడు కొత్త అధ్యయనం నేపథ్యంలో మరింత జాప్యం జరగనుంది. కొన్నేళ్లుగా వాహనాల సంఖ్య విపరీతంగా పెరగటంతో రోడ్డు ఇరుకుగా మారి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆరోడ్డు మీద ఉండాల్సిన ట్రాఫిక్ కంటే 48 శాతం వాహనాలు ఎక్కువగా తిరుగుతున్నాయి. ఏడాదికి 250 వరకు ప్రమాదాలు చోటు చేసుకుంటుండగా, దాదాపు 45 మంది వరకు మృత్యువాత పడుతున్నారు. వీలైనంత తొందరగా ఆ రహదారిని విస్తరించాల్సి ఉండగా, రకరకాల సమస్యలతో జాప్యం జరుగుతోంది. దాన్ని అలాగే ఉంచి పూర్తి కొత్త రోడ్డును నిర్మించాలంటే ఖర్చు భారీగా పెరుగుతోందని యంత్రాంగం ఆందోళన చెందుతోంది. దీంతోపాటు అంత నిడివిలో కొత్త రోడ్డుకు కావాల్సిన భూసేకరణ కూడా కష్టంగా మారుతుందని పేర్కొంటోంది.

ఏం జరుగుతుంది..

గతంలో నగరంలో గండిపేట రోడ్డు విస్తరణ సమయంలో ఇలాంటి భారీ వృక్షాలను నిర్దాక్షిణ్యంగా తొలగించారు. దీంతో ఆ ప్రాంతంలో పర్యావరణం పరంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పుడు ఈ రోడ్డుమీద వేయికి చేరువలో మర్రి వృక్షాలున్నందున, వాటిని తొలగిస్తే పర్యావరణంతోపాటు పక్షిజాతిపై పెనుప్రభావం ఉంటుందన్న అంచనా ఉంది. కచ్చితంగా ఆ వృక్షాలను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. వృక్షాలు ఎక్కువగా ఉన్న చోట పాత రోడ్డుకు ప్రత్యామ్నాయంగా కొత్త అలైన్‌మెంట్ చేయటం, మిగిలిన వాటిల్లో వీలైనంత సంఖ్యలో చెట్లను ట్రాన్స్‌లొకేట్ చేసి తిరిగి చిగురింపచేయటం, కొన్నింటిని కొట్టేయక తప్పని స్థితి నెలకొంటే వాటికి నాలుగైదు రెట్ల సంఖ్యలో కొత్తగా మర్రి మొక్కలు నాటి పెంచాల్సి ఉంటుంది. ఇలాంటి చర్యలను ఆ అధ్యయనం ద్వారా సూచిస్తారు.

ఓవరాల్ చాంపియన్ తెలంగాణ పోలీస్

ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో 5 బంగారు, 7 వెండి పతకాలు • 'ఎక్స్'లో సీఎం అభినందన

సాక్షి, హైదరాబాద్ : తెలంగాణ పోలీసులు జాతీయస్థాయిలో సత్తా చాటారు. లక్నోలో నిర్వహించిన ఆల్‌ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో వివిధ పోటీల్లో కలిపి మొత్తం ఐదు బంగారు పతకాలు, ఏడు వెండి పతకాలు తెలంగాణ పోలీస్‌శాఖకు దక్కాయి. ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించి, ప్రతిష్టాత్మకమైన చార్మినార్ ట్రోఫీ దక్కించుకున్నారు.12 ఏళ్ల తర్వాత తెలంగాణ పోలీసులు ఈ ఘనత సాధించారు.

శెభాష్ తెలంగాణ పోలీస్: ప్రతిభను చాటిన తెలంగాణ పోలీసులను అభినందిస్తూ ట్విట్టర్(ఎక్స్) వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం ఓ ట్వీట్ చేశారు. 'పతకాలు సాధించిన విజేతలు, డీజీపీ రవిగుప్తా, మొత్తం తెలంగాణ పోలీస్ విభాగానికి శుభాకాంక్షలు 'అని సీఎం అభినందించారు. బంగారు పతకాలు సాధించిన వారిలో జి.రామకృష్ణారెడ్డి, డి.విజయ్‌కుమార్, వి.కిరణ్‌కుమార్, పి.అనంతరెడ్డి, ఎం.దేవేందర్‌ప్రసాద్, వెండి పతకాలు సాధించినవారిలో పి.పవన్, ఎస్.వెంకటరమణ, ఎం.హరిప్రసాద్, కె.శ్రీనివాస్, షేక్‌ఖాదర్ షరీఫ్, సీహెచ్.సంతోష్, కె.సతీష్‌లు ఉన్నారని డీజీపీ రవిగుప్తా తెలిపారు.



ఆయా విభాగాల వారీగా చూస్తే..

- కేసుల దర్యాప్తులో శాస్త్రీయ ఆధారాల సేకరణ విభాగంలో ఒక బంగారు, ఒక వెండి పతకం
- పోలీస్ ఫొటోగ్రఫీ విభాగంలో ఒక బంగారు, ఒక వెండి పతకం
- డాగ్ స్క్వాడ్ పోటీల్లో ఒక బంగారు, ఒక వెండి పతకం
- యాంటీ స్టాబేజ్ చెక్‌లో రెండు బంగారు, మూడు వెండి పతకాలు
- పోలీస్ వీడియోగ్రఫీలో ఒక వెండి పతకం దక్కాయి.
- జాతీయస్థాయిలో రెండోస్థానంలో నిలిచిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌కు ఒక వెండి, మూడు కాంస్య పతకాలు, మూడోస్థానంలో నిలిచిన ఐటీబీపీ సిబ్బందికి ఒక బంగారు, నాలుగు కాంస్య పతకాలు దక్కాయి.

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 327

శనివారం 17-2-2024





డకెట్ 'బజ్‌బాల్'

ఇంగ్లండ్ ఓపెనర్ మెరుపు సెంచరీ. ఇంగ్లండ్ 207/2. -15లో



నాలుగో రోజూ లాభాలు

సెన్సెక్స్ లాభం 376 పాయింట్లు... 22 వేల పైకి నిఫ్టీ -15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

నేడు ప్రాజెక్టులపై శ్వేతపత్రం

- నీటిపారుదల రంగంపై మంత్రి ఉత్తమ్ ప్రజెంటేషన్ కూడా..
- శుక్రవారం నాటి అసెంబ్లీ ఎజెండాలో ఉన్నా వేరే అంశాలపై చర్చతో జాప్యం
- అలస్యమైనా సరే చర్చించాలంటూ పట్టుబట్టిన బీఆర్‌ఎస్, బీజేపీ
- ఎక్కువ మంది సభ్యులు మాట్లాడటానికి వీలుగా వాయిదా కోరిన అధికార పక్షం
- ఈ ప్రతిపాదనకు సరేనన్న ఎంఐఎం, సీపీఐ..
- కేసీఆర్‌పై మంత్రి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలతో సభలో గందరగోళం
- వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలిపిన బీఆర్‌ఎస్ సభ్యులు
- అసెంబ్లీ నేటి ఉదయం 10 గంటలకు వాయిదా

2లో

రాష్ట్రవ్యాప్తంగా కులగణన

ప్రభుత్వ తీర్మానానికి శాసనసభ ఏకగ్రీవ ఆమోదం

ఇంటింటా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే

- సమగ్ర కుటుంబ సర్వేకు సర్కార్ నిర్ణయం
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఇతర వర్గాల అభ్యున్నతికి చేపట్టాల్సిన ప్రణాళికల రూపకల్పన లక్ష్యం
- తీర్మానం ప్రవేశపెట్టిన మంత్రి పొన్నం
- అందరి సలహాలు తీసుకొని విధివిధానాలు రూపొందిస్తామని వెల్లడి
- చర్చలో పాల్గొన్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, బీఆర్‌ఎస్ సభ్యుడు కేటీఆర్ తదితరులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే (కులగణన) పేరుతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జరిపేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. వెనుకబడిన తరగతులతోపాటు ఎస్సీ, ఎస్టీ ఇతర వర్గాల అభ్యున్నతికి చేపట్టాల్సిన ప్రణాళికలను రూపొందించేందుకు ఉద్దేశించిన ఈ తీర్మానాన్ని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం సభ ముందుంచారు. సీఎం ఎ.రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, బీఆర్‌ఎస్ సభ్యులు కేటీఆర్, గంగుల కమలాకర్, కడియం శ్రీహరి, కాలేరు వెంకటేశ్, కాంగ్రెస్ సభ్యులు వాకాటి శ్రీహరి, శంకరయ్య, ఆది శ్రీనివాస్, ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ, బీజేపీ సభ్యుడు పాయల్ శంకర్, సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు చర్చలో పాల్గొన్నారు.

చట్టం అవసరం లేదు: పొన్నం ప్రభాకర్

జనాభా దామాషా పద్ధతిలో రాష్ట్రంలో అన్ని వర్గాలకు న్యాయం చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కులగణన ఎలా చేయాలనే దానిపై అందరి అభిప్రాయాలు, సలహాలు తీసుకొని ముందుకు వెళ్తామని, ఇందుకు సంబంధించిన విధివిధానా లు రూపొందిస్తామని చెప్పారు. కులగణన తీర్మానంపై సభలో జరిగిన చర్చకు ఆయన బదులిచ్చారు. కులగణనకు ఎలాంటి చట్టం అవసరం లేదని, మిగతా 2వ పేజీలో ▶



కులగణన తీర్మానంలో మా చిత్తశుద్ధిని ప్రతిపక్షాలు శంకించాల్సిన అవసరం లేదు. పాలితులను పాలకులుగా చేయాలనేది మా తపన. కులగణనను మరింత మెరుగ్గా నిర్వహించేందుకు విపక్ష సభ్యులు సూచనలు, సలహాలు ఇవ్వాలి. - సీఎం రేవంత్‌రెడ్డి



కులగణన విషయంలో న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా తగిన సలహాలు, సూచనలు తీసుకున్నాం. బీసీలకు సబ్‌ప్లాన్ కూడా తీసుకొస్తాం. సర్వే అనంతరం బీసీల శాతాన్ని కూడా ప్రకటిస్తాం. - డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



చట్టబద్ధత కల్పిస్తేనే కులగణన ఫలవంతమవుతుంది. బీసీల అభ్యున్నతి కోసం బీఆర్‌ఎస్ మొదటి నుంచీ పనిచేస్తోంది. 2004లోనే కేసీఆర్.. నాటి ప్రధాని మన్మోహన్‌ను కలిసి ఓబీసీలకు మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. - కేటీఆర్

విద్యలో వండర్

ఆన్‌లైన్ లెర్నింగ్ సంస్థ 'ఎడెక్స్ (edX)'తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం

2 వేలకు పైగా కోర్సులను వర్టికల్స్‌గా చదువుకునే గోల్డెన్ చాన్స్: సీఎం జగన్

- ఎంఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, హార్వర్డ్ అందించే కోర్సులను ఇక్కడి నుంచే ఉచితంగా నేర్చుకునే అవకాశం
- తద్వారా విద్యార్థులకు అంతర్జాతీయ వర్సిటీల సర్టిఫికేషన్.. 12 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా 'ఎడెక్స్' కోర్సులు

- వివరాలు 12లో

'ఫైబర్' ఫ్రాడ్ సూత్రధారి బాబే




'టెరాసాఫ్ట్'కు అడ్డగోలుగా ఫైబర్‌నెట్ ప్రాజెక్టు

- నేరచరితుడు వేమూరి కంపెనీకి పనులు
- బ్లాక్ లిస్ట్ నుంచి తొలగించి మరీ అప్పగింత
- రూ. 333 కోట్ల తొలిదశ పనుల్లో ప్రజాధనం లూటీ
- నకిలీ ఇన్‌వాయిస్‌లతో షెల్ కంపెనీల ద్వారా తరలింపు
- విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో సీఐడీ చార్జ్‌షీట్
- ఏ1 చంద్రబాబు, ఏ 2 వేమూరి, ఏ 3 కోగంటి

12లో

మన శరీరంలో పేరుకుపోయే వ్యర్థాలను ఎప్పటికప్పుడు బయటకు పంపించేందుకు కిడ్నీలు ఎప్పుడూ శ్రమిస్తూనే ఉంటాయి. అందుకుగాను మనం తగినంత నీటిని తాగడంతోపాటు కిడ్నీలను సురక్షితంగా ఉంచే ఆహారాలను తీసుకోవాలి. అయితే కొందరిలో పలు కారణాల వల్ల కిడ్నీ సమస్యలు వస్తుంటాయి. ఈ క్రమంలోనే వారిలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. అవేమిటో తెలుసుకుంటే ముందే జాగ్రత్త పడవచ్చు. ఆ లక్షణాలేమిటో తెలుసుకుందాం.



మీ కిడ్నీలు కుశలమేనా?

తరచూ మూత్రానికి వెళ్లాల్సి వస్తే దాన్ని కిడ్నీ సమస్యగా అనుమానించాలి. అయితే డయాబెటిస్ ఉన్నవారిలో సహజంగానే ఇలా జరుగుతుంది. కనుక ఆ వ్యాధి ఉందో, లేదో చెక్ చేయించుకోవాలి. ఒకవేళ డయాబెటిస్ లేకపోయినా మాటిమాటికీ మూత్రానికి వెళ్లాల్సి వస్తుందంటే.. దాన్ని కిడ్నీ సమస్యగా అనుమానించాలి.

- కిడ్నీ సమస్యలు ఉన్నవారిలో ముఖం అంతా వాపులకు గురై ఉబ్బిపోయి కనిపిస్తుంది. కాలి మడమలు, కాళ్లు, పాదాలు, చేతులు ఉబ్బిపోయి కనిపిస్తాయి
- కిడ్నీ సమస్యలు ఉంటే తీవ్రమైన అలసట వస్తుంది. కొందరిలో రక్తహీనత సమస్య కూడా ఏర్పడుతుంది
- చర్మం పొడిగా మారి దురదలు పెడుతుంది
- నోటి దుర్వాసన ఉంటుంది
- కిడ్నీ సమస్యలు ఉంటే కొందరిలో జ్ఞాపకశక్తి తగ్గుతుంది. కొందరికి తల తిరిగినట్లు అనిపిస్తుంది
- కిడ్నీ సమస్యలు ఉన్నవారిలో వెన్ను నొప్పి వస్తుంటుంది
- వాంతి వచ్చినట్లుగా... వికారంగా అనిపిస్తుంది
- కిడ్నీ సమస్యలు ఉంటే శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది
- కిడ్నీ సమస్యలు ఉన్నవారు వేడి వాతావరణంలో ఉన్నప్పటికీ చలిగా అనిపిస్తుంది. కొందరు వణుకుతారు.

పైన తెలిపిన లక్షణాలు కనుక ఎవరిలో అయినా ఉంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యుని సంప్రదించి వారి సలహా మేరకు సంబంధిత పరీక్షలు చేయించుకోవాలి. అవసరం అయితే మందులను వాడాల్సి ఉంటుంది. దీంతోపాటు కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచే ఆహారాలను తినాలి. ఇలా చేయడం వల్ల కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

వెడ్డింగ్ ప్లాన్

సింపుల్‌గా... సూపర్‌గా..!

ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు అన్నారు పెద్దలు. అంటే మన సమాజంలో ఈ రెండు విషయాలూ ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్న విషయాలన్నమాట. ఎందుకంటే ఒకవైపు ఖర్చు ఎంత పెట్టినా ఇంకా పెట్టాలేమో అన్నట్లుగా ఉంటుంది. ఎక్కడ పెంచాలో.. ఎక్కడ తగ్గించుకోవాలో అర్థం కాదు.. సరైన ప్లానింగ్ లేకపోతే అంతా గందరగోళమే. చివరికి తడిసి మోపెడవడం ఖాయం. తీరా అంత ఖర్చు పెట్టాక మనసుకు సంతృప్తి లేకపోతే మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. అందుకే పెళ్లి విషయంలో ముందస్తు ప్రణాళిక అవసరం.



భారతీయ సంప్రదాయంలో పెళ్లికి ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. కన్యాదాత ఎంతో హంగు, ఆర్భాటాలతో పెళ్లి చేస్తాడు. ఒకోసారి వరుడి తరపు వారే పెళ్లి ఖర్చులు పెట్టుకోవడం, లేదా ఖర్చును ఇద్దరూ కలిసి పంచుకోవడం... ఏ రకంగా చూసినా సరే, జీవితంలో ఒక్కసారే జరిగే సంబరం కావడంతో ఖర్చుకు ఎక్కడా వెనుకాడరు. పెళ్లి శుభలేఖ దగ్గర నుంచి.. మండపాలంకరణ వరకు, పెళ్లిబట్టల నుంచి నగల వరకు; టిఫిన్ల దగ్గర నుంచి విందు భోజనాల వరకు... ఇలా ప్రతిదీ ఖర్చుతో కూడుకున్నదే. భారతీయులు సగటున పెళ్లికోసం చేస్తున్న ఖర్చు రూ. 5 లక్షల నుంచి రూ. కోటికి పైగా ఉంటుందన్నది ఒక అంచనా.



ఇల్లలకగానే పండగా... అన్నట్లు ఉన్నదంతా వదిలించుకుని లేదా లేకపోతే అప్పులు చేసి మరీ పెళ్లి చేసిన తర్వాత ఆ జంట కాపురం కోసం మరి కొంత ఖర్చు చేయాల్సి వస్తుంది. ఏది తక్కువైనా నవ్వుల పాలు కావడం ఖాయం. అయితే వైభవంగా పెళ్లి చేయడం వరకు తప్పేం లేదు కానీ స్తోమతకు మించి అప్పులు చేయడంలోనే అభ్యంతరం... తప్పనిసరి వాటికి ఎలాగూ ఖర్చు తప్పదు కానీ కాస్త ఆచి తూచి ప్లాన్ ప్రకారం చేస్తే పెళ్లికి అయ్యే వృథా ఖర్చును కొంత తగ్గించవచ్చు. అదెలాగో చూద్దాం...



ముందస్తు ప్రణాళిక ...
పెళ్లి ఎంత గ్రాండ్ గా చేశాం అనే దానికన్నా ఎంత ప్రణాళికాబద్ధంగా ఆర్గనైజ్ చేశామన్నది ముఖ్యం. అనుకున్న బడ్జెట్ లోపు చేయాలంటే ఖర్చు ఎక్కడ పెట్టాలి.. ఎక్కడ తగ్గించుకోవాలో ముందుగానే నిర్ణయించుకోవాలి. ఇందుకోసం పెళ్లి తంతులో వివిధ ఘట్టాలకు అవసరమైన వస్తు సామగ్రిని ముందుగానే జాబితా రాసుకోవాలి. అవసరమైతే మండపం, అలంకరణ, కేటరింగ్ వంటి వాటిని ఒకరికే కాంట్రాక్ట్ ఇస్తే కొంతమేరకు ఖర్చు తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే పర్యవేక్షణ కూడా బావుంటుంది. వస్త్రాలు, నగలు కూడా అవసరం మేరకే కొనుగోలు చేయాలి.

అతిథుల జాబితా అన్నింటికన్నా ముఖ్యం...
పెళ్లి అంటేనే సకుటుంబ సపరివారంతోపాటు బంధు మిత్రులు, శ్రేయోభిలాషులు అంతా హాజరు కావాలని అందరూ కోరుకుంటారు. అందుకోసం బంధువులకు ఒకటని, మిత్రులకు మరొకటని కార్డులు ప్రింట్ చేయిస్తుంటారు. ఇక్కడ కూడా ఖర్చు తగ్గించుకునే అవకాశం ఉంటుంది. అందరికీ కామన్‌గా ఒకే ఆహ్వాన పత్రిక ఉంటే ఖర్చు తగ్గుతుంది. సేహితులకు కార్డులు కొట్టించే బదులు ఈ ఇన్విటేషన్ల ద్వారా కూడా ఆహ్వానం పంపుకోవచ్చు. అలాగే పెళ్లిలో మెహందీ అని, సంగీత్ అని, హల్దీ అనీ, రిసెప్షన్ అనీ ఇలా చాలా రకాల ఈవెంట్స్ చేస్తున్నారు. పెళ్లికూతురు దగ్గర కొన్ని, పెళ్లి కొడుకు వద్ద మరికొన్ని.. ఇద్దరిని కలిపి కొన్ని ఈవెంట్స్ ప్లాన్ చేస్తున్నారు. వీటికి ఎవరెవరిని పిలవాలనే దానిపై కూడా కసరత్తు చేయాలి. అప్పుడు ఏ ఈవెంట్ కు ఎంతమంది వస్తారో అవగాహన ఉంటుంది కాబట్టి.. అందుకనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలి.

ముందుగా బడ్జెట్ వేసుకోండి... పెళ్లికి ముందు బడ్జెట్ సిద్ధం చేసుకోవాలి. బడ్జెట్ లేకుండా వెడ్డింగ్ ఫంక్షన్ నిర్వహిస్తే ఖర్చులు భారీగా ఉంటాయి. మీ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ సిద్ధం చేసుకోవడం మొదటి పని. వివాహం అలా చేసుకోవాలని ఇలా చేసుకోవాలని చాలా కోరికలు ఉంటాయి. కానీ అవసరమైన వాటిని మాత్రమే కొనుగోలు చేయాలని గుర్తుంచుకోండి. ఉదాహరణకు వివాహానికి బట్టలు, ఆభరణాలు అవసరం. అలాగని ఖరీదైన బట్టలు, ఆభరణాలు అవసరం లేదు. బడ్జెట్‌లో వచ్చే వాటిని తీసుకోవడం ఉత్తమం.

క్యాటరింగ్: పెళ్లి విందులకు డబ్బు గుడ్డిగా ఖర్చు చేస్తారు. చాలా పెళ్లిళ్లలో ఆహారం వృథా అవడం గమనిస్తూనే ఉంటాం. వివాహ విందు మెనులో అవసరమైన ఆహార పదార్థాలను మాత్రమే చేర్చండి. లేనిపోని గొప్పల కోసం మెనూని పెంచవద్దు. హాజరయ్యే అతిథుల సంఖ్యకు అనుగుణంగా క్యాటరింగ్ సిద్ధం చేసుకోవాలి.



అలంకరణ సామగ్రి
పెళ్లి ఇంట్లో చాలా అలంకరణ ఉంటుంది. అవసరమైన అలంకరణ వస్తువులు మాత్రమే తీసుకోవాలి. వీటిలో పువ్వులు చాలా ముఖ్యమైనవి. వాటిని చౌకగా ఉన్న ప్రదేశాల నుంచి కొనుగోలు చేస్తే కొంత డబ్బు ఆదా అవుతుంది.



హనీమూన్ ట్రిప్... పెళ్లితంతు ముగిసిన తర్వాత నూతన వధూవరుల హనీమూన్ కోసం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. హనీమూన్ డెస్టినేషన్లుగా పేరుగాంచిన దేశాలకు ఎగిరిపోతున్నారు. ఇది కూడా బడ్జెట్ పెరగడానికి కారణం అవుతుంది. దీని బదులుగా మన దేశంలోనే అనువైన ప్రాంతాలను ఎంచుకుంటే చాలా సమయంతో పాటు ధనమూ ఆదా అవుతుంది. ఒకవేళ విదేశాలకే వెళ్లాలనుకుంటే తక్కువ ఖర్చుతో వెళ్లి రాగలిగే మలేసియా, థాయ్‌ల్యాండ్ వంటివి ఎంచుకుంటే సరిపోతుంది.




శరీరంలో స్రవించే హార్మోన్లలో ఒక్కోసారి చోటు చేసుకునే కొన్ని రకాల అసమతౌల్యతల కారణంగా చాలా ఒత్తిడికి లోనవుతుండటం లేదా మూడ్ ఆఫ్ కావడం మామూలే. అయితే దాన్ని సరిచేయడానికి మందులు మింగే బదులు కొన్ని ఆహారాలను తీసుకోవడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యాలు దృఢంగా ఉంటాయి. ఆ ఆహారాలేమిటో తెలుసుకుని, మూడ్ బాగుండనప్పుడు వాటిని తీసుకుంటే సరి!

మూడ్‌ని మార్చే ఫుడ్



ఒక్కొక్కసారి మనకు తెలియకుండానే మూడ్ పాడవుతుంది. ఏదో పోగొట్టుకున్నట్లు... వెలితిగా... ఒకలాంటి బాధగా అనిపిస్తుంది. అలాంటప్పుడు కొన్నిరకాల ఆహారాలను తీసుకోవడం వల్ల వెంటనే మూడ్ సరవుతుంది. అవేమిటో తెలుసుకుందాం...

పాలకూర.. ఐరన్ పాళ్లు అధికంగా ఉండే పాలకూర సంతోషకరమైన హార్మోన్లను పెంచడానికి పనిచేస్తుంది. అంతేకాదు, ఇందులో ఫైబర్, విటమిన్ ఇ పుష్కలంగా ఉండటం వల్ల జీర్ణవ్యవస్థకు, చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. పాలకూర స్మూతీ, సూప్ లేదా పాలకూరను ఏదో ఒక రూపంలో ఆహారంలో తీసుకోవడం చాలా ఉపయోగకరంగా ఉంటుంది.



మష్రూమ్స్.. మష్రూమ్స్ యాంటి డిప్రెసెంట్ లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. ఇందులో సమృద్ధిగా ఉండే విటమిన్ డి మానసిక స్థితిని నియంత్రిస్తుంది. ఇది సెరటోనిన్ సంశ్లేషణ స్థాయికి సంబంధించినది. దీని కారణంగా వ్యక్తి సంతోషకరమైన భావోద్వేగాలను అనుభవించగలడు. మీ మూడ్ ఆఫ్‌లో ఉన్నప్పుడు, మష్రూమ్ రెసిపీని తినడం వల్ల తిరిగి మంచి మూడ్‌లోకి వచ్చేసే అవకాశం మెండుగా ఉంది. ప్రయోజనకరంగా ఉంటుంది.

అవకాడో.. కొద్దికాలం క్రితం నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం అవకాడోలో పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇందులో ఉండే విటమిన్ బి3 ,ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్‌లు సంతోషకరమైన హార్మోన్ అయిన సెరోటోనిన్ ఉత్పత్తిని పెంచడంలో సహాయపడతాయి. రోజంతా సంతోషంగా ఉండటానికి సలాడ్, శాండ్‌విచ్ లేదా అల్పాహారంలో అవకాడోను చేర్చవచ్చు.



డ్రై ఫ్రూట్స్.. ప్రతిరోజూ కొన్ని బాదం లేదా వాల్‌నట్‌లను తినడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది, ఒత్తిడి తగ్గుతుంది. డ్రై ఫ్రూట్స్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల వల్ల ఇలా జరుగుతుంది.

డార్క్ చాకొలెట్.. ఓ నివేదిక ప్రకారం డార్క్ చాకొలెట్ తినడం వల్ల శరీరంలో సంతోషకరమైన హార్మోన్ల స్థాయి పెరుగుతుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మానసిక స్థితిని మెరుగుపరుస్తాయి. ఇందులో ఉండే ట్రిప్టోఫాన్ సెరోటోనిన్ స్థాయిలను పెంచుతుంది. ఫలితంగా వెంటనే మూడ్ సరవుతుంది. మూడ్ బాగుండనప్పుడు ఈ ఫుడ్ ప్రయత్నించండి.



సినిమా

దేవర డేట్ ఫిక్స్



● ఎన్టీఆర్

రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకున్నాడు 'దేవర'. ఈ ఏడాది అక్టోబరు 10న 'దేవర' చిత్రం తొలి భాగం విడుదల కానుంది. 'జనతా గ్యారేజ్' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబోలో వస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ఓ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. నందమూరి కల్యాణ్ రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. కాగా తొలి భాగాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 5న విడుదల చేయాలనుకున్నారు. కానీ వాయిదా వేశారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో అక్టోబరు 10న సినిమాని విడుదల చేయనున్నట్లు శుక్రవారం వెల్లడించారు మేకర్స్.

ఈ ప్రపంచాన్నే మనం బహిష్కరిద్దాం



● రాజేంద్రప్రసాద్, జయప్రద

'ఈ ప్రపంచం మన ప్రేమని తిరస్కరిస్తే.. ఈ ప్రపంచాన్నే మనం బహిష్కరిద్దాం' (రాజేంద్ర ప్రసాద్), 'అందరూ నన్ను ఏడిపించినవాళ్లే.. కానీ, నాకోసం ఏడ్చింది నువ్వు ఒక్కడివే' (జయప్రద) వంటి డైలాగులు 'లవ్ @65' మూవీ ట్రైలర్‌లో ఉన్నాయి. రాజేంద్ర ప్రసాద్, జయప్రద ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'లవ్ @65'. వీఎస్ ఆదిత్య దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కార్తీక్ రాజు, స్పందన పల్లి ముఖ్య పాత్రలు పోషించగా, సునీల్, అజయ్ ప్రత్యేక పాత్రల్లో కనిపించనున్నారు. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానున్న సందర్భంగా శుక్రవారం ట్రైలర్‌ని విడుదల చేశారు. 'రాత్రి ఇక్కడి నుంచి ఇద్దరు మిస్ అయిపోయారు సార్', 'ఎవరు', 'మా కావేరి సార్.. మా ఆది సార్', 'ఎలా మిస్సయ్యారు', 'వాళ్లు లేచిపోయారు సార్', 'ఇద్దరూ మేజర్లా', 'కాదు సార్.. ఆయనకి డెబ్బై నిండాయి.. ఆవిడకి ఓ అరవైఐదు దాక ఉంటాయి'.. వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ తుమ్మలపల్లి, సంగీతం: అనూప్ రూబెన్స్.

అన్యాయంపై పోరాటం



● అనుష్క

'అరుంధతి', 'భాగమతి'.. ఇలా ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్‌లో తనదైన శైలిని చాటుకుని సక్సెస్ అయ్యారు అనుష్క. తాజాగా ఆమె కథానాయిక ప్రాధాన్యంగా సాగే మరో సినిమా అంగీకరించారు. క్రిష్ (జాగర్లమూడి రాధాకృష్ణ) ఈ సినిమాకు దర్శకుడు. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. ఒడిశాలోని ఒక మహిళ జీవితంలో పదేళ్ల క్రితం జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమా రూపొందుతోందని సమాచారం. తనకు జరిగిన అన్యాయంపై పోరాటం చేసే ఓ సాధారణ అమ్మాయిగా అనుష్క పాత్ర ఉంటుందట. ఇటీవల ఒడిస్సాలో కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుపుతున్నారని తెలిసింది. కాగా ఈ సినిమాకు 'శీలవతి' అనే టైటిల్‌ను చిత్ర యూనిట్ పరిశీలిస్తోందనే టాక్ వినిపిస్తోంది. అలాగే ఈ సినిమాలో తమిళ నటుడు విక్రమ్ ప్రభు ఓ లీడ్ రోల్ చేస్తున్నారని, ఈ సినిమా ఈ ఏడాదే దక్షిణాది భాషల్లో విడుదలవుతుందనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

మహారాజా?



● మహేశ్‌బాబు

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఓ భారీ బడ్జెట్ ఫిల్మ్ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలోని హీరోయిన్ పాత్ర కోసం ఇండోనేషియా బ్యూటీ చెల్సియా ఇస్లాన్, దీపికా పదుకోన్ పేర్లు తెరపైకి వచ్చాయి. ఫారెస్ట్ అడ్వెంచరస్ ఫిల్మ్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'మహారాజా', 'మహారాజ్', 'చక్రవర్తి' అనే టైటిల్స్‌ను పరిశీలిస్తున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. మరి.. ఫైనల్‌గా ఈ టైటిల్స్‌లో ఏదో ఒకటి ఫిక్స్ అవుతుందా? లేక మరొక టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేస్తారా? అనేది తెలియాలంటే కొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు. ఇక విజయేంద్రప్రసాద్ కథ అందించిన ఈ చిత్రానికి ఎమ్ఎమ్ కీరవాణి సంగీతదర్శకుడు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాది వేసవిలో ఆరంభమవుతుందని టాక్.

మళ్లీ వస్తున్నాడు జోకర్



● 'జోకర్ 2' పోస్టర్

హాలీవుడ్ జోకర్ మళ్లీ వస్తున్నాడు. హాలీవుడ్ మ్యూజికల్ సైకలాజికల్ థ్రిల్లర్ ఫిల్మ్ 'జోకర్'. జోక్విన్ ఫీనిక్స్ ప్రధాన పాత్రలో టాడ్ ఫిలిప్స్ డైరెక్షన్‌లో రూపొందిన ఈ సినిమా 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'జోకర్ 2' (జోకర్: ఫోలీ ఎ డ్యూక్స్)ను ప్రకటించారు టాడ్ ఫిలిప్స్. ఈ చిత్రంలో జోక్విన్ ఫీనిక్స్‌తో పాటు లేడీ గగా మరో లీడ్ రోల్ చేస్తున్నారు. జాజై బీట్జ్ మరో లీడ్ రోల్‌లో కనిపిస్తారు. లాస్ ఏంజిల్స్, న్యూయార్క్, న్యూ జెర్సీ లొకేషన్స్‌లో చిత్రీకరణ జరిపారు. ఈ చిత్రం ట్రైలర్ ఏప్రిల్ 4న విడుదల కానుం దని హాలీవుడ్ టాక్. సినిమాను ఈ ఏడాది అక్టోబరు 4న విడుదల చేయాలనుకుంటున్నారు. టాడ్ ఫిలిప్స్, బ్రాడ్లీ కూపర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా వార్నర్ బ్రదర్స్ డిస్ట్రిబ్యూట్ చేయనుంది.

థ్రిల్ స్టార్ట్



● మోహన్ భగత్

మోహన్ భగత్, సుప్రిత సత్యనారాయణ్, భూషణ్ కల్యాణ్, రవీంద్ర విజయ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఆరంభం'. అజయ్ నాగ్ వి. దర్శకత్వంలో వీటీ అభిషేక్ నిర్మిస్తున్న సినిమా ఇది. ఈ సినిమా టీజర్‌ను హీరో నాగచైతన్య విడుదల చేసి, 'బ్యాగ్రౌండ్‌లో రామాయణ స్టోరీని నరేట్ చేస్తూ ఇంటర్‌కట్స్‌లో వేసిన విజువల్స్‌తో టీజర్‌ని డిఫరెంట్‌గా కట్ చేశారు. థ్రిల్లింగ్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో టీజర్ ఆసక్తిగా ఉంది'' అన్నారు.

యుద్ధానికి సిద్ధం!




● హృతిక్ రోషన్

బాలీవుడ్‌లో మరో వార్‌కు సిద్ధం అవుతున్నారు హీరో హృతిక్ రోషన్. ఆయన నటిస్తున్న యాక్షన్ స్పై ఫిల్మ్ 'వార్ 2'. ఎన్టీఆర్ మరో లీడ్ రోల్ చేస్తున్నారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ఈ నెలాఖర్లో ప్రారంభం కానుంది. హృతిక్ రోషన్‌పై ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారట అయాన్ ముఖర్జీ. ఈ చిత్రం 2025 ఆగస్టు 14న విడుదల కానుంది. 2019లో హృతిక్, టైగర్ ష్రాఫ్‌లు నటించిన 'వార్' సినిమాకు సీక్వెల్‌గా 'వార్ 2' వస్తోంది.

రీల్స్

పెళ్లనేది పాన్ ఇండియా సమస్య



● 'అల్లరి' నరేశ్

'ఆ ఒక్కటీ అడక్కు' అంటున్నారు హీరో 'అల్లరి' నరేశ్. ఆయన నటిస్తున్న 61వ చిత్రానికి నూతన దర్శకుడు మల్లి అంకం దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో ఫరియా అబ్దుల్లా హీరోయిన్. రాజీవ్ చిలక నిర్మిస్తున్న ఈ సినిమాకి 'ఆ ఒక్కటీ అడక్కు' టైటిల్ ఖరారు చేసి, ఫస్ట్ లుక్ గ్లింప్స్ విడుదల చేశారు. ఈ మూవీలో నరేశ్ పాత్ర పేరు గణ. అతని పెళ్లి గురించి కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగు వారు అడిగితే.. 'ఆ ఒక్కటీ అడక్కు.. పెళ్లనేది పాన్ ఇండియా సమస్య' అంటూ నరేశ్ చెప్పే డైలాగ్స్ గ్లింప్స్‌లో ఉన్నాయి. ''వినోదాత్మకంగా రూపొందుతున్న చిత్రమిది. మార్చి 22న విడుదల చేస్తాం'' అన్నారు మేకర్స్.

గ్రామీణ నేపథ్యంలో...



● యువ చంద్రకృష్ణ

యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల జంటగా సాహిత్ మోత్కూరి దర్శకత్వం వహించిన చిత్రం 'పొట్టేల్'. నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగె నిర్మించిన ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందించారు. ఈ చిత్రం నుంచి 'వచ్చారే..' అంటూ సాగే రెండో పాటని విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటని రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ''గ్రామీణ నేపథ్యంలో కొత్త కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'పొట్టేల్'. ఈ చిత్రంలోని భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

సందె వేళ...



● శాంతి చంద్ర, దీపికా సింగ్

శాంతి చంద్ర హీరోగా, దీపికా సింగ్, మిస్ ఇండియా 2022 స్మిమితి హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'డర్టీ ఫెలో'. ఆడారి మూర్తి సాయి దర్శకత్వంలో గూడూరు భద్రకాళి సమర్పణలో జీయస్ బాబు నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. డా. సతీష్ కుమార్ పి. సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'సందె వేళ...' అంటూ సాగే పాటని డైరెక్టర్ సాయి రాజేశ్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''నా మిత్రుడు శాంతి చంద్ర నటించిన 'డర్టీ ఫెలో'లోని 'సందె వేళ..' పాట బాగుంది'' అన్నారు. ''వినూత్న కథతో రూపొందిన చిత్రమిది'' అన్నారు శాంతిచంద్ర.

ప్రేమ.. నవ్వులు



● గౌతమ్, పరశురామ్

గౌతమ్ సాగి, దీప్శికా జంటగా చంద్రశేఖర్ కానూరి దర్శకత్వంలో శ్రీధర్ వర్మ సాగి నిర్మిస్తున్న చిత్రం 'రవికుల రఘురామ'. సుకుమార్ పమ్మి సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'చందమామే..' అంటూ సాగే పాటని డైరెక్టర్ పరశురామ్ విడుదల చేశారు. ''లవ్ అండ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. ప్రేక్షకులకు మంచి వినోదాన్ని ఇవ్వాలని తన సృజనాత్మకత మొత్తం జోడించి ప్రాణం పోస్తున్నారు చంద్రశేఖర్'' అని యూనిట్ పేర్కొంది.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 | వెల: ₹ 5.50 | సంపుటి: 16 | సంచిక: 327

శనివారం 17-2-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'




మార్చి 15 దాకా గడువు పెంపు

పేటీఎం పేమెంట్ బ్యాంక్ కార్యకలాపాల నిలిపివేత గడువు పొడిగింపు -15లో



వీడియో పెట్టు.. కోట్లు కొట్టు

సామాజికాంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న యూట్యూబర్‌పై కథనం -14లో



విష వలయంలో కాంగ్రెస్

బంధుప్రీతి, వారసత్వ రాజకీయాలు అనే విష వలయంలో కాంగ్రెస్ పార్టీ చిక్కుకుందని ప్రధాని మోదీ విమర్శించారు.

- వివరాలు 6లో



కాంగ్రెస్ ఖాతాల స్తంభన

ఐటీ రిటర్నులలో వ్యత్యాసం నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ ఖాతాలను ఆదాయ పన్ను శాఖ స్తంభింపజేసింది.

- వివరాలు 6లో



మూగబోయిన అసమ్మతి గళం

రష్యా అధ్యక్షుడు పుతిన్ కంట్లో నలుసుగా మారిన విపక్ష నేత అలెక్సీ నావల్నీ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందారు.

- వివరాలు 6లో



ఆ పెళ్లిళ్ల నమోదు తప్పనిసరి

ఎన్నారై పెళ్లిళ్లకు రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేయాలని కేంద్ర ప్రభుత్వానికి న్యాయ కమిషన్ సిఫార్సు చేసింది.

- వివరాలు 6లో

ఎలైట్ వైన్స్.. బార్లు!

రాష్ట్రంలో ఎక్సైజ్ రాబడి పెంచుకోవడంపై సర్కారు దృష్టి

- టానిక్ తరహాలో అధునాతన వైన్‌షాపులకు అనుమతినిచ్చే యోచనలో ప్రభుత్వం
- లాటరీ ప్రక్రియ లేకుండానే నేరుగా కొన్నేళ్లపాటు లైసెన్స్
- హైదరాబాద్ కేంద్రంగా బార్ల సంఖ్యను కూడా పెంచాలని నిర్ణయం
- మద్యం ధరల పెంపు ప్రతిపాదనలపై మాత్రం అస్పష్టత
- ఈసారితో పోలిస్తే వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.6 వేల కోట్లకు పైగా అదనపు రాబడి అంచనా
- జీఎస్టీ రెవెన్యూ అంచనాలు 15 శాతం పెంపు.. రిజిస్ట్రేషన్ల ఆదాయంలో కనిపించని మార్పు
- తగ్గిన అమ్మకపు పన్ను అంచనాలు.. ప్రజలపై భారం పడకుండా ఆదాయం పెంపుపై దృష్టి



సాక్షి, హైదరాబాద్: లాటరీ ప్రక్రియ, పోటీలేకుండా నేరుగా లైసెన్సులు ఇచ్చే 'ఎలైట్ బార్ల' తరహాలో.. 'ఎలైట్ వైన్స్' విధానాన్ని తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ప్రస్తుతమున్న ఏ4 కేటగిరీ వైన్‌షాపులకు అదనంగా.. నగర ప్రాంతాల్లో ఈ ఎలైట్ వైన్స్ ఏర్పాటుకు అనుమతించే దిశగా కసరత్తు ప్రారంభించింది. వీటికి సాధారణ వైన్‌షాపుల కంటే కనీసం రెండింతలు, ఆపైన లైసెన్స్ ఫీజులను నిర్ణయించడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని భావిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో ఇలా నేరుగా లైసెన్సు మంజూరు చేసిన 'టానిక్' ఎలైట్ వైన్‌షాపులు ఉన్నాయి. వాటికి ఇచ్చిన ఐదేళ్ల లైసెన్సుల గడువు ఈ ఏడాది మార్చితో ముగుస్తోంది. ఈ నేపథ్యంలో.. టానిక్ షాపుల తరహాలోనే మరిన్ని ఎలైట్ వైన్‌షాపులు ఏర్పాటు చేసేందుకు.. వీటితోపాటు మరిన్ని వాకిన్ స్టోర్స్ (సూపర్ మార్కెట్ల తరహాలో లోనికి వెళ్లి నచ్చినవి ఎంచుకునే ఉండేవి)ను ఏర్పాటు చేసేందుకు ఎక్సైజ్ శాఖ రంగం సిద్ధం చేస్తోంది. అంతేగాకుండా హైదరాబాద్ నగరంతోపాటు శివారు ప్రాంతాల్లో బార్ల సంఖ్యను కూడా పెంచే అంశాన్ని పరిశీలిస్తోంది. బార్లకు బాగా డిమాండ్ ఉన్న నేపథ్యంలో.. కొందరు బార్ లైసెన్సులను ఇతరులకు ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారని, అలా కాకుండా బార్ల సంఖ్యను పెంచడం ద్వారా డిమాండ్ తీరి, సర్కారుకు అదనపు ఆదాయమూ సమకూరుతుందని ఎక్సైజ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఎక్సైజ్ ఆదాయం పెంపుకోసం..

2023–24లో రూ.19,884.90 కోట్ల మేర ఎక్సైజ్ ఆదాయాన్ని గత ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు తగినట్టుగా రాబడి ఉంది. కాంగ్రెస్ సర్కారు తాజాగా పెట్టిన బడ్జెట్ (2024–25)లో మరో రూ. 6 వేల కోట్లు అదనంగా.. రూ.25,617.52 కోట్లు లక్ష్యంగా నిర్ణయించుకుంది. అంటే ప్రతి నెలా రూ.500 కోట్ల వరకు అదనపు ఆదాయాన్ని సమీకరించాల్సి ఉంటుంది. ఇందుకోసం మద్యం ధరలు పెంచాలని ఎక్సైజ్ శాఖ ప్రతిపాదన చేసినా ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే ఎలైట్ వైన్స్

మిగతా 8వ పేజీలో ▶

'గ్యారంటీ'గా ఇస్తారా?

రేషన్‌కార్డు కోసం లక్షలాది కుటుంబాల ఎదురుచూపులు

- 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్‌కు ఇదే ప్రామాణికం
- మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి తప్ప అన్ని గ్యారంటీలకు రేషన్‌కార్డు తప్పనిసరి
- ఇప్పటివరకు కార్డుల జారీ ప్రస్తావనే లేని వైనం
- 20 లక్షల మంది దరఖాస్తుదారుల్లో ఆందోళన



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు 'గ్యారంటీ'గా రావాలంటే.. రేషన్ కార్డు తప్పనిసరి కావడంతో వాటి కోసం అర్హులైన లక్షలాది కుటుంబాలు ఆశగా ఎదురు చూస్తున్నాయి. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకానికి రేషన్‌కార్డు నిబంధన లేదు. అయితే, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచే పథకానికి మాత్రం రేషన్‌కార్డు తప్పనిసరి చేశారు. ఇటీవల మరో రెండు గ్యారంటీలు..రూ.500కు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ హామీల అమలుకు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. ఈ పథకాలకు కూడా రేషన్‌కార్డునే ప్రామాణికంగా తీసుకొంది. దీంతో రేషన్‌కార్డు లేని అర్హులైన లక్షలాది కుటుంబాలు కొత్త రేషన్‌కార్డులు జారీ చేసి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని

మిగతా 8వ పేజీలో ▶



శంభు సరిహద్దులో భారీగా మోహరించిన పోలీసులు

రణరంగమైన 'శంభు'

- కొనసాగిన రైతుల ఆందోళన
- వారిపైకి భారీగా బాష్పగోళాలు
- గుండె పోటుతో రైతు మృతి
- రేపు మళ్లీ మంత్రుల చర్చలు

6లో

న్యూస్‌రీల్

పోలీసు స్టేషన్‌కు సరదాగా వస్తారా?



పోలీసులు తమ ప్రవర్తనాశైలిని మార్చుకోవాలని హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. ఫిర్యాదు చేయడానికి వచ్చిన వారిని భయాందోళనకు గురిచేసేలా వ్యవహరించవద్దని, వారు పోలీస్ స్టేషన్‌కు సరదాగా రారన్న విషయం తెలుసుకోవాలని స్పష్టం చేసింది.

- వివరాలు 8లో

నెలాఖరులోగా గురుకుల పోస్టుల భర్తీ!



గురుకుల విద్యాసంస్థల్లో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ వేగవంతమైంది. 7 వేల ఉద్యోగాలకు సంబంధించిన ప్రక్రియను తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు వేగిరం చేసింది. ఈ నెలాఖరులోగా అన్ని కేటగిరీల్లో ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసేలా కసరత్తు చేస్తోంది.

- వివరాలు 8లో



రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా రాజయ్య

సభ్యులుగా ఎం.రమేశ్, సంకేపల్లి సుధీర్‌రెడ్డి, నెహ్రూనాయక్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రెండో ఫైనాన్స్ కమిషన్‌ను నియమిస్తూ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. రాజయ్య చైర్మన్‌గా, మల్కుడ్ రమేశ్ (వికారాబాద్ జిల్లా), సంకేపల్లి సుధీర్‌రెడ్డి(సూర్యాపేట), మాలోతు నెహ్రూనాయక్ (మహబూబాబాద్)లను సభ్యులుగా నియమిస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కమిషన్ పదవీకాలం రెండేళ్లపాటు ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బీజేపీతో టచ్‌లో బీఆర్‌ఎస్ నేతలు



ఐదుగురు ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలు ఉన్నారన్న బండి సంజయ్

- ఎన్డీయేలో చేరబోతున్నామంటూ కేసీఆర్ అబద్ధాలు చెబుతున్నారు
- బీఆర్‌ఎస్ నేతలెవరూ పార్టీ వీడకుండా ఉండేందుకే డ్రామాలు
- 25 నుంచి మలివిడత ప్రజాహిత యాత్ర

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్‌కు చెందిన ఐదుగురు ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలు బీజేపీతో టచ్‌లో ఉన్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ చెప్పారు. బీజేపీలోకి వచ్చేందుకు వారు సంప్రదింపులు జరుపుతున్నారని తెలుసుకున్న మాజీ సీఎం కేసీఆర్.. తామే బీజేపీతో పొత్తు పెట్టుకుని, ఎన్డీఏలో చేరబోతున్నామంటూ అబద్ధాలు చెబుతున్నారని, ఎవరూ పార్టీ వీడకుండా డ్రామాలాడుతున్నారని విమర్శించారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడే ఎన్డీయేలో చేర్చుకోలేదని, ఇప్పుడు మునిగిపోయే నావ, ఒక్కసీటు కూడా రాని ఆ పార్టీతో పొత్తు పెట్టుకోవాల్సిన ఖర్మ బీజేపీకి లేదని వ్యాఖ్యానించారు. శుక్రవారం పార్టీ నేతలతో సమావేశమైన సంజయ్, మలిదశ ప్రజాహిత యాత్ర ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

అవినీతిపరులను రానీయం

'కేసీఆర్ భాషలో చెప్పాలంటే మెడమీద తలకాయ ఉన్నోడెవ్వడూ బీఆర్‌ఎస్‌తో పొత్తు పెట్టుకోడు. ఒకవేళ అదే జరిగితే బీజేపీలో సగం మంది అభ్యర్థులు పోటీ చేయడానికి కూడా వెనుకాడతారు. కేసీఆర్ వెళ్లి కలిసినా ఎన్డీఏలో మిగతా 13వ పేజీలో ▶

బీజేపీతో పొత్తు ఉన్నా మల్కాజిగిరి మాదే: మల్లారెడ్డి 13లో

జోన్ల మార్పుపై సమీక్షిస్తాం

- మంత్రి కోమటిరెడ్డి వెల్లడి
- సంత్ సేవాలాల్ పేరిట గుడి కట్టాలని నిర్ణయం

2లో

ఢిల్లీకి కాంగ్రెస్ సూట్‌కేసులు



- రాహుల్ గాంధీ కోసం కాంట్రాక్టర్లు, బిల్డర్లను బెదిరిస్తున్నారు
- తెలంగాణ ఎన్నికలకు కర్ణాటక నుంచి సూట్‌కేసులొచ్చాయ్
- ఇప్పుడు రాష్ట్రం నుంచి ఢిల్లీకి వెళ్తున్నాయి.. బీఆర్‌ఎస్, కేసీఆర్ అక్రమాలపై సర్కార్ చర్యలేవీ?
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రశ్నలు

- 13లో

నేడు జీఎస్‌ఎల్వీ సీ-14 ప్రయోగం

- సాయంత్రం 5:35 గంటలకు ప్రయోగం: ఇస్రో
- ఇన్‌శాట్–3డీఎస్ ఉపగ్రహంలో వాతావరణ అంచనా, విపత్తు హెచ్చరికల కోసం అత్యాధునిక పేలోడ్లు

సముద్రంలోకి కార్టోశాట్-2

- 17 ఏళ్ల నాటి ఉపగ్రహం విజయవంతంగా హిందూ మహాసముద్రంలో పడేలా చేసిన ఇస్రో

- వివరాలు 6లో

అంతా సిద్ధమే.. అయినా ఆలస్యమే!

రాష్ట్రంలో టీచర్ పోస్టుల భర్తీపై నిరుద్యోగుల్లో ఆందోళన

- మెగా డీఎస్సీ వేస్తామన్న సర్కారు.. దీనిపై రెండు సార్లు సమీక్షలు
- కానీ నోటిఫికేషన్ దిశగా అడుగులు పడటం లేదంటూ నిరాశ
- గతంలో డీఎస్సీ ఆగిపోవడానికి కారణమైన సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తులు
- లోక్‌సభ షెడ్యూల్ వస్తే పరిస్థితి మొదటికి వస్తుందని ఆవేదన
- టీచర్ ఖాళీల లెక్కలు తీసిన విద్యాశాఖ.. పదోన్నతులు, బదిలీలతో లింక్

8లో



కూటమిలో ఎవరున్నారో, లేరో తెలియడం లేదు! బీజేపీ కాంగ్రెస్ మధ్యే పోటీ అనండి చాలు!

క్లుప్తంగా...

కాగ్ నివేదికకు కేసీఆర్, మాజీ మంత్రులు సమాధానం చెప్పాలి: మంత్రి జూపల్లి



సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ పాలనలో వేలాది కోట్ల రూపాయల అవినీతి, అక్రమాలు జరిగాయని, ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అయ్యాయనడానికి కాగ్ నివేదికలే నిదర్శనమని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ పార్టీ చేసిన ఆరోపణలు వాస్తవమని ఈ నివేదికలే చెప్తున్నాయన్నారు. ఈ కాగ్ నివేదికలపై కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రులందరూ సమాధానాలు చెప్పాలని శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ జూపల్లి డిమాండ్ చేశారు. కాగ్ రిపోర్టుల ఆధారంగా విచారణ జరుపుతామని, గొర్రెల పంపిణీ, ఇసుక తవ్వకాలు, నిధుల దుర్వినియోగం, బిల్లుల చెల్లింపుల్లో అక్రమాలన్నింటిపై విచారణ జరుపుతామని చెప్పారు. తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదలబోమన్నారు. కాంగ్రెస్ పార్టీ వాస్తవాలు మాట్లాడుతుందనే విషయాన్ని కాగ్ నివేదికలతో ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. ఒక్క ఎంపీ స్థానం కూడా బీఆర్ఎస్ గెలిచే పరిస్థితి ఉండదని పేర్కొన్నారు.

రేవంత్‌కి అధికారం శాశ్వతం కాదు: కౌశిక్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి నోటికి వచ్చినట్లు మాట్లాడటం దురదృష్టకరమని, అధికారం శాశ్వతం కాదనే విషయం గుర్తుంచుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వగా, దానిని విస్మరించి ఆ ఉద్యోగాలను తామే ఇచ్చినట్లుగా ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకుంటోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే మంత్రులు, ఎమ్మెల్యేలు రేవంత్‌రెడ్డికి ఎదురుతిరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఓటుకు నోటు కేసు ట్రయల్స్ పూర్తి అయ్యాయని, మరో ఆరునెలల్లో రేవంత్‌రెడ్డికి శిక్ష పడటం ఖాయమని అన్నారు.

కులగణన కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాలి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



కాచిగూడ (హైదరాబాద్): జనగణనలో కులగణన కోసం వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రంపై ఒత్తిడి పెంచడానికి అధికార, ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకం కావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన శుక్రవారం కాచిగూడలో జరిగిన 14 బీసీ కులసంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ కులగణన తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశ పెట్టినందుకు హర్షం ప్రకటించారు. కులగణన లెక్కలు రాగానే బీసీల పంచాయతీరాజ్ రిజర్వేషన్లను 22 నుంచి 42 శాతానికి పెంచాలన్నారు. బీసీ గురుకులాలకు సొంత భవనాల నిర్మాణం, విద్యార్థుల స్కాలర్‌షిప్స్ పెంపు, ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి బీసీ స్టడీ సర్కిల్ మంజూరు, స్కాలర్‌షిప్స్, ఫీజు బకాయిల చెల్లింపును గ్రీన్ చానల్‌లో పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షణీయమని పేర్కొన్నారు. కేంద్రంలో ప్రభుత్వరంగ సంస్థలైన రైల్వే, ఎల్ఐసీ, బీహెచ్ఈఎల్, బీడీఎల్, బ్యాంకింగ్, రక్షణ సంస్థలను ప్రైవేటు పరం చేయకుండా చూడాలని కృష్ణయ్య కోరారు.

భారత విద్యార్థులపై దాడులను ఆపేందుకు తీవ్ర కృషి

అమెరికా అధ్యక్ష భవనం వెల్లడి



వాషింగ్టన్: అమెరికాలో భారతీయ, భారతీయ అమెరికన్ విద్యార్థులపై ఇటీవల కాలంలో జరుగుతున్న వరుస దాడులు, అనూహ్యంగా సంభవిస్తున్న మరణాలపై అధ్యక్ష భవనం వైట్ హౌస్ స్పందించింది. అధ్యక్షుడు జో బైడెన్‌తో పాటు ఆయన ప్రభుత్వం విద్యార్థులపై దాడులను ఆపేందుకు తీవ్రంగా కృషి చేస్తోందని వివరించింది. 'జాతి, లింగ, మతపరమైన లేదా మరే ఇతర కారణాలతోనైనా హింసకు పాల్పడితే సహించబోం. ఇటువంటి వాటికి అమెరికాలో తావు లేదు'అని వైట్ హౌస్ ప్రతినిధి జాన్ కిర్బీ స్పష్టం చేశారు. 'అధ్యక్షుడు, ఆయన ప్రభుత్వం దేశంలోని వివిధ ప్రాంతాల్లో భారతీయ, భారతీయ అమెరికన్ విద్యార్థులపై జరుగుతున్న దాడులకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు తీవ్రంగా కృషి చేస్తోంది. జాతీయ, స్థానిక అధికారుల సమన్వయంతో చేయగలిగిందంతా చేస్తోంది. దాడులకు బాధ్యులను వదిలేది లేదు'అని కిర్బీ పేర్కొన్నారు. 'ఈ ఘటనలతో భారత్‌లోని వారి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు ఆవేదన గురికావడంపై ఆందోళన చెందుతున్నాం. భారతీయ విద్యార్థులకు ఇక్కడ ఎదురవుతున్న భద్రతా సమస్యలను పరిష్కరించేందుకు భారతీయ అమెరికన్లు సైతం సిద్ధంగా ఉన్నారు'అని కిర్బీ వివరించారు. గత కొద్ది వారాల్లో అమెరికాలోని వివిధ ప్రాంతాల్లో నలుగురు భారతీయ అమెరికన్ విద్యార్థులు వివిధ పరిస్థితుల్లో ప్రాణాలు కోల్పోవడం తెలిసిందే.

అనుమానాలొద్దు.. సలహాలివ్వండి

కులగణన తీర్మానంపై చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి

ప్రతిపక్షాలు మా చిత్తశుద్ధిని శంకించాల్సిన అవసరం లేదు

- అన్ని వర్గాల సమగ్ర సమాచార సేకరణతో పాటు బీసీ కులగణన చేస్తాం
- పాలితులను పాలకులను చేయాలన్నదే మా తపన



సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాలకు సంబంధించిన సమగ్ర సమాచారం కోసం ఇంటింటి సర్వే చేస్తూనే బీసీల అభ్యున్నతి లక్ష్యంగా ఆ వర్గానికి సంబంధించిన కుల గణన చేయటానికి శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానంలో తమ చిత్తశుద్ధిని ప్రతిపక్షాలు శంకించాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పాలితులను పాలకులను చేయడానికే తమ తపన అని వ్యాఖ్యానించారు. గతంలో యూపీఏ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి చేపట్టిన చర్యల తరహాలోనే రాష్ట్రంలో బలహీన వర్గాల అభ్యున్నతికి ఉపయోగపడే గొప్ప నిర్ణయమైనందున దాన్ని మరింత మెరుగ్గా నిర్వహించేందుకు సూచనలు సలహాలు ఇవ్వాలని కోరారు. శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టిన కులగణన తీర్మానంపై చర్చలో భాగంగా బీఆర్ఎస్ సభ్యులు లేవనెత్తిన సందేహాలపై సీఎం వివరణ ఇచ్చారు.

అండగా ఉండాలంటే లెక్కలు తెలియాలని సుప్రీం చెప్పింది

'ఈ తీర్మానంపై సలహాలు సూచనలు ఇవ్వటం కంటే అనుమానాలు లేవనెత్తడం ద్వారా ఈ అంశాన్ని పక్కదోవ పట్టించటంతో పాటు ప్రజల్లో సందేహాలు రేకెత్తించేలా ప్రధాన ప్రతిపక్ష సభ్యులు వ్యవహరిస్తున్నారు. యూపీఏ–1 హయాంలో మైనారిటీల అభ్యున్నతి కోసం చర్యలు చేపట్టాలని నిర్ణయించి జస్టిస్ రాజేందర్ సచార్ కమిటీ వేశారు. దాని సిఫారసుల ఫలితంగా ముస్లిం మైనారిటీల సంక్షేమానికి కనీవినీ ఎరుగని రీతిలో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పుడు బీసీల సమగ్ర అభ్యున్నతి కోసం, వారికి ప్రభుత్వం అండగా నిలవాలన్న రాహుల్‌గాంధీ ఆలోచన మేరకు మా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ప్రజలకు వెల్లడించలేదు. పదేళ్లయినా అది ఓ రహస్య నివేదికగానే ఉండిపోయింది. ఒకే ఒక కుటుంబం ఆ వివరాలను అవసరమైనప్పుడు చూసుకుని, ఎన్నికల సమయంలో దాన్ని వాడుకుంది. మాకు అలాంటి ఉద్దేశం లేదు. ఈ తీర్మానం అత్యంత కీలకమైంది. బలహీనవర్గాలకు అండగా నిలబడాలంటే ఆ వర్గం లెక్కలేంటో తెలియాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీన్ని అమలు చేసే క్రమంలో న్యాయ, చట్టపరమైన చిక్కులు ఏర్పడే అవకాశం ఉందనే అనుమానాలు ఏవైనా ప్రతిపక్షానికి ఉంటే వాటిని వెల్లడిస్తూ మంచి సూచనలు చేయాలి..'అని సీఎం కోరారు.

అర శాతం ఉన్నోళ్లకు బాధగానే ఉంటుంది..

'అర శాతం ఉన్నోళ్లకు కచ్చితంగా బాధ ఉంటుంది. రాష్ట్రాన్ని గుప్పిట్లో ఉంచుకున్నోళ్లకు.. ఇప్పుడు లెక్కలన్నీ బయటకు వచ్చి 50 శాతం ఉన్నోళ్లకు రాజ్యాధికారంలో భాగం ఇవ్వాల్సి వస్తుందన్న బాధ ఉండొచ్చు. ఇప్పటికైనా ప్రధాన ప్రతిపక్ష నేత వచ్చి అభిప్రాయం చెప్పాలి. లేదా వారు బాధ్యత అప్పగించిన వారైనా చెప్పాలి. నకలు చిట్టీలు అందించినట్టు కడియం శ్రీహరి పక్కన చేరి వారిని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. కడియం శ్రీహరి చిత్తశుద్ధిపై మాకు సందేహం లేదు. కానీ, పక్కన కూర్చున్నవారి సావాస దోషం ఆయనను తప్పుదోవ పట్టిస్తోంది. మేనిఫెస్టో, ఎన్నికల హామీలపై చర్చ కావాలంటే ప్రత్యేకంగా పెట్టుకుందాం. 2014, 2018 ఎన్నికల మేనిఫెస్టోలో ప్రతిపక్ష పార్టీ ఏం హామీ ఇచ్చింది, వాటిని ఎంతమేర అమలు చేసింది, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, ఈ 70 రోజుల్లో అమలు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చిద్దాం..'అని రేవంత్ అన్నారు.

తీర్మానంలో స్పష్టత లేదు: కడియం శ్రీహరి

తీర్మానంలో స్పష్టత లోపించిందని, సమగ్ర కుటుంబ సర్వే అని, బీసీ కుల గణన అని ఉందని, ఇందులో ఏది చేస్తారో చెప్పాలని బీఆర్ఎస్ సీనియర్ సభ్యుడు కడియం శ్రీహరి ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జోక్యం చేసుకుని తీర్మానంలో పూర్తి స్పష్టత ఉందని, అన్ని వర్గాలు, అన్ని కులాల ఆర్థిక, సామాజిక ఇతర అంశాల పూర్తి వివరాలను సర్వే ద్వారా సేకరించనున్నట్టు చెప్పారు. బీసీ కులగణన కూడా ఇందులో భాగమేనని స్పష్టం చేశారు. విపక్షం ఒకవేళ ఈ తీర్మానాన్ని వ్యతిరేకిస్తున్నట్లైతే ఆ విషయం బహిరంగంగా చెప్పాలని అన్నారు.

కేవలం బీసీల కులగణనతో వారికే నష్టం: గంగుల కమలాకర్

బీఆర్ఎస్ సభ్యుడు గంగుల కమలాకర్ తీర్మానంపై చర్చను ప్రారంభించారు. తీర్మానానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని, అయితే దీనిపై కొన్ని సందేహాలున్నాయని అన్నారు. తీర్మానం కాకుండా బిల్లు ప్రవేశపెట్టి చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కేవలం బీసీ కుల గణన చేస్తే చివరికి బీసీలే నష్టపోతారని పేర్కొన్నారు. సర్వే ఎప్పట్లోగా చేసి వివరాలు వెల్లడిస్తారో కూడా చెప్పాలన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో.. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ప్రకటించారని, వచ్చే జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో దాన్ని అమలు చేయాలని కోరారు. బీసీలకు రూ.20 వేల కోట్ల బడ్జెట్ పెడతామని, బీసీ సబ్ ప్లాన్ తెస్తామని చెప్పినా బడ్జెట్‌లో వాటి ఊసు లేదన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా కులగణన

▶ మొదటి పేజీ తరువాయి

2011లో అప్పటి యూపీఏ ప్రభుత్వం ఎలాంటి చట్టం లేకుండానే చేపట్టిందని తెలిపారు. అయితే తర్వాత వచ్చిన మోదీ ప్రభుత్వం దీనిని పక్కన పెట్టడంతో పదేళ్లుగా వెనక్కు పోయిందని అన్నారు. 2014లో అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే జరిపినప్పటికీ బయట పెట్టలేదని విమర్శించారు. తాజాగా చేపట్టనున్న సర్వే అణగారిన, వెనుకబడిన వర్గాల ప్రజలు రాజకీయంగా, సామాజికంగా ఎదగడానికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. బీసీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, 2014 నుంచి 2023 వరకు అప్పటి ప్రభుత్వం బీసీల కోసం రూ.23 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని చెప్పారు. ఎంబీసీలకు వెయ్యి రూపాయలు కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు.

న్యాయ సలహాల మేరకే ముందుకు: భట్టి

కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు, పార్టీ మూల సిద్ధాంతాలకు అనుగుణంగా రాష్ట్రంలో కులగణనకు అంకురార్పణ చేస్తున్నట్లు భట్టి విక్రమార్క చెప్పారు. న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా తగిన సలహాలు, సూచనలు తీసుకున్నామన్నారు. 'ఎవరెంత ఉంటారో వారికి అంత చెందాలి'అని రాహుల్‌గాంధీ చెప్పారని, అందుకు అనుగుణంగానే ఈ నెల 4న కేబినెట్‌లో చర్చించి కులగణన చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. బీసీలకు సబ్‌ప్లాన్ కూడా తీసుకొస్తామని, సర్వే అనంతరం బీసీల శాతాన్ని కూడా ప్రకటిస్తామని చెప్పారు.

చట్టబద్ధత కల్పిస్తేనే మంచిది: కేటీఆర్

రాష్ట్రంలో కులగణనను బీఆర్ఎస్ సంపూర్ణంగా స్వాగతిస్తోందని మాజీమంత్రి కేటీఆర్ అన్నారు. అయితే భవిష్యత్తులో న్యాయపరసమస్యలు తలెత్తకుండా చట్టబద్ధత కల్పిస్తేనే ఫలవంతమవుతుందని చెప్పారు. బీసీల అభ్యున్నతి కోసం బీఆర్ఎస్ తొలి నుంచి పనిచేస్తోందన్నారు. 2004లోనే కేసీఆర్.. ఆర్.కృష్ణయ్య, వకుళాభరణం కృష్ణమోహన్‌రావుతో కలిసి నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌ను కలిసి ఓబీసీలకు మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరిన విషయాన్ని గుర్తుచేశారు. 2014 తర్వాత శాసనసభలో రెండుసార్లు ఈ మేరకు తీర్మానం చేసి కేంద్రానికి పంపించినట్లు తెలిపారు.

కమిషన్‌ను ఏర్పాటు చేయాలి: అక్బరుద్దీన్

రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేసేందుకు వీలుగా కులగణన చేపట్టేందుకు ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని అక్బరుద్దీన్ ఒవైసీ కోరారు. జనాభా ప్రాతిపదికన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీలతోపాటు మైనారిటీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలని సూచించారు. రిజర్వేషన్లు 50 శాతం మించకూడదనే నిబంధనలను తొలగించాలన్నారు. కూనంనేని మాట్లాడుతూ.. కులగణనకు సంబంధించిన విధివిధానాలు ఏమిటో తెలపాలని విజ్ఞప్తి చేశారు. బిల్లు రూపంలో తీసుకొస్తే చట్టబద్ధత ఉంటుందని సూచించారు.

నేడు కేసీఆర్ జన్మదిన వేడుకలు

తెలంగాణ భవన్‌లో ప్రత్యేక కార్యక్రమాలు.. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరు




సాక్షి, హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు, మాజీ సీఎం కె. చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలు శనివారం పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో జరగనున్నాయి. ఈ వేడుకల్లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుతో పాటు బీఆర్ఎస్ ముఖ్య నేతలు పాల్గొంటారు. ఈ వేడుకల్లో భాగంగా కేసీఆర్ 70వ పుట్టిన రోజును గుర్తు చేసేలా 70 కిలోల భారీ కేక్‌ను కట్ చేస్తారు. కేటీఆర్ చేతుల మీదుగా వెయ్యి మంది ఆటో డ్రైవర్లకు రూ.లక్ష చొప్పున ప్రమాద బీమా చేయిస్తారు. అలాగే దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ, రోగులకు పండ్ల పంపిణీ వంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. 'తానే ఒక చరిత్ర'పేరిట 30 నిముషాల నిడివి కలిగిన ప్రత్యేక డాక్యుమెంటరీని ప్రదర్శిస్తారు. కాగా, కేసీఆర్ జన్మదినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నాయకులకు పార్టీ పిలుపునిచ్చింది. అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించనున్నారు.

నేడు ప్రాజెక్టులపై శ్వేతపత్రం

నీటిపారుదల రంగంపై మంత్రి ఉత్తమ్ ప్రజెంటేషన్ కూడా..

- శుక్రవారం నాటి అసెంబ్లీ ఎజెండాలో ఉన్నా వేరే అంశాలపై చర్చతో జాప్యం
- ఆలస్యమైనా సరే చర్చించాలంటూ పట్టుపట్టిన బీఆర్ఎస్, బీజేపీ
- ఎక్కువ మంది సభ్యులు మాట్లాడటానికి వీలుగా వాయిదా కోరిన అధికార పక్షం
- ఈ ప్రతిపాదనకు సరేనన్న ఎంఐఎం, సీపీఐ..
- కేసీఆర్‌పై మంత్రి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలతో సభలో గందరగోళం
- వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలిపిన బీఆర్ఎస్ సభ్యులు
- అసెంబ్లీ నేటి ఉదయం 10 గంటలకు వాయిదా



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రాజెక్టుల పరిస్థితిపై అసెంబ్లీ శ్వేతపత్రం విడుదల, నీటిపారుదల రంగంపై ప్రజెంటేషన్ శనివారానికి వాయిదా పడ్డాయి. వీటిపై శాసనసభలో శుక్రవారమే చర్చ జరగాల్సి ఉన్నా ఇతర అంశాలపై చర్చతో జాప్యమవడం, మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యలు, బీఆర్ఎస్ సభ్యుల నిరసనతో చాలా సేపు గందరగోళం నెలకొంది. నీటిపారుదల అంశం చాలా కీలకం కావడంతో.. ఎక్కువ మంది సభ్యులు చర్చలో పాల్గొనేందుకు వీలుగా వాయిదా వేయాలని అధికార పక్షం కోరడం.. దీనికి ఎంఐఎం, సీపీఐ మద్దతివ్వడంతో స్పీకర్ శనివారం ఉదయం 10 గంటలకు వాయిదా వేశారు.

కోమటిరెడ్డి వ్యాఖ్యలతో వేడెక్కి..

శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో శాసనసభలో కులగణనపై తీర్మానం ఆమోదం పొందాక స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తేనీటి విరామం ప్రకటించారు. తిరిగి సభ సాయంత్రం 6 గంటలకు సమావేశమైంది. తొలుత ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య లేచి.. శ్వేతపత్రంపై సుదీర్ఘంగా చర్చించాల్సిన అవసరం ఉందని, అందుకోసం సభను శనివారానికి వాయిదా వేయాలని స్పీకర్‌ను కోరారు. దీనితో వాయిదా వద్దని, వెంటనే చర్చ చేపట్టాలని బీఆర్ఎస్ సభ్యులు లేచి ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడటానికి స్పీకర్ అవకాశం ఇచ్చారు. వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ నల్లగొండకు హెలికాప్టర్‌లో వెళతారు. ఐదు నిమిషాల్లో రాగల సభకు రాకపోవడం ఏమిటంటూ ఘాటు విమర్శలు చేశారు. దీనితో బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి తదితరులు నిరసన వ్యక్తం చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు.

వాయిదాపై చర్చ తర్వాత

బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ''శ్వేతపత్రంపై చర్చించడానికి గంటల తరబడి వేచి ఉన్నాం. రాత్రి 11 గంటల వరకు కూర్చోవడానికి సిద్ధం. శనివారం పార్టీ సమావేశాలకు వెళ్లాల్సి ఉంది. మీరు ఎజెండాలో పెట్టి ఎందుకు చర్చ చేపట్టడం లేదు. వెంటనే చర్చ మొదలుపెట్టండి..'' అని కోరారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు కల్పించుకుంటూ.. అందరి అభిప్రాయాలు తీసుకున్నాక స్పీకర్ నిర్ణయిస్తారని చెప్పారు. సభ వాయిదాకు అభ్యంతరం లేదని ఎంఐఎం, సీపీఐ సభ్యులు తెలిపారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. ''ప్రాజెక్టులపై స్వల్పకాలిక చర్చ శుక్రవారం ఉంటుందని, సమావేశాలు అదేరోజు ముగుస్తాయని బీఏసీలో నిర్ణయించారు. మధ్యాహ్నం కలసినప్పుడు మంత్రి శ్రీధర్‌బాబు కూడా స్వల్పకాలిక చర్చ ఉంటుందన్నారు. కానీ ఇలా సభా సంప్రదాయాలకు విరుద్ధంగా చర్చ లేకుండా వాయిదా వేస్తామనడం సరికాదు. ఎంతరాత్రయినా చర్చకు మేం సిద్ధం. ప్రతిపక్షాన్ని బుల్డోజ్ చేస్తాం. ఇష్టానుసారం నిర్వహిస్తామనడం సరికాదు'' అని వ్యాఖ్యానించారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ.. బీఏసీలో నిర్ణయించని ఇతర అంశాలను స్పీకర్ అనుమతితో చర్చిద్దామనుకున్నామని చెప్పారు. ఇది ముఖ్యమైన అంశమని, అన్ని పార్టీల ఎమ్మెల్యేలు చర్చలో పాల్గొనేందుకు వీలుగా శనివారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి వరకు నిర్వహిద్దామని, ప్రతిపక్షం సహకరించాలని కోరారు. కాగా.. కేసీఆర్‌ను ఉద్దేశించి మంత్రి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. సభను శనివారం ఉదయం 10 గంటలకు వాయిదా వేశారు.

మీరంటే.. మీరు.. క్షమాపణల కోసం డిమాండ్

సభలో గందరగోళం నెలకొన్న తరుణంలో శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు కల్పించుకుని.. శ్వేతపత్రంపై స్వల్పకాలిక చర్చకు సంబంధించి అన్నిపక్షాల సలహాలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు. స్పీకర్ తొలుత బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావుకు అవకాశం ఇచ్చారు. ''ప్రతిపక్ష నేత గురించి మంత్రి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలి. లేదా స్పీకర్ రికార్డుల నుంచి తొలగించాలి'' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. దీనిపై మంత్రి వెంకట్‌రెడ్డి స్పందిస్తూ.. ''నల్లగొండ సభలో ప్రతిపక్ష నేత సీఎంను, నన్ను దున్నపోతులంటూ వ్యాఖ్యానించారు. ఆయన సభకు వచ్చి క్షమాపణ చెప్పాలి'' అని డిమాండ్ చేశారు. హరీశ్‌రావు ప్రతిస్పందిస్తూ.. ''గతంలో పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి నాటి సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి కాల్చేయాలి, ఉరితీయాలి అని మాట్లాడలేదా? బాధ్యతయుత పదవిలో ఉన్నందున సభలో అలా మాట్లాడవద్దు'' అని కౌంటర్ ఇచ్చారు.



రేవంత్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న జాజుల తదితరులు. చిత్రంలో భట్టి, పొన్నం, పొంగులేటి

కులగణనపై హర్షాతిరేకాలు

సీఎంకు మంత్రి పొన్నం, వకుళాభరణం కృతజ్ఞతలు

- మంత్రులకు ధన్యవాదాలు తెలిపిన బీసీ సంఘాలు

సాక్షి, హైదరాబాద్: కులగణన తీర్మానాన్ని శాసన సభ ఏకగ్రీవంగా ఆమోదించడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. శుక్రవారం సభలో తీర్మానం ఆమోదం పొందిన తర్వాత బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వజ్రేశ్ యాదవ్, రాజ్యసభ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. శాలువాతో సత్కరించారు. పొన్నం నేతృత్వంలో వకుళాభరణంతో పాటు బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగొని బాలరాజ్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు అసెంబ్లీ లాబీల్లో పలువురు మంత్రులను కలిసి ధన్యవాదాలు తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు డి.శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలను వారు కలిసారు. కాగా బీసీ సంఘం నేతలు అసెంబ్లీకి తరలివచ్చి మంత్రి పొన్నంను అభినందనలతో ముంచెత్తారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీలకు అన్ని రంగాల్లో తగినంత వాటా దక్కాలంటే కులగణన చేయడమే మార్గమన్నారు. కులగణన తీర్మానానికి ఏకగ్రీవంగా మద్దతు తెలిపిన సీఎం, డిప్యూటీ సీఎంలతో పాటు సహచర మంత్రులు, పలు పార్టీల ఫ్లోర్‌లీడర్లు, ఎమ్మెల్యేలకు పొన్నం ధన్యవాదాలు తెలియజేశారు. ఏఐసీసీ అగ్రనేతలు, ప్రజాసంఘాలు, బీసీ సంఘాల నేతలు, మేధావులకు కూడా కృతజ్ఞతలు తెలిపారు.

చారిత్రక ఘట్టానికి శ్రీకారం: వకుళాభరణం

కులగణన తీర్మానాన్ని రాష్ట్ర శాసనసభ ఆమోదించడంతో చారిత్రక ఘట్టానికి శ్రీకారం చుట్టినట్లు అయిందని వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. బలహీన వర్గాలు, తమ జీవితాల్లో సమున్నతంగా ఎదగాలనే లక్ష్య సాధనకు ఇది శుభారంభంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

జోన్ల మార్పుపై సమీక్షిస్తాం

మంత్రి కోమటిరెడ్డి వెల్లడి

- సంత్ సేవాలాల్ పేరిట గుడి కట్టాలని నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలను సంబంధం లేని జోన్లలో కలిపిన నేపథ్యంలో త్వరలోనే అధికారులతో కలిసి సమీక్షించి మార్పులు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం అసెంబ్లీ జీరో అవర్‌లో బీఆర్ఎస్ సభ్యుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, చేర్యాల పరిధిలోని ఒక్కో విభాగాన్ని ఒక్కో జోన్‌లో కలిపారని, దీనివల్ల ప్రజలు తమ అవసరాల కోసం వివిధ ప్రాంతాలకు తిరగాల్సి వస్తోందన్నారు. చేర్యాల డివిజన్ ఏర్పాటు చేసి, అన్నీ ఒకేచోట ఉండేలా చేయాలన్నారు. మెదక్‌ను సిరిసిల్ల జోన్‌లో కలపడం వల్ల ప్రజలకు అసౌకర్యంగా ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి సభ దృష్టికి తెచ్చారు. చార్మినార్ జోన్‌కు మార్చాలని ఆమె సూచించారు. సంత్ సేవాలాల్ మహారాజ్ గురు పేరిట గుడి కట్టాలని నిర్ణయించామని, ఎక్కడ కట్టాలనే విషయాన్ని యోచిస్తున్నామని మంత్రి తెలిపారు. జీరో అవర్‌లో డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. గొర్రెల పంపిణీ వ్యవహారంలో గొల్ల కురుమలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని కోమటిరెడ్డి సభలో తెలిపారు. తిరుమలలో తెలంగాణ ప్రజాప్రతినిధులకు ప్రోటోకాల్ అమలుపై టీటీడీ బోర్డ్‌తో సంప్రదింపులు జరుపుతామని మంత్రి కోమటిరెడ్డి సభకు హామీ ఇచ్చారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ..

వేసవిలో తాగునీటి సమస్య నివారణకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని పలువురు శాసనసభ్యులు ప్రస్తావించారు. షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో తాగు, సాగునీరు సమస్య తీవ్రంగా ఉందని, చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే కె శంకర్ కోరారు. చెన్నూరు నియోజకవర్గంలో మిషన్ భగీరథ పథకం విఫలమైందని, పాత పైపులను కాంట్రాక్టర్లు వాడటం వల్ల అవి పగిలి పోయి తాగునీరు అందని పరిస్థితి ఉందని కాంగ్రెస్ సభ్యుడు వివేక్ వెంకటస్వామి సభ దృష్టికి తెచ్చారు.



సీఎం రేవంత్‌ను కలిసిన రాజయ్య

సాక్షి, హైదరాబాద్: మాజీ ఉప ముఖ్యమంత్రి టి.రాజయ్య శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. అసెంబ్లీకి వచ్చిన ఆయన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి రేవంత్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపి శాలువాతో సన్మానించారు. ఇటీవలే బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన రాజయ్య త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు.

మరో రెండింటికి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు

పర్చూరు, కందుకూరు నియోజకవర్గాలకు నియామకం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మరో రెండు శాసన సభ స్థానాలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలను నియమిస్తూ పార్టీ అధినేత, ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఏడో జాబితాలో కందుకూరు నియోజకవర్గం సమన్వయకర్తగా కటారి అరవిందా యాదవ్, పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్తగా ఎడం బాలాజీని నియమించారు. గతంలో కందుకూరు స్థానాన్ని ఓసీలకు ఇవ్వగా ఇప్పుడు బీసీ మహిళకు కేటాయించారు. అలాగే ఇంతకుముందు పర్చూరు స్థానాన్ని ఓసీలకు ఇవ్వగా.. ఇప్పుడు కూడా ఓసీ (కాపు) సామాజికవర్గానికి చెందిన ఎడం బాలాజీకి అవకాశం కల్పించారు. ఈ మేరకు శుక్రవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

ఏపీలో ఏకగ్రీవంగా రాజ్యసభ ఎన్నిక

ముగ్గురు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్లకు ఆమోదం

- స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ


సాక్షి, అమరావతి: త్వరలో ఖాళీ అవనున్న మూడు రాజ్యసభ స్థానాలకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన అనంతరం వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు మాత్రమే రంగంలో మిగిలారు. స్వతంత్ర అభ్యర్థి ఒకరు నామినేషన్ వేసినప్పటికీ, ఆయన సమర్పించిన పత్రాలు సరిగా లేకపోవడంతో అధికారులు తిరస్కరించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ముగ్గురి నామినేషన్లు సక్రమంగా ఉండడంతో వాటిని ఆమోదించినట్టు రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి యం.విజయరాజు వెల్లడించారు. శుక్రవారం అసెంబ్లీ భవనంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా, అభ్యర్థుల ప్రతినిధుల సమక్షంలో నామినేషన్ల పరిశీలన జరిగింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గొల్ల బాబూరావు, వైవీ సుబ్బారెడ్డి, మేడా రఘునాథరెడ్డి నామినేషన్లతోపాటు అవసరమైన పలు డాక్యుమెంట్లన్నీ పూర్తి స్థాయిలో సమర్పించారు. దీంతో వీరి నామినేషన్లను ఆమోదించారు. స్వతంత్ర అభ్యర్థిగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన పెమ్మసాని ప్రభాకర్ నాయుడు నామినేషన్ దాఖలు చేసినప్పటికీ, కనీసం 10 మంది ఎమ్మెల్యేల మద్దతుతో కూడిన పత్రాన్ని సమర్పించకపోవడంతో ఆయన నామినేషన్‌ను తిరస్కరించినట్టు రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి విజయరాజు చెప్పారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 20వ తేదీ వరకు గడువు ఉన్నందున ఆ రోజున ఏకగ్రీవంగా ఎన్నికైన రాజ్యసభ అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నట్లు విజయరాజు తెలిపారు. నామినేషన్ల పరిశీలనలో సహాయ రిటర్నింగ్ అధికారి పి.వి. సుబ్బారెడ్డి, డిప్యూటీ సెక్రటరీ వనితా రాణి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యసభలో టీడీపీ సున్నా

మూడు స్థానాల్లో ఏకగీవ్రంగా ఎన్నికైన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు

రాష్ట్ర కోటాలో రాజ్యసభలోని 11 స్థానాలూ వైఎస్సార్‌సీపీ ఖాతాలోకే

41 ఏళ్ల టీడీపీ చరిత్రలో రాజ్యసభలో ఆ పార్టీ ప్రాతినిధ్యం లేకపోవడం ఇదే తొలిసారి



వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

- మార్చి నుంచి మూడు రైళ్ల రాకపోకలు!
- మరో 6 రైళ్లకు హాల్టింగ్ సదుపాయం
- దశలవారీగా మరిన్ని రైళ్ల రాకపోకలు
- ప్రధాని మోదీతో ప్రారంభానికి సన్నాహాలు

చర్లపల్లి టెర్మినల్ నుంచి త్వరలో రైళ్లు

సాక్షి, హైదరాబాద్: నాలుగో రైల్వే టెర్మినల్‌గా చర్లపల్లి స్టేషన్ సేవలు మార్చి నుంచి ప్రారంభం కానున్నాయి. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ స్టేషన్‌లపై పెరిగిన రైళ్ల ఒత్తిడిని దృష్టిలో ఉంచుకొని దక్షిణమధ్య రైల్వే రూ.221 కోట్లతో చర్లపల్లి స్టేషన్ విస్తరణ చేపట్టిన సంగతి తెలిసిందే. ప్రతి రోజూ సుమారు 50 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేలా చర్లపల్లి టెర్మినల్‌ను విస్తరించారు. సరుకు రవాణాకు పార్శిల్ కేంద్రం కూడా ఏర్పాటు చేశారు. రోజుకు 200కు పైగా రైళ్లు రాకపోకలు సాగిస్తున్న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్రస్తుతం పునరాభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో కొన్ని రైళ్ల రాకపోకలను నియంత్రించవలసిన అవసరం ఏర్పడింది. ఈ క్రమంలోనే చర్లపల్లి స్టేషన్ విస్తరణ పూర్తి కావడంతో మార్చి నుంచి కొన్ని రైళ్లను ఇక్కడి నుంచి నడిపేందుకు ఏర్పాట్లు చేపట్టారు.

ప్రధాని మోదీతో ప్రారంభం!

ప్రధాని మోదీతోనే త్వరలో చర్లపల్లి టెర్మినల్‌ను ప్రారంభించనున్నారు. అదే రోజు రైళ్ల రాకపోకలు కూడా ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు.

చర్లపల్లి నుంచి నడిచే రైళ్లు ఇవే...

- షాలిమార్ నుంచి సికింద్రాబాద్‌కు రాకపోకలు సాగిస్తున్న ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045/18046) త్వరలో సికింద్రాబాద్‌కు బదులు చర్లపల్లి నుంచి రాకపోకలు సాగించనుంది.
- చెన్నై నుంచి నాంపల్లి స్టేషన్‌కు నడిచే చార్మినార్ ఎక్స్‌ప్రెస్ (12603/12604) చర్లపల్లి నుంచి రాకపోకలు సాగించనుంది.
- గోరఖ్‌పూర్ నుంచి సికింద్రాబాద్‌కు రాకపోకలు సాగించే (12589/12590) గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ను చర్లపల్లి నుంచి నడుపనున్నారు.

మరో 6 రైళ్లకు హాల్టింగ్...

- హైదరాబాద్-సిర్పూర్‌కాగజ్‌నగర్ (17011/17012), సికింద్రాబాద్-సిర్పూర్‌కాగజ్‌నగర్ (12757/12758), గుంటూరు-సికింద్రాబాద్ (17201/17202) గోల్కొండ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-సిర్పూర్‌కాగజ్‌నగర్ (17233/17234) భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్, విజయవాడ-సికింద్రాబాద్ (12713/12714) శాతవాహన ఎక్స్‌ప్రెస్, గుంటూరు-సికింద్రాబాద్ (12705/12706) ఎక్స్‌ప్రెస్ రైళ్లను మార్చి నుంచి చర్లపల్లి స్టేషన్‌లో నిలుపనున్నారు.ఈ మేరకు రైల్వే బోర్డు అనుమతులను ఇచ్చింది.



సమస్త ప్రాణికోటిలో అంతర్యామిగా వుండే, అందరినీ తన వశంలో వుంచుకునే,
అద్వితీయమైన ఏకాకృతి కలిగిన ఆ పరబ్రహ్మ సర్వము తాను ఒక్కడే
అయినప్పటికీ అపూర్వలీలచే నానాప్రకారాలుగా రూపాలు ధరిస్తూంటాడు.
– హైందవ ధర్మం

సాక్షి
శనివారం, 17 ఫిబ్రవరి 2024

ఇండొనేసియాలో కొత్త ఏలిక

సర్వేలన్నీ జోస్యం చెప్పినట్టు బుధవారం జరిగిన ఇండొనేసియా దేశాధ్యక్ష ఎన్నికల్లో రక్షణమంత్రి, వివాదాస్పద మాజీ సైనికాధికారి జనరల్ ప్రబోవో సుబియాంటో విజయం సాధించారు. అభ్యర్థుల్లో మిగిలినవారితో పోలిస్తే ఓటర్లకు బాగా పరిచయమున్న నేత గనుక తొలి రౌండులో ముందంజలో ఉంటాడని అందరూ అంచనా వేశారు. కానీ నెగ్గటానికి అవసరమైన 50.1 శాతం కనీస ఓట్ల వరకూ వెళ్లగలరని ఎవరూ అనుకోలేదు. ఇండొనేసియా ఎన్నికల నిబంధనల ప్రకారం అభ్యర్థుల్లో ఎవరికీ కనీస ఓట్లు లభించకపోతే తిరిగి పోలింగ్ నిర్వహించకతప్పదు. గతంలో అధ్యక్ష పదవికి రెండు దఫాలు పోటీచేసి ఓడిన సుబియాంటోకు తాజా ఎన్నికల్లో సానుభూతితోపాటు యువత మద్దతు పుష్కలంగా దొరికింది. అందుకే ఆయనకు 60 శాతం ఓట్లు పోలయ్యాయి. సుబియాంటో చరిత్ర ఏమంత ఘనమైనది కాదు. దేశాన్ని దీర్ఘకాలం పాలించిన తన సొంత మామ, నియంత జనరల్ సుహార్తో ప్రాపకంతో సైన్యంలో ఉన్నత పదవులకు ఎగబాకి లెఫ్టినెంట్ జనరల్ స్థాయికి ఎదిగారు. 1997 నాటి విద్యార్థి ఉద్యమాన్ని దారుణంగా అణిచేయటంలో కీలకపాత్ర పోషించారు. ఆ సమయంలో దాదాపు 20 మంది విద్యార్థి నేతల అపహరణలకు సుబియాంటోయే కారణమన్న ఆరోపణలున్నాయి. వారందరూ సైన్యం చిత్రహింసలకు బలైవుంటారని మానవ హక్కుల సంఘాలు ఆరోపించాయి. చిత్రమేమంటే ఆ తర్వాత మరో ఏడాదికే సుహార్తోను గద్దెదించటానికి సుబియాంటో తోడ్పడ్డారు. ఆ తర్వాత తానే ఆ పీఠాన్ని అధిష్ఠించాలని ఉవ్విళ్లూరినా అది సాధ్యపడలేదు. కనీసం సైనిక దళాల చీఫ్ కావాలని కలలుకన్నా సుహార్తో స్థానంలో అధ్యక్షుడైన బీజే హబీబి అందుకు ససేమిరా అంగీకరించలేదు. దాంతో ఆయనపై ఆగ్రహించి కొందరు సైనికులను వెంటబెట్టుకుని అధ్యక్ష భవనంపై దాడికి సిద్ధపడ్డారు. కానీ అది వికటించి సైన్యం నుంచి ఉద్వాసన తప్పలేదు. ఆ తర్వాత జోర్డాన్ పరారై వ్యాపారవేత్తగా అవతరించారు. 2009 అధ్యక్ష ఎన్నికల నాటికి సొంతంగా ఒక పార్టీ స్థాపించి మాజీ దేశాధ్యక్షురాలు మేఘావతి సుకర్ణోపుత్రితో కూటమికట్టి ఉపాధ్యక్షుడిగా పోటీచేశారు. కానీ ఆ కూటమి ఓటమి చవిచూసింది. 2014, 2019 ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పోటీ చేసినా ఓటర్లు తిరస్కరించారు. ఆ తర్వాతే సుబియాంటోకు జ్ఞానోదయమైంది. రెండుసార్లూ తనపై గెలిచిన అధ్యక్షుడు జోకోవితో సంధి చేసుకుని రక్షణమంత్రి అయ్యారు. ఈసారి సైతం జోకోవియే పోటీచేసేవారు. కానీ అధ్యక్ష పదవికి వరసగా రెండుసార్లు మించి పోటీ చేయకూడదన్న నిబంధన కారణంగా ఆయన రంగం నుంచి తప్పుకోవాల్సి వచ్చింది.

ప్రపంచంలోనే ఇండొనేసియా మూడో అతి పెద్ద ప్రజాతంత్ర దేశం. జనాభా రీత్యా ముస్లింలు అత్యధికంగా వున్న దేశం. ఆగ్నేయాసియాలో అతి పెద్ద పారిశ్రామిక దేశంగా ఒకప్పుడున్నా 1997లో వచ్చిన ఆర్థిక సంక్షోభంలో దెబ్బతింది. ఆ తర్వాత క్రమేపీ వృద్ధి సాధిస్తూ 2012 నాటికి జీ–20 దేశాల్లో ఆర్థికాభివృద్ధి వైపు దూసుకుపోతున్న నాలుగో అతి పెద్ద దేశంగా ఎదిగింది. 2020లో కోవిడ్ బారిన పడటమేకాక, ఆర్థిక మాంద్యంలో చిక్కుకుంది. ఇప్పుడిప్పుడే తిరిగి పుంజుకుంటున్నా నిరుద్యోగం, అధిక ధరలు వేధిస్తూనే వున్నాయి. దానికితోడు దక్షిణ చైనా సముద్రంలో చైనాతో సరిహద్దు తగాదాలున్నాయి. అయితే ఇరు దేశాల ఆర్థిక సంబంధాలకూ ఆ వివాదం అడ్డురాలేదు. అటు అమెరికా, భారత్‌లతో సాన్నిహిత్యం సాగిస్తూ ఇండొనేసియా ఆర్థికంగా పుంజుకుంటోంది. విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తోంది. అయితే దీర్ఘకాలం నుంచి రాజకీయాల్లో కొనసాగుతూ, ఉద్యమ చరిత్రగల ఇద్దరు నేతలను కాదని మాట నిలకడ, సిద్ధాంత నిబద్ధత లేని సుబియాంటోకు ఈ స్థాయిలో ప్రజలు నీరాజనాలు పట్టడం ఆశ్చర్యకరమే. యువతలో సుబియాంటో పేరు మారుమోగటానికి టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి మాధ్యమాలు దోహదపడ్డాయి. సర్వే నిర్వహించిన సంస్థలకు ఓటర్లు... మరీ ముఖ్యంగా యువ ఓటర్లు ఆయన గత చరిత్ర తమకు అనవసరమని చెప్పటం సుబియాంటోకున్న జనాకర్షణను తెలియజేస్తుంది. గతంలో దేశాధ్యక్ష పదవికి పోటీచేసిన రెండుసార్లూ తన సైనిక గతాన్ని ఘనంగా చెప్పుకున్న సుబియాంటో ఈసారి ఆ జోలికి పోలేదు. సైనికాధికారిగా పనిచేసిన కాలంలో తూర్పు తైమూర్‌లో స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నవారిని హతమార్చటం, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ఉద్యమించిన విద్యార్థి నేతలను మాయం చేసి వారి ప్రాణాలు తీయటంవంటి అంశాల్లో అమెరికా, ఆస్ట్రేలియా గతంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశాయి. ఆయనపై నిషేధం కూడా విధించాయి.

మూడో అతి పెద్ద ప్రజాస్వామిక దేశమైన ఇండొనేసియాలో క్రమేపీ వ్యవస్థలు బలహీనపడుతుండటం అందరిలోనూ ఆందోళన కలిగిస్తోంది. ఈసారి సుబియాంటో తరఫున ఉపాధ్యక్ష పదవికి నిలబడిన 36 ఏళ్ల గిబ్రాన్ నేపథ్యమే ఈ సంగతి చెబుతుంది. కనీసం 40 ఏళ్లుంటే తప్ప ఉపాధ్యక్ష పదవికి పోటీచేయటానికి వీల్లేదని ఎన్నికల నిబంధనలు చెబుతున్నా రాజ్యాంగ న్యాయ స్థానం చీఫ్ జస్టిస్‌గా వున్న గిబ్రాన్ మామ ఈ నిబంధనను సవరించి అతనికి సాయపడ్డాడు. దీనిపై ఆందోళన చెలరేగి చీఫ్ జస్టిస్ రాజీనామా చేయాల్సివచ్చినా, ఆ తీర్పు మాత్రం రద్దుకాలేదు. 20 కోట్ల మంది ఓటర్లలో అత్యధికుల మనసు గెలుచుకున్న సుబియాంటో అంతంతమాత్రంగా వున్న వ్యవస్థలను మరింత బలహీనపరుస్తారని ఆయన ఎన్నికల ప్రసంగాలే చెబుతున్నాయి. మానవ హక్కుల చార్టర్, రాజ్యాంగ న్యాయస్థానం వంటివి కనుమరుగైతే ఇండొనేసియా తిరిగి నియంతృత్వంలోకి జారుకుంటుంది. ఆర్థికాభివృద్ధి దెబ్బతింటుంది. ప్రజల అప్రమత్తతే ఆ ప్రమాదాన్ని నివారించాలి.

రైతుల డిమాండ్లకు చెవి ఒగ్గాలి!

విశ్లేషణ



ప్రొ॥ ప్రమోద్ కుమార్

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మళ్లీ పంజాబ్ రైతులు నిరసన బాట పట్టారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధతను అందించే మార్గాలను కనుగొనడానికి ఒక కమిటీని ఏర్పాటు చేస్తామన్న కేంద్రం వాగ్దానం విషయంలో ఆలస్యమే ఈ నిరసనకు ఒక ప్రేరేపకం. ఎన్నికల వేళ మాత్రమే రాజకీయ పార్టీలు మాట వింటాయనేది మరొక కారణం. అయితే, 2020 నాటి రైతుల ఆందోళనకు 32 సంఘాల సమ్మేళనం నాయకత్వం వహించింది. ఈసారి నిరసనలకు అంత విస్తృత మద్దతు లేదు. అయినప్పటికీ, మునుపటి కంటే డిమాండ్లు నిర్మాణాత్మకంగా కనిపిస్తున్నాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ నుండి భారత్ వైదొలగడం, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు, రైతులు, రైతుకూలీలకు పింఛన్లు వంటివి ఇందులో ఉన్నాయి.

రానున్న 2024 పార్లమెంటరీ ఎన్నికలు విరుద్ధమైన అవగాహనలకు సాక్షీభూతంగా నిలుస్తున్నాయి. ప్రతిపక్షాల కుల గణన డిమాండ్‌కు బీజేపీ తలొగ్గుతుందనే భావన పోయి, అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవం తర్వాత బీజేపీ ప్రయోజనం పొందుతుందనే అభిప్రాయం వైపు లోలకం సూచీ కదిలింది. అయితే, సమాఖ్య నిధుల్లో తమ వాటా కోసం కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్న దక్షిణాది ప్రాంతీయ పార్టీలు మాత్రం ఈ కథనాన్ని సవాలు చేస్తున్నాయి. ఈ పరిణామాల మధ్యనే పంజాబ్ రైతులు ఢిల్లీ వైపు కవాతు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నిరసనకు పలు రైతు సంఘాలు మద్దతు తెలుపడంతో ఎన్నికల ముందు మరోసారి రంగం సిద్ధమైంది. ఢిల్లీ సరిహద్దులో బలగాలను మోహరించి, భారీగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయితే, డిమాండ్ల స్వభావం, పాల్గొంటున్న సంఘాలు, ప్రభుత్వ ప్రతిస్పందన వంటి అనేక అంశాలలో, 2020 రైతుల నిరసనలకు ప్రస్తుత నిరసన భిన్నంగా ఉంది.

ప్రస్తుతం ఢిల్లీ సరిహద్దుల్లో కొనసాగుతున్న నిరసనలకు జగ్జీత్ సింగ్ డల్లేవాల్, సర్వన్ సింగ్ పంధేర్ నేతృత్వంలోని సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వం వహిస్తోంది. వీరు మునుపటి రైతుల నిరసనలో ప్రముఖులు కాదు. దర్శన్ పాల్, బల్బీర్ సింగ్ రాజేవాల్ నేతృత్వం వహిస్తున్న రెండు గ్రూపులు భారత్ బంద్‌కు వేర్వేరుగా పిలుపు నిచ్చాయి. హరియాణాలో మితిమీరిన ప్రభుత్వాధికార వినియోగానికి వ్యతిరేకంగా భారత్ కిసాన్ యూనియన్(ఉగ్రాహాన్) రైల్ రోకోకు ప్రత్యేక పిలుపునిచ్చింది.

2020లో మొదలైన రైతుల ఆందోళనకు సైద్ధాంతికంగా సమర్థమైన 32 సంఘాల సమ్మేళనం నాయకత్వం వహించింది. పైగా అది పంజాబ్ కేంద్రంగా మాత్రమే జరగలేదు. అందులో పశ్చిమ ఉత్తర ప్రదేశ్, హరియాణా నుండి కూడా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈసారి మాత్రం ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ఇప్పటికి చాలావరకు మౌనంగా ఉన్నాయి. అలాగే రాకేశ్ టికైత్, గుర్నామ్ సింగ్ చధూనీ నేతృత్వంలోని యూనియన్లు ప్రస్తుతం ఆందోళనలో భాగం కాకూడదని నిర్ణయించుకున్నాయి.

అంతకుముందటి నిరసన ఉద్యమం... పౌర సమాజ కార్యకర్తలు, కళాకారులు, నిపుణులు, పదవీ విరమణ చేసిన పౌర సేవకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల నుండి విస్తృత మద్దతును పొందింది. రాడికల్ మితవాదులు కూడా తమ సొంత కథనాలతో అందులోకి వచ్చారు కానీ వారు కేంద్రస్థానంలోకి ప్రవేశించలేదు. ఉద్యమానికి ప్రగతిశీల రైతులు నాయకత్వం వహించడం, వారికి మత కుల అనుబంధాలకు అతీతంగా ఉదారవాదులు మద్దతునివ్వడం వల్ల రాడికల్ మితవాద రాజకీయాల పాత్ర పరిమితమైంది. కానీ ప్రస్తుత



నిరసనకు విస్తృతమైన మద్దతు లేదు. పైగా గుర్తింపు రాజకీయాల వెంపర్లాట కూడా దీని వెనుక ఉంటోంది. నేడు రైతు సంఘాలలోని మూడు ప్రధాన వర్గాలు ఒకే బ్యానర్ కింద ఐక్యం కాలేదు. అవి ఒక దానితో ఒకటి పోటీ పడుతున్నాయి. సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతరమైన గ్రూప్) ఇతర యూనియన్లను అధిగమించి నాయకత్వ స్థానంలోకి ప్రవేశించింది. పంజాబ్ ప్రభుత్వ మద్దతుతో కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరపడానికి సిద్ధమైంది.

డిమాండ్ల విషయానికొస్తే, ప్రస్తుత నిరసనలు మునుపటి కంటే నిర్మాణాత్మకంగా కనిపిస్తున్నాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ నుండి భారతదేశం వైదొలగడం, వ్యవసాయ రుణాల మాఫీ, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు, కనీస మద్దతు ధరకు చట్టపరమైన హామీ, రైతులు– రైతు కూలీలకు పెన్షన్లు, 2020–21 నిరసనల సందర్భంగా రైతులపై దాఖలైన కేసుల ఉపసంహరణ, నష్టపరిహారం వంటివి ఇందులో ఉన్నాయి. నిరసన కాలంలో మరణించిన రైతులకూ, 'లఖీంపూర్ ఖీరీ ఘటన' బాధితులకూ న్యాయం జరిగేలా చూడటం, వ్యవసాయ చట్టాల రద్దు తర్వాత 2021లో బీజేపీ చేసిన వాగ్దానాలపై దృష్టి పెట్టడం కూడా డిమాండ్లలో ఉన్నాయి.

మరోవైపు, సరిహద్దుల్లో భారీగా కంచెలు వేయడం, ఘాజీపూర్, సింఘు, టిక్రి సరిహద్దుల్లో 144 సెక్షన్ విధించడం చూస్తుంటే ప్రస్తుత నిరసనపై ప్రభుత్వ ప్రతిస్పందన ఇప్పుడు కూడా ప్రతిచర్యగానే కనిపిస్తోంది. పంజాబ్, హరియాణాల్లో అనేక ప్రాంతాలలో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. పంజాబ్, హరియాణా సరిహద్దులను రాజస్థాన్ మూసివేసింది. అనేక జిల్లాలలో నిషేధాజ్ఞలను విధించింది. వారి 'ఢిల్లీ ఛలో' ప్రకటనకు ముందే, రైతులతో చర్చలు ప్రారంభించినప్పటికీ, 2021లో చేసిన వాగ్దానాలపై కేంద్రప్రభుత్వం ఇంకా స్పందించలేదు.

అలాగే, నిరసన ప్రదేశంలో టియర్ గ్యాస్ వాడకం, డ్రోన్ల ద్వారా పొగ బాంబులు వేయడం, రాళ్లు రువ్వడం, వాహనాలను సీజ్ చేయడం, రైతులను పోలీసులు నిర్బంధించడం వంటి ఘటనలు అలాగే కొనసాగుతున్నాయి. క్రితంసారి మితిమీరిన బలప్రయోగం జరిపిన అనుభవం నుంచి ప్రభుత్వం పాఠాలేమీ నేర్చుకున్నట్టు లేదు. ఎందుకంటే, మితిమీరిన బలప్రయోగం చేయడం... నిరసనను తీవ్ర దారుల్లోకి మళ్లించాలనుకునేవారికి ఊతమిస్తుంది.

2020లో జరిగిన రైతుల నిరసన నుండి ఇతర పాఠాలు కూడా ఉన్నాయి. అది రైతుల విజయంతో ముగిసింది, అయితే 700 కంటే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయారు. 1990లలో ప్రారంభమైన ఆర్థిక సంస్కరణల ఎజెండాకు వ్యతిరేకంగా ఇది మొదటి, సుదీర్ఘ పోరాటం. అన్నదాతలు ఆకలితో అలమటిస్తున్న వేళ వ్యవసాయ వ్యాపారం (అగ్రి బిజినెస్) మాత్రం విపరీతంగా లాభాలు ఆర్జించడం విడ్డూరం. ఆహార ధాన్యాలకు కొత్త మార్కెట్లు లేకపోవడం, నీటి మట్టం తగ్గడం లాంటి కారణాలనే వ్యవసాయ సంక్షోభానికి కారణాలుగా చూపడం పరిస్థితి తీవ్రతను తగ్గించడమే అవుతుంది.

ఆహారమే ఇప్పుడు రాజకీయం. ఇది కేవలం పరిపాలన, చట్టపరమైన చర్యల ద్వారా మాత్రమే పరిష్కారం కాదు. ఆహార సార్వభౌమాధికారం, ఆహార భద్రత, రైతుల జీవనోపాధికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి రాజకీయ సంకల్పం అవసరం. కేంద్రం అన్ని రాజకీయ పార్టీలను భాగం చేస్తూ, దీర్ఘకాలిక పరిష్కారాలను కనుగొనడంలో నిమగ్నం కావాలి. దీన్నొక ఓట్ల వ్యవహారంగా చూడకూడదు. వ్యవసాయాన్ని ప్రపంచంతో పోటీపడేలా చేయాలంటే, సబ్సిడీలు ఇవ్వాలి. తమ వాణిజ్య వ్యవసాయాన్ని నిలబెట్టుకోవడానికి, అభివృద్ధి చెందిన దేశాలు కూడా భారీ సబ్సిడీలు ఇస్తున్నాయి.

క్రితంసారి రైతులు వీధుల్లోకి వచ్చిన ఘటన నుండి మరొక పాఠం ఏమిటంటే, ప్రభుత్వం అన్ని భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపుల తర్వాతే చట్టాలను రూపొందించాలి. లేకపోతే, అది ప్రజలకు విషాదాన్నీ, నాయకత్వానికి ఇబ్బందినీ కలిగిస్తుంది. మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకున్న కేంద్రం, కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన మద్దతును అందించే మార్గాలను కనుగొనడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. ఈ వాగ్దానంపై చొరవ విషయంలో ఆలస్యమే ఇప్పుడు తమ నిరసనను ప్రారంభించేందుకు రైతులకు తగిన కారణాన్ని అందించింది. రాజకీయ నాయకత్వం కేవలం నిరసనలకు మాత్రమే స్పందిస్తుందనీ, ఎన్నికల వేళ మాత్రమే ప్రజల వాణిని వింటుందనే భావన ట్రిగ్గర్‌గా పనిచేసింది.

వ్యాసకర్త చండీగఢ్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ కమ్యూనికేషన్ చైర్‌పర్సన్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎగిరేలా ప్రేరణ



కవితా చౌధరీ మరణ వార్త దిగ్భ్రాంతికరం. ఆమె సృజన 'ఉడాన్' తన కాలానికి అత్యంత ప్రేరణాత్మక ధారావాహిక (దూరదర్శన్‌లో 1989–91 మధ్య ప్రసారమైంది). ఇండియన్ సివిల్ సర్వీసె స్‌లో ఇప్పుడు అత్యున్నత స్థానాల్లో ఉన్న చాలామంది మహిళలు తాము ఉడాన్ వల్ల ప్రేరణ పొందామని నాతో అన్నారు. ఆమె అద్వితీయమైన దర్శకురాలు.

– శేఖర్ కపూర్, దర్శకుడు

అమెరికా ఆట



ఒక సిక్కు మిలిటెంటు (హర్‌దీప్ సింగ్ నిజ్జార్) హత్య గురించి భారత్‌తో (కెనడా ప్రధాని) ట్రూడో ఘర్షణ పడటం వెనుక బైడెన్(అమెరికా) ప్రభుత్వం ఉన్నదని ఇప్పుడు స్పష్టమవుతోంది. కెనడాతో అమెరికా పంచుకున్న అవిశ్వసనీయ నిఘా సమాచారమే దీనికి కారణం.

– బ్రహ్మ చెల్లానీ
వ్యూహాత్మక అంశాల నిపుణుడు


చంపేశారా!



అలెక్సీ నవాల్నీ 47 ఏళ్ల వయసులో కారాగారంలో చనిపోయారు. ఆయన (రష్యా అధ్యక్షుడు) పుతిన్‌కు కఠినమైన విమర్శకుడు. తనకు ఏం జరగగలదో తెలిసీ రష్యాకు తిరిగి వచ్చారు.

– విక్రమ్ చంద్ర, సంపాదకుడు

ఉల్లంఘన



పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ప్రతిపక్ష పార్టీ బ్యాంక్ అకౌంట్లను స్తంభింపజేయడం, స్వేచ్ఛా ఎన్నికల సూత్రాన్ని ఉల్లంఘించడం కాదా?

– సుహాస్ పల్శీకర్, ప్రొఫెసర్

సహనశీలతే నాయకగుణం



గల్ఫ్ ప్రాంతంతో ఇండియా సంబంధాలు పెరుగుతుండటం పట్ల పాకిస్తాన్ అసౌకర్యంగా ఉండటం, కశ్మీర్‌లో పాకిస్తాన్ తీవ్రవాద బాధితురాలిగా నాకు చాలా ఓదార్పునిస్తోంది. తనను తాను ఇస్లాం సంరక్షకురాలిగా భావించుకునే పాకిస్తాన్‌కు బదులుగా, సహనశీలమైన యూఏఈ లాంటి దేశం ముస్లిం ప్రపంచానికి నాయకత్వం వహించాలి.

– సోనమ్ మహాజన్, వ్యాఖ్యాత

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ఇన్ బాక్స్

నాస్తికోద్యమ యోధుడు

సుమారు యాభై ఏళ్ల పాటు నాస్తిక జెండాను మోస్తూ మూఢ నమ్మకాల నిర్మూలనకై నిర్విరామ కృషి చేసిన డా॥ జయగోపాల్ ఫిబ్రవరి 7న విశాఖ పట్నంలో తుదిశ్వాస విడిచారు. 'ఆంధ్ర పెరియార్'గా పిలువబడే జయగోపాల్‌ను గుర్తు చేసుకుంటూ ఎందరో అభిమానులు నివాళులు అర్పిస్తున్న సందర్భం ఇది. భౌతిక వాదిగా డా॥ జయగోపాల్ కార్యాచరణ ఎంతో సుదీర్ఘమైనది.

జయగోపాల్ తొలుత కొంతకాలం నాస్తిక కేంద్రం 'గోరా'తో కలిసి పని చేశారు. 1972 ఫిబ్రవరి 13న ఆయన 'భారత నాస్తిక సమాజం' (భానాస) ఏర్పాటు చేశారు. నాస్తిక, హేతువాద ఉద్యమ వ్యాప్తికై ఎన్నో పల్లెలు, పట్టణాలు తిరిగి రకరకాల కార్యక్రమాలు నిర్వహించారు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా ఎనిమిది రాష్ట్రాలలో నాస్తికవాదాన్ని విస్తరింపజేశారు. దళితులపై దాడులకు వ్యతిరేకంగా అనేక సాహసిక ఉద్యమాలలో భాగమయ్యారు.



డా॥ జయగోపాల్

నాస్తికోద్యమ వ్యాప్తి కోసం జయ గోపాల్ వందలాది వ్యాసాలు దేశ విదేశీ పత్రికల్లో రాశారు. నాలుగైదు భాషల్లో వివిధ రాష్ట్రాల్లో ఉపన్యాసాలు ఇచ్చారు. సాంస్కృతిక, భౌతిక వాద భావజాల వ్యాప్తి కోసం పదుల సంఖ్యలో పుస్తకాలు రాశారు. 'నాస్తిక యుగం' అనే పత్రికను స్థాపించి 40 సంవత్సరాలు నడిపారు. ఇంగ్లీషులో 'ఏజ్ ఆఫ్ ఎథియిజం' అనే పత్రికను నడిపారు. అంతర్జాతీయ స్థాయిలో 'నాస్తిక పౌరహక్కుల కేంద్రం' స్థాపించి దాని గుర్తింపు కోసం ఐక్య రాజ్య సమితిని కోరారు. మానవ హక్కుల ఉప సంస్థగా దానిని ఐరాస పరిగణించింది. ఇప్పటికీ ఆయనకు సమితితో ఉత్తరాల అనుబంధం ఉంది. ప్రపంచంలోని ఆలోచనాపరుల రక్షణ కోసం జర్మనీలో అంతర్జాతీయ కమిటీని ఏర్పాటు చేశారు. దాని ద్వారా ప్రపంచవ్యాప్త మానవ హక్కుల కార్యకర్తలకు అండగా నిలబడుతూ పోరాటం చేశారు. అంతర్జాతీయ సేవలకు గుర్తింపుగా ఆయన 'బ్రేవ్ మైండ్' అవార్డును అందుకున్నారు.

ఆయన నాస్తిక ఉద్యమకారుడే కాదు, హక్కుల ఉద్యమకారుడు కూడా. విశాఖ పౌర హక్కుల సంఘానికి జిల్లా కార్యదర్శిగా ఒక దశాబ్ద కాలం పని చేశారు. 'భానాస'కు అనుబంధంగా 'కులాంతర వివాహితుల పరిరక్షణ సమితి'ని స్థాపించి వందలాది కులాంతర, మతాంతర వివాహాలు నిర్వహించారు. పెరియార్ 144వ జయంతి సందర్భంగా 2023 సెప్టెంబర్ 17 నాడు జయగోపాల్ చేతుల మీదుగా భారత నాస్తిక సమాజం వెబ్‌సైట్ ప్రారంభమైంది. నాస్తికోద్యమకారుడిగా అంతర్జాతీయ గుర్తింపు పొందిన డా॥ జయగోపాల్ కృషి శ్లాఘనీయం. ఆయన సంస్థలను, వాటి ఆశయాలను ముందుకు నడిపించడమే ఆయనకు ఉత్తమ నివాళి.

– బి. నర్సన్, హైదరాబాద్

దయ్యాలు వేదాలు వల్లించడం అంటే ఇదే!

అభిప్రాయం



అడుసుమిల్లి జయప్రకాష్

అధికారంలో ఉన్నప్పుడు కళ్లు మూసుకుని, పదవీ విరమణ తర్వాత తగుదునమ్మా అంటూ టీడీపీకి రాజకీయ ప్రయోజనం కలిగించేందుకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు ఊరూరా తిరుగుతున్నారు. హింసలేని ఎన్నికలు, స్వేచ్ఛ అంటూ పెద్ద మాటలు చెబుతున్నారు. కాపాడే అధికారం ఉన్నప్పుడు ఏం చేశారని పౌర సమాజం ప్రశ్నిస్తోంది.

ఇటీవల కాలంలో 'సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ' (సీఎఫ్‌డీ) పేరుతో ఏపీ ఎన్నికల మాజీ ప్రధాన అధికారి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్, ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎల్వీ సుబ్రహ్మణ్యం తదితరులు సమావేశాలతో హడావిడి చేస్తున్నారు. సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ ప్రధాన లక్ష్యం స్వేచ్ఛగా, ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల్లో ఓటు హక్కును ఉపయోగించుకోవడం అని ప్రకటించారు. ఇదే నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ ఏపీ రాష్ట్ర ఎన్నికల అధికారిగా ఉన్న కాలంలో, స్థానిక సంస్థల్లో ఏకగ్రీవాలు ఎక్కువయ్యాయనీ, అలాగే నామినేషన్లు వేయనివ్వడం లేదనీ, దౌర్జన్యాలు పెరిగాయనీ పెద్ద ఎత్తున విపక్షాలు ఫిర్యాదు చేయడం గమనార్హం.

ఎల్వీ సుబ్రహ్మణ్యాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా తొలగించడంతో ఆయనకు ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ లాంటివి గుర్తు కొస్తున్నాయి. ఈయన అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని గతంలో ఎన్నికల సమయంలో చంద్రబాబు తీవ్ర ఆరోపణలు చేశారనే విషయాన్ని మరిచిపోతే ఎలా?

సీఈసీ విడుదల చేసిన వివరాల ప్రకారం 2019లో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల్లో 79.74 శాతం ఓట్లు పోలయ్యాయి. నరసరావుపేట పార్లమెంటరీ నియోజక వర్గంలో అత్యధికంగా 85.53 శాతం పోలయ్యాయి. అలాగే 2014 ఎన్నికల్లో రాష్ట్రంలో 74.64 శాతం ఓట్లు పోలయ్యాయి. బాపట్ల పార్లమెంటరీ నియోజకవర్గంలో అత్యధికంగా 85.16 శాతం ఓట్లు పోలయ్యాయి. అంటే, రాష్ట్ర విభజన జరిగిన మొదటి ఐదేళ్లకే ఇక్కడి ప్రజల్లో కలిగిన చైతన్యం కారణంగా 2019 ఎన్నికల్లో చంద్రబాబును ఇంటికి పంపడం కోసం, మరో ఐదు శాతం మంది కొత్తగా ఓటింగ్‌లో పాల్గొన్నారన్నమాట. ఇక్కడి గణాంకాలు ఇలా ఉన్నప్పుడు, 'ప్రజాస్వామ్య పరిరక్షణ' పేరుతో మళ్ళీ ఓటు–హక్కు అంటూ, వీరి కసరత్తు ఎందుకు? ఈ ఐఏఎస్ అధికారులతో పీవీ రమేష్ అనే మరొక ఐఏఎస్ కలిశారు. వీరు కలిగించే చైతన్యం అంతా బెజవాడ కేంద్రంగానే సాగడం గమనార్హం.

'ప్రజాస్వామ్య పరిరక్షణ' పేరుతో నిమ్మగడ్డ బృందం నిర్వహిస్తున్న సభల్లో గెస్ట్ పాత్రల్లో పాల్గొంటున్నవారి విషయమై పౌరులు బాధపడుతున్నారు. రిటైర్ అయ్యాక కూడా వైసీపీ ప్రభుత్వంలో చక్రం తిప్పబోయి క్షతగాత్రులైన ఈ ముగ్గురు అధికారులు తమకంటూ ఇక్కడ ఒక విలువ లేక, 'మీడియా అటెన్షన్' కోసం, మాజీ భారత ఎన్నికల కమిషనర్ వీఎస్ సంపత్, కేబినెట్ సెక్రటరీ కె. పద్మనాభయ్యలను తమ పక్కన పెట్టుకుంటున్నారు.

ఎందుకు ఈ మాజీ అధికారులను క్షతగాత్రులు అనవలసివచ్చిందో తెలియాలి. నిమ్మగడ్డ రమేష్ కుమార్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ కేడర్‌లో ఏదో ఒక ప్రధాన శాఖలో కాకుండా, చంద్రబాబు కోసం తన సర్వీస్ చివరి రోజు వరకూ రాజ్ భవన్‌లో గవర్నర్ సెక్రటరీగా పనిచేశారు. రాష్ట్ర విభజనకు ముందు 4 నెలల పాటు రాష్ట్రపతి పాలన ఉండడం మనకు తెలిసిందే. అప్పట్లో గవర్నర్ ఇ.ఎస్.ఎల్. నరసింహన్ ఆఫీస్ కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల్లో అన్ని కీలక నిర్ణయాలకు కేంద్రం అయింది. ఇలా టీడీపీ రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేయడం మొదటి నుంచి నిమ్మగడ్డకు కొత్తకాదు. అందుకే 2016లో రిటైర్ అయిన మరుసటి రోజు ఇతణ్ణి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పోస్ట్‌లో చంద్రబాబు నియమించారు.

అదే నెలలో ఆయన కుమార్తె నిమ్మగడ్డ లావణ్యను ఏపీ 'ఎకనమిక్ డెవలప్మెంట్ బోర్డ్'లో సీనియర్ కన్సల్టెంట్‌గా నెలకు రూ 1.50 లక్షల జీతంతో నియమించారు. అయితే ప్రభుత్వం మారడంతో ఉపాధి కోల్పోయి, పౌర వేదిక ముసుగులో జగన్ మోహన్ రెడ్డి ప్రత్యర్థి తరహాలో ఇప్పుడు నిమ్మగడ్డ వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు ఈ ప్రభుత్వం మారితే, మళ్ళీ 'ఫ్యామిలీ ప్యాకేజి' ప్రయోజనాలు పొందడం ఆయన లక్ష్యం. అందుకోసం 'ఈ ప్రభుత్వంలో సలహాదారులు ఎంతమంది? వీరు కేబినెట్ హోదాలో ఉంటూ రాజకీయాలు ఎలా మాట్లాడతారు?' అంటూ రమేష్ టీడీపీ తరఫున విమర్శలు చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఇప్పటికంటే ఎక్కువమంది సలహాదారులు, 'కన్సల్టెంట్లు' ఉన్న విషయం తెలియనిది కాదు.

'స్కిల్ స్కామ్'లో అరెస్టయిన 'ఏ 1' గంటా సుబ్బారావు, ముందస్తు బెయిల్ తెచ్చుకున్న 'ఏ 2' ఐఏఎస్ లక్ష్మీనారాయణలు ఇద్దరూ ఇదే తరహాలో బయట నుంచి ప్రభుత్వం 'కన్సల్టెంట్స్'గా నియమించిన వారేకదా! ప్రభుత్వంలో సలహాదారులు రాజకీయాలు మాట్లాడ్డం నేరమా? లేక నమ్మకంగా ప్రభుత్వంలో ఉంటూ, దొంగ దారుల్లో నిధులు బయటకు పంపడం నేరమా? ఈ రెండింటిలో ఏది ప్రజాస్వామ్యానికి చేటు? అని రాష్ట్ర ప్రజలు ఈ నిమ్మగడ్డ బృందాన్ని నిలదీయొద్దూ? 'రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం...' అంటూ పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్న నిమ్మగడ్డ, బెజవాడలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సీటులో కూర్చుని, తన తప్పుడు చర్యలకు తగిన శిక్ష నుంచి తప్పించుకోవడానికి క్రింది ఉద్యోగులతో 'కంప్యూటర్ హార్డ్ డిస్క్'లు ధ్వంసం చేయించడం ఏ స్ఫూర్తి అవుతుందో చెప్పగలరా?



అసలు ఎల్వీ సుబ్రహ్మణ్యంను సీఎస్‌గా నియమించడమే ఓ ప్రహసనం! ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు సీఎస్‌గా ఉన్న అనిల్ చంద్ర పునేఠా చంద్రబాబు కనుసన్నల్లో పనిచేస్తూ ఉండడంతో, భారత ఎన్నికల కమిషనర్ వెంటనే అయన్ని తొలగించి, క్రీడలు యువజన సర్వీసులు సెక్రటరీగా ఉన్న సుబ్రహ్మణ్యంను సీఎస్ పోస్టులో నియమించింది. అయితే, జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక, సీఎం పరిపాలనా శైలి వేగాన్ని అందుకోలేని స్థితిలో ఉన్న ఎల్వీ స్థానంలో మరొకరిని సీఎస్ పోస్టులో నియమించారు. అదీ ఎల్వీ ఆక్రోశానికి కారణం. దాంతో, నిమ్మగడ్డ వెనుక తిరుగుతూ జగన్ ప్రభుత్వం మీద ముసుగు దాడికి దిగారు.

ఇందులో ముఖ్యుల ఎంపిక ఎవరిదోగానీ, ఆసక్తికరంగా ఉంది. అంబేడ్కరిస్టుల కుటుంబం నుంచి మాజీ ఐఏఎస్ పీవీ రమేష్ కొంచెం ఆలస్యంగా ఇందులోకి దిగారు. 'స్కిల్ స్కామ్' జరిగినప్పుడు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న ఈయన కేస్ సమయంలో 'మీడియా' ముందు వివాదాస్పదంగా మాట్లాడి వార్తల్లో వ్యక్తి అయ్యారు. సర్వీసులో ఎక్కువకాలం పలుదేశాల్లో 'వరల్డ్ బ్యాంక్'లో పనిచేశానని చెప్పుకునే రమేష్, ప్రస్తుతం 'ఇండియన్ బిజినెస్ స్కూల్'లో 'ఫ్యాకల్టీ'గా పనిచేస్తూ, మధ్యలో ప్రజాస్వామ్య పరిరక్షణకు బెజవాడ వస్తున్నారు. అయితే, ఇక్కడ ఈ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం గురించి ఈయన ఒక్క మాటా మాట్లాడరు!

వీరంతా 'పొలిటికల్ జేఏసీ'గా ఏర్పడి, దానికి 'సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ' అని పేరుపెట్టి ఏపీలో తటస్థ ఓటరును ప్రభావితం చేయాలనే రహస్య 'ఎజెండా'తో పనిచేస్తున్నారు. వీరికి 'మీడియా' కవరేజీ కోసం 'బాబు మీడియా ఎటూ ఉండనే ఉంది. ఏతా వాతా చెప్పొచ్చేది ఏమిటంటే... ప్రజలు అంతా గమనిస్తున్నారు. తగిన సమయంలో తగినవిధంగా స్పందిస్తారు.

వ్యాసకర్త మాజీ ఎమ్మెల్యే । 98481 28844

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** శు.అష్టమి ప.1.19 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** కృత్తిక ప.1.40 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** తె.5.31 నుండి 7.04వరకు (తెల్లవారితే ఆదివారం), **దుర్ముహూర్తం:** ఉ.6.31 నుండి 8.02 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.20 నుండి 12.51 వరకు ; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.30, **సూర్యాస్తమయం:** 5.57.

నిరసన గళం మూగబోయింది



జైల్లోనే మరణించిన రష్యా విపక్ష నేత నవాల్నీ

పుతిన్ పనేనంటూ ఇంటాబయటా విమర్శలు ● పుతిన్‌కు చెమటలు పట్టించిన హక్కుల నేత

మాస్కో: రష్యాలో మరో అసమ్మతి గళం శాశ్వతంగా మూగబోయింది. మూడేళ్లుగా నిర్బంధంలో ఉన్న విపక్ష నేత, హక్కుల ఉద్యమకారుడు 47 ఏళ్ల అలెక్సీ నవాల్నీ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందారు. ''ఆయన శుక్రవారం ఉదయం వాకింగ్ అనంతరం అస్వస్థతకు గురయ్యారు. ఆ వెంటనే అపస్మారక స్థితిలోకి జారుకున్నారు. కాపాడేందుకు వైద్యులు ఎంత ప్రయత్నించినా, తక్షణం అంబులెన్సు రప్పించినా లాభం లేకపోయింది'' అని జైలు వర్గాలు తెలిపాయి. అయితే మరణానికి కారణమేమిటో బయట పెట్టలేదు. దశాబ్దానికి పైగా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కంట్లో నలుసుగా మారి ఆయనకు ప్రబల ప్రత్యర్థిగా ఎదిగిన నవాల్నీ మృతిపై తీవ్ర అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇది కచ్చితంగా ప్రభుత్వ హత్యేనని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2018లో రష్యా అధ్యక్ష పదవి కోసం పుతిన్‌తో పోటీ పడేందుకు విఫలయత్నం చేసిన నవాల్నీ, నాటినుంచీ ప్రభుత్వ అవినీతిపై పోరును తీవ్రతరం చేశారు. పలు స్థాయిల్లో పెచ్చరిల్లిన అవినీతిని బయటపెడుతూ సంచలనం సృష్టిస్తూ వచ్చారు. దాంతో ప్రభుత్వం ఆయన్ను నిర్బంధించడమే గాక దేశద్రోహం తదితర అభియోగాలు మోపింది. 19 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న నవాల్నీని మాస్కో సమీపంలోని జైలు నుంచి గత డిసెంబర్‌లో దాదాపు 2,000 కిలోమీటర్ల దూరంలోని స్పెషల్ రెజిమ్ పీనల్ కాలనీకి తరలించారు. అతి శీతల ఆర్కిటిక్ ప్రాంతంలోని ఈ కాలనీ రష్యాలోకెల్లా అత్యంత కఠినమైన పరిస్థితులుండే కారాగారం. వచ్చే నెలలో రష్యాలో అధ్యక్ష ఎన్నికలున్న నేపథ్యంలో ఇది కచ్చితంగా ఆయన గొంతు నొక్కే ప్రయత్నమేనని అభిమానులు అప్పుడే ఆందోళనలకు దిగారు. ఈ ఎన్నికల్లో పుతిన్‌ను సవాలు చేసే గట్టి ప్రత్యర్థి లేకపోయినా 'నవాల్నీ ఫ్యాక్టర్' ఆయన్ను బాగా చీకాకు పరుస్తోంది. నవాల్నీ అనుయాయులతో పాటు నానాటికీ పెరిగిపోతున్న అభిమాన గణం సోషల్ మీడియా ద్వారా పుతిన్ వ్యతిరేక ప్రచారంతో దేశమంతటా హోరెత్తిస్తోంది. దేశ విదేశాల్లోని పుతిన్ అపార ఆస్తుల చిట్టాను కొద్ది రోజులుగా ఒక్కొక్కటిగా విప్పుతూ ఫొటోలు, వీడియోలతో సహా బయట పెడుతూ వస్తోంది. వాటికి మిలియన్ల కొద్దీ వ్యూస్, లక్షలాది లైక్‌లు వచ్చి పడుతున్నాయి! ఈ నేపథ్యంలో నవాల్నీ 'మృతి' పుతిన్ పనేనని భావిస్తున్నారు. దీనిపై పాశ్చాత్య దేశాలన్నీ స్పందించాయి. పుతిన్ అణచివేతను నవాల్నీ ఆజన్మాంతం అత్యంత ధైర్యసాహసాలతో ఎదిరించారంటూ పలు దేశాధినేతలు కొనియాడారు.

విషప్రయోగం జరిగినా...

మూడున్నరేళ్ల క్రితం ప్రాణాంతక విషప్రయోగం జరిగినా వెరవని గుండె ధైర్యం నవాల్నీది! ఆయన 2020 ఆగస్టులో సైబీరియా పర్యటన ముగించుకుని తిరిగొస్తుండగా 'నొవిచోక్' దాడికి గురయ్యారు. రష్యాకే ప్రత్యేకమైన ఆ ప్రాణాంతక రసాయనాన్ని నవాల్నీ లో దుస్తులపై చల్లినట్టు తర్వాత తేలింది. నాడీ మండలాన్ని నేరుగా దెబ్బ తీసే నొవిచోక్ ప్రభావానికి విమానంలోనే ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. అనుయాయులు హుటాహుటిన జర్మనీకి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. నెలల తరబడి చికిత్స తర్వాత కోలుకున్నాక పుతిన్‌పై 'అండర్‌ప్యాంట్స్ (లో దుస్తుల) పాయిజనర్' అంటూ చెణుకులు విసిరారు. దాంతో అండర్‌ప్యాంట్స్ పదబంధం ఒక్కసారిగా రష్యా సోషల్ మీడియాలో పాపులరైంది. దానిపై లెక్కలేనన్ని మీమ్స్ కూడా పుట్టుకొచ్చాయి. నిర్బంధం ఖాయమని తెలిసి కూడా ఆరోగ్యం చక్కబడుతూనే 2021 జనవరిలో నవాల్నీ రష్యా తిరిగొచ్చారు. మాస్కోలో విమానం దిగీ దిగగానే ఆయన్ను నిర్బంధంలోకి తీసుకుని జైలుకు తరలించారు. చివరికి జైల్లోనే ప్రాణాలు కోల్పోయారు.

నవ్వుతూనే కన్పించారు...

నవాల్నీ చివరిసారిగా గురువారం బయటి ప్రపంచానికి కన్పించారు. ఓ కేసు విచారణలో వీడియో లింక్ ద్వారా పాల్గొన్నారు. ఆరోగ్యంగా ఉండటమే గాక సరదాగా నవ్వుతూ, విచారణ సందర్భంగా జడ్జితోనూ జోకులు వేస్తూ గడిపారు.



పుతినే బాధ్యుడు: భార్య

నవాల్నీ మరణ వార్తలపై ఆయన భార్య యూలియా నవాల్నయా అనుమానాలు వెలిబుచ్చారు. శుక్రవారం మ్యూనిచ్ భద్రతా సదస్సులో మాట్లాడుతూ ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. ''నా భర్త మృతి నిజమే అయితే అందుకు పుతిన్, ఆయన అనుచర గణమే బాధ్యులు. ఎప్పటికైనా వారు శిక్ష నుంచి తప్పించుకోలేరు'' అన్నారు. సదస్సులో పాల్గొన్న అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ తదితర నేతలు ఆమెను ఓదార్చారు.

సాహసమే శ్వాస...

మాస్కో శివారు ప్రాంతమైన బుటిన్‌లో జన్మించిన నవాల్నీ మాస్కోలో లా డిగ్రీ అనంతరం విదేశాల్లో పై చదువులు పూర్తి చేశారు. ప్రభుత్వ అవినీతిని ప్రశ్నించడం ద్వారా పుతిన్ వ్యతిరేకునిగా తెరపైకి వచ్చారు. రష్యా చమురు, గ్యాస్ కంపెనీల్లో వాటాలు కొనుగోలు చేసి వాటిలోని విచ్చలవిడి అవినీతిని బయట పెట్టారు. 2008 నుంచీ ఆయన పేరు క్రమంగా రష్యా అంతటా పాకింది. దాంతో 2012లో నవాల్నీ అరెస్టుల పర్వం మొదలైంది. 2014లో ఆశ్చర్యకరంగా జైలు నుంచి విడుదల చేయడంతో మాస్కో మేయర్ ఎన్నికల బరిలో దిగారు. ప్రచార మార్గాలన్నింటినీ మూసేసినా పుతిన్ బలపరిచిన అభ్యర్థికి గట్టి పోటీ ఇవ్వడంతో నవాల్నీ పేరు మారుమోగిపోయింది. దాంతో ప్రభుత్వం మళ్లీ అరెస్టుల పర్వానికి తెర తీసింది. చివరికి 2018 అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి అనర్హునిగా ప్రకటించడంతో ప్రజల దృష్టిలో నవాల్నీ మళ్లీ హీరోగా మారారు. రష్యాలో రెండు దశాబ్దాలుగా విపక్ష నేతలు, పుతిన్ విమర్శకులు, వ్యతిరేకులు నిర్బంధం పాలవడం, అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించడం పరిపాటిగా మారింది. విపక్ష నేత బోరిస్ నెమ్‌త్సోవ్‌ను 2015లో పుతిన్ అధికార నివాసం క్రెమ్లిన్ ప్రాసాదానికి కూతవేటు దూరంలోనే కాల్చి చంపారు. పుతిన్‌ను విమర్శించిన వాగ్నర్ గ్రూప్ బాస్ ప్రిగోజిన్ 2023 ఆగస్టులో 'విమాన ప్రమాదం'లో మరణించాడు. ప్రభుత్వంపై విమర్శలు చేసి అకాల మరణం పాలైన రష్యా కుబేరుల జాబితా చాలా పెద్దది. నవాల్నీ మాత్రం పుతిన్‌ను గట్టిగా సవాలు చేస్తూ ప్రబల ప్రత్యర్థిగా ఎదుగుతూ వచ్చారు. సోషల్ మీడియాను, స్వతంత్ర మీడియాను సమర్థంగా వాడుకుంటూ చెమటలు పట్టించారు. భౌతిక దాడులు, హత్యాయత్నాలను ఏమాత్రం లెక్కచేయని తీరు ఆయనకు అసంఖ్యాకంగా అభిమానులను సంపాదించి పెట్టింది.


2018లో మాస్కోలో ప్రభుత్వ వ్యతిరేక ర్యాలీలో నవాల్నీ

నిరసనలు... ఆగ్రహావేశాలు

నవాల్నీ మృతి పట్ల ప్రపంచవ్యాప్తంగా నిరసనలు, ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఇది పుతిన్ పనేనంటూ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మండిపడ్డారు. నవాల్నీ కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. అధికారాన్ని కాపాడుకునేందుకు ఎవరినైనా అంతమొందించడం పుతిన్ నైజమంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ దుయ్యబట్టారు. ఆయన సర్వం కోల్పోవడంతో పాటు తన తప్పిదాలకు బాధ్యునిగా శిక్ష అనుభవించి తీరాల్సిందేనన్నారు. నవాల్నీ తన అసమాన ధైర్యసాహసాలకు జీవితాన్నే మూల్యంగా చెల్లించాల్సి రావడం బాధాకరమని జర్మనీ చాన్సలర్ ఒలాఫ్ స్కాల్జ్ ఆవేదన వెలిబుచ్చారు. అడుగడుగునా ప్రాణాపాయం పొంచి ఉన్నా మొక్కవోని ధైర్యసాహసాలు ప్రదర్శించడం నవాల్నీకే చెల్లిందంటూ బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ కొనియాడారు. ఆయన్ను రష్యా ప్రభుత్వమే క్రూరంగా పొట్టన పెట్టుకుందని లాత్వియా అధ్యక్షుడు రింకేవిక్స్ ఆరోపించారు. తాను అత్యంత బలహీనుడినని ఈ చర్యతో పుతిన్ రుజువు చేసుకున్నారని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ అభిప్రాయపడ్డారు. రష్యాలో స్వేచ్ఛా గళాలపై ఉక్కుపాదం మోపుతున్నారంటూ ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ మండిపడ్డారు. సొంత ప్రజల అసమ్మతి పుతిన్‌ను విపరీతంగా వణికిస్తోందని మరోసారి రుజువైందని ఈయూ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాండర్ లియన్ అన్నారు. పుతిన్ ఆదేశాల మేరకే నవాల్నీ హత్య జరిగిందని ప్రపంచ మాజీ చెస్ చాంపియన్, రష్యా విపక్ష నేత గారీ కాస్పరోవ్ తదితరులు దుమ్మెత్తిపోశారు.

నేడు జీఎస్ఎల్‌వీ సీ14 ప్రయోగం



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): వాతావరణ ఉపగ్రహం ఇన్‌శాట్–3డీఎస్‌ను మోసుకెళ్లే జీఎస్ఎల్‌వీ ఎఫ్14 ఉపగ్రహ వాహక నౌక ప్రయోగానికి శుక్రవారం మధ్యాహ్నం కౌంట్‌డౌన్ మొదలైంది. తిరుపతి జిల్లా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి శనివారం సాయంత్రం 5.35 గంటలకు దీనిని ప్రయోగించనున్నారు. గతంలో ప్రయోగించిన ఇన్‌శాట్–3డీ, ఇన్‌శాట్–3డీఆర్ ఉపగ్రహాలకు కొనసాగింపుగానే ఇన్‌శాట్–3డీఎస్‌ని పంపుతున్నట్లు ఇస్రో వెల్లడించింది. సుమారు 2,275 కిలోల బరువైన ఈ ఉపగ్రహంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన పేలోడ్లున్నాయి. ఈ పేలోడ్లు వాతావరణ అంచనా, విపత్తు హెచ్చరికల కోసం మెరుగైన వాతావరణ పరిశీలన, భూమి, సముద్ర ఉపరితలాల పర్యవేక్షణ విధులను చేపడతాయి. ప్రయోగం మొదలైన 20 నిమిషాల తర్వాత జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్(జీటీవో)లో శాటిలైట్‌ను ప్రవేశపెడతారు. అనంతరం దశలవారీగా రెండు రోజులపాటు కక్ష్యను మారుస్తూ జియో స్టేషనరీ ఆర్బిట్‌లోకి మారుస్తారు.

సముద్రంలోకి కార్టోశాట్-2

బెంగళూరు: పాత ఉపగ్రహాలతో ఆయా కక్ష్యల్లో పెరిగిపోతున్న అంతరిక్ష చెత్తను కాస్తయినా తగ్గించే లక్ష్యంతో ఇస్రో మరో అడుగు ముందుకేసింది. దాదాపు 17 సంవత్సరాల క్రితం ప్రయోగించాక చాలా ఏళ్లు దేశానికి సేవలందించిన కార్టోశాట్–2 ఉపగ్రహాన్ని ఇస్రో విజయవంతంగా భూవాతావరణంలోకి తీసుకొచ్చి హిందూ మహాసముద్రంలో పడేలా చేసింది. ఫిబ్రవరి 14వ తేదీ మధ్యాహ్నం 3.48 గంటలకు ఈ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని ఇస్రో శుక్రవారం ప్రకటించింది. పట్టణ ప్రణాళికలకు సాయపడేలా అత్యంత స్పష్టమైన హై రెజల్యూషన్ ఇమేజీలు తీసేందుకు 2007 జనవరి పదో తేదీన 680 కేజీల ఇస్రో కార్టోశాట్–2 ఉపగ్రహాన్ని 635 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలో విజయవంతంగా పంపింది. ఇది 2019 ఏడాదిదాకా పనిచేసింది. తర్వాత కక్ష్య తగ్గించుకుంటూ క్రమంగా భూవాతావరణంలోకి ప్రవేశించి అత్యంత వేగంగా తిరుగుతూ మండి, ధ్వంసమై అతి చిన్న ముక్కలుగా మారిపోనుంది. అలా కావడానికి సాధారణంగా 30 సంవత్సరాల సమయం పడుతుంది. ఈలోపు ఉపగ్రహాలుండే కక్ష్యల్లో అంతరిక్ష చెత్తను తగ్గించేందుకు ముందుగానే దీనిని భూవాతావరణంలోకి రప్పించారు.

రూ.84,560 కోట్లతో సైనిక సామగ్రి

న్యూఢిల్లీ: దేశ సైనిక బలగాల యుద్ధ పటిమను గణనీయంగా పెంచే రూ.84,560 కోట్ల విలువైన పలు ఆయుధ వ్యవస్థల కొనుగోలుకు రక్షణ శాఖ పచ్చజెండా ఊపింది. కొనుగోలుకు సంబంధించిన ప్రతిపాదనలకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సారథ్యంలోని డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్(డీఏసీ)ఆమోదం తెలిపింది. కొత్త తరం యాంటీ ట్యాంక్ మందుపాతరలు, ఎయిర్ డిఫెన్స్ టాక్టికల్ కంట్రోల్ రాడార్లు, హెవీ వెయిట్ టోర్పెడోలు, మధ్యశ్రేణి, మల్టీ మిషన్ యుద్ధ విమానాలు, ఫ్లయిట్ రీఫ్యూయలర్ విమానాలు, అధునాతన రేడియో వ్యవస్థలు ఇందులో ఉన్నట్లు రక్షణ శాఖ తెలిపింది. వీటి చేరికతో నేవీ, కోస్ట్‌గార్డ్, ఎయిర్‌ఫోర్స్ పాటవం గణనీయంగా పెరుగుతాయని పేర్కొంది.

సీపీఐ (ఎంఎల్)ఎమ్మెల్యేపై అనర్హత వేటు

పట్నా: సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే మనోజ్ మంజిల్‌ను బిహార్ అసెంబ్లీ అనర్హుడిగా ప్రకటించింది. ఓ హత్య కేసులో న్యాయస్థానం ఆయనకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువరించినందున, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 8 ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు విధాన సభ సెక్రటేరియట్ తెలిపింది. కోర్టు శిక్ష ప్రకటించిన ఫిబ్రవరి 13వ తేదీ నుంచి అనర్హత అమల్లోకి వస్తుందని శుక్రవారం జారీ చేసిన నోటిఫికేషన్‌లో తెలిపింది. భోజ్‌పూర్ జిల్లా తరారీ స్థానం నుంచి మంజిల్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఎనిమిదేళ్ల క్రితం నాటి హత్య కేసు విచారించిన ఎంపీ/ఎమ్మెల్యే కేసుల ప్రత్యేక కోర్టు మంజిల్‌ను దోషిగా నిర్ధారించిన విషయం తెలిసిందే. తాజా పరిణామంతో బిహార్ అసెంబ్లీలో వామపక్షాల బలం 11కు తగ్గినట్లయింది.

నేటి నుంచి బీజేపీ సమావేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగానే 370 స్థానాలు, జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్డీయే) 400కు పైగా సీట్లు గెలుచుకోవడం తథ్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు నిర్వహించబోతున్నారు. ఢిల్లీలోని భారత్ మండపంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి 11,500 మందికిపైగా బీజేపీ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొనబోతున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి ఇప్పటికే వందలాది మంది బీజేపీ నేతలు, కార్యకర్తలు ఢిల్లీ చేరుకున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అధ్యక్ష ప్రసంగంతో శనివారం మధ్యాహ్నం ప్రారంభమయ్యే జాతీయ కార్యవర్గ సమావేశాలు ఆదివారం సాయంత్రం ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగంతో ముగుస్తాయి.

గాజా ఆస్పత్రిని చుట్టుముట్టిన ఐడీఎఫ్

ఆక్సిజన్ నిల్వలు అడుగంటి అయిదుగురు రోగులు మృతి

రఫా: ప్రాణాలతో మిగిలి ఉన్న బందీలను హమాస్ మిలిటెంట్లు నాసిర్ ప్రాంగణం అడుగునున్న సొరంగాల్లో దాచినట్లు ఇజ్రాయెల్ రక్షణ బలగాలు (ఐడీఎఫ్)అనుమానిస్తున్నాయి. దీంతో, వారం రోజులుగా ఆస్పత్రిని దిగ్బంధించి అణువణువూ శోధిస్తున్నాయి. గత ఏడాది అక్టోబర్ 7వ తేదీ దాడితో సంబంధమున్నట్లుగా అనుమానిస్తున్న 20 మందిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు ఐడీఎఫ్ తెలిపింది. ఆస్పత్రిలోని 460 మందికి పైగా సిబ్బంది, రోగులను ఎలాంటి సౌకర్యాలు లేని ఆ పక్కనే ఉన్న పాతభవనంలోకి తరలివెళ్లాలని ఆర్మీ ఆదేశించింది. విద్యుత్ సరఫరా నిలిపివేయడంతోపాటు, ఆక్సిజన్ నిల్వలు అడుగంటడంతో ఐసీయూలోని ఆరుగురు రోగుల్లో ఐదుగురు చనిపోయినట్లు గాజా అధికారులు శుక్రవారం తెలిపారు.

కాంగ్రెస్ ఖాతాల స్తంభన

- అప్పిలేట్ ట్రిబ్యూనల్‌ను ఆశ్రయించడంతో పునరుద్ధరణ
- ప్రజాస్వామ్యంపై దాడి: కాంగ్రెస్

న్యూఢిల్లీ: ఎలక్టోరల్ బాండ్ల విధానాన్ని రద్దుచేస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో మోదీ సర్కార్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలిన మరుసటి రోజే కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ ఖాతాలను ఆదాయ పన్ను శాఖ స్తంభింపజేయడం కలకలం సృష్టించింది. 2018–19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేసులో ఐటీ రిటర్నుల్లో రూ.210 కోట్ల వ్యత్యాసం ఉన్న నేపథ్యంలో వాటి రికవరీ కోసం ఆయా ఖాతాలను ఐటీ శాఖ స్తంభింపజేసినట్లు వార్తలొచ్చాయి. పార్టీ ప్రధాన ఖాతాలను ఫ్రీజ్ చేయడంతో కాంగ్రెస్ వేగంగా స్పందించింది. వెంటనే ఐటీ, ఐటీ అప్పిలేట్ ట్రిబ్యునల్(ఐటీఏటీ)ను ఆశ్రయించింది. దీంతో ట్రిబ్యునల్ కాస్త కాంగ్రెస్‌కు అనుకూలంగా ఆదేశాలిచ్చింది. ఆయా ఖాతాల్లో మొత్తంగా రూ.115 కోట్లు అలాగే నిల్వ ఉంచి మిగతాది మాత్రమే విత్‌డ్రా, ఇతరత్రా అవసరాలకు వాడుకోవచ్చని సూచించింది. వెంటనే ఆయా ఖాతాలను డీ ఫ్రీజ్ చేయాలని ఐటీ అధికారులను ఆదేశించింది. ట్రిబ్యునల్ ఆదేశాలతో సంబంధిత ఖాతాలన్నీ పునరుద్ధరించబడ్డాయి. ట్రిబ్యునల్ ఈ అంశంపై బుధవారం మరోసారి వాదనలు విననుంది. ఫ్రీజ్ చేసిన ఖాతాల్లో యూత్ కాంగ్రెస్ ఖాతాలూ ఉన్నాయి. ఖాతాల స్తంభనపై మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. '' 2018–19 ఆర్థికంలో ఐటీ రిటర్నులను కాస్త ఆలస్యంగా సమర్పించాం. ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ జీతభత్యాలను పార్టీకి విరాళాల రూపంలో ఇచ్చారు. అలాంటి కొన్ని మొత్తాలు ఐటీ రిటర్నుల్లో ప్రతిబింబించలేదు. అంతమాత్రానికే ప్రధానమైన తొమ్మిది ఖాతాలను స్తంభింపజేస్తారా?' అని కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. దీనిపై పార్టీ కోశాధికారి అజయ్ మాకెన్ మాట్లాడారు. '' ఖాతాల్లో ఉన్న మొత్తంలో రూ.115 కోట్లే అత్యంత ఎక్కువైనది. సిబ్బంది జీతభత్యాలు, విద్యుత్ బిల్లులు చెల్లించడానికి మిగతా డబ్బు అస్సలు సరిపోదు. రాబోయే లోక్‌సభ ఎన్నికల వేళ ఇలా ఖాతాలను ఫ్రీజ్ చేస్తే ఎన్నికల్లో పార్టీ భాగస్వామి కావడం చాలా కష్టం'' అని మాకెన్ అన్నారు.

భయపడకండి మోదీ జీ: రాహుల్

ఈ వ్యవహారంపై రాహుల్ గాంధీ స్పందించారు. '' భయపడకండి మోదీ జీ! కాంగ్రెస్ ప్రజాశక్తికి కాంగ్రెస్ చిరునామా. నియంతృత్వం ముందు మోకరిల్లేది లేదు'' అన్నారు. అధికార దాహంతో లోక్‌సభ ఎన్నికల వేళ దేశంలోని అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ ఖాతాలను ప్రభుత్వం స్తంభింపచేసిందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఆరోపణలను బీజేపీ తిప్పికొట్టింది. మోదీ మూడోసారి పగ్గాలు చేపట్టాక ఇలాంటి ఆరోపణలకు కాంగ్రెస్ చాలా సమయం దొరుకుతుందంటూ కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఎద్దేవాచేశారు.

దిగ్గజ భారత చెఫ్ ఖురేషి అస్తమయం



న్యూఢిల్లీ: మొగలుల కాలంనాటి దమ్ పుఖ్త్ వంట విధానాన్ని దేశవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి తెచ్చిన ప్రముఖ పాకశాస్త్ర దిగ్గజం ఇంతియాజ్ ఖురేషి తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 93 సంవత్సరాలు. లక్నో ప్రాంతంలో మాత్రమే వాడే వంట పాత్ర మూత చివర్ల నుంచి గాలి పోకుండా పిండి ముద్దను చుట్టే (ధమ్ పుఖ్త్) టెక్నిక్‌ను ప్రాచుర్యంలోకి తెచ్చిన ఘనత ఆయనదే. ప్రాచీన అవధ్ వంటకాలనూ ఆయన కొత్త తరహాలో సృష్టించారు. బుఖారా వంటకాలను కనిపెట్టింది కూడా ఖురేషీనే. 1979లో ఐటీసీ హోటల్స్‌లో చేరి ప్రధాన చెఫ్ స్థాయికి ఎదిగారు. ఎందరో దేశ, విదేశీ ప్రముఖులకు తన వంటకాలు రుచు చూపి ఔరా అనిపించారు. ఆహార ప్రియులకు పరిచయం అక్కర్లేని వ్యక్తి అయిన ఖురేషీ వంటలంటే పడిచచ్చే వాళ్ల జాబితా చాలా పెద్దది. ప్రధాని, రాష్ట్రపతి విశిష్ట అతిథుల ప్రత్యేక విందుల్లో ఆయనే స్పెషల్ వంటకాలు వండేవారు. 2016లో పద్మశ్రీ పొందారు. ఈ అవార్డ్ అందుకున్న తొలి పాకశాస్త్ర ప్రవీణుడు ఖురేషీనే.

విష వలయంలో కాంగ్రెస్

బంధుప్రీతి, వారసత్వ రాజకీయాలు ● నన్ను వ్యతిరేకించడమే అజెండా: మోదీ



జైపూర్/రేవాడీ: కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి విరుచుకుపడ్డారు. ఆ పార్టీ బంధుప్రీతి, వారసత్వ రాజకీయాల విష వలయంలో చిక్కుకుందని, అందుకే నాయకులంతా బయటకు వెళ్లిపోతున్నారని చెప్పారు. తనను వ్యతిరేకించడమే కాంగ్రెస్ ఏకైక అజెండాగా మారిపోయిందని మండిపడ్డారు. ''కాంగ్రెస్‌కు దశ, దిశ లేవు. భవిష్యత్తులో చేయాల్సిన అభివృద్ధి పట్ల విజన్, రోడ్డు మ్యాప్ లేవు'' అన్నారు. శుక్రవారం జైపూర్‌లో 'వికసిత్ భారత్, వికసిత్ రాజస్తాన్' సభనుద్దేశించి మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. రోడ్లు, రైల్వేలు, సౌర శక్తి, విద్యుత్ సరఫరా, తాగునీరు, పెట్రోలియం, సహజ వాయువు తదితర రంగాలకు చెందిన రూ.17,000 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు.

వికసిత్ భారత్ అంటే...

ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను తాము అమలు చేస్తుంటే కొందరికి నిద్ర పట్టడం లేదని మోదీ అన్నారు. వికసిత్ భారత్, మేక్ ఇన్ ఇండియా, వోకల్ ఫర్ లోకల్ వంటివి తాము ప్రారంభించిన పథకాలు కావడంతో వాటి గురించి కాంగ్రెస్ మాట్లాడడం లేదని ఆరోపించారు. మోదీ ఏం మాట్లాడినా, ఏం చేసినా కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని, దీనివల్ల దేశానికి భారీ నష్టం కలిగే అవకాశం ఉన్నా ఆ పార్టీ లెక్కచేయడం లేదని మండిపడ్డారు. ఇలాంటి ప్రతికూల రాజకీయాలు యువతకు ఏమాత్రం స్ఫూర్తిని ఇవ్వబోవని తేల్చిచెప్పారు. ఇటీవలే యూఏఈలో పర్యటించానని, భారత్ సాధిస్తున్న ప్రగతిని చూసి అక్కడి నేతలు ఆశ్చర్యం వ్యక్తం చేశారని ప్రధాని మోదీ వెల్లడించారు. వికసిత్ భారత్ అంటే కేవలం కొన్ని పదాలు లేదా భావోద్వేగం కాదని వివరించారు. దేశంలో ప్రతి కుటుంబాన్ని సౌభాగ్యవంతంగా మార్చే, పేదరికాన్ని తొలగించే, ఉపాధి అవకాశాలు సృష్టించే, ఆధునిక వసతులు కల్పించే కార్యక్రమం అని తెలియజేశారు. తన దృష్టిలో యువత, మహిళలు, రైతులు, పేదలు అనే నాలుగు కులాలు మాత్రమే ఉన్నాయని ప్రధానమంత్రి మరోసారి వివరించారు. హరియాణాలోని రేవాడీలో ఎయిమ్స్‌కు మోదీ శంకుస్థాపన చేశారు. పలు ప్రాజెక్టులను ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. రాముడు కేవలం ఊహేనని, అయోధ్యలో ఆలయం అవసరం లేదని అన్న కాంగ్రెస్ ఇప్పుడు జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తోందని ఎద్దేవా చేశారు.

అదానీ లబ్ధి కోసమే అగ్నివీర్: రాహుల్

న్యూఢిల్లీ/మొహానియా: పారిశ్రామికవేత్త అదానీకి ప్రయోజనం కలిగించేందుకే కేంద్రంలో మోదీ ప్రభుత్వం అగ్నివీర్ పథకం తెచ్చిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దేశ సరిహద్దులను కాపాడే జవాన్లకు వేతనాలివ్వడం మోదీకి ఇష్టం లేదన్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా ఆయన శుక్రవారం బిహార్‌లోని కైమూర్ జిల్లా మొహానియాలో ర్యాలీలో మాట్లాడారు. ''సాధారణ సైనికుడి మాదిరిగా అగ్నివీర్‌కు వేతనం, పింఛను ఉండవు. క్యాంటీన్ సౌకర్యముండదు. విధి నిర్వహణలో మరణిస్తే అమరవీరుడి గుర్తింపూ ఇవ్వరు. రక్షణ బడ్జెట్ నుంచి సైనికులకు వేతనాలు, వసతులు కల్పించడం మోదీ సర్కారుకు ఇష్టం లేదు. బడ్జెట్‌ను అదానీకి లబ్ధి కలిగిలా ఖర్చు చేయాలనుకుంటోంది'' అని ఆరోపించారు. బిహార్‌లో ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తదితరులు కూడా యాత్రలో పాల్గొన్నారు. ప్రియాంకా గాంధీ అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరడంతో శుక్రవారం యాత్రలో పాల్గొనలేకపోయినట్టు పార్టీ ప్రకటించింది.

రణరంగమైన శంభు సరిహద్దు

- కొనసాగిన రైతుల ఆందోళన
- వారిపైకి భారీగా బాష్పగోళాలు
- గుండె పోటుతో రైతు మృతి
- రేపు మళ్లీ మంత్రుల చర్చలు

చండీగఢ్: డిమాండ్ల సాధన కోసం రైతులు చేపట్టిన ఆందోళనలతో పంజాబ్–హరియాణా నుంచి ఢిల్లీకి దారితీసే ప్రాంతాలన్నీ శుక్రవారం నాలుగో రోజూ అట్టుడికిపోయాయి. శంభు సరిహద్దు తదితర చోట్ల తీవ్ర ఉద్రిక్తత కొనసాగింది. పోలీసు వలయాలను ఛేదించుకొని దూసుకెళ్లేందుకు నిరసనకారులు తీవ్ర ప్రయత్నం చేశారు. కొందరు ముసుగులు ధరించి పోలీసులపైకి రాళ్లు విసిరారు. వారిని చెదరగొట్టానికి పోలీసులు భారీ సంఖ్యలో బాష్పవాయువు గోళాలు ప్రయోగించారు. ఇరు వర్గాల ఘర్షణలతో శంభు సరిహద్దు రణరంగంగా మారింది. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత తదితర డిమాండ్ల సాధనకు సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా తదితర రైతు సంఘాలు 'చలో ఢిల్లీ'కి పిలుపునివ్వడం తెలిసిందే. నాలుగు రోజులుగా కొనసాగుతున్న రైతుల ఉద్యమాన్ని సోషల్ మీడియాలో ప్రసారం చేస్తున్న 70 యూట్యూబ్ చానళ్లపై కేంద్రం నిషేధం విధించింది. ఆందోళనకారులు రాళ్లు రువ్వుతూ భద్రతా దళాలను కవ్విస్తున్నారంటూ పోలీసులు వీడియోలు విడుదల చేశారు. శంభు సరిహద్దు వద్ద నాలుగు రోజులుగా ఆందోళనల్లో పాల్గొంటున్న జ్ఞాన్‌సింగ్ అనే 63 ఏళ్ల రైతు గుండెపోటుతో మృతిచెందాడు. పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లాకు చెందిన ఆయనకు ఉదయం గుండె నొప్పి రావడంతో ఆసుపత్రిలో చేర్చినా లాభం లేకపోయింది. మరోవైపు, రైతు సంఘాలు ఇచ్చిన గ్రామీణ భారత్ బంద్ పిలుపుతో శుక్రవారం పంజాబ్, హరియాణాతోపాటు ఉత్తరాది రాష్ట్రాల్లో చాలాచోట్ల రవాణా వ్యవస్థ స్తంభించింది. వ్యాపార, వాణిజ్య సముదాయాలు మూతపడ్డాయి. జనం తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. రైతులు హైవేలను దిగ్బంధించారు.


శంభు వద్ద పోలీసులు బాష్పవాయుగోళాలు ప్రయోగించడంతో పరుగులు తీస్తున్న రైతులు

రేపు మంత్రుల కమిటీ చర్చలు

కేంద్ర మంత్రులు, రైతు సంఘాల నేతల మధ్య ఇటీవల మూడు సార్లు చర్చలు జరిగాయి. ఈ నెల 8, 12, 15వ తేదీల్లో చర్చలు ఈ చర్చలు ఫలించలేదు. గురువారం రాత్రి ఐదు గంటలకు పైగా చర్చించినా ఇరు వర్గాలు ఏకాభిప్రాయానికి రాలేదు. డిమాండ్ల నుంచి రైతు సంఘాలు వెనక్కి తగ్గడం లేదు. చర్చలు ఆదివారం కూడా కొనసాగనున్నాయి.

కేజ్రీవాల్ సర్కారు విశ్వాస తీర్మానం

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తమ సర్కారుపై శుక్రవారం శాసనసభలో విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. మద్యం కుంభకోణంలో ప్రశ్నించేందుకు ఈడీ ఎన్నిసార్లు సమన్లు జారీచేసినా గైర్హాజరవడంతో శనివారం తమ ముందు హాజరుకావాలని సిటీ కోర్టు కేజ్రీవాల్‌ను ఆదేశించిన నేపథ్యంలో ఆయన ఈ చర్యకు దిగడం గమనార్హం. విశ్వాస తీర్మానంపై శనివారం సభలో చర్చించనున్నారు. 70 మంది సభ్యుల అసెంబ్లీలో కేజ్రీవాల్ బలపరీక్షకు సిద్ధపడటం ఇది రెండోసారి. ఆప్‌కు 62 మంది ఎమ్మెల్యేలుండగా బీజేపీ బలం రెండుకు పడిపోయింది. లెఫ్టినెంట్ గవర్నర్ ప్రసంగానికి అడ్డు తగిలారన్న కారణంతో గురువారం ఆరుగురు బీజేపీ ఎమ్మెల్యేలను సెషన్ మొత్తానికీ సస్పెండ్ చేయడమే ఇందుకు కారణం. శుక్రవారం విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి కేజ్రీవాల్ మాట్లాడారు. తమ ఎమ్మెల్యేలంతా తమతోనే ఉన్నారన్నారు. కానీ వారెక్కడ జారిపోతారోననే భయంతోనే ఆయన బలపరీక్షకు దిగారని బీజేపీ ఎద్దేవా చేసింది.

ఎన్‌ఆర్‌ఐ పెళ్లిళ్ల నమోదు తప్పనిసరి

మోసాల కట్టడికి సమగ్ర చట్టం.. న్యాయ కమిషన్ సిఫార్సులు



న్యూఢిల్లీ: ప్రవాస భారతీయులు (ఎన్‌ఆర్‌ఐలు), భారత సంతతికి చెందిన విదేశీయులు(ఓసీఐ)–భారతీయ పౌరుల మధ్య మోసపూరిత వివాహాల పెరుగుతండటం ఆందోళనకరమని న్యాయ కమిషన్ పేర్కొంది. ఈ ధోరణికి అడ్డుకట్ట వేయడానికి సమగ్రమైన చట్టం తేవాలని కేంద్రానికి సూచించింది. భారతీయులు–ఎన్‌ఆర్‌ఐలు, భారతీయులు–ఓసీఐల మధ్య పెళ్లిళ్లను విధిగా రిజిస్టర్ చేసే విధానం ఉండాలని స్పష్టం చేసింది. జస్టిస్ రితూరాజ్ అవస్థీ నేతృత్వంలోని లా కమిషన్ 'లా ఆన్ మ్యాట్రిమోనియల్ ఇష్యూస్ రిలేటింగ్ టు ఎన్‌ఆర్‌ఐ, ఓసీఐ' అంశంపై అధ్యయనం చేసింది. ఇటీవల కేంద్ర న్యాయ శాఖకు ఇటీవలే నివేదిక సమర్పించింది. దీనిపై కేంద్రం తేదలచిన చట్టం పెళ్లిళ్లకు వివాదాలన్నింటినీ పరిష్కరించేలా సమగ్రంగా ఉండాలని అభిప్రాయపడింది. మోసపూరిత ఎన్‌ఆర్‌ఐ వివాహాలతో భారత యువతులు అధికంగా నష్టపోతున్నారని గుర్తుచేసింది. విడాకులు, భాగస్వామికి భరణం, కస్టడీ, చిన్నారుల జీవన వ్యయాన్ని భరించడం వంటి అంశాలను చట్టంలో చేర్చాలని సిఫార్సు చేసింది. వైవాహిక స్థితిని కచ్చితంగా వెల్లడించేలా పాస్‌పోర్టు చట్టం–1967లో సవరణలు చేయాలని పేర్కొంది. పాస్‌పోర్టులో మ్యారేజీ రిజిస్ట్రేషన్ నెంబర్ కూడా ఉండాలని తెలిపింది. ఇద్దరు జీవిత భాగస్వాముల పాస్‌పోర్టులను అనుసంధానించాలని, దీనివల్ల మోసాలను అడ్డుకోవచ్చని అభిప్రాయపడింది.



మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో భారీ ప్రదర్శన నిర్వహిస్తున్న ఐక్య కార్మిక సంఘాల నాయకులు

కదం తొక్కిన కార్మికులు

సాక్షి నెట్‌వర్క్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగాయి. ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆయా కలెక్టరేట్ల ఎదుట మహాధర్నాలు నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా మహబూబాబాద్‌లో వ్యవసాయ మార్కెట్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. హనుమకొండలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జయశంకర్ భూపాలపల్లిలోని సింగరేణి గనుల్లో అన్ని సంఘాల నాయకులు, కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జనగామలో రైల్వేస్టేషన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చి ధర్నా చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రశాంతంగా సాగింది. ఉదయం నుంచే పార్టీలు, సంఘాల నాయకులు ఆర్టీసీ డిపోల వద్దకు చేరుకుని బస్సులు బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. అయితే, అధికారులు ముందుగానే దూరప్రాంత సర్వీసులు రద్దుచేశారు. మిగతా సర్వీసులు మధ్యాహ్నం తర్వాత మొదలయ్యాయి. కాగా, ఖమ్మం రూరల్ మండలం కాశిరాజుగూడెం నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు వెళ్తున్న విద్యార్థులను కూడా నిరసనకారులు అడ్డుకున్నారు. హాల్ టికెట్లు చూపించినా అనుమతించకపోవడంతో విద్యార్థులు కన్నీటిపర్యంతం కాగా, ఇతరులు సర్దిచెప్పడంతో పంపించారు. ఇక సింగరేణివ్యాప్తంగా సమ్మె పాక్షికంగానే సాగింది. 39,010 మంది కార్మికులకు 18,072 వేల మంది(60 శాతం) విధులకు హాజరయ్యారని అధికారులు తెలిపారు. అయితే, రోజువారీ లక్ష్యంలో 10 శాతం మేర బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది.

యాదాద్రిలో ఘనంగా రథసప్తమి వేడుక

ఉదయం సూర్యప్రభ వాహనంపై, రాత్రి స్వర్ణరథంపై స్వామివారి ఊరేగింపు



శుక్రవారం రాత్రి స్వర్ణ రథంపై ఊరేగుతున్న యాదగిరీశుడు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం రథ సప్తమి వేడుకలు వైభవంగా జరిగాయి. వేకువజామున గర్భాలయంలో, ముఖ మండపంలో శ్రీస్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను వజ్రా, వైఢూర్యాలు, పూలు, పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం వారిని సూర్యప్రభ వాహనంపై అధిష్టించి, తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. తూర్పు రాజగోపురం ముందున్న మాడవీధిలో శ్రీస్వామి వారి సూర్యప్రభ సేవను అధిష్టించారు. శ్రీస్వామి వారిని రాత్రి స్వర్ణరథంపై ఊరేగించారు.

19 నుంచి పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

యాదగిరిగుట్ట: యాదాద్రి దేవాలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపూర్వగిరి(పాతగుట్ట) లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆలయ ఈవో రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ప్రధానార్చకుడు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు ఆవిష్కరించారు. ఈవో రామకృష్ణారావు మాట్లాడుతూ 19న స్వస్తివచనంతో ఉత్సవాలు ప్రారంభమై 25వ తేదీన అష్టోత్తర శతఘటాభిషేకంతో ముగుస్తాయని చెప్పారు. ప్రధాన ఘట్టాలైన శ్రీస్వామివారి ఎదుర్కోలు మహోత్సవం 21న, తిరు కల్యాణోత్సవం 22న, దివ్య విమాన రథోత్సవం 23న జరుగుతాయన్నారు.

విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించొద్దు

టీఎస్‌పీఈజేఏసీ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ యోచనను తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణకు నిరసనగా కిసాన్‌మోర్చా, సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు తలపెట్టిన దేశవ్యాప్త ఆందోళనల్లో భాగంగా తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ శుక్రవారం మధ్యాహ్నం మింట్‌కాంపౌండ్‌లోని సీపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ముందు మధ్యాహ్న భోజన విరామ నిరసన ప్రదర్శన నిర్వహించింది. టీఎస్‌పీఈజేఏసీ చైర్మన్ వెంకటేశ్వర్లు, కన్వీనర్ రత్నాకర్‌రావుల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఆందోళనల్లో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరిస్తే మెరుపు సమ్మెకు కూడా వెనుకాడబోమని వెంకటేశ్వర్లు హెచ్చరించారు. దేశవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులను సమీకరించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడం వల్ల పార్లమెంటు విద్యుత్ ప్రైవేటీకరణ బిల్లును స్టాండింగ్ కమిటీకి సిఫారసు చేసిందని కన్వీనర్ రత్నాకర్‌రావు చెప్పారు.

తెరపైకి కొబ్బరి బోర్డు!

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖతో మళ్లీ ఆశలు

- ఏళ్లుగా నిరీక్షిస్తున్న కొబ్బరి రైతులు
- బోర్డు లేక వెనక్కి మళ్లుతున్న నిధులు



అశ్వారావుపేట రూరల్: రాష్ట్రంలో కొబ్బరి అభివృద్ధి బోర్డు ఏర్పాటు అంశం తెరపైకి రావడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. తాజాగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్రంలో కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. దీంతో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతుల్లో ఆశలు మొలకెత్తగా.. కేంద్రం స్పందిస్తుందా, లేదా అనే మీమాంస నెలకొంది.

ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ కేంద్రంగా..

రాష్ట్ర విభజనకు ముందు హైదరాబాద్ కేంద్రంగా కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయం ఉండేది. రాష్ట్ర విభజన సమయాన తెలంగాణలో సాగు తక్కువగా ఉందనే కారణంతో ఈ కార్యాలయాన్ని ఏపీకి మార్చారు. ఆనాటి నుంచి ఏపీ కొబ్బరి బోర్డు అధికారులే తెలంగాణలో కుడా కొబ్బరి సాగు విస్తరణ, అభివృద్ధి, రాయితీతోపాటు ఇతర సేవలందిస్తున్నారు. అయితే, తెలంగాణలో బోర్డు లేని కారణంగా కొబ్బరి రైతాంగానికి ఆశించిన స్థాయిలో సేవలు, రాయితీలు అందడం లేదనే చెప్పాలి. దీంతో కొన్నాళ్లుగా ఇక్కడ కూడా ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది.

ఇక్కడా వేలాది ఎకరాల్లో సాగు

తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో ఎక్కువగా తోటలు, కొబ్బరి నర్సరీలు ఉన్నాయి. నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేటలో కొన్నేళ్ల క్రితం దాదాపు 50 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ కొబ్బరి విత్తనోత్పత్తి క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. ఫలితంగా ఈ రెండు మండలాల్లో కొబ్బరి తోటలు అత్యధికంగా విస్తరించాయి. ప్రస్తుతం భద్రాద్రి జిల్లాలో 1,358 ఎకరాలు, ఖమ్మం జిల్లాలో 586 ఎకరాల్లో కొబ్బరి తోటలు సాగులో ఉన్నాయి. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోనూ తోటలు సాగులో ఉండగా, తెలంగాణలో ఇప్పటివరకు కొబ్బరి అభివృద్ధి బోర్డు ఏర్పాటు కాలేదు. ఫలితంగా సాగుదారులకు సేవలందక సలహాలు ఇచ్చేవారు కరువయ్యారు. బోర్డు లేని కారణంగా ఈ ప్రాంత రైతులకు రాయితీలు, ఇతర అంశాల్లో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఏటా రూ.80 కోట్ల నుంచి రూ.90 కోట్లు దక్కడం లేదని తెలుస్తోంది.

మంత్రి తుమ్మల లేఖతో కదలిక?

గతేడాది ఏప్రిల్‌లో కొబ్బరి అభివృద్ధిమండలి బోర్డు అధికారుల బృందం అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో పర్యటించింది. ఈసందర్భంగా రైతుల విజ్ఞప్తి మేరకు బోర్డు ఏర్పాటు విషయాన్ని ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కానీ ఆ తర్వాత ఈ అంశం మళ్లీ మరుగునపడింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం, దమ్మపేట మండలానికి చెందిన మంత్రి తుమ్మలకు వ్యవసాయ శాఖ దక్కడంతో బోర్డు ఏర్పాటు విషయాన్ని స్థానిక రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు తుమ్మల తెలంగాణలో కొబ్బరి అభివృద్ధి బోర్డు ఏర్పాటుచేయాలని లేఖ రాయడంతో రైతుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.

టెండర్ లేకుండానే మందుల సరఫరా

రూ.3 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిన నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్



ఏసీబీకి పట్టుబడిన డాక్టర్ లచ్చూనాయక్

నల్లగొండ టౌన్: నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ లచ్చూనాయక్ ఓ మెడికల్ ఏజెన్సీ నిర్వాహకుడి నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నాన్‌టెండర్ పద్ధతిలో సర్జికల్, నాన్‌సర్జికల్ మందుల సరఫరా కోసం గతంలో ఇచ్చిన ఒప్పందాన్ని అమలు చేయడానికి నల్లగొండకు చెందిన రవి మెడికల్ ఏజెన్సీ నిర్వాహకుడు రాపోలు వెంకటేశ్వర్లు నుంచి లచ్చూనాయక్ శుక్రవారం రూ.3 లక్షల లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ శ్రీనివాస్‌రావు నేతృత్వంలోని అధికారుల బృందం పట్టుకుంది. డబ్బులు స్వాధీనం చేసుకుని లచ్చూనాయక్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం ఆయన్ను హైదరాబాద్‌లోని ఏసీబీ కార్యాలయానికి తీసుకెళ్లారు. వెంకటేశ్వర్లు గతేడాది మార్చిలో సర్జికల్ సామగ్రిని 10 శాతం, డ్రగ్స్‌ను 6 శాతం డిస్కౌంట్‌పై సరఫరా చేయడానికి ప్రభుత్వ ఆస్పత్రితో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ ఏడాది కూడా సరఫరా చేయడానికి టెండర్ పిలవకుండా ఉండాలంటే తనకు రూ.3 లక్షలు ఇవ్వాలని లచ్చూ డిమాండ్ చేయడంతో వెంకటేశ్వర్లు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచనల ప్రకారం శుక్రవారం ఉదయం 8 గంటలకు లచ్చూనాయక్ నివాసంలో పక్కా ప్రణాళికతో ఏసీబీ అధికారులు ఆయన్ను పట్టుకున్నారు.

ఆరేళ్ల కూతురిని హతమార్చిన తల్లి

- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందనే...
- పాము కరిచి చనిపోయిందని నమ్మించే ప్రయత్నం

లింగాల: వివాహేతర సంబంధానికి అడ్డు తగులుతుందనే నెపంతో కన్నకూతుర్నే ఓ తల్లి హతమార్చింది. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం కొత్తకుంటపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తకుంటపల్లికి చెందిన తగిలి తిరుపతయ్య– మల్లీశ్వరి దంపతులకు ముగ్గురు సంతానం. తిరుపతయ్య నాగర్‌కర్నూల్‌లో పనిచేస్తూ అప్పుడప్పుడు స్వగ్రామానికి వచ్చి పోతుంటాడు. అయితే మల్లీశ్వరి కొంతకాలంగా మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకొని ప్రతీరోజు ఫోన్లో మాట్లాడుతుండేది. ఈ విషయాన్ని పసిగట్టిన రెండో కూతురు జాను(6) తల్లి విషయం ఎప్పటికప్పుడు తండ్రికి చెప్పేది. దీంతో తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నట్టు భావించిన మల్లీశ్వరి గురువారం రాత్రి బాలిక గొంతు నులిమి చంపేసింది. తర్వాత పాము కరిచి చనిపోయినట్టుగా నమ్మించే ప్రయత్నం చేసింది. అయితే బంధువులు వచ్చి జాను దుస్తులు విప్పి చూడగా ఒంటి నిండా గాయాలు కనిపించాయి. దీంతో వారు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలాన్ని అచ్చంపేట సీఐ రవీందర్, ఎస్‌ఐ జగన్‌మోహన్ పరిశీలించారు. మల్లీశ్వరిని అదుపులోకి తీసుకొని విచారించగా హత్య చేసినట్టు ఒప్పుకుందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై జాను తండ్రి తిరుపతయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

స్టేట్ ఆర్ట్ గ్యాలరీ వేదికగా కళాత్మక సమ్మేళనం

- 200 మంది భారతీయ చిత్రకారుల కళా ప్రదర్శన
- నేటి నుంచి మార్చి 5 వరకు ఎగ్జిబిషన్



సాక్షి, హైదరాబాద్: చిత్రకళలో దేశవ్యాప్తంగా ఖ్యాతి పొందిన దాదాపు 200 మంది కళా ప్రదర్శనకు హైదరాబాద్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీ వేదికగా మారనుంది. ఇండియా ఫైన్ ఆర్ట్స్–ముంబై ఆధ్వర్యంలో స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శనివారం నుంచి మార్చి 5 వరకు 'న్యూస్–ది ఆర్ట్ ఫెస్ట్ 2024'ను నిర్వహించనున్నారు. ఇండియా ఫైన్ ఆర్ట్స్–ముంబై వ్యవస్థాపకుడు మన్విందర్ దావర్, రాష్ట్రానికి చెందిన ప్రముఖ చిత్రకారులు లక్ష్మణ్ ఏలె, నగేష్ గౌడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రదర్శనలో భాగంగా ఆర్టిస్ట్ వర్క్‌షాప్స్, ఆర్ట్ టాక్స్, ప్యానల్ డిస్కషన్స్, జానపద కళా ప్రదర్శన, మ్యూజిక్ కన్సర్ట్స్, ఫిల్మ్ స్క్రీనింగ్ వంటి కళా ప్రదర్శనలు కూడా ఉంటాయని మన్విందర్ దావర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనలో ఆర్టిస్టులు ఆ నంద్ గడప, డా.నిర్మలా బిలుక క్యూరేటర్లుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

ముగిసిన వర్క్‌షాప్..

స్టేట్ ఆర్ట్ గ్యాలరీ వేదికగా ఈ నెల 12 నుంచి ప్రారంభమైన 'న్యూస్–ది ఆర్ట్ ఫెస్ట్'వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. ఈ వర్క్‌షాప్‌లో గురుచరణ్ సింగ్, విమ్మి ఇందిరా, ఆంజలీయే ఎలా మీనన్, శోభా బ్రూటా, ప్రభాకర్ కోల్టే తదితర 13 మంది చిత్రకారులు పాల్గొని అద్భుత పెయింటింగ్‌లను వేశారు.

ఐదుగురు ఎన్‌డీ నేతల అరెస్టు

- పేలుడు పదార్థాలు, విప్లవ సాహిత్యం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్



పట్టుబడిన వారి వివరాలు వెల్లడిస్తున్న భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంటౌన్: సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ పెద్ద చంద్రన్నవర్గానికి చెందిన ఐదుగురిని అరెస్టు చేసినట్టు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ బి.రోహిత్‌రాజ్ వెల్లడించారు. ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఆ వివరాలు వెల్లడించారు. ఇల్లెందు మండలం పూసలపల్లి గ్రామపంచాయతీ పరిధి అటవీప్రాంతంలో సాయుధులు సమావేశమయ్యారనే సమాచారంతో తనిఖీలు చేపట్టగా, న్యూడెమొక్రసీకి చెందిన 11 మంది నేతలు పారిపోయేందుకు యత్నించగా ఐదుగురు పట్టుబడ్డారని చెప్పారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం రామగుండాలకు చెందిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ పెద్ద చంద్రన్నవర్గం రాష్ట్ర కార్యదర్శి కూరసం వంజయ్య అలియాస్ అశోక్, కొత్తగూడ మండలం ఎంచన్ గ్రామానికి చెందిన సాయుధ దళ కార్యదర్శి ధనసరి సమ్మయ్య అలియాస్ గోపన్న, బయ్యారం మండలం మిర్యాలపెంటకు చెందిన సాయుధ దళ సభ్యుడు సనాగే పొంగుల ముత్తయ్య అలియాస్ పుల్లన్న, బయ్యారం గ్రామం ముస్తఫానగర్‌కు చెందిన కొరియర్ షేక్ మదర్ సాహెబ్, ఖమ్మం జిల్లా కూసుమంచి మండలానికి చెందిన సాయుధ దళ కమాండర్ కలకొండ సురేష్‌ను అరెస్టు చేసినట్టు ఎస్పీ తెలిపారు. గురుగుంట్ల దేవిరెడ్డి, నాయిని కొమరయ్య, దనసరి సురేష్, క్రాంతి, అబ్బర్ల రాజయ్య, ఉపేందర్ పారిపోయారన్నారు. పట్టుబడిన వారి నుంచి ఒక పిస్టల్, 303 రౌండ్లు, ఐదు జిలెటిన్ స్టిక్స్, నాలుగు కిట్ బ్యాగ్‌లు, విప్లవ సాహిత్యం స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వివరించారు.

పీఓడబ్ల్యూ సంధ్య భర్త రామకృష్ణారెడ్డి మృతి

సంధ్యను పరామర్శించిన మంత్రి సీతక్క, మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి



రామకృష్ణారెడ్డి (ఫైల్)



భర్త రామకృష్ణారెడ్డి భౌతికకాయం వద్ద రోదిస్తున్న వి.సంధ్య

ముషీరాబాద్ (హైదరాబాద్): ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) జాతీయ కన్వీనర్ వి.సంధ్య భర్త, కవి, నవ్య ప్రింటింగ్ ప్రెస్ యజమాని రామకృష్ణారెడ్డి (62) శుక్రవారం ఉదయం హిమాయత్‌నగర్‌లోని ఆయన స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. కొంతకాలంగా మల్టిపుల్ ఆర్గాన్ డిజార్డర్‌తో బాధపడుతున్న ఆయన శుక్రవారం ఉదయం ఇంట్లోనే కుప్పకూలిపోగా వెంటనే సమీపంలోని అపోలో ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే రామకృష్ణారెడ్డి గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపారు. అంత్యక్రియలు చిట్యాల సమీపంలోని నేరడ గ్రామంలో ఉన్న వారి వ్యవసాయ క్షేత్రంలో శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తారని కుటుంబ సభ్యులు వెల్లడించారు. రెండేళ్ల క్రితం నవ్య ప్రింటింగ్ ప్రెస్‌లో విప్లవ సాహిత్యాన్ని ముద్రిస్తున్నారనే కారణంతో పోలీసులు ఆయన ప్రెస్ మీద దాడి చేసి సీజ్ చేసిన సంగతి తెలిసిందే. విద్యార్థి దశలో పీడీఎస్‌యూలో చురుగ్గా పాల్గొన్న రామకృష్ణారెడ్డి అదే యూనియన్‌లో పని చేస్తున్న ఉద్యమ సహచరురాలు వి.సంధ్యను ప్రేమ వివాహం చేసుకున్నారు. రామకృష్ణారెడ్డి మరణ వార్త తెలిసిన వెంటనే పలువురు నేతలు తరలివచ్చి భౌతికకాయానికి ఘనంగా నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మంత్రి సీతక్క, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, వై.వెంకటేశ్వర్లు, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర నేతలు ఎస్.వెంకటేశ్వరరావు, పి.సూర్యం, సీపీఎం నేతలు ఎస్.వీరయ్య, బొజ్జ భిక్షమయ్య, సీపీఐ నేత పశ్య పద్మ, రమా మెల్కొటే, సజయ, విమల, మా భూమి సంధ్య ఉన్నారు.

క్లుప్తంగా...

రెవెన్యూలో 25 మంది బదిలీ

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ శాఖలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు (ఎస్‌జీడీసీ), డిప్యూటీ కలెక్టర్లుగా పనిచేస్తున్న 25 మందిని ప్రభుత్వం బదిలీ చేసింది. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిత్తల్ శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. పలువురిని అడిషనల్ కలెక్టర్లుగా, ఆర్డీవోలుగా నియమించారు. మరికొందరిని భూసేకరణ విభాగంలో నియమించగా, కొందరిని డిప్యుటేషన్లపై ఇతర శాఖలకు పంపారు.

ప్రజావాణికి 1,364 అర్జీలు

లక్డీకాపూల్(హైదరాబాద్): మహాత్మ జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణికి సమస్యలు వెల్లువెత్తాయి. అధికారులు ప్రజల నుంచి 1,364 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవరాజన్ అర్జీదారులను కలిసి సమస్యల గురించి అడిగి తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కారమార్గాలు చూపారు. ఓ సంస్థ బాధిత ఉద్యోగులు ఇబ్బందులను చెబుతూ ప్రభుత్వ సాయం కావాలని అర్థించారు. పలువురు మహిళలు గృహలక్ష్మి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తులను సమర్పించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు ప్రభుత్వ సాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు.

ఉర్దూ భాషాభివృద్ధి మండలి సభ్యునిగా సూర్యనారాయణమూర్తి



సాక్షి, హైదరాబాద్/లక్డీకాపూల్: కేంద్ర విద్యాశాఖలోని ఉర్దూ భాషాభివృద్ధి జాతీయ మండలి సభ్యునిగా విశ్రాంత పాత్రికేయుడు, ఉర్దూ తెలుగు- అనువాదకుడు పీవీ సూర్యనారాయణమూర్తి (మెహక్ హైదరాబాదీ) నియమితులయ్యారు. ఈ విషయాన్ని జాతీయ మండలి డైరెక్టర్ ప్రొఫెసర్ ధనుంజయ్ సింగ్ ఒక లేఖ ద్వారా తెలియజేశారు. మండలి సభ్యునిగా సూర్యనారాయణమూర్తి మూడేళ్లపాటు కొనసాగుతారు. తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరానికి చెందిన మూర్తి.. 36 ఏళ్ల పాటు వివిధ ప్రధాన తెలుగు దినపత్రికలలో పనిచేసి 2021లో ఉద్యోగ విరమణ చేశారు. ప్రముఖ ఉర్దూ రచయితల కథా సాహిత్యాన్ని తెలుగు వారికి అందించారు. ఫిక్షన్, నాన్ ఫిక్షన్ కలిపి ఇప్పటిదాకా మొత్తం తొమ్మిది పుస్తకాలు తీసుకొచ్చారు.

వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వక్ఫ్ బోర్డు నూతన చైర్మన్‌గా సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన బోర్డు పాలక మండలి సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో నామినేటెడ్ సభ్యుడైన చైర్మన్‌ను తొలగించిన విషయం తెలిసిందే. తాజాగా నూతన ప్రభుత్వం బోర్డు సభ్యులుగా సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీని, మహిళా ఐఏఎస్ అధికారి ఆయేషా ముసరత్‌లను నామినేట్ చేస్తూ ఆదేశాలు జారీచేసింది. ప్రభుత్వ నిర్ణయాన్ని ఎన్నికల కేటగిరీలో ఎన్నికైన బోర్డు సభ్యుడు మౌలానా బందగీ బాద్‌షా రియాజ్ ఖాద్రీ స్వాగతించారు. అనంతరం జరిగిన పాలక మండలి సమావేశంలో బోర్డు సభ్యుడు మల్లిక్ మోహితేశం.. చైర్మన్ పదవికి సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ పేరును ప్రతిపాదించగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ పాలకమండలి సమావేశంలో సభ్యుడు అక్బర్ నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

ఆదివాసీల హక్కుల పోరాట సమితి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): ఆదివాసీలకు ఇళ్ల పట్టాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) 'చలో హైదరాబాద్'కు పిలుపునిచ్చింది. ఈ నెల 20న ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద ఆదివాసీలతో భారీ మహాధర్నా నిర్వహించనున్నట్లు తుడుం దెబ్బ వర్కింగ్ ప్రెసిడెంట్ గొడం గణేశ్ ప్రకటించారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో శుక్రవారం 'చలో హైదరాబాద్ మహాధర్నా'వాల్ పోస్టర్‌ను సమితి నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ...ఆదిలాబాద్ జిల్లా మావల మండలం బట్టిసావర్‌గాం గ్రామ సమీపంలో గుడిసెల్లో నివసిస్తున్న 2,043 మంది నిరుపేద ఆదివాసీలకు ప్రభుత్వం తక్షణమే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆధార్‌కార్డు ఉంటేనే 'గృహజ్యోతి'

సాక్షి, హైదరాబాద్: గృహజ్యోతి పథకం కింద గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా కోసం లబ్ధిదారులు ఆధార్‌కార్డును తప్పనిసరిగా కలిగి ఉండాలని ఇంధన శాఖ కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ శుక్రవారం ఉత్తర్వులు చేశారు. ఆధార్‌కార్డు లేనివారు వెంటనే దానికి దరఖాస్తు చేసుకుని పొందాలని సూచించారు.

అంతా సిద్ధమే.. అయినా ఆలస్యమే!

రాష్ట్రంలో టీచర్ పోస్టుల భర్తీపై నిరుద్యోగుల్లో ఆందోళన

- మెగా డీఎస్సీ వేస్తామన్న సర్కారు.. దీనిపై రెండు సార్లు సమీక్షలు
- కానీ నోటిఫికేషన్ దిశగా అడుగులు పడటం లేదంటూ నిరాశ
- గతంలో డీఎస్సీ ఆగిపోవడానికి కారణమైన సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తులు
- లోక్‌సభ షెడ్యూల్ వస్తే పరిస్థితి మొదటికి వస్తుందని ఆవేదన
- టీచర్ ఖాళీల లెక్కలు తీసిన విద్యాశాఖ.. పదోన్నతులు, బదిలీలతో లింక్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో టీచర్ పోస్టులను భర్తీ చేస్తామని ప్రభుత్వం వరుసగా ప్రకటనలు చేస్తున్నా.. ఆ దిశగా ముందడుగు పడటం లేదని నిరుద్యోగులు, ఉపాధ్యాయ అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లకేళ్లుగా ఉపాధ్యాయ పోస్టుల కోసం సిద్ధమవుతున్నామని, వీలైనంత త్వరగా ప్రక్రియ ప్రారంభించాలని కోరుతున్నారు. గత ప్రభుత్వంలో డీఎస్సీ వేసినా.. టీచర్ల పదోన్నతులు, బదిలీలు, టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష)లో అర్హత వంటి ఇబ్బందులతో నియామక ప్రక్రియ ఆగిపోయిందని గుర్తుచేస్తున్నారు. కొత్త సర్కారు మెగా డీఎస్సీ వేస్తామని ప్రకటించడం సంతోషకరమని.. కానీ ఇప్పటికే ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి, ఆటంకాలను తొలగించడంపై దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైతే పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుందని, ఆలోగానే భర్తీ ప్రక్రియ చేపట్టాలని కోరుతున్నారు.

నాలుగు లక్షల మందికిపైగా..

రాష్ట్రంలో ఉపాధ్యాయ విద్య కోర్సులు పూర్తి చేసి, టెట్ కూడా పాసైన వారు సుమారు 4 లక్షల మందికిపైగా ఉన్నారు. వారంతా టీచర్ పోస్టుల భర్తీ కోసం ఎదురుచూస్తున్నారు. ఇందులో ఏళ్లకేళ్లుగా డీఎస్సీ కోసం ప్రత్యేక కోచింగ్ తీసుకుంటున్నవారు కూడా ఉన్నారు. కొత్త సర్కారు మెగా డీఎస్సీ వేస్తామనడం, ఇటీవల సీఎం రెండుసార్లు టీచర్ పోస్టుల భర్తీపై సమీక్షించినా.. నోటిఫికేషన్ జారీ దిశగా ప్రక్రియ ఏదీ మొదలవకపోవడంపై నిరాశ వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆదివారం జరిగిన కేబినెట్ సమావేశంలో మెగా డీఎస్సీపై చర్చ జరిగిందని, ఖాళీల గుర్తింపు, ఇతర అంశాలపై కసరత్తు చేపట్టాలని సీఎం ఆదేశించారని మంత్రులు చెప్పడంపై ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

డీఎస్సీ వేసినా ఆగిపోయి..

తెలంగాణ ఏర్పాటైన తర్వాత 2017లో టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీ నిర్వహించారు. తర్వాత ఆ ఊసే లేదు. గత ఏడాది డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చినా.. 5,089 పోస్టులే ఉన్నాయి. ఆరేళ్ల తర్వాత డీఎస్సీ వేశారని, పోస్టులు పెంచాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ అభ్యర్థులు ఆందోళనలు చేపట్టారు. కొత్త రోస్టర్ విధానంతో కొన్ని జిల్లాల్లో పోస్టులే లేకుండాపోయాయని నిరాశ వ్యక్తం చేశారు. దీనికితోడు పదోన్నతులు, బదిలీల సమస్యలతో డీఎస్సీ వాయిదా పడింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక అనుబంధ నోటిఫికేషన్ జారీ చేయాలంటూ మంత్రులు, అధికారులకు అభ్యర్థులు వినతిపత్రాలు సమర్పించారు. దీనిపై ప్రభుత్వం నుంచి సానుకూల సంకేతాలు వచ్చాయి. సీఎం కూడా టీచర్ పోస్టుల భర్తీపై రెండు సార్లు అధికారులతో సమీక్షించి.. సమగ్ర నివేదిక కోరారు. అధికారులు లెక్కలన్నీ తేల్చి.. పదోన్నతుల ద్వారా కొన్ని, నేరుగా జరిగే నియామకాల మరికొన్ని.. కలిసి 21వేల టీచర్ పోస్టుల భర్తీ అవసరమని నివేదించారు. సీఎం రేవంత్ కూడా మెగా డీఎస్సీ వేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో అనేక మంది ప్రైవేటు స్కూళ్లలో ఉద్యోగాలు మానుకుని మరీ డీఎస్సీ కోసం సిద్ధమవుతున్నారు. కానీ ప్రభుత్వం నుంచి అనుకున్నస్థాయిలో వేగం కనిపించడం లేదని.. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వస్తే మళ్లీ మొదటికి వస్తుందని అభ్యర్థులు వాపోతున్నారు.

బదిలీలు, పదోన్నతులతో లింకు

పూర్తిస్థాయిలో టీచర్ల బదిలీలు, పదోన్నతులు చేపడితే తప్ప వాస్తవ ఖాళీలను నిర్ధారించలేమని విద్యాశాఖ అధికారులే చెప్తున్నారు. ఇప్పటికిప్పుడు 13వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, పదోన్నతుల ద్వారా మరో 8 వేల వరకు పోస్టులు ఖాళీ అవుతాయని అంటున్నారు. మరోవైపు పదోన్నతుల విషయంలో పలు న్యాయపరమైన చిక్కులు ఉన్నాయి. ముఖ్యంగా టీచర్ అర్హత పరీక్ష (టెట్) ఉత్తీర్ణులకు మాత్రమే పదోన్నతులు ఇవ్వాలంటూ.. 2012 తర్వాత నియమితులైన టీచర్లు కోర్టును ఆశ్రయించారు. కోర్టు కేంద్ర నిబంధనలను పరిశీలించి.. పదోన్నతులకు టెట్ తప్పనిసరి అని తేల్చింది. గత ఏడాది చేపట్టిన టీచర్ల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం రాష్ట్రంలోని దాదాపు 80వేల మంది టీచర్లు 'టెట్'రాయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. మారిన సిలబస్ నేపథ్యంలో కొత్త అభ్యర్థులతో సమానంగా పాత టీచర్లు టెట్ రాయడం కష్టమని ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం లేవనెత్తుతున్నాయి. 'టెట్'నిర్వహణ, టీచర్ల బదిలీల విషయంలో ఇది చిక్కుముడిగా మారింది. మరోవైపు భారీ సంఖ్యలో పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ అనుమతి అవసరం. వీటన్నింటితో టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని అధికార వర్గాలు చెప్తున్నాయి. అన్ని అడ్డంకులను ఛేదించుకుని లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌లోగా డీఎస్సీ నోటిఫికేషన్ రావడం కష్టమేనని అంటున్నాయి.

ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నాం

డీఎస్సీ కోసం రాష్ట్రంలో లక్షల మంది నిరుద్యోగులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. అధికారులు ఖాళీల వివరాలను ప్రభుత్వానికి సమర్పించడం, సీఎం రివ్యూ చేయడంతో ఆశలు నెరవేరుతున్నాయన్న ఆనందం కనిపించింది. కానీ నోటిఫికేషన్ దిశగా అడుగు ముందుకు పడకపోతుండటంపై నిరుద్యోగుల్లో అసహనం పెరుగుతోంది.

– రావుల రామ్మోహన్‌రెడ్డి, డీఎడ్. బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

టీచర్లకు టెట్ నిర్వహించాలి

టీచర్ల పదోన్నతులకు టెట్ అర్హత తప్పనిసరి. ఎన్నో ఏళ్లుగా బోధిస్తున్న టీచర్లకు ఈ పరీక్షను అంతర్గత పరీక్షలా నిర్వహించాలి. ఇది ఎంత త్వరగా చేపడితే అంత మంచిది. ఇప్పటికే స్కూళ్లలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. నిర్వహణ పోస్టులైన డీఈవో, ఎంఈవోల పోస్టుల్లో చాలావరకు ఖాళీగా ఉన్నాయి. దీనిపై ప్రభుత్వం దృష్టిపెట్టాలి.

– చావా రవి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

నెలాఖరులోగా గురుకుల పోస్టుల భర్తీ!

- జూనియర్ లెక్చరర్ కేటగిరీలో 1:2 నిష్పత్తిలో జాబితా విడుదల
- ఈనెల 20 తర్వాత టీజీటీ కేటగిరీలో 1:2 నిష్పత్తిలో జాబితా
- ధ్రువపత్రాల పరిశీలన, డెమో పరీక్షల నిర్వహణకు 26వ తేదీ డెడ్‌లైన్
- తర్వాత 6,737 పోస్టులకు ఎంపికయ్యే అభ్యర్థులకు సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు



సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ వేగవంతమైంది. ఇప్పటికే గురుకుల డిగ్రీ కాలేజీలు, గురుకుల జూనియర్ కాలేజీల్లోని ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్ ఉద్యోగాలతోపాటు గురుకుల పాఠశాలల్లో ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) పోస్టులను భర్తీ చేశారు. మరో 7వేల ఉద్యోగాలకు సంబంధించిన ప్రక్రియను తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ) వేగిరం చేసింది. ఈ నెలాఖరులోగా అన్ని కేటగిరీల్లో ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసేలా కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో డిగ్రీ కాలేజీల్లోని 793 లెక్చరర్ ఉద్యోగాలు, జూనియర్ కాలేజీల్లో 1,924 జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలకు సంబంధించి 1:2 నిష్పత్తిలో వేర్వేరుగా ప్రాథమిక ఎంపిక జాబితాలను విడుదల చేసింది. ఈ నెల 19వ తేదీ నుంచి ధ్రువపత్రాల పరిశీలన, అభ్యర్థులకు డెమో పరీక్షలను నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేసింది. దీనిపై సంక్షిప్త సందేశాలు, ఫోన్ కాల్ ద్వారా అభ్యర్థులకు సమాచారం అందిస్తున్నారు.

చివరివారంలో టీజీటీ అభ్యర్థుల జాబితా..

గురుకులాల్లో భర్తీ చేస్తున్న 9వేల ఉద్యోగాల్లో అత్యధికంగా 4,020 ఉద్యోగాలు ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ) కేటగిరీలోనివే. ఈ ఉద్యోగాలపైనే ఎక్కువ మంది అభ్యర్థులు ఆశలు పెట్టుకున్నారు. అర్హత జాబితాల కోసం వేచిచూస్తున్నారు. ఈ పోస్టులకు సంబంధించి ఈనెల 20వ తేదీ తర్వాత సబ్జెక్టుల వారీగా 1:2 నిష్పత్తిలో అభ్యర్థుల ప్రాథమిక జాబితాలను టీఆర్ఈఐఆర్‌బీ విడుదల చేయనుంది. 24వ తేదీ నుంచి అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. 26వ తేదీకల్లా పరిశీలన పూర్తి చేసి తుది జాబితాలను విడుదల చేయాలని భావిస్తున్నారు. మొత్తంగా 4,020 టీజీటీ, 1,924 జూనియర్ లెక్చరర్, 793 డిగ్రీ లెక్చరర్ పోస్టులు కలిపి 6,737 ఉద్యోగాలను నెలాఖరులో భర్తీ చేయనున్నారు. ఎల్బీ స్టేడియం వేదికగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి సీఎం ఆధ్వర్యంలో అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసే అవకాశం ఉందని సమాచారం.

అనుమతి లేని డ్రగ్స్ సీజ్

- మంచిర్యాలలో డీసీఏ సోదాలు
- హరియాణా నుంచి ఓ కంపెనీ ద్వారా రాష్ట్రానికి సరఫరా

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/హైదరాబాద్: డ్రగ్స్ లైసెన్స్ తయారీ అనుమతులు లేకుండా విక్రయాలు చేస్తున్న మందులను రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం మంచిర్యాలలోని శ్రీరామ్ మెడికల్ ఏజెన్సీలో అధికారులు నిర్వహించిన సోదాల్లో 1,800 ట్యాబ్లెట్లతోపాటు రూ.30వేల విలువైన నకిలీ 'క్లింథియా 100ఎంజీ'ట్యాబ్లెట్లను సీజ్ చేశారు. గర్భిణులకు రోగనిరోధకతను పెంచేందుకు, బెరి బెరి, పెల్లగ్రా, వర్నికే–కొర్సాకొ ఆఫ్ సిండ్రోమ్ వంటి రోగాలకు ఈ ఔషధాలను వినియోగిస్తారు. ఈ మేరకు డ్రగ్స్ కంట్రోల్ డీజీ వీబీ.కమలాసన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నిబంధనల ప్రకారం రోగాలను నయం చేసే మందులను డ్రగ్స్ లైసెన్స్ పొందిన కంపెనీలే తయారు చేయాలని పేర్కొన్నారు. హరియాణాలోని మెడ్లిన్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మాత్రం ఆహార ఉత్పత్తి కింద లైసెన్స్ పొంది ఈ మందులను తయారు చేసి మార్కెట్ చేస్తున్నారని వెల్లడించారు. అనుమతులు లేని మందులను అమ్మితే కేసులు నమోదు చేస్తామని, అమ్మినవారికి ఐదేళ్లకు శిక్ష పడే అవకాశం ఉందని తెలి పారు. ఈ తనిఖీల్లో కరీంనగర్ డ్రగ్స్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్, ఎం.శ్రీనివాసులు, మంచిర్యాల డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చందన పాల్గొన్నారు.

'గ్యారంటీ'గా ఇస్తారా?

▶ మొదటి పేజీ తరువాయి

కోరుతున్నాయి. రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. ప్రజాపాలనలో భాగంగా రేషన్‌కార్డులకు కూడా దరఖాస్తులు స్వీకరించారు. కానీ కొత్త కార్డుల విషయంలో ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి విధివిధానాలను ప్రకటించడం కానీ, ఎప్పటి నుంచి కార్డులు జారీ చేస్తారన్న సమాచారం ఇవ్వడం కానీ చేయకపోవడంతో ప్రజల్లో అయోమయం నెలకొంది. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు ప్రక్రియలో భాగంగా విద్యుత్ శాఖ అధికారులు ఆధార్, రేషన్‌కార్డు నంబర్లు సిద్ధంగా ఉంచుకోవాలంటూ సందేశాలు పంపిస్తుండటంతో రేషన్ కార్డులు రానివారు ఆందోళనకు గురవుతున్నారు.

20 లక్షల దరఖాస్తులు..

కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్‌లోనే ఆరు గ్యారంటీలకు ప్రజాపాలన పేరిట దరఖాస్తులను ఆహ్వానించింది. ప్రతి గ్రామం, పట్టణం నుంచి వార్డుల వారీగా 1.28 కోట్ల దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా రేషన్‌కార్డుల కోసం అర్హులైన కుటుంబాల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ వచ్చింది. దీంతో రేషన్‌కార్డుల కోసం కూడా విడిగా దరఖాస్తులు స్వీకరించారు. అలా సుమారు 20 లక్షల వరకు దరఖాస్తులు వచ్చినట్లు అనధికారిక లెక్క. కాగా

> మేడం/సార్,
> గృహ జ్యోతి పథకం కోసం మీరు ప్రజా పాలన కార్యక్రమంలో అందజేసిన సమాచార ధృవీకరణ కార్యక్రమం మా సిబ్బంది ద్వారా జరుగుతున్నది. కనుక మీరు దయచేసి ప్రజాపాలన దరఖాస్తు రసీదు, ఆహార భద్రతా కార్డు (రేషన్ కార్డు) నెంబర్ మరియు ఆధార్ కార్డు నెంబర్ అందుబాటులో వుంచుకోగలరు - TSSPDCL

విద్యుత్ శాఖ పంపిన స్క్రీన్‌షాట్ మెసేజ్

పౌరసరఫరాల శాఖ.. కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులు తమకు అందలేదని స్పష్టం చేస్తుండటంతో ప్రజాపాలనలో ప్రజలు రేషన్‌కార్డుల కోసం చేసిన దరఖాస్తుల పరిస్థితి ఏమిటి అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక ప్రజాపాలనలో వచ్చిన 1.28 కోట్ల దరఖాస్తుల్లో కూడా రేషన్‌కార్డు జిరాక్స్ కాపీ లేకుండా అందజేసినవే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. దీంతో ఈ దరఖాస్తుల విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అదే సమయంలో కొత్త రేషన్‌కార్డులు ఇవ్వకుండా ఆరు గ్యారంటీలను అమలు చేయడం అంటే అర్హులకు అన్యాయం చేయడమే అవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో 90.14 లక్షల రేషన్‌కార్డులు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004లో అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వం తెలుపు, గులాబీ కార్డులను జారీ చేసింది. 2014లో కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రెండు రకాల కార్డులను రద్దు చేసి, ఆహార భద్రతా కార్డు పేరుతో కొత్త కార్డులు జారీ చేసింది. ఇందులో జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) కింద 54.48 లక్షల కార్డులు ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆహారభద్రత కార్డులు 35.66 లక్షలు ఉన్నాయి. మొత్తం 90.14 లక్షల కార్డుల ద్వారా 2.83 కోట్ల మంది దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) ఉన్నట్టు తెలుస్తోంది. కాగా కొత్తగా పెళ్లిళ్లయి కుటుంబాల నుంచి వేరుపడిన వాళ్లు, వివిధ కారణాల వల్ల కార్డులు పొందలేని వాళ్లు లక్షల సంఖ్యలో ఇప్పుడు కొత్త కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. వీరు కాకుండా రేషన్‌కార్డుల్లో పుట్టిన పిల్లల పేర్లు చేర్చడానికి కూడా లక్షల కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. వెంటనే అర్హులకు కొత్త రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ, కార్డుల్లో అడిషన్స్ (చేర్పులు) చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి.

పోలీసు స్టేషన్‌కు సరదాగా వస్తారా?

పోలీసులు వారి ప్రవర్తనా తీరు మార్చుకోవాలి

- ఫిర్యాదుదారులను భయాందోళనకు గురిచేసేలా వ్యవహరించొద్దు
- ఓ కేసు విచారణ సందర్భంగా హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు
- వారి విధులేంటో తెలిసేలా అవగాహనా తరగతులు నిర్వహించాలని డీజీపీకి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: పోలీసులు తమ ప్రవర్తనాశైలిని మార్చుకోవాలని, ప్రజల కోసమే వారు పనిచేస్తున్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. ఫిర్యాదు చేయడానికి వచ్చిన వారిని భయాందోళనకు గురిచేసేలా వ్యవహరించవద్దని, వారు పోలీస్ స్టేషన్‌కు సరదాగా రారన్న విషయం తెలుసుకోవాలని స్పష్టం చేసింది. అవసరమైతే పోలీసుల విధులేంటో వారికి తెలిసేలా ఆన్‌లైన్ విధానంలోనైనా అవగాహన తరగతులు నిర్వహించాలని డీజీపీని ఆదేశించింది. ఈ విషయాన్ని డీజీపీకి తెలియజేయాలని అడిషనల్ అడ్వొకేట్ జనరల్‌కు సూచించింది. ఇప్పటికీ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పోలీసులు, న్యాయవాదులు, వైద్యుల వద్దకు ప్రజలు విధిలేకే వస్తారన్న విషయం గుర్తుంచుకుని మసలుకోవాలని చెప్పింది. తమ కేసు తీసుకోవడం లేదంటూ భవిష్యత్‌లో ఏ ఫిర్యాదుదారుడు కోర్టుకు రాకుండా చర్యలు చేపట్టాలని డీజీపీని ఆదేశించింది. తనపై వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై ఫిర్యాదు చేసినా కరీంనగర్ టూటౌన్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం లేదంటూ ఓ మహిళ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. గత విచారణ సందర్భంగా కరీంనగర్ టూటౌన్ ఎస్‌హెచ్‌ఓను వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించడంతో ఆయన హాజరయ్యారు.

ఎస్‌హెచ్‌ఓ వివరణ ఇవ్వాల్సిందే...

ఆ మహిళ ఫిర్యాదు మేరకు 14న ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఏఏజీ మహమ్మద్ ఇమ్రాన్‌ఖాన్ తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యానికి క్షమాపణ కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. ఎస్‌హెచ్‌ఓ మాత్రం జాప్యంపై వివరణ ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పింది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓ మహిళ స్టేషన్‌లో ఉంటే ఎందుకు వచ్చారో కనుక్కోవాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని వ్యాఖ్యానించింది. స్టేషన్‌కు ఎవరూ సరదాగా రారన్న విషయాన్ని గ్రహించాలంది. ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా తప్పుడు ఫిర్యాదుగా నిర్ధారణకు రావద్దని స్పష్టం చేసింది. మనమంతా చట్టానికి బద్ధులమై పనిచేస్తున్నామని, అందరూ దానికి కట్టుబడి ఉండాల్సిందేనని నొక్కి చెప్పింది. ప్రజలకు సేవలు అందించేలా స్టేషన్లలో ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేసే విషయాన్ని పరిశీలించాలని డీజీపీకి సూచించింది. ఎస్‌హెచ్‌ఓ వివరణ కోసం విచారణను వచ్చే నెల 4కు వాయిదా వేసింది. ఆలోగా ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యానికి కారణాలను తెలుపుతూ అఫిడవిట్ దాఖలు చేయాలని చెప్పింది.

గనులు కావాలంటే వేలంలో పాల్గొనాల్సిందే

కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి అమ్రిత్‌లాల్ మీనా



సమీక్షలో పాల్గొన్న కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి అమ్రిత్‌లాల్ మీనా, సింగరేణి సీఎండీ బలరామ్

సాక్షి, హైదరాబాద్: బొగ్గు గనులు కావాలంటే వేలం పాటలో పాల్గొనాల్సిందేనని కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ కార్యదర్శి అమ్రిత్‌లాల్ మీనా స్పష్టం చేశారు. 2020లో తెచ్చిన మార్గదర్శకాల ప్రకారం గనుల కేటాయింపులో పారదర్శక విధానాన్ని అనుసరిస్తున్నామని, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు ఏవైనా వేలం పాట ద్వారానే గనులు కేటాయిస్తామన్నారు. కోల్/ లిగ్నైట్ గ్యాసిఫికేషన్‌పై వివిధ వర్గాలతో సంప్రదింపుల కోసం హైదరాబాద్ వచ్చిన ఆయన, ఆ కార్యక్రమం అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 893 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామని, వచ్చే ఏడాది వన్ బిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయనున్నట్లు వెల్లడించారు. 2020 నుంచి కోల్ బ్లాకుల వేలం జరుగుతోందని, వేలం పాటలో ప్రభుత్వరంగ సంస్థ కాకుండా ప్రైవేట్ సంస్థ గనులను దక్కించుకుంటే అన్వేషణకు అయిన నిధులను రీయింబర్స్ చేయిస్తున్నామన్నారు. ఆ తర్వాత అమ్రిత్‌లాల్ సింగరేణి భవన్‌కు చేరుకొని సంస్థ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కోల్‌బెల్టులను, మూడు గనులను సింగరేణికే కేటాయించాలని సంస్థ సీఎండీ ఎన్.బలరాం కోరారు. ఈ కార్యక్రమంలో బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి రూపేందర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమానికి కేంద్రం కట్టుబడి ఉంది

రాంజీ గోండు ట్రైబల్ మ్యూజియానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి శంకుస్థాపన



రాంజీ గోండు విగ్రహానికి పూలమాల వేస్తున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో సీతక్క

గన్‌ఫౌండ్రీ(హైదరాబాద్): గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అబిడ్స్‌లో కేంద్ర, రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖల ఆధ్వర్యంలో నిర్మించనున్న రాంజీ గోండు ట్రైబల్ మ్యూజియానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ గిరిజనుల ఆత్మగౌరవం..నిజాం, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన రాంజీ గోండు పేరుమీద గిరిజన స్మారక మ్యూజియానికి శంకుస్థాపన చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటంలో ఎక్కువగా బలైంది గిరిజన బిడ్డలే అని గుర్తు చేశారు. గిరిజన మ్యూజియం నిర్మాణానికి స్థలం కేటాయించాలని గత ప్రభుత్వానికి అనేక సార్లు విన్నవించినా, స్పందించలేదన్నారు.

గిరిజన సమగ్రాభివృద్ధికి కృషి

గిరిజనులు ఎక్కువగా ఉన్న భూపాలపల్లి, ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించామని కిషన్‌రెడ్డి తెలిపారు. గిరిజన విశ్వవిద్యాలయానికి రూ.900 కోట్లు, గిరిజన రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ నిర్మాణానికి రూ.6.50 కోట్లు కేటాయించాయని, గిరిజన విద్యారంగ అభివృద్ధికి రూ.420 కోట్లతో 17 ఏకలవ్య ఇనిస్టిట్యూట్స్ ప్రారంభిస్తున్నట్టు ఆయన చెప్పారు. సమ్మక్క-సారలమ్మ జాతరకు కేంద్ర ప్రభుత్వం తరఫున రూ.3 కోట్లు ఇస్తామని ప్రకటించారు. రాష్ట్రమంత్రి సీతక్క మాట్లాడుతూ మహనీయుల చరిత్ర భవిష్యత్ తరాలకు అందించడానికి మ్యూజియాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. గిరిజన స్మారక మ్యూజియం నిర్మాణానికి కేంద్రం రూ.25 కోట్లు, రాష్ట్రప్రభుత్వం రూ.10 కోట్లు కేటాయించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి డాక్టర్ ఎ.శరత్, డైరెక్టర్ ఈవీ.నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎలైట్ వైన్స్.. బార్లు!

▶ మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు, బార్ల సంఖ్య పెంచడం ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్న దానిపై మాత్రం సానుకూలత వచ్చినట్టు ఎక్సైజ్‌శాఖ వర్గాలు చెప్తున్నాయి.

రిజిస్ట్రేషన్ల ఆదాయం యథాతథం

సర్కారు తాజా బడ్జెట్‌లో రాష్ట్రానికి పన్నుల ద్వారా వచ్చే ఆదాయ పద్దులో.. స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ అంచనాలను యథాతథంగా కొనసాగించింది. గత బడ్జెట్ (2023-24)లో రూ.18,500 కోట్ల మేర రిజిస్ట్రేషన్ల ఆదాయ లక్ష్యం నిర్దేశించుకోగా.. ఈసారి (2024-25) స్వల్పంగా తగ్గించి రూ.18,228 కోట్ల రాబడి లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రతిపాదనలను బట్టి ఈ ఏడాది భూముల విలువల పెంపు ఉండదని తెలుస్తోంది.

- వాహనాల పన్నుల ద్వారా రూ.8,477 కోట్లు, జీఎస్టీ ద్వారా రూ.50,762 కోట్లు వస్తుందని తాజా బడ్జెట్‌లో పేర్కొంది. జీఎస్టీ ద్వారా 2023-24లో రూ.40వేల కోట్ల రాబడి అంచనా వేయగా.. ఈసారి ఏకంగా రూ.10వేల కోట్లకుపైగా పెంచడం గమనార్హం. ఇక కేంద్ర జీఎస్టీ (సీజీఎస్టీ)లో వాటా ద్వారా మరో రూ.7,838 కోట్లు వస్తాయని ప్రభుత్వం అంచనా వేసింది.
- 2023-24లో వ్యాపార, అమ్మకపు పన్ను ద్వారా రూ.39,500 కోట్లు వస్తాయని అంచనా వేయగా రూ.34,166 కోట్లు సమకూరాయి. దీంతో ఈసారి ఈ పద్దు కింద ఆదాయ అంచనాను గతంకన్నా తక్కువగా రూ.33,449 కోట్లుగా సర్కారు పేర్కొంది.
- పన్నేతర ఆదాయాన్ని కూడా ఈసారి బడ్జెట్‌లో తగ్గించి చూపెట్టారు. గత బడ్జెట్‌లో దీనిని రూ.22,801 కోట్లుగా అంచనా వేయగా.. తాజా బడ్జెట్‌లో రూ.20,658 కోట్లకు తగ్గించారు. అంటే ప్రజలపై నేరుగా భారం వేయకుండా, ఇతర మార్గాల ద్వారా పన్ను ఆదాయం పెంచుకునే దిశలో సర్కారు బడ్జెట్ ప్రతిపాదనలు చేసినట్టు స్పష్టమవుతోందని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ పన్ను రాబడుల అంచనాలివీ.. (రూ.కోట్లలో)

ఆదాయ వనరు	2021-22	2022-23	2023-24	2024-25
రిజిస్ట్రేషన్లు	12,372.73	15,600	18,500	18,228
ఎక్సైజ్	17,482.19	17,500	19,884.90	25,617
వ్యాపార, అమ్మకాల పన్ను	26,973.83	33,000	39,500	33,449
వాహనాల పన్ను	4,380.61	6,453	7,512	8,477
పన్నేతర ఆదాయం	8,857.42	15,284.83	22,801.01	20,658.44



భగ్గుమన్న కార్మిక లోకం



దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానం కేంద్రం నుంచి వేలాది మంది కార్మికులు నారాయణగూడ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. నారాయణగూడ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోని పక్షంలో రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం హెచ్చరించారు. – సుందరయ్య విజ్ఞాన కేంద్రం









నేత్రపర్వం.. పెద్దమ్మ తల్లి రథోత్సవం

బాణాసంచా మెరుపులు.. డప్పు చప్పుళ్లు.. వేద పండితుల మంత్రోచ్చారణలు.. జై పెద్దమ్మ తల్లి నినాదాల నడుమ జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి రథోత్సవం శుక్రవారం సాయంత్రం నేత్రపర్వంగా జరిగింది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఆలయ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి రథాన్ని లాగి వేడుకలను ప్రారంభించారు. నగరం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. – బంజారాహిల్స్

పలువురు డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు

- హైదరాబాద్ ఆర్డీవోగా మహిపాల్
- సికింద్రాబాద్ ఆర్డీవోగా దశరథ సింగ్

సాక్షి, సిటీబ్యూరో: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిత్తల్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ రెవెన్యూ డివిజన్ అధికారిగా కె.మహిపాల్ నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న సూర్యప్రకాశ్ హైదరాబాద్ యూఎల్‌సీకి బదిలీ అయ్యారు. సికింద్రాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారిగా ఆర్.దశరథ సింగ్‌కు పోస్టింగ్ లభించింది. ఇక్కడ పని చేస్తున్న టి.రవి హైదరాబాద్ ఎల్పీకి బదిలీ అయ్యారు. హైదరాబాద్ లా అధికారిగా వీర బ్రహ్మ, హైదరాబాద్ యూఎల్‌సీగా రాజేశ్ కుమార్, రంగారెడ్డి యూఎల్‌సీగా గోపీరాం, రాజేంద్రనగర్ ఆర్డీవోగా కొప్పుల వెంకట్ రెడ్డి, కీసర ఆర్డీవోగా వెంకట ఉపేందర్‌లకు పోస్టింగ్‌లు లభించాయి.

ఆకట్టుకున్న అగ్రిటెక్



ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అగ్రిటెక్- 2024, అగ్రివిజన్- 2024 ఎగ్జిబిషన్ రైతులను ఎంతో ఆకట్టుకుంది. వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఉద్యానవన విశ్వవిద్యాలయం, పశువైద్య విశ్వవిద్యాలయంతో పాటు, అగ్రిబిజినెస్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థలు స్టాళ్లను ఏర్పాటు చేశాయి. అలాగే మట్టి నమూనా సేకరణ కేంద్రాలు, వివిధ రకాల మొక్కలు, రాష్ట్రంలోని వివిధ పాంత్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడుకు చెందిన స్టాళ్లు కూడా ఇక్కడ కొలువుదీరాయి. వీటిని రైతులతో పాటు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు పరిశీలించారు.

హస్త విలాసం!

కాంగ్రెస్‌లోకి వలసల జాతర



బొంతు రామ్మోహన్ దంపతులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న దీప్ దాస్‌మున్షీ



వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి..



సీఎంతో కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి..

- తాజాగా మాజీ మేయర్ బొంతు దంపతులు
- వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీత
- బీఆర్‌ఎస్ సీనియర్ నేత కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి సైతం
- త్వరలో మరికొందరు చేరే అవకాశం
- లోక్‌సభ ఎన్నికల నాటికి పెరగనున్న బలం?

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలోకి వచ్చే జిల్లాల నుంచి పలువురు నేతలు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరుతుండటంతో ఆ పార్టీలో జోష్ పెరుగుతోంది. రాబోయే రోజుల్లో మరికొందరు చేరే అవకాశాలున్నాయి. తమంత తాముగా వచ్చి చేరుతున్న వారితో పాటు వీలైనంత ఎక్కువ మందిని పార్టీలో చేర్చుకునేందుకు సైతం కాంగ్రెస్ వల వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు కొందరికి బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం.

తాజాగా మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఆయన భార్య చర్లపల్లి కార్పొరేటర్ శ్రీదేవి, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీత, బీఆర్‌ఎస్ నేత కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇప్పటికే డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ హస్తం పంచన చేరారు. త్వరలోనే మాజీ మేయర్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఆయన కోడలు రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, డిప్యూటీ మేయర్ శ్రీలత, ఆమె భర్త బీఆర్‌ఎస్ కార్మిక విభాగం నేత శోభన్‌రెడ్డి చేరడం ఖాయమైంది. ఈ పేర్లు ఇప్పటికే తెర పైకి రాగా, తెర వెనుక ఉన్న మరికొందరు త్వరలో ముందుకు రానున్నారు.

రాజధానిపై పట్టు కోసం..



రచ్చ గెలిచినా ఇంట ఓడినట్లు.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికస్థానాలు సాధించి అధికారంలోకి వచ్చినప్పటికీ, జీహెచ్‌ఎంసీ పరిధిలోని 24 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కచోట కూడా గెలవలేదు. దీంతో రాజధాని నగరమైన హైదరాబాద్‌లో, జీహెచ్‌ఎంసీ పరిధిలో అది పార్టీకి తీరని వెలితిగా ఉంది. మేయర్ స్థానం సైతం బీఆర్‌ఎస్ పార్టీకే ఉంది. రాజధాని నగరంలో ఏ అభివృద్ధి చేపట్టినా, ప్రారంభోత్సవాలు చేసినా ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వానిస్తే బీఆర్‌ఎస్ నేతలే కనిపిస్తున్నారు. ఈ పరిస్థితి నివారణతో పాటు త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో గెలవాలంటే ఎక్కువ మంది తమ పార్టీ నేతలుండాలని కాంగ్రెస్ కృతనిశ్చయంతో ఉంది. అందుకే వీలైనంత మంది ఎమ్మెల్యేలను, కార్పొరేటర్లను తమవైపు రప్పించే పనిలో పడింది. వందమంది ఓటర్లను మళ్లించగలిగే నేతల్ని సైతం పార్టీలోకి తీసుకునే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఎలాగైనా గెలవాల్సిందే..

రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో గ్రేటర్‌లో కలిసి ఉన్న సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల లోక్‌సభ స్థానాలను ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో ఉంది కాంగ్రెస్ పార్టీ. లేని పక్షంలో కేవలం అడ్డగోలు హామీలిచ్చి గెలిచిన కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారని చాటేందుకు బీఆర్‌ఎస్, బీజేపీలు కాచుకు కూర్చున్నాయి. అందుకే రాబోయే లోక్‌సభ ఎన్నికల్ని సవాల్‌గా తీసుకున్న కాంగ్రెస్ అన్ని రకాల అస్త్రశస్త్రాలను వినియోగించనుంది. ఎక్కువమంది నేతలను పార్టీలోకి లాగనుందని పార్టీ నేతలు ప్రైవేటు సంభాషణల్లో చెబుతున్నారు. కేవలం బీఆర్‌ఎస్ నుంచే కాకుండా బీజేపీ నుంచి సైతం కాంగ్రెస్ వైపు లాగే యోచనలో ఉంది. దీంతోపాటు నగరంలో ప్రభావం చూపించగల ఎంఐఎంతోనూ చెలిమి దిశగా అడుగులు వేస్తోంది. లోక్‌సభలోనూ గెలుపు జెండా ఎగరేసేందుకు పరిస్థితులను అన్ని విధాలుగా తనకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నాల్లో ఉంది. దీంతో, లోక్‌సభ ఎన్నికల నాటికి పార్టీలోకి భారీగా వలసలు ఉంటాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

కార్పొరేటర్లపై కన్ను..

కలిసి వచ్చే కార్పొరేటర్లనూ ఇతర పార్టీల వారిని భారీగా ఆకర్షించే పనిలో పడింది. అందుకు ఇద్దరు ముగ్గురు నేతలకు ఆ పని అప్పగించినట్లు తెలుస్తోంది. జీహెచ్‌ఎంసీ పరిధిలో పార్టీ ఎమ్మెల్యేలు లేకపోవడంతో పాటు జీహెచ్‌ఎంసీ పాలక మండలిలోనూ మిగతా పార్టీల కంటే కాంగ్రెస్ బలహీనంగా ఉంది. పాలకమండలి ఎన్నికల సమయంలో తొలుత గెలిచింది కేవలం రెండు స్థానాలే అయినా ప్రస్తుతం బలాన్ని డజన్ స్థానాలకు పెంచుకోగలిగినప్పటికీ అధికార పార్టీకి ఆ బలం చాలదని భావిస్తోంది. ప్రభుత్వ నిర్ణయాలు జీహెచ్‌ఎంసీలో సవ్యంగా అమలు కావాలన్నా, జీహెచ్‌ఎంసీలో తమ పట్టు, ప్రభావం ఉండాలన్నా పాలకమండలిలో తమవారు ఎక్కువగా ఉండాలని భావిస్తోంది. అందుకుగాను బీఆర్‌ఎస్ కంటే ఎక్కువమంది తమకు ఉండాలని భావిస్తోంది. బీఆర్‌ఎస్‌కు ప్రస్తుతం యాభై మందికి పైగా ఉన్నారు. ఆ లక్ష్యాన్ని చేరుకోవాలనే ప్రయత్నాల్లో ఉన్న కాంగ్రెస్.. ఏమేరకు సాధించగలదో ఎన్నికల నాటికి వెల్లడి కానుంది.

సమస్య పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలి

నోబెల్ పురస్కార గ్రహీత సర్ రిచర్డ్ జె రాబర్ట్స్



రాయదుర్గం: నేటి తరం విద్యార్థులు, పరిశోధకులు సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఇంగ్లండ్‌కు చెందిన నోబెల్ పురస్కార గ్రహీత ప్రొఫెసర్ సర్ రిచర్డ్ జె రాబర్ట్స్ సూచించారు. శుక్రవారం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ఆడిటోరియంలో బయో టెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్ విభాగం పర్యవేక్షణలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు అధ్యక్షతన 'బయో అన్వేషణ-2024'లో భాగంగా 'దిపాత్ టు ది నోబెల్ ప్రైజ్' అనే అంశంపై ఆయన ప్రత్యేక ఉపన్యాసమిచ్చారు. విద్యార్థులు, పరిశోధకులు తమ పరిశోధనలను ఒక పనిగా తీసుకోకుండా నేర్చుకోవడాన్ని సరదాగా చేయడానికి సమస్య పరిష్కారానికి ఉపయోగించాల్సిన అవసరం ఉందన్నారు. తాను 1993లో ఫిజియాలజీ/మెడిసిన్‌లో నోబెల్ బహుమతి అందుకున్నానని గుర్తు చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, విద్యావేత్తలు, పరిశోధక విద్యార్థులు, ఫ్యాకల్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

10 లక్షల విద్యుత్ కనెక్షన్లకు రేషన్, ఆధార్ అప్‌డేట్

ఈ ప్రక్రియ నిరంతరాయం: డిస్కం

సాక్షి, సిటీబ్యూరో: ఆరు గ్యారంటీల పథకంలో భాగంగా త్వరలో అమలు చేయబోతున్న గృహజ్యోతి పథకానికి అర్హులను గుర్తించే ప్రక్రియ దాదాపు పూర్తైంది. గ్రేటర్ జిల్లాల పరిధిలోని తొమ్మిది సర్కిళ్లలో 48,03,963 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 200 యూనిట్లలోపు విద్యుత్ వాడే వినియోగదారులు 19.80 లక్షల మంది ఉన్నట్లు అంచనా. వీరంతా ఇప్పటికే ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. గృహ జ్యోతి పథకానికి ప్రభుత్వం రేషన్‌కార్డు/ ఆధార్‌కార్డు/ ఫోన్ నంబర్ల అనుసంధానం తప్పనిసరి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో 17.21 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. లబ్ధిదారుల్లో చాలా మందికి రేషన్ కార్డులు లేకపోవడంతో వీరు తమ కనెక్షన్లను ఉచిత పథకానికి అనుసంధానం చేసుకోలేక పోయారు. ఫిబ్రవరి 15 వరకు 9,96,807 లక్షల కనెక్షన్లను మాత్రమే ఈ పథకానికి అనుసంధానించినట్లు తెలిసింది. మీటర్ రీడర్ల సమ్మె కారణంగా కొన్ని ప్రాంతాల్లో ఈ వివరాలు నమోదు చేయలేక పోయారు. అనుసంధానం ఇప్పటితో ఆగిపోలేదని, ఇది నిరంతర ప్రక్రియ అని.. వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డిస్కం అధికారులు చెప్పుతున్నారు. నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే వారు తమ కరెంట్ బిల్లుతో పాటు ఆధార్, రేషన్ కార్డులను వెంట తీసుకెళ్లి.. సమీపంలోని ఈఆర్‌ఓ కేంద్రాల్లో నమోదు చేసుకోవచ్చని సూచిస్తున్నా రు. కాగా.. అద్దె ఇళ్లలో ఉంటున్న వారికి ఇంటి యజమానుల నుంచి అభ్యంతరాలు తప్పడం లేదు. భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని భావించి కొంత మంది యజమానులు తమ ఇంట్లోని విద్యుత్ మీటర్లపై అద్దెదారుల రేషన్‌కార్డు, ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేసుకునేందుకు నిరాకరిస్తున్నారు.

19న జరిగే ప్రజావాణి రద్దు



సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 19వ తేదీన (సోమవారం) జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగే ప్రజావాణి, ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కమిషనర్ రోనాల్డ్ రాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19వ తేదీన ఉదయం 10 గంటల నుంచి జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం జరగనున్న నేపథ్యంలో ప్రజావాణి, ఫోన్ ఇన్ ప్రోగ్రాంలను రద్దు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సర్కిల్ కార్యాలయాల్లో మాత్రం ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా నిర్వహిస్తారని రోనాల్డ్ రాస్ స్పష్టం చేశారు.

ప్రగతికి బ్రేక్!

hmda Growing Global

హెచ్‌ఎండీఏలో ఆగిన అభివృద్ధి పనులు

- ఆగిన బాచుపల్లి- మియాపూర్ రోడ్డు విస్తరణ
- 14 కిలోమీటర్లకు రూ.124 కోట్లతో ప్రతిపాదనలు
- ప్రతిపాదనల దశలోనే మరో 30 పనులు

సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో చేపట్టిన రహదారుల విస్తరణతో పాటు పలు అభివృద్ధి పనులకు బ్రేక్ పడింది. వివిధ ప్రాంతాల్లో రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల విస్తరణ కోసం గత ప్రభుత్వ హయాంలోనే ప్రతిపాదనలు రూపొందించారు. ప్రణాళికలను సిద్ధం చేశారు. కొన్ని ప్రాజెక్టుల కోసం టెండర్‌లను సైతం ఆహ్వానించారు. ఈ క్రమంలోనే ఎన్నికలు రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటినప్పటికీ అభివృద్ధి పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది.

నోటిఫికేషన్ దశలోనే టెండర్లు..

పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారులను లింక్ రోడ్లతో అనుసంధానం చేసేందుకు కార్యాచరణ చేపట్టారు. నార్సింగి నుంచి ఔటర్ రింగ్‌రోడ్డు వరకు కొత్తగా రోడ్డును అభివృద్ధి చేశారు. ఔటర్ చుట్టుపక్కల ఉన్న కాలనీలకు సైతం లింకు రోడ్లతో అనుసంధానం చేసేందుకు సన్నాహాలు చేశారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లభించకపోవడంతో హెచ్‌ఎండీఏ అధికారులు సుమారు 30 అభివృద్ధి పనులను పెండింగ్‌లో పెట్టినట్లు సమాచారం. వీటిలో కొన్నింటికి ఇప్పటికే టెండర్‌లను ఆహ్వానించగా, మరికొన్ని టెండర్‌లకు నోటిఫికేషన్ దశలో ఉన్నాయి. 'గతంలో ఆహ్వానించిన టెండర్‌లను రద్దు చేసి కొత్తగా మరోసారి వేయాల్సి ఉంటుందా, లేక ఆ ప్రాజెక్టులనే రద్దు చేయాల్సి వస్తుందా అనేది తెలియడం లేదు' అని ఓ అధికారి విస్మయం వ్యక్తం చేశారు.

ఆగిన బాచుపల్లి- మియాపూర్ విస్తరణ..

- బాచుపల్లి నుంచి మియాపూర్ వరకు 14 కిలోమీటర్లున్న 4 లైన్‌ల రోడ్డును 6 లైన్‌లకు విస్తరించేందుకు గతంలోనే ప్రణాళికలను రూపొందించారు. ఇందుకోసం సుమారు రూ.124 కోట్ల అంచనా వ్యయంతో టెండర్‌లను సైతం ఆహ్వానించారు. కానీ ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టు టెండర్‌లను ఓపెన్ చేయకపోవడం గమనార్హం.
- ఈ మార్గంలో ఆరు లైన్‌ల విస్తరణతో బాచుపల్లి సర్కిల్ పెద్ద మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ప్రస్తుతం బాచుపల్లి చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ప్రజలు షాపింగ్ మాల్స్, ఇతరత్రాఎంటర్‌టైన్‌మెంట్ కోసం మియాపూర్, కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు వరకు రావాల్సి వస్తోంది. రహదారి విస్తరణ వల్ల సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి.
- ఔటర్‌రింగ్ రోడ్డుపై మల్లంపేట్ వద్ద ఇంటర్‌చేంజ్ ఏర్పాటు చేయడంతో గతంలో గండిమైసమ్మ వరకు వెళ్లి తిరిగి వెనక్కి రావాల్సివచ్చేది. ప్రస్తుతం ఆ బాధ తప్పింది. కానీ రహదారి విస్తరణ నిలిచిపోవడంతో వాహనాల రద్దీ భారీగా పెరిగింది. కూకట్‌పల్లి, ప్రగతినగర్, జేఎన్‌టీయూ, నిజాంపేట్, గండిమైసమ్మ తదితర ప్రాంతాల్లో రోడ్ల విస్తరణతో బౌరంపేట్ ఎడ్యుకేషనల్ హబ్‌గా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

చెరలో చెరువులు!

- శిఖం భూముల్లో వెలుస్తున్న వెంచర్లు
- అడ్డగోలుగా ఎన్‌ఓసీలు, ఎల్పీ నంబర్లు
- అడ్వకేట్ కమిషన్ ఏర్పాటుతో కదలనున్న డొంక

సాక్షి, రంగారెడ్డి జిల్లా: చెరువుల పరిరక్షణలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారు. కళ్లముందే తటాకాలు కబ్జా అవుతున్నా పట్టించుకోవడం లేదు. ఆక్రమణదారులు, రియల్టర్లు అడిగిందే తడవుగా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ వంటి అంశాలు పరిశీలించకుండానే ఇరిగేషన్ అధికారులు ఎన్‌ఓసీలు, హెచ్‌ఎండీఏ అధికారులు ఎల్‌పీ నంబర్లు జారీ చేస్తున్నారు. ఫలితంగా జిల్లాలో విలువైన చెరువులు, కుంటలు ఉనికిని కోల్పోతున్నాయి.

ఇవి కనుమరుగు..

- మీర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని మంత్రాల చెరువు ప్రస్తుతం 33 ఎకరాలకు కుంచించుకుపోయింది. తాళ్లచెరువు పూర్తిగా కనుమరుగైంది.
- జిల్లెలగూడ 30 ఎకరాల విస్తీర్ణంలోని సంజ చెరువు ప్రస్తుతం 12 ఎకరాలే మిగిలింది. పెద్ద చెరువులో ఇప్పటికే 42 ఎకరాలకుపైగా ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లిపోయింది.
- బాలాపూర్ రెవెన్యూ పరిధిలోని గుర్రంచెరువులో ఇప్పటికే 24 ఎకరాలు ఆక్రమణకు గురైంది. సర్వే నం. 127, 128,/1, 128/2లోని 16.16 ఎకరాల (ఎఫ్‌టీఎల్ పరిధిలో 33.20 ఎకరాలు) పెద్ద చెరువులో ఇప్పటికే 15 ఎకరాలకుపైగా కబ్జాకు గురైంది.
- 37.34 ఎకరాల్లో విస్తరించిన బురాన్‌ఖాన్ చెరువు (వెంకటాపూర్) ప్రస్తుతం ఏడు ఎకరాలే మిగిలింది. 40.9 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఎర్రకుంటలో 32 ఎకరాలు మాయమైంది. మల్లాపూర్ రెవెన్యూ వెంకటాపూర్‌లో సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన సుద్దమోనికుంట సగానికిపైగా కబ్జాకు గురైంది.
- బడంగ్‌పేట్‌లో 14.15 ఎకరాల్లో ఉండాల్సిన కుల్లోనికుంట ప్రస్తుతం పది ఎకరాలే మిగిలింది. ఇదే మున్సిపాలిటీలోని కొత్తకుంట ఆనవాళ్లు లేకుండా పోయింది.
- ఇక 267 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన జల్‌పల్లి చెరువులో ఇప్పటికే వంద ఎకరాలకుపైగా కబ్జాకు గురైంది. జల్‌పల్లి పెద్ద చెరువు కట్ట కింది భాగం నాలుగు ఎకరాలకుపైగా భూమి పేదల పేరుతో ఇప్పటికే కబ్జాకు గురైంది.
- గాలిదొడ్డిలోని 5.30 ఎకరాల ఈద్గవాని కుంట పూర్తిగా కనుమరుగైంది. హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలకు సరిహద్దు గ్రామంలో 6.23 ఎకరాల్లో విస్తరించిన హత్తిగూడ కుంట ఆనవాళ్లు లేకుండా పోయింది.
- కాటేదాన్‌లోని 19.15 ఎకరాల మామిడి కుంట (ఐదు ఎకరాలు) ఆక్రమణకు గురైంది. ఇదే ప్రాంతంలోని కీలకమైన అప్పా చెరువు 39 ఎకరాల్లో విస్తరించి ఉండగా, ప్రస్తుతం 12 ఎకరాలే మిగిలింది. బాబుల్‌రెడ్డినగర్‌లోని 22 ఎకరాల నర్సబాయి కుంటను పూర్తిగా మింగేశారు.
- తుర్కయాంజాల్ మాసబ్ చెరువు శిఖం భూముల్లో ఇప్పటికే వెంచర్లు వెలిశాయి. రియల్టర్లు ఏకంగా భారీ బండరాళ్లు, లారీల కొద్ది మట్టి పోసి చెరువు ఆనవాళ్లు లేకుడా చేశారు.



రంగంలోకి అడ్వొకేట్ కమిషన్

హైదరాబాద్ జిల్లా పరిధిలో 18 చెరువులకు, రంగారెడ్డి జిల్లాలో 79 చెరువులకు, మేడ్చల్ వీటిలో 97 చెరువులకు మాత్రమే ఎఫ్‌టీఎల్ నిర్ధారించారు. మిగిలిన వాటికి ఎఫ్‌టీఎల్ నిర్ధారించి, హద్దు రాళ్లను ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ఇటీవల హైకోర్టు సీరియస్ అయింది. చెరువుల పరిరక్షణ కోసం అడ్వొకేట్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. శేరిలింగంపల్లి మండలం మాదాపూర్‌లోని దుర్గం చెరువు, నానక్‌రాంగూడలోని మేడికుంట, గాలిదొడ్డిలోని గోసాయికుంట, నల్లగండ్లలోని పెద్ద చెరువు సహా గంగారం పెద్ద చెరువు, సరూర్‌నగర్ మండలం బైరామల్‌గూడ రెవెన్యూ పరిధిలోని మద్దెలకుంటలను జిల్లా రెవెన్యూ అధికారులతో కలిసి అడ్వొకేట్ కమిషన్ పరిశీలించింది.

గోల్డెన్ అవర్ రెస్పాన్స్.. రూ.కోటిన్నర సేఫ్!

- సైబర్ నేరాల్లో భారీ మొత్తం కోల్పోయిన ఇరువురు
- ఫిర్యాదు అందడంతోనే స్పందించిన సైబర్ క్రైమ్ పోలీసులు
- నిందితుల బ్యాంక్ ఖాతాల్లో ఉన్న రూ.1.61 కోట్లు ఫ్రీజ్
- న్యాయస్థానం అనుమతితో బాధితులకు అందజేత



సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరాల్లో బాధితులుగా మారిన ఎవరైనా ఆ విషయం గుర్తిస్తే గోల్డెన్ అవర్స్‌గా పిలిచే మొదటి రెండు గంటల్లోపు ఫిర్యాదు చేయాలని పోలీసులు పదేపదే సూచిస్తున్నారు. ఇలా చేసిన ఇద్దరు బాధితులకు రూ.1.61 కోట్లు వెనక్కి వచ్చాయి. న్యాయస్థానం అనుమతితో ఈ సొమ్ముకు సంబంధించిన చెక్కులను జాయింట్ సీపీ (నేరాలు, సిట్) ఏవీ రంగనాథ్ శుక్రవారం బాధితులకు అందజేశారు. నగరానికి చెందిన ఓ మహిళకు కొన్నాళ్ల క్రితం సైబర్ క్రిమినల్స్ నుంచి ఫెడెక్స్ కొరియర్ సంస్థ పేరుతో ఫోన్ వచ్చింది. ఆమె పేరుతో తైవాన్‌కు బుక్ అయిన పార్శిల్‌లో కొన్ని నిషేధిత వస్తువులు ఉన్నాయని చెప్పిన అవతలి వ్యక్తి ఫోన్‌ను ముంబై సైబర్ క్రైమ్ పోలీసులకు బదిలీ చేస్తున్నట్లు చెప్పాడు. ఆ విభాగం అధికారిగా మాట్లాడిన వ్యక్తి బాధితురాలిని బెదిరించి రూ.98,79,000 వివిధ బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేయించుకున్నాడు. నగరానికి చెందిన మరో వ్యక్తికి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు స్టాక్ బ్రోకర్‌గా పరిచయం చేసుకుని పెట్టుబడుల పేరుతో నకిలీ ఆన్‌లైన్ అప్లికేషన్ల ద్వారా రూ.1,04,80,000 కాజేశారు. ఈ ఇద్దరు బాధితులు తాము మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. డీసీపీ డి.కవిత, ఏసీపీ ఆర్‌జీ శివమారుతి ఆదేశాల మేరకు తక్షణం స్పందించిన సిబ్బంది కేసులు నమోదు చేయడంతో పాటు వీటి ఆధారంగా ఆయా బ్యాంకులకు లేఖలు రాశారు. బ్యాంకు అధికారులు జమ్మూకశ్మీర్, గుజరాత్‌లోని సైబర్ నేరగాళ్ల ఖాతాల్లో ఉన్న రూ.1,61,24,226 ఫ్రీజ్ చేశారు. ఆపై సైబర్ క్రైమ్ పోలీసులు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయడం ద్వారా ఈ సొమ్ము బాధితులకు తిరిగి చెల్లించడానికి అనుమతి, ఆదేశాలు పొందారు. దీంతో రూ.80,76,198, రూ.80,48,028లకు సంబంధించిన చెక్కులను బాధితులకు అందించారు.

సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దు..

ఏదైనా పార్శిల్‌కు సంబంధించిన స్టేటస్ కోసం కేవలం ఆయా కొరియర్ సంస్థల అధికారిక వెబ్‌సైట్లను మాత్రమే ఆశ్రయించండి. ఆ సంస్థల పేరుతో ఫోన్లు, ఎస్ఎమ్మెస్‌లు, లింకులను విశ్వసించకూడదు. ఇలాంటి లింకుల్ని క్లిక్ చేస్తే మీ ఫోన్ యాక్సస్ సైబర్ నేరగాళ్ల చేతికి వెళ్లిపోతుంది. సైబర్ క్రైమ్ సహా ఏ విభాగానికి చెందిన పోలీసులు, అధికారులు స్కైప్ కాల్స్ ద్వారా సంప్రదింపులు జరపరు. సమస్యలు పరిష్కరించడానికి డబ్బు డిమాండ్ చేయరు. ట్రేడింగ్ చేయడానికి సెబీ అనుమతి ఉన్న సంస్థలనే ఆశ్రయించండి. ఎవరైనా సైబర్ నేరాల్లో బాధితులుగా మారితే వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 1930 లేదా అధికారిక వెబ్‌సైట్ (cybercrime.gov.in) ద్వారా ఫిర్యాదు చేయడం. ఎంత త్వరగా ఫిర్యాదు చేస్తే అంత ఉపయోగం. – ఏవీ రంగనాథ్, సంయుక్త సీపీ

ప్రధాని మోదీ రాజీనామా చేయాలి

కాంగ్రెస్ నేత షుజాత్ అలీ డిమాండ్

సాక్షి,సిటీబ్యూరో: ఎలక్టోరల్ బాండ్ల పథకం రాజ్యాంగ, చట్ట విరుద్ధమని సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి షుజాత్ అలీ డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. పారదర్శకతకు భరోసానిచ్చేందుకే ఎలక్టోరల్ బాండ్లని ప్రధాని మోదీ చెబుతున్నప్పటికీ సుప్రీంకోర్టు జవాబుదారీతనాన్ని కోరుతుందని ఆయన పేర్కొన్నారు. చారిత్రక తీర్పు ప్రజాస్వామ్య విలువలను పెంపొందిస్తుందని, ప్రజల విరాళాలలో పారదర్శకతను తిరిగి ప్రవేశపెట్టడం ద్వారా భారత దేశ ప్రజాస్వామ్య చట్రంపై ప్రజలకు విశ్వాసాన్ని పునరుద్ధరిస్తుందని ఆయన పేర్కొన్నారు.

16 గంటల్లో పట్టేశారు..

కిస్వా జ్యువెలర్స్ దోపిడీ కేసు కొలిక్కి

- లండన్ వెళ్లే ప్రయత్నాల్లో ఉన్న ప్రధాన నిందితుడు
- తన వద్ద రైడర్లుగా పని చేసే ఇద్దరితో కలిసి స్కెచ్
- అనువుగా ఉండటంతోనే కిస్వా జ్యువెలర్స్ ఎంపిక
- ముగ్గురి అరెస్టు, రూ.24 లక్షల సొత్తు స్వాధీనం



సాక్షి, సిటీబ్యూరో: అక్బర్‌బాగ్ చౌరస్తాలోని కిస్వా జ్యువెలర్స్‌లో చోటు చేసుకున్న దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ నేరానికి ఒడిగట్టిన ముగ్గురు నిందితులను సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్, చాదర్‌ఘాట్ పోలీసులు 16 గంటల్లోనే గుర్తించి పట్టుకున్నట్లు డీసీపీ జానకి ధరావత్ పేర్కొన్నారు. ఈ ముగ్గురూ బైక్ టాక్సీలు నడుపుతుంటారని ఆమె వివరించారు. అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు, ఏసీపీ జి.శ్యామ్‌సుందర్‌తో కలిసి శుక్రవారం తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు.

విదేశాలకు వెళ్లివచ్చి మరో దేశం వెళ్లాలని...

ముంబైకి చెందిన నజీమ్ ఎజాజ్ కొటాడియా అక్కడే గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. కొన్నేళ్లుగా అతడి తల్లిదండ్రులతో పాటు సోదరి సైతం అమెరికాలో ఉంటోంది. నజీమ్ చిన్న వయస్సులోనే విలాసవంతమైన జీవితానికి అలవాటుపడి ఎక్కువగా డబ్బు ఖర్చు చేసేవాడు. దీంతో అతడి తండ్రి హసన్ తన సంపాదన, ఆస్తి కుమారుడి చేతికి అందకుండా కట్టడి చేశాడు. తాను డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో కొన్నేళ్లుగా ఆఫ్రికా, చైనా, అమెరికాలో పలు ఉద్యోగాలు చేశాడు. 2022లో తిరిగి వచ్చిన ఇతగాడు ముంబైకి చెందిన యువతిని వివాహం చేసుకుని పాపకు తండ్రి అయ్యాడు. ఇతడి వ్యవహారశైలి నచ్చని భార్య కూడా తన కుమార్తెను తీసుకుని వేరుగా ఉంటోంది. నజీమ్ ప్రస్తుతం లండన్ వెళ్లి స్థిరపడాలనే ప్రయత్నాల్లో ఉన్నాడు.

డ్రైవర్ నుంచి మూడు బైక్స్‌కు ఓనర్‌గా...

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నజీమ్ బతుకుదెరువు కోసం గతేడాది నగరానికి వలసవచ్చి కొంపల్లిలో నివసిస్తున్నాడు. తొలుత ఓ బైక్ ట్యాక్సీ కంపెనీలో డ్రైవర్‌గా చేరిన ఇతడు ఆపై సొంతంగా మూడు ద్విచక్ర వాహనాలు ఖరీదు చేశాడు. వీటిలో ఒకటి అతడే నడుపుతూ... మిగిలిన రెండింటినీ నడిపేందుకు ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చి జీడిమెట్ల సుభాష్‌నగర్‌లో ఉంటున్న షౌకత్ రైనీ, వారిస్‌లను నియమించుకున్నాడు. నజీమ్ కొన్నాళ్ల క్రితం ఓ కస్టమర్‌ను తన బైక్‌పై తీసుకుని కిస్వా జ్యువెలర్స్‌కు వెళ్లాడు. అక్కడే దాదాపు 15 నిమిషాలు గడిపిన అతడికి ఆ దుకాణం ఉన్న ప్రాంతం, అందులోని పరిస్థితులు, లోపాలతో పాటు అక్కడ పని చేయడానికి వర్కర్స్ ఎవరూ లేకుండా యజమాని ఒక్కడే ఉంటాడనే విషయాన్ని గుర్తించాడు.

మిగిలిన ఇద్దరితో కలిసి దోపిడీ స్కెచ్..

లండన్ వెళ్లే ప్రయత్నాల్లో ఉన్న ఇతగాడు ఈ దుకాణంలో దోపిడీ చేసి సొమ్ము చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ విషయం తన వద్ద బైక్ డ్రైవర్లుగా పని చేసే షౌకత్, వారిస్‌లకు చెప్పి వారిని ఒప్పించాడు. దీంతో ముగ్గురూ కొన్ని రోజుల క్రితం ఆ దుకాణం వద్దకు వెళ్లి రెక్కీ చేసి వచ్చారు. వాస్తవానికి ఈ త్రయం మంగళవారమే దోపిడీ కోసం రంగంలోకి దిగింది. జ్యువెలరీ దుకాణం వద్ద అర్ధగంట ఎదురు చూసినా పరిస్థితులు అనుకూలించకపోవడంతో వెనక్కు తగ్గారు. మరుసటి రోజు (బుధవారం) ముగ్గురూ కొంపల్లిలోని నజీమ్ ఇంటి నుంచి మూడు బైక్‌లపై బయలుదేరారు. అబిడ్స్‌లోని తాజ్‌మహల్ హోటల్ వద్ద రెండు పార్క్ చేశారు. అక్కడి నుంచి నజీమ్, షౌకత్ ఓ బైక్ పైన, వారిస్ ఆటోలో బయలుదేరి కిస్వా జ్యువెలర్స్ వద్దకు వచ్చారు. తొలుత వారిస్ వినియోగదారుడిగా దుకాణంలోకి వచ్చాడు.

అక్బర్‌బాగ్–బోయిన్‌పల్లి మధ్య 'దర్యాప్తు'...

ఆపై బైక్‌పై నజీమ్, షౌకత్ దుకాణంలోకి ప్రవేశించి కేవలం 2.13 నిమిషాల్లో దోపిడీ పూర్తి చేశారు. అక్కడ నుంచి వీరిద్దరూ బైక్‌పై మలక్‌పేటకు వచ్చి మెట్రో స్టేషన్ వద్ద దాన్ని పార్క్ చేసి వేర్వేరు ఆటోల్లో కొంపల్లి వెళ్లారు. వారిస్ మరో ఆటోలో అక్కడకు చేరుకున్నాక నజీమ్ ఇంట్లో కలుసుకుని సొత్తు అక్కడే ఉంచారు. ఆపై క్యాబ్ బుక్ చేసుకుని అబిడ్స్, మలక్‌పేటల్లో ఉన్న బైక్స్ తీసుకుని నజీమ్ ఇంటికి చేరుకున్నారు. ఈ కేసు దర్యాప్తు కోసం సౌత్‌ఈస్ట్ జోన్, చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.సైదాబాద్, వై.ప్రకాష్‌రెడ్డి నేతృత్వంలోని బృందాలు రంగంలోకి దిగాయి. అక్బర్‌బాగ్–బోయిన్‌పల్లి మధ్య ఉన్న మార్గాల్లోని 300 కెమెరాల్లో రికార్డు అయిన ఫీడ్ పరిశీలించి నిందితులను గుర్తించారు. సాంకేతిక ఆధారాలను బట్టి ముగ్గురూ కొంపల్లిలోని నజీమ్ ఇంట్లో ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నారు. వీరి నుంచి రూ.24 లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

ఈడీ కస్టడీలో ఉన్న ఇంటిని అమ్మిన నౌహీరాపై చీటింగ్ కేసు

ఫిలింనగర్: ఈడీ కస్టడీలో ఉన్న ఇంటిని తమకు విక్రయిస్తానని రూ. కోట్లు తీసుకుని మోసం చేయడమే కాకుండా ఇంటిని ఖాళీ చేయాలంటూ రౌడీలతో దౌర్జన్యానికి దిగిన నౌహీరాషేక్‌పై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..సినీ నిర్మాత బండ్ల గణేష్ కుమారుడు బండ్ల హీరేష్ ఫిలింనగర్ రోడ్డునెంబర్–13 సైట్–2లోని ప్లాట్‌నెంబర్ 15–ఏలో నౌహీరా షేక్‌కు చెందిన ఇంట్లో 2023 నుంచి అద్దెకు ఉంటున్నాడు. నౌహీరా షేక్ సదరు ఇంటిని అమ్ముతున్నట్లుగా చెప్పడంతో తామే కొనుగోలు చేస్తామని గత ఏడాది మార్చి 23న నౌహీరాకు రూ.3 కోట్లు అడ్వాన్స్‌గా ఇచ్చాడు. మిగతా మొత్తాన్ని కూడా జమ చేస్తున్న సమయంలో ఈ ఇల్లు ఈడీ కేసులో ఉన్నట్లుగా తెలిసిందన్నారు. అయితే నౌహీరా మాత్రం మిగతా డబ్బులు చెల్లించాల్సిందిగా తమపై ఒత్తిడి చేస్తుందని, కేసు విషయం ప్రస్తావించగా దాటవేస్తూ వస్తుందని ఆరోపించారు. ఈ నెల 15న మధ్యాహ్నం నౌహీరాషేక్ 10 మంది రౌడీలతో కలిసి తమ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించడమే కాకుండా ఖాళీ చేయాలంటూ బెదిరింపులకు పాల్పడిందని, అసభ్య పదజాలంతో దూషించిందని ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హీరేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు నౌహీరాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బుద్వేల్ లే అవుట్ అభివృద్ధికి టెండర్ల ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: హెచ్ఎండీఏ గత సంవత్సరం ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా విక్రయించిన బుద్వేల్ , మోకిలా లే అవుట్‌లలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం హెచ్ఎండీఏ తాజాగా టెండర్లను ఆహ్వానించింది. ఈ మేరకు శుక్రవారం ఆన్‌లైన్ టెండర్లకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆసక్తిగల సంస్థలు ఈ నెల 29లోగా దరఖాస్తు చేసుకోవచ్చునని అధికారులు తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో బుద్వేల్ వద్ద సుమారు 100 ఎకరాల్లో హెచ్ఎండీఏ లే అవుట్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. బహుళ అంతస్తుల భవనాల నిర్మాణానికి హెచ్ఎండీఏ ప్రణాళికలను రూపొందించింది.ఈ మేరకు గత సంవత్సరం నిర్వహించిన టెండర్లకు అనూహ్య స్పందన లభించింది. అలాగే మోకిలా లోని సుమారు 300 హెచ్ఎండీఏ ప్లాట్‌లకు సైతం వేలం నిర్వహించగా, గరిష్ఠంగా గజానికి రూ.లక్షకు పైగా ధర పలికింది. రెండు చోట్ల హెచ్ఎండీఏ భారీ మొత్తంలో ఆదాయం లభించింది. ప్రస్తుతం ఈ రెండు చోట్ల రోడ్లు , విద్యుత్, పారిశుద్ధ్యం, మంచినీరు, పార్కులు, తదితర మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు చేపట్టారు. బుద్వేల్ లే అవుట్ అభివృద్ధికి రూ.354 కోట్లు, మోకిలా అభివృద్ధికి రూ.47 కోట్లతో టెండర్లకు నోటిఫికేషన్ వెలువరించారు.

జూపార్కును సందర్శించిన చాపెల్ జూ డైరెక్టర్



ఇంగ్లాండ్ హోమ్స్ చాపెల్ జూ డైరెక్టర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న జూపార్కు అధికారులు

బహదూర్‌పురా: భారతదేశ పర్యటనలో భాగంగా నగరానికి వచ్చిన ఇంగ్లాండ్ హోమ్స్ చాపెల్ జూ డైరెక్టర్ మెలిస్సా మ్యూస్, బెన్ మ్యూస్ దంపతులు శుక్రవారం నెహ్రూ జూలాజికల్ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా వారికి జూపార్కు క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఎస్.హిరేమత్, ఐఎఫ్ఎస్ పి.రఘువీర్ స్వాగతం పలికారు. అనంతరం వారు జంతు ప్రదర్శనశాలలు, సఫారీ కాంప్లెక్స్, మౌస్ డియర్ బ్రీడింగ్ సెంటర్, వన్యప్రాణుల రక్షణ, పునరావాస కేంద్రం, సరీసృపాల గృహం తదితరాలను సందర్శించారు. ఈ సందర్భంగా క్యూరేటర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జూపార్క్‌లో వన్య ప్రాణుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. జూపార్కు నిర్వాహణ అంశాలు, ఇటీవల కాలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, బ్రీడింగ్ ప్రోగ్రామ్ తదితరాలను వివరించారు. అనంతరం మెలిస్సా, బ్రాండన్ హ్యూస్ మాట్లాడుతూ.. జూపార్కు నిర్వహణ వ్యవస్థ ఎంతో బాగుందన్నారు. జంతు ప్రదర్శనశాలలో అరుదైన జాతుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న జూ వెటర్నరీ వింగ్‌ను అభినందించారు. కార్యక్రమంలో జూ వెటర్నరీ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎ.హకీం, డిప్యూటీ క్యూరేటర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రూ.200 కోసం దారుణం

- ఇద్దరు బాలల మధ్య ఘర్షణ
- బండరాయితో మోది స్నేహితుడి హత్య
- నిందితుడి అరెస్ట్

మియాపూర్: ఇద్దరు బాలల మధ్య రూ.200 కోసం జరిగిన ఘర్షణ హత్యకు దారి తీసిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. న్యూ హఫీజ్ పేట, ఆదిత్య నగర్‌కు చెందిన అస్గర్, షహనాజ్‌బేగం దంపతుల కుమారుడు ఏఎంబీ మాల్‌లో పనిచేసేవాడు. కొద్ది రోజుల క్రితం పని మానేసిన అతను జులాయిగా తిరుగుతున్నాడు. ఈ నెల 14న ఇంటి నుంచి బయటికి వెళ్లిన అతను తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. గురువారం సాయంత్రం హఫీజ్‌పేట ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఓ బాలుడు పడి ఉన్నట్లు గుర్తించిన స్థానికుల పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని అదృశ్యమైన బాలుడిగా గుర్తించారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో మృతి చెందినట్లు గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. హత్య కేసు నమోదు చేసుకున్న పోలీసులు కేసు విచారణలో భాగంగా మృతుడి స్నేహితుడిపై అనుమానంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా తానే హత్య చేసినట్లు అంగీకరించాడు.

మద్యం మత్తులో హత్య..

ఆదిత్యానగర్‌కు ప్రాంతానికే చెందిన మరో బాలుడు మృతుడితో పాటు కొన్ని రోజులు ఏఎంబీ మాల్‌లో హౌస్ కీపింగ్ పని చేశాడు. ఈ నెల 14న సాయంత్రం ఇద్దరూ కలిసి స్థానిక బంగారు వైన్స్ వద్ద మద్యం కొనుగోలు చేసి ఫ్లైఓవర్ బ్రిడ్జి కిందికి వెళ్లి పార్టీ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య రూ.200 విషయమై గొడవ జరిగింది. దీంతో అతను అస్గర్ కుమారుడిని బలంగా కొట్టడంతో అతను అపస్మారకస్థితికి చేరుకున్నాడు. అనంతరం పక్కనే ఉన్న బండరాయితో అతడి తలపై మోది హత్యచేసి అక్కడి నుంచి పారిపోయినట్లు తెలిపాడు. నిందితుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టి అక్కడి నుంచి జువైనల్ హోమ్‌కు తరలించనున్నట్లు తెలిపారు.

విద్యార్థినిపై అధ్యాపకుడి లైంగికదాడి

శంషాబాద్: జూనియర్ కళాశాల అధ్యాపకుడు అదే కాలేజీకి చెందిన విద్యార్థినిని ప్రేమ పేరుతో నమ్మించి లైంగిక దాడికి పాల్పడిన సంఘటన శంషాబాద్‌లో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక రాళ్లగూడ ప్రధాన రహదారిలో జూనియర్ కళాశాలలో నిజామాబాద్‌కు చెందిన సూర్యదీప్ అధ్యాపకుడిగా పని చేస్తున్నాడు. అతను అదే కాలేజీలో చదువుతున్న ఓ విద్యార్థినిని ప్రేమిస్తున్నానని నమ్మించి పలుమార్లు నగరానికి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. దీనిని గుర్తించిన బాధితురాలి కుటుంబసభ్యులు ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు శుక్రవారం నిందితుడు సూర్యదీప్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోగాలు నయం చేస్తానని..

నగదుతో నకిలీ ఆయుర్వేద వైద్యుడి పరారీ

వెంగళరావునగర్: ఆయుర్వేద వైద్యంతో సకల రోగాలు నయం చేస్తానని నమ్మించి ఓ నకిలీ వైద్యుడు నగదుతో ఉడాయించిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రిటైర్డ్ ఉద్యోగి ఖాజావలి, సుభాన్‌బీ దంపతులు మోతీనగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. సుభాన్‌బీ గత కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతూ మంచానికే పరిమితమైంది. కాగా ఆరు నెలల క్రితం రామయ్య అనే వ్యక్తి వారి ఇంటికి వచ్చి తన తల్లి కూడా పక్షవాతంతో బాధపడుతుండేదని, తనకు తెలిసిన ఆయుర్వేద వైద్యుడి చికిత్సతో పూర్తిగా నయమైందని తెలిపాడు. నేను సదరు వైద్యుడికి వివరాలు చెబుతానని, వారి కుమారుడు వచ్చి అన్ని విషయాలు చెబుతాడని వారిని నమ్మించాడు. ఆ మర్నాడు వారి ఇంటికి వచ్చిన శంకరయ్య అనే వ్యక్తి సుభాన్‌బీని పరీక్షించి ఆయుర్వేద మందుల ద్వారా తప్పకుండా నయం అవుతుందని చెప్పాడు. అనంతరం ఖాజావలిని కళ్యాణ్‌నగర్‌లోని బాలాజీ ఆయుర్వేద వైద్యశాలకు తీసుకెళ్లాడు. అక్కడ ఉన్న ఆనంద్ అనే వ్యక్తి ఆయుర్వేదం వైద్యంతో వ్యాధి నయం చేస్తామని ఇందుకు కొంత ఖర్చవుతుందని చెప్పాడు. వ్యాధి నయం కాకపోతే మీరు ఇచ్చిన నగదు తిరిగి ఇస్తానని హామీ ఇచ్చాడు. వారి మాటలు నమ్మిన ఖాజావలి తన భార్య బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.2,83,500 ఇచ్చాడు. దీంతో ఆనంద్ ఒక మందును తయారు చేసి వారికి ఇచ్చాడు. రెండు నెలలు పాటు మందులు వాడినా ప్రయోజనం లేకపోవడంతో ఆనంద్‌కు ఫోన్ చేశాడు. తాను మందుల కోసం వేరే ప్రాంతానికి వచ్చానని, త్వరలోనే వచ్చి కలుస్తానని ఖాజావలికి చెప్పాడు. మూడునెలలైనా ఆనంద్ రాకపోవడంతో అతను ఇటీవల కళ్యాణ్‌నగర్‌లోని ఆయుర్వేద వైద్యశాలకు వెళ్లి చూడగా ఆసుపత్రి తాళం వేసి ఉంది. చుట్టుపక్కల వారిని విచారించగా రెండు నెలలుగా తెరవడం లేదని చెప్పడంతో తాము మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు శుక్రవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో టోకరా...

వెంగళరావునగర్: పార్ట్‌టైం ఉద్యోగం పేరుతో ఆన్‌లైన్ మోసగాళ్లు ఓ షార్ట్ ఫిలిం డైరెక్టర్‌కు టోకరా వేసి సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్లారెడ్డి అనే యువకుడు గత కొంతకాలంగా ఎల్లారెడ్డిగూడలో ఉంటూ షార్ట్‌ఫిల్మ్ డైరెక్టర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 2న టెలిగ్రాం యాప్‌లో పూజాసింగ్ పేరుతో పార్ట్‌టైం జాబ్ పేరుతో మెసేజ్ వచ్చింది. లింక్ ఓపెన్ చేయగా వివరాల కోసం రూ.1046 ఆన్‌లైన్‌లో పంపాలన్నారు. అతను నగదు పంపగా మీరు మా సంస్థలో సభ్యులయ్యారని, బిజినెస్ చేయాలంటే రూ.10 వేలు చెల్లించాలని సూచించారు. మొదట్లో లాభాలు చూపించి పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టించారు. అనంతరం వారి నుంచి స్పందన లేకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బస్తీల్లో పేదల చెంతకే 'సంక్షేమ' ఫలాలు!

- మోదీ గ్యారంటీ వాహనాల వద్ద బస్తీవాసుల సందడి
- అన్ని శాఖల అధికారులు ఒకే గొడుగు కిందకు...
- ఈ నెల 20 వరకు వికసిత్ భారత్ సంకల్పయాత్ర
- ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో శిబిరాల ఏర్పాటు

బంజారాహిల్స్: అర్హులైన వారు కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల్లో లబ్ధిదారులుగా చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర మూడో దశ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధుల్లో నాలుగు చోట్ల మొదటి రోజున ప్రత్యేక శిబిరాలను ఏర్పాటుచేశారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–10లోని గౌరీశంకర్ కాలనీ, ఎంఎస్‌మక్తా, బోరబండ, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో అధికారుల బృందాలు ప్రజల ముంగిట్లోకి వెళ్లి ఈ శిబిరాలు ఏర్పాటుచేసి పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేయడమే కాకుండా ఆయా పథకాల గురించి అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు పొందడానికి అర్హులై ఉండి ఇప్పటివరకు వాటి ప్రయోజనాలు పొందని ప్రజల వద్దకు ఈ అధికారుల బృందాలు వెళ్తున్నాయి. ప్రతి అర్హుడికి వందకు వంద శాతం కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిని సమకూర్చాలన్నది ఈ యాత్ర ప్రధాన లక్ష్యం. అలాగే పథకాలకు సంబంధించిన సమాచార వ్యాప్తి, వాటి గురించి అవగాహన కల్పించడం, లబ్ధిదారుల వ్యక్తిగత అనుభవాన్ని తెలుసుకోవడానికి ప్రధాని మోదీ గ్యారంటీ వాహనం కూడా ఈ శిబిరాల వద్ద ఏర్పాటుచేస్తున్నారు. ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు వికసిత్ భారత్ సంకల్పయాత్ర ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో వేర్వేరు చోట్ల ఏర్పాటుచేయనున్నారు. ఈ శిబిరాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి వారికి సకాలంలో వైద్యం అందించేవిధంగా చర్యలు తీసుకుంటారు. ఉచితంగా మందులు కూడా పంపిణీ చేస్తారు. అలాగే ముద్ర రుణాల గురించి, కొత్తగా బ్యాంక్ అకౌంట్ తెరిచేందుకు బ్యాంక్ అధికారులు కూడా ఇక్కడ ఉంటారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే ఉజ్వల గ్యాస్ పథకం లబ్ధిదారులను కూడా గుర్తించేందుకు సంబంధిత అధికారులు ఇక్కడ అందుబాటులో ఉంటారు. వీటికి తోడు ఆధార్ అప్‌డేట్, ఇతరత్రా ఆధార్ సమస్యలపై అధికారులు కౌంటర్‌ను ఏర్పాటు చేస్తారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ఇవే...

వికసిత్ భారత్ సంకల్పయాత్ర శిబిరాల్లో వివిధ శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ ఆయా పథకాలను తెలియజేస్తూ అర్హులను గుర్తించి ఆయా పథకాల్లో వారిని లబ్ధిదారులుగా చేరుస్తున్నారు. ఈ పథకాల్లో ముఖ్యంగా ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి ఉజ్వల యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, సుకన్య సమృద్ధి యోచన, ముద్ర లోన్లు, ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, పీఎం స్వానిధి యోజన, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, స్వచ్ఛ భారత్ మిషన్, ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, స్టాండప్ యోజన, అటల్ పెన్షన్ యోజన ఉన్నాయి.


వైద్య శిబిరంలో పరీక్ష నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది...


ఆధార్ అప్‌డేట్ చేసుకుంటున్న ప్రజలు

ఆధార్ అప్‌డేట్ కోసం వచ్చా...



ఆధార్ అప్‌డేట్ కోసం ఎన్నో ప్రాంతాలను తిరగడం జరిగింది. ఎక్కడా సరైన స్పందన కనిపించలేదు. బ్యాంకుల్లో కూడా అప్‌డేట్ చేస్తారని తెలుసుకుని వెళ్లినా ఉపయోగం లేకుండా పోయింది. ఇప్పుడు నేను ఉన్న ఏరియాకే ఆధార్ అప్‌డేట్‌కు సంబంధించిన అధికారులు వచ్చి నా ఆధార్‌ను అప్‌డేట్ చేశారు. ఇలా మా బస్తీకి రావడం ఎంతో ఆనందంగా ఉంది.

– శృతిశిఖ, బంజారాహిల్స్

ముద్ర లోన్ కోసం..



కేంద్ర ప్రభుత్వం ముద్రలోన్లు పేరుతో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు రుణాలు ఇస్తున్నట్లు తెలుసుకుని ఈ శిబిరానికి వచ్చాను. ఇక్కడ బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు నా పూర్తి వివరాలు తీసుకున్నారు. నేను ఈ పథకానికి అర్హుడినని వారు చెప్పడం జరిగింది. నా ఇంటి ముంగిట్లోకే మోదీ గ్యారంటీ వాహనం వచ్చి మమ్మల్ని లబ్ధిదారులను చేయడం ఎంతో ఆనందంగా ఉంది.

– రాజు, బస్తీవాసి

ఉజ్వల గ్యాస్ కనెక్షన్ కోసం...



కేంద్ర ప్రభుత్వం ఉజ్వల గ్యాస్ పేరుతో పేద ప్రజలకు గ్యాస్ కనెక్షన్‌ను ఇస్తుంది. ఈ విషయం తెలుసుకుని నేను మా ఇంటి వద్దనే ఏర్పాటుచేసిన ఈ శిబిరం వద్దకు వచ్చాను. ఇక్కడ ఏర్పాటు చేసిన కౌంటర్‌లో సంబంధిత అధికారులు నాకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను తీసుకోవడం జరిగింది. నేను ఈ పథకానికి అర్హురాలినని వారు వెల్లడించారు. ఇలా మా బస్తీకే వచ్చి మమ్ములను గుర్తించడం సంతోషంగా ఉంది.

– శ్యామల, గౌరీశంకర్‌కాలనీ

శుభాకాంక్షలు



రహమత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి భవానీశంకర్ పుట్టిన రోజు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. పార్టీ డివిజన్ నాయకులు గ్యార నాగరాజు, రవీందర్‌రెడ్డి, జాఫర్ హుస్సేన్, ఆండాళు, మేఘన పద్మ, సాయి, ప్రకాష్, బెన్నార్, శివ, అరుణ్‌గౌడ్, సువర్ణ తదితరులు కేట్ చేసి భవానీశంకర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు

శ్రీనగర్‌కాలనీ: ట్రాఫిక్ నియమాలు ప్రతిఒక్కరూ తప్పక పాటించాలని లేకుంటే చలాన్లతో పాటు జైలు శిక్ష తప్పదని ఎస్ఆర్‌నగర్ ఎస్ఐ నరేష్ హెచ్చరించారు. శుక్రవారం అమీర్‌పేటలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అధిక శబ్దం చేసే సైలెన్సర్లు, అధిక లోడ్‌లతో వచ్చే వాహనాలతో పాటు ట్రాఫిక్ నియమాలు పాటించని వాహనదారులకు చలానాలను విధించారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలిపై అవగాహన కల్పించారు. మైనర్లకు వారి తల్లిదండ్రులు వాహనాలను ఇవ్వరాదని సూచించారు.

ప్రతి సినిమాలో అంబేడ్కర్ చిత్రపటం పెట్టాలి


వినతి పత్రం అందజేస్తున్న గంధం సుమన్ నరేష్

ఫిలింనగర్: రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటాన్ని ప్రతి సినిమాలో పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ దళిత రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గంధం సుమన్ మాదిగ కోరారు. శుక్రవారం ఆయన ఫిలించాంబర్ అసోసియేషన్ సభ్యుడు శంకరశాస్త్రికి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. సినిమాల్లో కోర్టు సన్నివేశాలు, పోలీస్ స్టేషన్ సన్నివేశాలు, పేదలకు భూములు పంచే సన్నివేశాల్లో కచ్చితంగా అంబేడ్కర్ ఫొటో పెట్టేలా చర్యలు తీసుకునేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

అభివృద్ధి పనులపై జెడ్‌సీ సమీక్ష



బంజారాహిల్స్: పలు ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారం ఇతరత్రా అంశాలపై వివిధ శాఖల అధికారులతో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ గురువారం తన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా విభాగాల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సమీక్షా సమావేశంలో చర్చించారు. పోలీసు, ఇతర విభాగాల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. వివిధ అంశాలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. సమన్వయ కమిటీ సమావేశాల్లో తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించనున్నట్లు ఈ సందర్భంగా ఆయన సూచించారు.

కరిగిపోయే ఐస్‌పై... తరగని అభిమానం


ఐస్‌తో వి లవ్ రేవంత్ అంటూ పేరును కార్వింగ్ చేసిన రీజెన్సీ కాలేజీ విద్యార్థులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని రీజెన్సీ కాలేజీ విద్యార్థులు శుక్రవారం కాలేజీ వద్ద ఐస్‌పై రకరకాల ఆకృతులు కార్వింగ్ చేసి ఆకట్టుకున్నారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరును ఐస్ బార్లతో కార్వింగ్ చేసి ప్రదర్శించారు. ఈ ప్రదర్శన స్థానికంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ... క్షణాల్లోనే కరిగిపోయే బట్టర్, ఐస్‌లపై అందమైన ఆకృతులను తీర్చిదిద్దే ప్రక్రియను నేర్పిస్తుంటామని ఇది హోటల్ మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్‌లో ఒక భాగమని అన్నారు. ఐస్, బట్టర్‌లపైనే కాకుండా కూరగాయలు, ఫ్రూట్స్ కార్వింగ్‌లో కూడా విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. త్వరలోనే ఐస్, బట్టర్‌లతో ఓ ప్రదర్శన నిర్వహించబోతున్నామని అన్నారు.

క్రైస్తవులపై దాడులకు నిరసనగా ర్యాలీ

బంజారాహిల్స్; వాయిస్ ఆఫ్ జీసస్ గాస్పెల్ మహిళా విభాగం టీమ్ అధ్యక్షురాలు సరోజాభాస్కర్ ఆధ్వర్యంలో ఫిలింనగర్‌లోని మహనీయుల చౌరస్తాలో క్రైస్తవులపై, ఫాస్టర్లపై జన్‌వాడలో జరిగిన దాడులకు నిరసనగా భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని క్రైస్తవులపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దాడులు చేసే వారిపై తక్షణమే శిక్షలు విధించాలన్నారు.

18న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా

పంజగుట్ట: రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మశాస్త్రం తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారని యావత్ సమాజం ఐక్యమై దాన్ని అడ్డుకోవాలని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నేషనల్ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ పిలుపునిచ్చింది. ఫెడరేషన్ ఆధ్వర్యంలో మరో 30 సంఘాలు కలిసి రాజ్యాంగ పరిరక్షణకు ఈ నెల 18వ తేదీ ఆదివారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు మహాధర్నా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ధర్నా కరపత్రాన్ని ఫెడరేషన్ జాతీయ సెక్రటరీ జనరల్ ఎం.నర్సింగరావు, జాతీయ ప్రధాన కార్యదర్శి జి.శంకర్, రాష్ట్ర అధ్యక్షుడు టి.రాజలింగం ఆవిష్కరించారు.

చెక్కుల పంపిణీ

బంజారాహిల్స్: నిరుపేదల సంక్షేమానికి తన వంతు కృషి ఎప్పుడూ ఉంటుందని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. షాదీముబారక్, కళ్యాణలక్ష్మి పథకాల కింద మంజూరైన నిధులకు సంబంధించిన చెక్కులను శుక్రవారం ఆమె క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. 60 మంది లబ్ధిదారులు చెక్కులను అందుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడమే ప్రథమ లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్నట్లు చెప్పారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే సత్వర పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

'మలబార్'లో రాయల్ పోల్కీ జువెలరీ ప్రదర్శన



పంజగుట్ట: అందమైన బంగారు, వజ్రాభరణాలు ధరించి అంతే అందమైన మోడల్స్ కనువిందు చేశారు. సోమాజిగూడలోని మలబార్ గోల్డ్, డైమండ్స్ షోరూంలో రాజసం ఉట్టిపడేలా రూపొందించిన విరాజ్ రాయల్ పోల్కీ జువెలరీ షోను శుక్రవారం రాత్రి ఆవిష్కరించారు. ఇప్పటి మోడ్రన్ పెళ్లికూతుర్లకు, జువెలరీ ప్రేమికులను ఆకర్షించేలా ఈ డిజైన్లు రూపొందించారు. ఈ ప్రదర్శన 16 నుండి 25వ తేదీ వరకు కొనసాగుతుందని షోరూం మేనేజర్ అజయ్ తెలిపారు. రాయల్ డిజైన్‌తో చేసిన అన్ని రకాల జువెలరీపై రాయితీ ఉందన్నారు. ఈ ప్రదర్శనలో భారీ నెక్లెస్‌లు, లాంగ్ హారాలు, యూనిక్ కలర్ కాంటేషన్ స్టోన్ కలెక్షన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో స్టోర్ నిర్వాహకులు అజయ్, పోల్కీ కలెక్షన్స్ ఇన్‌చార్జి గోరక్ నాథ్, మోడల్స్ పాల్గొన్నారు.

కుల గణనపై తీర్మానం హర్షణీయం

లిబర్టీ: రాష్ట్రంలో కుల గణన చేయాలని అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేయడాన్ని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్రు కుమారస్వామి స్వాగతించారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీల పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏమిటో నిరూపించారని స్పష్టం చేశారు.

థీమ్ పార్క్‌లో సమస్యలు పరిష్కరించండి

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ కళ్యాణ్‌నగర్‌కాలనీలో ఉన్న థీమ్ పార్క్‌లో సమస్యలను పరిష్కరించాలని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు కార్పొరేటర్ దేదీప్య విజయ్‌ను కోరారు. దీనికి స్పందించిన కార్పొరేటర్ శుక్రవారం పార్క్‌ను సందర్శించి మొత్తం కలియ తిరిగి పరిశీలించారు. టూల్స్ రూం, వాచ్‌మెన్ గది తదితర ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు ఉన్నాయని, పార్క్‌లోని చెట్ల నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, ఇతర మెయింటెనెన్స్ తదితర విషయాలను ఆమెకు తెలియజేశారు. ఆయా సమస్యలను చూసిన కార్పొరేటర్ జీహెచ్ఎంసీ అర్బన్ ఫారెస్ట్రీ అధికారుల ద్వారా సాధ్యమైనంత త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. ఫెడరేషన్ చైర్మన్ సత్యనారాయణ, కాలనీనేతలు హరినాథ్, రామరాజు, హనుమంతరావు, జీహెచ్ఎంసీ ఏఈ అవినాష్, శేఖర్, అర్బన్ ఫారెస్ట్రీ ఇన్‌చార్జి అలీ, ఎస్ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఆందోళన

వెంగళరావునగర్: కార్మిక సంక్షేమ చట్టాలను రక్షించాలని కోరుతూ జరిగే భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఎం, ప్రజాసంఘాల జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకులు టి.సాయిశేషగిరిరావు కోరారు. శుక్రవారం యూసుఫ్‌గూడ అడ్డా వద్ద సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను రక్షించే చట్టాలను రద్దు చేయడాన్ని ఖండిస్తున్నట్టు చెప్పారు. ఈ మేరకు ఇందిరాపార్క్ వద్ద ఉన్న ధర్నా చౌక్‌కు కదిలి రావాలని, భారత్‌బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలియజేయాలని ఆయన కోరారు. యూసుఫ్‌గూడ లేబర్ అడ్డా భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ప్రసాద్, రమణ, కృష్ణ, రవి, బాలు, కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అక్కడ నుంచి ధర్నాచౌక్‌కు బయలుదేరి వెళ్లారు.

18న 'ఆస్ట్రేలియన్ అడ్మిషన్స్ డే'

బంజారాహిల్స్: ఆస్ట్రేలియాలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఈ నెల 18వ తేదీన ఉచితంగా ఆస్ట్రేలియన్ అడ్మిషన్స్ డే నిర్వహించనున్నట్లు యూని ఎక్స్‌పర్ట్స్ ఓవర్సిస్ ఎడ్యుకేషన్ సంస్థ ఆపరేషన్స్ హెడ్ ఉమ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... ఆస్ట్రేలియాలో చదువుకోవాలనుకునే విద్యార్థులకు ఇది ఒక సువర్ణ అవకాశమని తెలిపారు. ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో పాల్గొనే విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వీసా రిక్రూట్‌మెంట్, అడ్మిషన్స్ రిక్రూట్‌మెంట్, స్కాలర్‌షిప్స్ ఆప్షన్, లాంగర్ స్టే బ్యాక్ ఆప్షన్, ట్రావెల్స్ అప్‌డేట్స్ అన్ని స్వయంగా ఆస్ట్రేలియాకు చెందిన యూనివర్సిటీ ప్రతినిధులతో చర్చించి వారి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చునని తెలిపారు. వివరాలకు ఫోన్: 99123 28645లో సంప్రదించాలని తెలిపారు.

దళిత క్రైస్తవులపై దాడులను ఖండిస్తున్నాం

హిమాయత్‌నగర్: మెథడిస్ట్ చర్చ్ సంఘ సభ్యులైన దళిత క్రైస్తవులపై జరిగిన అమానుష దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని 'క్రిష్టియన్ డెమోక్రటిక్ మూవ్మెంట్' వ్యవస్థాపక అధ్యక్షుడు పి.ఎ.మెల్కిసెదెక్ అన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలం, జన్వాడ గ్రామంలో చర్చి సభ్యులపై అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కొంతమంది ఆర్ఎస్ఎస్‌కు చెందిన కార్యకర్తలు కలిసి ముందస్తు పథకంతో కర్రలతో, ఇనుప రాడ్లతో, రాళ్లతో విచక్షణా రహితంగా దాడులు చేయడం దారుణమన్నారు. దాడులకు బాధ్యులైన అందరిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, క్రైస్తవులకు రక్షణ కల్పించే విషయంలో త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు డీజీపీలను కలిసి వివరిస్తామన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ రెవ రేనాల్డ్ వెస్లీ, ఆర్గనైజర్ ఖురేషీ, సురేష్, జాన్ మాథ్యూస్ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలి

లక్డీకాపూల్: నిమ్స్‌లో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీసం వేతనంగా రూ.26 వేలు చెల్లించాలని నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సీఐటీయూ పిలుపు మేరకు చలో ఇందిరాపార్కు కార్యక్రమంలో భాగంగా నిమ్స్‌లో కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా భారీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీనియారిటీ ప్రకారం కాంట్రాక్ట్ కార్మికుల సర్వీసులను క్రమబద్ధీకరించాలన్నారు. అదే విధంగా లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఇ. నరసింహ, సంయుక్త కార్యదర్శి వెంకటేష్, కోశాధికారి రాజయ్య, మాధవి, రాధిక ఎలిజిబెతి, లక్ష్మీ భాగ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే భాషోపాధ్యాయుల సమస్యలు పరిష్కారం

పంజగుట్ట: గ్రేడ్ టూ ఉద్యోగిగా నియమితులై గ్రేడ్ టూ ఉద్యోగిగానే పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులు ఎవరైనా ఉన్నారంటే అది కేవలం భాషా పండిత ఉపాధ్యాయులే అని భాషా పండితులు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో భాషా పండిత ఉపాధ్యాయులకు తప్పక న్యాయం జరుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో భాషా పండితుల మనోభావాలతో కూడిన భాషోపాధ్యాయుల గీతం సీడీని టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భాషా పండితులు కొన్ని సంవత్సరాలుగా పదోన్నతులు లేక తీవ్ర నిరాశతో ఉన్నారన్నారు. భాషా పండితుల ఆవేదన, వారి హక్కులు తెలిపేందుకు ఈ గీతం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి ఉపాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పర్వత సత్యనారాయణ, ఆర్‌యూపీపీటీ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి గుళ్లపల్లి తిరుమల కాంతికృష్ణలు గేయ రూపకర్త వివేక్ భవానీ మాట్లాడారు. త్వరలో భాషా పండితుల సమ్మేళనాన్ని ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పండితులు అందరూ హాజరై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నేతలు వనం శ్రీనివాస్, చంద్రశేఖర్, బాలాజీ, అమీర్‌బాషా, శర్మ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా బీవీబీపీ స్కూల్ వార్షికోత్సవం


బీవీబీపీ స్కూల్ వార్షికోత్సవంలో పాల్గొన్న కేంద్ర ఆర్థిక శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆదిత్య

ఫిలింనగర్: తాను చదువుకున్న పాఠశాలకే ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఓ యువ అధికారి కష్టపడి చదివితే.. ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగితే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించారు. జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో కనులపండువగా జరిగాయి. ఇదే పాఠశాలలో చదువుకుని ప్రస్తుతం భారత ప్రభుత్వ ఆర్థిక శాఖలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కె.ఆదిత్య ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ... ఒక లక్ష్యాన్ని ఏర్పాటుచేసుకుని చదువుకోవడం ద్వారా మంచి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవచ్చన్నారు. విద్యార్థుల ఆటాపాటలు, సంబరాలు అంబరాన్ని తాకాయి. స్కూల్ మేనేజింగ్ కమిటీ చైర్మన్ ఎస్.గోపాలకృష్ణన్, అకడమిక్ డైరెక్టర్ రమాదేవి, పాఠశాల ప్రిన్సిపాల్ సి.అరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

15 రోజుల్లో 46 మందికి 'డబుల్' ఇళ్లు

సికింద్రాబాద్ ఆర్‌డీఓ రవి


లబ్ధిదారుల సమస్యలను ఆర్‌డీఓకు వివరిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: కమలానగర్‌లోని డబుల్‌బెడ్ రూం ఇళ్లను కేటాయించని లబ్ధిదారుల వివరాలతో కూడిన నివేదికను వారం రోజుల్లో జిల్లా కలెక్టర్‌కు పంపనున్నట్లు సికింద్రాబాద్ ఆర్‌డీఓ రవి వెల్లడించారు. కలెక్టర్ ఆమోదించన 15 రోజుల్లో 46 మంది బస్తీ లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించే అవకాశం ఉందన్నారు. ఎస్పీఆర్ హిల్స్‌లోని కమలానగర్ డబుల్ బెడ్ రూం ఇళ్లను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ... కమలానగర్‌లో 210 మంది లబ్ధిదారులు నివాసం ఉండేలా డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించారన్నారు. ఇందులో 110 మందికి ఇళ్లు కేటాయించామని, వివిధ కారణాల వల్ల 46 మందికి కేటాయించలేదన్నారు. ఎన్నికల కారణంగా 46 మందికి కేటాయింపు నిలిచిపోయిందని చెప్పారు. ఇళ్లు రాని లబ్ధిదారులు వివరాలు మరో సారి పరిశీలిస్తామన్నారు. ఎస్పీఆర్‌హిల్స్‌లోని ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో ఫెన్సింగ్ వేయడం కోసం సర్వే చేశామని తెలిపారు. అన్ని ప్రభుత్వ స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. ప్రభుత్వ స్థలాల్లో ప్రజోపయోగ నిర్మాణాలు చేపట్టాలని నివేదికలు రూపొందించాలని నిర్ణయించినట్టు ఆర్‌డీఓ వెల్లడించారు. రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, ఖైరతాబాద్ మండల తహసీల్దార్, నయీమొద్దీన్, మండల సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో 'అయిదు' రెస్టారెంట్



బంజారాహిల్స్: దక్షిణ భారతదేశ వంటకాలను ఒకేచోట అందించేలా జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–45లో ఏర్పాటు చేసిన అయిదు (ఏఐడీయూ) రెస్టారెంట్ శుక్రవారం ప్రారంభమైంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వంటకాలు అందించేలా దీనిని ఏర్పాటుచేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. స్టఫ్డ్ పనియారం, మీన్ పొల్లిచట్టు, చింతకాయ కోడి కబాబ్, కుట్టు పరోటా మొట్టాకూర, మంగ్లోరియన్ ఫిష్ కర్రీ, పనీర్ చెట్టినాడ్, తెంగైపాల్ కోని బిర్యానీ, మైసూర్‌పాక్, డబుల్ కా మీఠా వంటి విభిన్న రకాల రుచులను ఇక్కడ ఆస్వాదించవచ్చన్నారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ ఆమస్‌చైనానీ, డైరెక్టర్ శ్రేయా చైనానీ, సతీష్ పోల్కం తదితరులు పాల్గొన్నారు.

బెదిరిస్తోందంటూ రియల్టర్ హత్యకేసులో నిందితురాలిపై ఫిర్యాదు


జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఇంటి పత్రాలు చూపిస్తున్న ధర్మారెడ్డి

బంజారాహిల్స్: కొన్ని రోజులు క్రితం యూసుఫ్‌గూడ ఎల్ఎన్‌నగర్‌లో రియల్టర్ పుట్టా రాము హత్యకేసులో నిందితురాలైన హిమాంబీ తన ఇల్లును ఆక్రమించుకుని ఖాళీ చేయకుండా తనను బెదిరింపులకు గురిచేస్తుందని, ఆమెపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు బి.ధర్మారెడ్డి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. పుట్టా రాము హత్య కేసులో నిందితురాలైన హిమాంబీ, ఆమె కూతురు నసీమాలు జైలులో ఉన్నారని, తన ఇంటిని ఖాళీ చేయకుండా ఇదేమిటని అడిగితే తన పైనే దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇల్లు ఖాళీ చేయాలని తాను అడిగితే అత్యాచారం చేశావంటూ పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బెదిరించేదని ఆరోపించారు. తన ఇంటిని ఆక్రమించుకున్న హిమాంబీ తన భర్త, కూతురుతో కలిసి ఇక్కడ వ్యభిచార గృహం నిర్వహిస్తుందని ఆయన ఆరోపించారు. చట్టప్రకారం తాను కొనుగోలు చేసిన ఇంటిని ఆక్రమించుకునేందుకు రౌడీల సహాయంతో ఖాళీ చేయకపోవడంతో పాటు బెదిరింపులకు పాల్పడుతున్న హిమాంబీ, ఆమె భర్త జాన్‌సైద్, కుమార్తె నసీమాలపై చట్టపరమైన చర్యలు తీసుకుని వారి బారి నుంచి ఇంటికి విముక్తి కలిగించాలని, తనకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులు ఫిర్యాదును స్వీకరించి ఈ కేసుపై దర్యాప్తు చేపట్టారు.

యువతి ఆత్మహత్య

వెంగళరావునగర్: అనుమానాస్పద స్థితిలో యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... వై.నూకరత్నం, నందకుమార్, వారి కుమార్తె పూజ(23) వెంగళరావునగర్ డివిజన్ యాదగిరినగర్‌లో ఉంటున్నారు. ఈ నెల 15వ తేదీ సాయంత్రం నూకరత్నం ఇంటి పని చేస్తుండగా పూజ ఆమె గదిలోకి వెళ్లి తలుపు వేసుకుంది. ఎంతకీ తలుపు తీయకపోవడంతో చుట్టుపక్కల వారిని పిలిచి తలుపులు తీయించగా గదిలో పూజ ఉరేసుకుని ఉంది. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

విద్యలో వండర్

ఆన్‌లైన్ లెర్నింగ్ సంస్థ 'ఎడెక్స్'తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం

2 వేలకు పైగా కోర్సులను వర్టికల్స్‌గా చదువుకునే గోల్డెన్ చాన్స్



ఎడెక్స్‌తో ఒప్పందం సందర్భంగా అభినందనలు తెలుపుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్. చిత్రంలో మంత్రి బొత్స, ఎడెక్స్ సీఈవో 'పద్మశ్రీ' అనంత్ అగర్వాల్ తదితరులు

సాక్షి, అమరావతి: పిల్లల ఉన్నత చదువుల ఖర్చు కోసం వెనుకాడకుండా మానవ వనరులపై పెట్టుబడికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు విప్లవాత్మక సంస్కరణలతో ఊహించనన్ని మార్పులు తెచ్చామని గుర్తు చేశారు. ఈ క్రమంలో విదేశాలకు వెళ్లి చదువుకోలేని మన విద్యార్థుల కోసం ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీలు అందించే కోర్సులను 'ఎడెక్స్' ద్వారా ఉచితంగా అందుబాటులోకి తెస్తున్నట్లు ప్రకటించారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, ఎంఐటీ, హార్వర్డ్ లాంటి విఖ్యాత వర్సిటీలు అందించే కోర్సుల్లో 2 వేలకుపైగా వర్టికల్స్‌లో విద్యార్థులు తమకు నచ్చిన అంశాన్ని నేర్చుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నేషనల్ బాకలారియట్ (ఐబీ) సిలబస్ అందుబాటులోకి తెస్తున్నామని, దీన్ని తొలుత ఒకటో తరగతితో ప్రారంభించి పదేళ్లలో రాష్ట్ర విద్యార్థులు ఐబీ విధానంలో టెస్ట్ పరీక్షలు రాసేలా అడుగులు ముందుకు వేస్తున్నట్లు చెప్పా రు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం, ప్రముఖ ఆన్‌లైన్ లెర్నింగ్ సంస్థ 'ఎడెక్స్' మధ్య కీలక ఒప్పందం కుదిరింది. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, ఉన్నత విద్యాశాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్, ప్రాథమిక విద్యాశాఖ కమిషనర్ (మౌలిక వసతుల కల్పన) కాటమనేని భాస్కర్, 26 వర్సిటీల వీసీలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

> 'ఎడెక్స్'తో ఒప్పందం రాష్ట్ర విద్యా రంగ చరిత్రలో సువర్ణాధ్యాయం. 'రైట్ టు ఎడ్యుకేషన్' అనేది పాత నినాదం. 'రైట్ టు క్వాలిటీ ఎడ్యుకేషన్' అనేది మన ప్రభుత్వ విధానం. నాణ్యమైన విద్య అందించడం ద్వారానే పేదరికాన్ని నిర్మూలించవచ్చు.
>
> – ముఖ్యమంత్రి వైఎస్ జగన్

అనూహ్య సంస్కరణలు..

ఉన్నత విద్యారంగంలో అనూహ్య సంస్కరణలు తెచ్చాం. ఆర్థిక భారంతో ఏ ఒక్కరి చదువులూ మధ్యలో ఆగిపోకూడదని పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తున్నాం. ఏటా జగనన్న వసతి దీవెన ద్వారా అర్హులందరికీ వసతి ఖర్చులు అందజేస్తున్నాం. తొలిసారి డిజిటల్ విద్యలో భాగంగా డిగ్రీలో ద్విభాషా పాఠ్య పుస్తకాలు, మూడేళ్ల కోర్సులో ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేశాం. దీనికి అదనంగా మరో ఏడాది ఆనర్స్ డిగ్రీ ఇచ్చే విధానాన్ని ప్రవేశపెట్టాం. సులభంగా సిలబస్ చదువుకునేలా 400కిపైగా బైలింగ్యువల్ పాడ్‌కాస్ట్‌లు అందుబాటులో ఉన్నాయి. ఉన్నత విద్యలో బోధన ప్రమాణాల పెంపునకు కోర్టు కేసులను అధిగమించి 18 వర్సిటీల్లో 3,295 పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టాం. 2019లో 257 ఉన్నత విద్యాసంస్థలకు న్యాక్ గుర్తింపు ఉంటే మన చర్యలతో ఈ సంఖ్య 437కు పెరిగింది.

సృజనకు పదును..

పేద, మధ్య తరగతి విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు నాంది పలికి 6వ తరగతి నుంచి ఐఎఫ్‌పీ ప్యానెళ్లతో సృజనాత్మక బోధన చేపట్టాం. 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ఉచితంగా ట్యాబ్‌లు ఇచ్చి, చదువుల్లో వేగం పెంచి సులభంగా అర్థమయ్యేలా చర్యలు చేపట్టాం

వర్సిటీల్లో టెక్నాలజీ వినియోగం పెరగాలి..

జగనన్న విదేశీ విద్య ద్వారా ఒక్కో విద్యార్థిపై రూ.1.20 కోట్లు ఖర్చు చేస్తున్నాం. ప్రపంచంలోని టాప్-50 వర్సిటీలు, 21 ఫ్యాకల్టీల్లో టైమ్స్ రేటింగ్స్, క్యూ ఎస్ రేటింగ్స్‌లోని 320 కాలేజీలలో సీటొస్తే ఉచితంగా చదివిస్తున్నాం. ఇప్పటి వరకు 400 మందికి పైగా ప్రభుత్వ సాయంతో విదేశాల్లో చదువుతున్నారు. వర్సిటీల్లో ఏఐ, అగ్‌మెంటెడ్ టెక్నాలజీ, 3డీ లెర్నింగ్ విధానాలను మన కరిక్యులమ్‌లో అందుబాటులోకి తేవాలని గతంలోనే వీసీలకు సూచించా. ఇప్పటికే పద్మావతి వర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పూర్తి స్థాయిలో వినియోగానికి చర్యలు తీసుకున్నారు. కంప్యూటర్ విజన్, మెటావర్స్ లెర్నింగ్ జోన్లు ఏర్పాటు చేశారు. ఒక్కో జోన్‌కు దాదాపు రూ.10 కోట్లు పెట్టుబడి పెట్టారు. ఇలాంటివి అన్ని వర్సిటీల్లోనూ రావాలి.

అంతర్జాతీయ వర్సిటీ కోర్సులు స్థానికంగానే

మన విద్యార్థులకు నాణ్యమైన విద్యను సంపూర్ణ స్థాయిలో అందించేందుకు 'ఎడెక్స్'తో ఒప్పందం చేసుకున్నాం. ఈ ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫారమ్ ద్వారా దాదాపు 2 వేలకు పైగా కోర్సులు మన పాఠ్య ప్రణాళికలో వర్టికల్స్ కిందకు వస్తాయి. ఎడెక్స్‌లో విద్యార్థి తనకు కావాల్సిన వర్టికల్స్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ప్రపంచ ప్రఖ్యాత లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, ఎంఐటీ, హార్వర్డ్ లాంటి విద్యా సంస్థలు ఈ కోర్సులను ఆఫర్ చేసి బోధిస్తాయి. అక్కడి ప్రొఫెసర్లతో మన విద్యార్థులు ఆన్‌లైన్‌లో సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లతో పాటు క్రెడిట్స్ దక్కుతాయి. తద్వారా జాబ్ మార్కెట్‌లో ఉద్యోగాలు సులభంగా లభిస్తాయి. పాశ్చాత్య దేశాల్లో డిగ్రీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్, రియల్ ఎస్టేట్ మేనేజ్‌మెంట్, సైబర్ ఫోరెన్సిక్, స్టాక్ ఎక్స్ఛేంజ్, వెల్త్ మేనేజ్‌మెంట్, రిస్క్ మేనేజ్‌మెంట్ లాంటి వర్టికల్స్ కనిపిస్తాయి. మన దగ్గర అవి లేకపోగా నేర్పించే సరైన మానవ వనరులు అందుబాటులో లేవు. ఈ సమస్యలను అధిగమించేందుకు అత్యుత్తమ వర్సిటీల కోర్సులను మన కరిక్యులమ్‌లో భాగం చేస్తున్నాం. తద్వారా ఆంధ్రా వర్సిటీ నుంచి తీసుకునే డిగ్రీల్లో స్టాక్ ఎక్స్ఛేంజ్, రిస్క్ మేనేజ్‌మెంట్, వెల్త్ మేనేజ్‌మెంట్, పైథాన్ కోర్సులకు ప్రపంచ వర్సిటీల సర్టిఫికేషన్ లభిస్తుంది. విదేశాలకు వెళ్లి చదువుకోలేని విద్యార్థుల కోసం మన వర్సిటీల్లో వీటిని అందుబాటులోకి తెస్తున్నాం. దీని ద్వారా ఉన్నత విద్యలో దాదాపు 12 లక్షల మంది విద్యార్థులకు మేలు జరుగుతుంది.

'ఫైబర్' ఫ్రాడ్ సూత్రధారి బాబే

'టెరాసాఫ్ట్'కు అడ్డగోలుగా ఫైబర్‌నెట్ ప్రాజెక్టు

- నేరచరితుడు వేమూరి కంపెనీకి పనులు.. బ్లాక్ లిస్ట్ నుంచి తొలగించి మరీ అప్పగింత
- రూ.333 కోట్ల తొలిదశ పనుల్లో ప్రజాధనం లూటీ
- నకిలీ ఇన్‌వాయిస్‌లతో షెల్ కంపెనీల ద్వారా తరలింపు
- విజయవాడ ఏసీబీ కోర్టులో సీఐడీ చార్జ్‌షీట్

ఏ1 చంద్రబాబు, ఏ2 వేమూరి, ఏ3 కోగంటి



సాక్షి, అమరావతి: కేంద్ర నిధులతో చేపట్టిన ఫైబర్‌నెట్ ప్రాజెక్టు స్కామ్ కేసులో మాజీ సీఎం చంద్రబాబు లూటీకి సంబంధించి కీలక ఆధారాలను సేకరించిన సీఐడీ శుక్రవారం విజయవాడ ఏసీబీ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేసింది. తనకు సన్నిహితుడైన, నేర చరిత్ర కలిగిన వేమూరి హరికృష్ణకు చెందిన టెరాసాఫ్ట్ కంపెనీకి అడ్డగోలుగా ఈ ప్రాజెక్టును కట్టబెట్టి చంద్రబాబు ప్రజాధనాన్ని స్వాహా చేసినట్లు ఆధారాలతో నిగ్గు తేల్చింది. ఈ నేపథ్యంలో ఏ1గా మాజీ సీఎం చంద్రబాబు, ఏ2గా టెరాసాఫ్ట్ ఎండీ వేమూరి హరికృష్ణ, ఏ3గా ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్, ఇన్‌క్యాప్ సంస్థల మాజీ ఎండీ కోగంటి సాంబశివరావు (ప్రస్తుతం ద.మ. రైల్వేలో చీఫ్ కమర్షియల్ మేనేజర్)తోపాటు మరికొందరిని నిందితులుగా పేర్కొంది. వారిపై ఐపీసీ సెక్షన్లు 166, 167, 418, 465, 468, 471, 409, 506 రెడ్ విత్ 120(బి)లతోపాటు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లు 13(2), రెడ్ విత్ 13(1)(సి)(డి) ప్రకారం కేసులు నమోదు చేసింది. ఫైబర్‌నెట్ పేరుతో చంద్రబాబు బృందం ప్రజాధనాన్ని ఎలా కొల్లగొట్టిందీ సీఐడీ తన చార్జ్‌షీట్‌లో సవివరంగా పేర్కొంది. ఎఫ్ఐఆర్ నమోదు సమయంలో చంద్రబాబును ఏ25గా పేర్కొనగా అనంతరం దర్యాప్తులో వెల్లడైన అంశాల ఆధారంగా తాజాగా చార్జ్‌షీట్‌లో ఏ1గా చేర్చారు. ఈ వెసులుబాటు దర్యాప్తు సంస్థలకు ఉంది.

ఐటీ శాఖకు బదులుగా..

టెరాసాఫ్ట్‌కు ఫైబర్‌నెట్ ప్రాజెక్టును కట్టబెట్టడం ద్వారా చంద్రబాబు యథేచ్ఛగా అవినీతికి పాల్పడ్డారు. మొత్తం రూ.2 వేల కోట్ల విలువైన ప్రాజెక్టు మొదటి దశలో రూ.333 కోట్ల పనుల్లో అక్రమాలకు బరితెగించారు. ఈ ప్రాజెక్టును ఐటీ శాఖ చేపట్టాల్సి ఉండగా విద్యుత్, మౌలిక వసతుల కల్పన, పెట్టుబడుల శాఖ ద్వారా చేపట్టాలని స్వయంగా ఆదేశించారు. నాడు ఈ శాఖలను చంద్రబాబే నిర్వహించడం గమనార్హం.

బిడ్లు.. టెండర్లు వేమూరివే

వేమూరి హరికృష్ణకు చెందిన టెరాసాఫ్ట్‌కే ఈ ప్రాజెక్టును అప్పగించాలని ముందే నిర్ణయించుకున్న చంద్రబాబు పక్కాగా కథ నడిపారు. అందుకోసం వేమూరిని ఏపీ ఈ-గవర్నింగ్ కౌన్సిల్‌లో సభ్యుడిగా చేర్చారు. నేర చరిత్ర ఉన్న ఆయన్ను కీలక స్థానంలో నియమించి పనులు చక్కబెట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ఫైబర్‌నెట్ టెండర్ల మదింపు కమిటీలో సభ్యుడిగా కూడా నియమించారు. ప్రాజెక్టు బిడ్లు దాఖలు చేసే కంపెనీకి చెందిన వ్యక్తులు నిబంధనల ప్రకారం టెండర్ల మదింపు కమిటీలో ఉండకూడదు. చంద్రబాబు దీన్ని తుంగలోకి తొక్కారు.

అమాంతం విలువ పెంచేసి...

ప్రాజెక్ట్ విలువను అడ్డగోలుగా నిర్ణయించారు. ఎలాంటి మార్కెట్ సర్వే చేపట్టకుండా సరఫరా చేయాల్సిన పరికరాలు, నాణ్యతను ఖరారు చేసి ప్రాజెక్ట్ విలువను అమాంతం పెంచేశారు. వేమూరి హరికృష్ణ, నాటి ఫైబర్‌నెట్ కార్పొరేషన్ ఎండీ కోగంటి సాంబశివరావు ఇందులో కీలక పాత్ర పోషించారు.

బ్లాక్ లిస్ట్ నుంచి తొలగించి మరీ..

ప్రాజెక్టు టెండర్ల ప్రక్రియ చేపట్టేనాటికి టెరాసాఫ్ట్ ప్రభుత్వ బ్లాక్ లిస్ట్‌లో ఉంది. పౌర సరఫరాల శాఖకు ఈ - పోస్ యంత్రాల సరఫరాలో విఫలమైన టెరాసాఫ్ట్‌ను అధికారులు బ్లాక్ లిస్టులో చేర్చారు. చంద్రబాబు ఆ కంపెనీని ఏకపక్షంగా బ్లాక్ లిస్టు నుంచి తొలగించారు. పోటీలో ఉన్న ఇతర కంపెనీలను పక్కనబెట్టేశారు. దీనిపై పేస్ పవర్ అనే కంపెనీ అభ్యంతరాలు వ్యక్తం చేసినా ఖాతరు చేయలేదు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను సైతం సాంకేతిక కారణాలతో అనర్హులుగా పేర్కొంటూ టెరాసాఫ్ట్‌కే ప్రాజెక్టును కట్టబెట్టారు. టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని పట్టుబట్టిన అధికారి బి.సుందర్‌ను హఠాత్తుగా బదిలీ చేసి తమకు అనుకూలమైన వ్యక్తులను నియమించుకున్నారు. టెండర్ల ప్రక్రియ మొదలైన తరువాత టెరాసాఫ్ట్ తమ కన్సార్టియంలో మార్పులు చేసి సాంకేతికంగా అధిక స్కోర్ సాధించేందుకుగా వివిధ పత్రాలను ట్యాంపర్ చేశారు.

కీలక అధికారుల వాంగ్మూలం..

ఫైబర్‌నెట్ కుంభకోణంపై కేసు నమోదు చేసిన సీఐడీ కీలక ఆధారాలను సేకరించింది. ఇండిపెండెంట్ ఏజెన్సీ ఐబీఐ గ్రూప్ ద్వారా ఆడిటింగ్ జరపడంతో అవినీతి బట్టబయలైంది. టెరాసాఫ్ట్ కంపెనీ నిబంధనలను ఉల్లంఘించి నాసిరకం పరికరాలు సరఫరా చేసి ప్రభుత్వాన్ని మోసగించిందని ఐబీఐ గ్రూప్ నిర్ధారించింది. నిబంధనలు పాటించాలని తాము పట్టుబట్టిన ప్పటికీ అప్పటి సీఎం చంద్రబాబు బేఖాతరు చేశారని, ఈ టెండర్ల ప్రక్రియలో ఆయన క్రియాశీలంగా వ్యవహరించారని సెక్షన్ 164 సీఆర్‌పీసీ ప్రకారం న్యాయస్థానంలో వారి వాంగ్మూలాన్ని నమోదు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

అమలు లోపభూయిష్టం

ప్రాజెక్టును అమలు చేయడంలో టెరాసాఫ్ట్ అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించింది. టెండర్ నోటిఫికేషన్ నాణ్యత ప్రమాణాలను ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో 80% ప్రాజెక్టు పనులు నిరుపయోగంగా మారాయి. మరోవైపు షెల్ కంపెనీల ద్వారా ప్రజాధనాన్ని అక్రమంగా తరలించారు. వేమూరి హరికృష్ణ తన సన్నిహితుడైన కనుమూరి కోటేశ్వరరావు సహకారంతో వ్యవహారాన్ని నడిపించారు. వేమూరికి చెందిన కాఫీ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, ఫ్యూచర్ స్పేస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలలో కనుమూరి కోటేశ్వరరావు భాగస్వామిగా ఉన్నాడు. వేమూరి హరికృష్ణ, తుమ్మల గోపీచంద్, రామ్‌కుమార్ రామ్మూర్తిలతో కలసి విజయవాడ కేంద్రంగా నెటాప్స్ ఫైబర్ సొల్యూషన్స్ ఎల్ఎల్‌పీ అనే మ్యాన్ పవర్ సప్లై కంపెనీ పేరిట ఓ షెల్ కంపెనీని సృష్టించారు. ఆ కంపెనీ ఫైబర్‌నెట్ ప్రాజెక్టుకు సిబ్బందిని సమకూర్చినట్లు, పర్యవేక్షించినట్లు కాగితాలపై చూపించారు. ఈ ప్రాజెక్టుతో సంబంధం ఉన్న టెరాసాఫ్ట్, ఇతర కంపెనీలకు చంద్రబాబు ప్రభుత్వం ఏకంగా రూ.284 కోట్లు విడుదల చేసింది. నకిలీ ఇన్వాయిస్‌లతో ఆ నిధులను కొల్లగొట్టి కనుమూరి కోటేశ్వరరావు ద్వారా అక్రమంగా తరలించారు. వాటిలో రూ.144 కోట్లను షెల్ కంపెనీల ద్వారా తరలించారు. నాసిరకమైన పనులతో ప్రభుత్వ ఖజానాకు రూ.119.8 కోట్ల నష్టం వాటిల్లిందని నిగ్గు తేలింది.

నగర వార్తలు

'కాశీయాత్ర'లో సరళమైన భాష



కవాడిగూడ: గద్దర్ ప్రాంగణం(ఎన్టీఆర్ స్టేడియం)లో నిర్వహిస్తున్న 36వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌కు పుస్తక ప్రియులు పోటెత్తుతున్నారు. హైదరాబాద్ జాతీయ పుస్తక ఫెయిర్ ఆధ్వర్యంలో రవ్వ శ్రీహరి వేదికపై మామిడాల వినోద్ రచించిన వారణాసి పుస్తకాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ కథకుడు, అనువాదకుడు రూప్ కుమార్ మాట్లాడుతూ.. వారణాసి ఒకప్పుడు ఉద్యమాల పురిటిగడ్డ అని రచయిత కొత్తగా చెప్పిన తీరు బాగుందన్నారు. అనంతరం కవి, రచయిత సీహెచ్ రాంబాబు మాట్లాడుతూ.. కాశీయాత్ర చేసినంత సులువుగా ఈ పుస్తకంలో భాషా ప్రయోగం జరిగిందన్నారు. కార్యక్రమంలో పుస్తక రచయిత మామిడాల వినోద్, కవి ఆశారాజు, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి రియల్టీ

మండే ఎండల్లో చల్లగా!





సాక్షి, హైదరాబాద్: వేసవి కాలం రాకముందే ఎండ మండిపోతుంది. బయటే కాదు ఇంట్లో ఉన్నా ఎండ వేడి తగులుతుంది. అసలు ఇంటి పైకప్పు ఉందా లేదా అన్నట్టుగా ఉంటుంది ఇంట్లో వేడి. సాధారణ సీలింగ్ ఉన్న ఇంట్లో అయితే ఈ వేడిమి తీవ్రత మరింత ఎక్కువే. దీనికి పరిష్కారం చూపించి.. మండు వేసవిలో ఇంటిని చల్లగా మార్చేస్తుంది 'ఫాల్స్ సీలింగ్'!

గదిలో ఆహ్లాదభరిత వాతావరణం ఏర్పర్చడమే ఫాల్స్ సీలింగ్ ప్రధాన ఉద్దేశం. అలసిన మనసు, శరీరానికి సాంత్వన చేకూర్చడమే. ఫాల్స్ సీలింగ్‌తో ఇంట్లోని వాతావరణాన్ని అందంగా, ఆహ్లాదంగా మార్చుకోవటమే కాకుండా సాధారణ ఇంటి పైకప్పును డైమండ్, చతురస్రం, గోళాకారం వంటి విభిన్న ఆకృతుల్లో అందంగా తీర్చిదిద్దుకోవచ్చు కూడా.

వర్ణాల ఎంపిక ఇలా..

- గోడ రంగుతో పోల్చుకుంటే సీలింగ్‌కు వేసే వర్ణం తేలికగా ఉండాలి. అప్పుడు పైకప్పు తక్కువ ఎత్తులో ఉందనిపిస్తూ, విశాలంగా ఉన్న భావనను కలిగిస్తుంది. ముదురు షేడ్లను ఎంచుకుంటే పైకప్పు ఎత్తులో ఉందన్న అభిప్రాయాన్ని కలిగిస్తుంది.
- మిగతా గదులతో పోల్చుకుంటే పడకగది సీలింగ్‌నే ఎక్కువసేపు చూస్తాం కాబట్టి వర్ణాల్లో సాదాసీదావి కాకుండా నేటి పోకడలకు అద్దంపట్టేవి ఎంచుకోవాలి. మధ్యస్థం, డార్క్, బ్రౌన్ వర్ణాలు పడకగదికి చక్కగా నప్పుతాయి. ఎందుకంటే ఈ వర్ణాలు ఉత్సాహపరిచే విధంగా, స్వభావానికి అనుకూలంగా ఉంటాయి మరి.
- తాజాదనం ఉట్టిపడుతున్న లుక్ రావాలంటే మోనోక్రోమాటిక్ థీమ్‌ను ఎంచుకోవాలి. రెండు, మూడు వర్ణాలు కలిసినవి ఎంచుకుంటే మాత్రం అది పడకగది గోడలకు వేసిన రంగు కంటే తేలికగా ఉండేలా చూసుకోవాలి. అప్పుడే మీ సీలింగ్ ప్రశాంత భావనను కలగజేస్తుంది.
- గోడల రంగుకు, సీలింగ్‌కు ఒకే రకమైనవి కాకుండా.. వేర్వేరు వర్ణాల్ని కూడా వేసుకోవచ్చు. దగ్గర దగ్గర రంగులు కాకుండా, చూడగానే తేడా ఇట్టే కనిపించే వర్ణాలను ఎంపిక చేసుకోవటం మేలు. దృశ్య వ్యక్తీకరణ ప్రదేశంగా సీలింగ్‌ను వినియోగించుకోండి. ఆహ్లాదభరితమైన ఆకాశం, లేదంటే గదితో కలిసిపోయేలా ఆకట్టుకునే ఆకారాలు, వర్ణాలతో నాటకీయత కన్పించేలా అలంకరించుకోవచ్చు.

జాగ్రత్తలివే..

- ఫాల్స్ సీలింగ్ ఎంపికలో ధర కంటే నాణ్యతకే ప్రాధాన్యమివ్వాలి.
- ఫ్లోర్ నుంచి పైకప్పు మధ్య కనీసం 12 అడుగుల ఎత్తు అయినా ఉండాలి.
- ఏమరుపాటుగా ఉంటే ఫాల్స్ సీలింగ్‌తో పాటు ఎయిర్ కండిషన్ మెషీన్ కూడా పాడయ్యే అవకాశం ఉంటుంది.
- ఉడెన్ ఫాల్స్ సీలింగ్‌లో అయితే ఎలుకలతో పాటు చెదలు, పురుగులు చేరే అవకాశం ఉంది. కాబట్టి జాగ్రత్త వహించాలి.
- దుమ్ము, ధూళి చేరకుండా అప్పుడప్పుడు శుభ్రం చేయాలి.

వైద్య వృత్తిలో ఓర్పు అవసరం



నర్సింగ్ స్టాఫ్‌కు సూచనలిస్తున్న గాంధీ సూపరింటెండెంట్ రాజారావు

గాంధీఆస్పత్రి: ఓర్పుతో విధులు నిర్వహించి నిరుపేద రోగులకు మెరుగైన సేవలు అందించాలని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు నర్సింగ్ సిబ్బందికి సూచించారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగం సాధించిన 130 మంది నర్సింగ్ ఆఫీసర్లకు గాంధీ ఆస్పత్రిలో పోస్టింగ్ కేటాయించగా, వారంతా శుక్రవారం విధుల్లో చేరారు. గాంధీ చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ మంగమ్మ నేతృత్వంలో సూపరింటెండెంట్ రాజారావును కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగులకు వైద్యసేవలు అందించడం వరంగా భావించాలన్నారు. ఆస్పత్రికి వచ్చే నిరుపేద, నిరక్షరాస్యులైన రోగులకు అన్నివిధాల సహాయ, సహకారాలు అందించాలని సూచించారు. అనంతరం విధి నిర్వహణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమయ పాలన తదితర అంశాలపై చర్చించారు. గాంధీ ఆస్పత్రిలో 153 రెగ్యులర్ నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు ఖాళీ ఉండగా 130 పోస్టులు భర్తీ చేశారు. 365 మంది నర్సింగ్ ఆఫీసర్లు అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తుండగా, వారిలో సుమారు 125 మంది ఇటీవల ప్రభుత్వ ఉద్యోగం పొంది పలు జిల్లాలకు వెళ్లారు. కార్యక్రమంలో డిప్యూటీ మేరీ రోజ్‌లిన్, ఆర్ఎంఓ-1 జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గోశాలలో మంత్రి కొండా సురేఖ పూజలు

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్‌లో ప్రతిభానగర్ గోశాలలో శుక్రవారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గో పూజ నిర్వహించారు. రథసప్తమి పర్వదినంగా ఆమె గోశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులను గోవుల సంరక్షణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ నాయకులు గ్యార నాగరాజు, శివ, విష్ణు, నయీంఖాన్, ఆలయ కమిటీ సభ్యులు రమేశ్‌లు మంత్రికి స్వాగతం పలికారు.

డీహెచ్ కార్యాలయం ఎదుట మహా ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న వైద్య ఉద్యోగులు

సుల్తాన్‌బజార్: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం ఎదుట శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో మహా ధర్న జరిగింది. ధర్నాలో పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్(ఐఎన్‌టీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ధర్నా నిర్వహించామన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖపై అనుసరించిన విధానల వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఉద్యోగుల హక్కులకు భంగం కలిగించే 142 జీఓను రద్దు చేసే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ జీఓను వెనక్కి తీసుకోవడంతో పాటు, 317 జీఓను సవరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బలరాం, రాబర్ట్ బ్రూస్, వేణుగోపాల్ గౌడ్, గోవింద్‌రెడ్డి, అనిల్‌కుమార్, విజయ్‌భాస్కర్, రామలక్ష్మి, రామేశ్వరీ, కవిత, రమాదేవి, విజయ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో టీఎన్జీఓఎస్ నిరసన



కలెక్టరేట్‌లో ఉద్యోగుల నిరసన

సాక్షి, సిటీబ్యూరో: కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా కేంద్ర కమిటీ పిలుపు మేరకు టీఎన్జీఓస్ జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ కలెక్టరేట్‌లో శుక్రవారం ఉద్యోగులు మధ్యాహ్న భోజన సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా టీఎన్జీఓఎస్ ప్రతినిధులు మాట్లాడుతూ.. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, ఇన్‌కంటాక్స్ పరిమితి రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర సంస్థల ప్రైవేటీకరణ మానుకోవాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో కేంద్ర సంఘ ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, జిల్లా యూనిట్ అధ్యక్షుడు ముజీబ్, ఉపాధ్యక్షులు కస్తూరి వెంకట్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, పబ్లిసిటీ సెక్రటరీ శైలజ, జిల్లా కార్యదర్శి విక్రమ్ కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు కె.ఆర్.రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు ఉమర్ ఖాన్, కురాడి శ్రీనివాస్, నరేశ్‌కుమార్, సభ్యులు సుజాత, ఖలీద్ అహ్మద్, బొలిగిద్ద శంకర్, శ్రీధర్ నాయుడు, ముఖీమ్ ఖురేషి, సభ్యులు పాల్గొన్నారు.

హక్కుల సాధనే ధ్యేయం

సుల్తాన్‌బజార్: కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి సీపీఎస్‌ను సాధించుకుంటామని తెలంగాణ టీఎన్జీఓస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీష్ అన్నారు. ఆల్ ఇండియా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమైఖ్య, తెలంగాణ టీఎన్జీఓస్ కేంద్ర సంఘం పిలుపు మేరకు శుక్రవారం అబిడ్స్‌లోని భీమా భవన్‌లో నగర శాఖ అధ్యక్షుడు కట్కూరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జగదీష్ మాట్లాడుతూ.. టీఎఫ్ఆర్‌డీఏ చట్టాన్ని తొలగించాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగ ఖాళీను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ కేంద్ర సంఘం సహాధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ప్రచార కార్యదర్శి శైలజ, కార్యదర్శులు పాల్గొన్నారు.

తగ్గుతున్న టమోటా ధర

- నగరానికి రోజూ 100 లారీల టమోటా

సాక్షి, సిటీబ్యూరో: టమోటా ధరలు తగ్గుముఖం పట్టాయి. మార్కెట్‌కు దిగుమతులు పెరగడంతో ధరలు సామాన్యులకు అందుబాటులోకి వచ్చాయి. గత నెల రోజులుగా భగ్గుమంటున్న టమోటా ధరలను కట్టడి చేయడంలో అధికారులు విఫలం కాగా.. కొందరు వ్యాపారులు మాత్రం ధరలు పెంచుతూ వచ్చారు. జంటనగరాల అవసరాలకు సరిపడా సరుకు అందుబాటులోకి రావడంతో గుడిమల్కాపూర్, మోండా, బోయిన్‌పల్లి, మాదన్నపేట, ఎల్‌బీనగర్ మార్కెట్లలో ధరలు తగ్గాయి. హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో రూ.8 ఉండగా రిటైల్‌గా రూ.10-15 పలుకుతోంది.

డిమాండ్‌కు తగ్గ సరఫరా..

వాస్తవానికి హైదరాబాద్‌కు రోజుకు దాదాపు వంద నుంచి 120 లారీల టమోటా డిమాండ్ ఉంది. కానీ, ప్రస్తుతం మార్కెట్‌కు సరఫరా అవుతున్నది 100 లారీలు మాత్రమే. తెలంగాణ జిల్లాల నుంచి రోజుకు 30 నుంచి 40 లారీలు వస్తుండగా, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నుంచి మరో 60-70 లారీల మేరకు టమోటా దిగుమతి అవుతోంది. అయితే, నగర అవసరాలకు ఇంకా 20-30 లారీల వరకు డిమాండ్ ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

ఉద్యమాలలో సాహిత్యానిది కీలక పాత్ర



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సత్యనారాయణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యమ సమయంలో సాహిత్యం కీలక పాత్ర పోషిస్తుందని తెలుగు వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ 133 తరగతి గదిలో రెండో రోజు జరిగిన తెలుగు సాహిత్య మహాసభ-2024 కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రపంచంలో జరిగిన పలు ఉద్యమాలతో పాటు తెలంగాణ సాయుధ రైతాంగా పోరాటం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర తొలి, మలి దశ ఉద్యమాలు కవిత్వంతో పాటు ఆటపాట-మాటామంతితో విరాజిల్లాయన్నారు. శుక్రవారం సాయంత్రం ఆర్ట్స్ కాలేజీ ఎదట జరిగిన కవితా పొద్దు కార్యక్రమంలో ఓయూ ప్రొఫెసర్ కాశీం అధ్యక్షత వహించగా ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, విరసం అధ్యక్షుడు అరసవెల్లి కృష్ణ, ఏపూరి సోమన్న, భూపతి వెంకటేశ్వర్లు పాల్గొని కవిత్వం చెప్పారు.

క్లుప్తంగా...

రైతులను మోసగిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్

సాక్షి,హైదరాబాద్: బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రైతులను మోసం చేస్తున్నాయని ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్ చైర్మన్ కోదండరెడ్డి ఆరోపించారు. శుక్రవారం టీపీసీసీ కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్‌రెడ్డితో కలిసి ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రైతులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతున్న రైతులపై ప్రభుత్వం దౌర్జన్యం చేస్తోందని మండిపడ్డారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిందని, ఏ రైతు కూడా బజారున పడలేదన్నారు. మోదీ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఇందిరా పార్కు ధర్నాచౌక్ వద్ద కాంగ్రెస్ నిర్వహించిన ధర్నాకు బీఆర్ఎస్ పార్టీ నేతలు వచ్చి జెండా లూపుతూ డ్రామాలాడారని ధ్వజమెత్తారు.

కనీసం 12 స్థానాల్లో విజయమే లక్ష్యం కావాలి

- రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ



సాక్షి, హైదరాబాద్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని కనీసం 12 స్థానాల్లో విజయమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ కోరారు. ఇందుకోసం వారం రోజుల్లో రంగంలోకి దిగాలని ఆమె జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరితో కలిసి ఆమె రాష్ట్రంలోని జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మున్షీ మాట్లాడుతూ వారం రోజుల్లోగా పోలింగ్ బూత్ స్థాయి కమిటీల నియామకాన్ని పూర్తి చేయాలని సూచించారు. పార్లమెంటు అభ్యర్థుల ఎంపిక కోసం త్వరలోనే అభిప్రాయ సేకరణ జరుపుతామని పేర్కొన్నారు. ఇందుకోసం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తామని దాస్‌మున్షీ వెల్లడించారు.

కాంగ్రెస్‌లో చేరిన బొంతు, సునీతారెడ్డి

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నేత, జీహెచ్‌ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఆయన భార్య.. కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్ రెడ్డి, మరో నేత కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి, ప్రొఫెసర్ బానోత్ రమణ నాయక్‌లు కాంగ్రెస్‌లో చేరారు. శుక్రవారం గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీ సమక్షంలో వారు పార్టీలో చేరారు. ఈ నాయకులకు దీపా దాస్ కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

సీఎంను కలిసిన పట్నం, బొంతు దంపతులు

గాంధీభవన్‌లో చేరికల అనంతరం వారు సీఎం చాంబర్‌కు వచ్చి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. వారితో పాటు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి తదితరులున్నారు.

పలు పరీక్షల జీఆర్ఎల్ విడుదల చేసిన టీఎస్‌పీఎస్సీ

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగాల భర్తీ ప్రక్రియను టీఎస్‌పీఎస్సీ వేగిరం చేసింది. ఇటీవల గ్రూప్–4 ఉద్యోగాలకు సంబంధించి పరీక్షలు రాసిన అభ్యర్థుల జనరల్ ర్యాంకింగ్ లిస్టు (జీఆర్ఎల్)ను విడుదల చేసిన టీఎస్‌పీఎస్సీ.. తాజాగా మరిన్ని ఉద్యోగాలకు సంబంధించిన జీఆర్ఎల్‌ను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, హార్టికల్చర్ ఆఫీసర్, ఇంటర్ విద్యాశాఖ పరిధిలో లైబ్రేరియన్, అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, అగ్రికల్చర్ ఆఫీసర్ ఉద్యోగాలకు సంబంధించిన అర్హత పరీక్షలకు హాజరైన అభ్యర్థుల జనరల్ ర్యాంకింగ్ లిస్టులు కమిషన్ వెబ్‌సైట్‌లో ఉన్నాయి. త్వరలో ఉద్యోగాలకు షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థుల వివరాలను వెల్లడించనున్నట్లు కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సాహిత్యవేత్త 'భాగవతుల' ఇకలేరు



సాక్షి, అమరావతి : ప్రముఖ సాహిత్యవేత్త, గురజాడ కన్యాశుల్కం నాటకాన్ని ఓలి పేరుతో ఆంగ్లంలో అనువదించిన భాగవతుల వెంకట రాధాకృష్ణమూర్తి శుక్రవారం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. ఆయన స్వస్థలం అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం, దిమిలి గ్రామం. వృత్తిరీత్యా మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ అనంతరం విశాఖపట్నంలో స్థిరపడ్డారు. తెలుగు సాహిత్యంలో మంచి అభినివేశం కలిగిన గురజాడ రచనలను ఆయన ఔపోసన పట్టారు. అనారోగ్యం రీత్యా కొంతకాలంగా భాగవతుల హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతిచెందారు.

ఢిల్లీకి కాంగ్రెస్ సూట్‌కేసులు

రాహుల్ గాంధీ కోసం కాంట్రాక్టర్లు, బిల్డర్లను బెదిరిస్తున్నారు

- తెలంగాణ ఎన్నికలకు కర్ణాటక నుంచి సూట్‌కేసులొచ్చాయ్
- ఇప్పుడు తెలంగాణ నుంచి ఢిల్లీకి వెళ్తున్నాయి
- ఆరు గ్యారంటీల అమలు ఏమైంది?
- బీఆర్ఎస్, కేసీఆర్ అక్రమాలపై రాష్ట్ర సర్కార్ చర్యలేవీ?

కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి సూటిప్రశ్నలు

సాక్షి, హైదరాబాద్



విజిలెన్స్‌తో అయ్యేది లేదు.. పోయేది లేదు

కాంగ్రెస్‌పార్టీ ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడం పక్కన పెట్టి ఢిల్లీకి సూట్‌కేసులు మోస్తోందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. రాహుల్ గాంధీ కోసం రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్‌కాంట్రాక్టర్లు, బిల్డర్లు, కంపెనీలను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు కర్ణాటక నుంచి సూట్‌కేసులు వస్తే.. ఇప్పుడు తెలంగాణ నుంచి ఢిల్లీకి వెళ్తున్నాయని విమర్శించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వెల్లాల రామ్మోహన్ తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. వారికి కిషన్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు కావడం లేదని ఆరోపించారు. ''కాంగ్రెస్‌ది భస్మాసుర హస్తం.. చెయ్యి గుర్తుకు ఓటేస్తే.. అదే చెయ్యిని ప్రజల తలపై పెట్టి మోసం చేస్తుందని''ఇప్పుడు మరోసారి రుజువైందని ధ్వజమెత్తారు. ''దేశ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టిన పీవీ నర్సింహారావును మోదీ ప్రభుత్వం గౌరవించింది. పీవీ చనిపోతే.. ఆయన పార్థివ దేహాన్ని ఏఐసీసీ ఆఫీసులోకి రానివ్వకుండా హైదరాబాద్‌కు పంపిన చరిత్ర కాంగ్రెస్‌ది అని అన్నారు.

విజిలెన్స్‌తో అయ్యేది లేదు.. పోయేది లేదు

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ దొందూ దొందేని కిషన్‌రెడ్డి విమర్శించారు. 'ఈ రెండూ అవినీతి, కుటుంబ పార్టీలే. ఇవి మజ్లిస్‌పంచన చేరి బుజ్జగింపు రాజకీయాలు చేస్తాయి. కాంగ్రెస్ కూడా అవినీతి పార్టీనే కాబట్టి బీఆర్ఎస్, కేసీఆర్‌పై దర్యాప్తు చేసేందుకు కాంగ్రెస్‌ప్రభుత్వానికి ధైర్యం లేదు. సీబీఐతో విచారణ జరిపించాలని మేము డిమాండ్ చేస్తే.. విజిలెన్స్ పేరుతో కాలయాపన చేస్తోంది. విజిలెన్స్‌తో అయ్యేది లేదు.. పోయేది లేదు. గత బీఆర్ఎస్‌ప్రభుత్వం కాంట్రాక్టర్లకు నిధులు ఇవ్వకుండా వారు జీహెచ్‌ఎంసీ ముందు ధర్నా చేసే దుర్మార్గ స్థితికి తీసుకువస్తే.. కాంగ్రెస్‌ప్రభుత్వం దాన్ని మరింత దిగజార్చనుంది. హైదరాబాద్‌నుంచి రాష్ట్రానికి పెద్ద మొత్తంలో ఆదాయం వస్తున్నా.. జీహెచ్‌ఎంసీకి నిధులు ఇవ్వడం లేదు'' అని కిషన్ రెడ్డి మండిపడ్డారు.

మోదీతోనే తెలంగాణ అభివృద్ధి...

గత తొమ్మిదిన్నరేళ్లలో మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిధులు ఇస్తోందని కిషన్ రెడ్డి వివరించారు. 'రూ.400 కోట్లతో చర్లపల్లి, రూ.720 కోట్లతో సికింద్రాబాద్, రూ.450 కోట్లతో కాచిగూడ, రూ.350 కోట్లతో నాంపల్లి రైల్వే స్టేషన్లను మోదీ ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందన్నారు. భద్రాద్రి అభివృద్ధికి రూ.50 కోట్లు కేంద్రం ఇచ్చిందని, వరంగల్‌రామప్ప దేవాలయానికి మోదీ కృషితో యునెస్కో గుర్తింపు వచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణలో రూ.లక్షా 20 వేల కోట్ల విలువైన రహదారుల నిర్మాణం జరిగిందన్నారు. హైదరాబాద్ చుట్టూ రూ.26 వేల కోట్ల ట్రిపుల్‌ఆర్‌రోడ్డును మోదీ మంజూరు చేశారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్‌హయాంలో ఎంపీలు, మంత్రులు అవినీతి ఆరోపణలతో, కుంభకోణాలతో జైలుకు వెళ్లారని, తొమ్మిదిన్నర ఏళ్ల మోదీ పాలనలో ఒక్క రూపాయి అవినీతి జరగలేదని గుర్తు చేశారు. వచ్చే 25 ఏళ్లలో ప్రపంచ దేశాలకు విశ్వగురువుగా భారత్‌ను నిలబెట్టాలని ప్రధాని పిలుపునిచ్చారనీ అందులో భాగస్వామ్యమయ్యేందుకు మనం సిద్ధమవ్వాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

నారాయణగూడలో రూ.2.70 కోట్లతో లగ్జరీ ఫ్లాట్లు

- తాజాగా వెలుగులోకి వచ్చిన శివబాలకృష్ణ కొనుగోళ్లు
- ఆధారాలు లభించడంతో కన్‌స్ట్రక్షన్ కంపెనీకి నోటీసులు
- రూ.2.70 కోట్లు సీజ్ చేసిన ఏసీబీ

సాక్షి, హైదరాబాద్: హెచ్‌ఎండీఏ టౌన్ ప్లానింగ్ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ అక్రమార్జనతో కూడబెట్టిన ఆస్తుల చిట్టాను ఒక్కొక్కటిగా ఏసీబీ అధికారులు విప్పుతున్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఇప్పటికే శివబాలకృష్ణ హైదరాబాద్ పరిసరాలతోపాటు పలు జిల్లాల్లో బినామీల పేరిట కొనుగోలు చేసిన 200ఎకరాలపైగా వ్యవసాయ భూములను కనుగొన్నారు. ఇప్పుడు మరిన్ని స్థిరాస్తులపై ఆరా తీస్తున్నారు. తమ కస్టడీలో శివబాలకృష్ణ నుంచి సేకరించిన వివరాలతో పాటు సోదాల్లో భాగంగా స్వాధీనం చేసుకున్న ఆస్తుల పత్రాలను విశ్లేషించిన ఏసీబీ అధికారులు సదరు నిందితుడు నారాయణగూడలో శ్రీ కృష్ణ కన్‌స్ట్రక్షన్స్ వద్ద రూ.2.70 కోట్లు చెల్లించి రెండు లగ్జరీ ఫ్లాట్లు కొనుగోలు చేసినట్టు నిర్ధారించారు. దీంతో శ్రీ కృష్ణ కన్‌స్ట్రక్షన్స్ వద్దనున్న రూ.2.70కోట్లను శుక్రవారం ఏసీబీ సీజ్ చేసినట్టు తెలిసింది. ఇప్పటికే ఆ కంపెనీకి నోటీసులు ఇచ్చిన ఏసీబీ అధికారులు, ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు రాబట్టారు. 2021 నుంచి 2022 వరకు విడతల వారీగా ఆ సంస్థకు రూ.2.70కోట్లు చెల్లించినట్లు గుర్తించారు. బినామీల పేరుతో శివబాలకృష్ణ ఈ ఫ్లాట్లను రిజిస్ట్రేషన్ చేసేందుకు యత్నించారని ఏసీబీ దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. శివబాలకృష్ణ ఇంకా ఎక్కడెక్కడ ఏయే స్థిరాస్తులు కొనుగోలు చేశాడన్న దానిపై అధికారుల దర్యాప్తు కొనసాగుతోంది.

అధిక దిగుబడులే లక్ష్యం కావాలి

- అందుకు వ్యవసాయంలో నూతన పద్ధతులు పాటించాలి
- ఎగ్జిబిషన్లు, సదస్సులు రైతు వేదికల్లో ఏర్పాటు చేయాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఏజీవర్సిటీ: అధిక దిగుబడులే లక్ష్యంగా వ్యవసాయంలో నూతన పద్ధతులు పాటించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. వ్యవసాయ సాంకేతికత పరిజ్ఞానం వినియోగం విషయంలో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలని సూచించారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలో సీఐఐ ఆధ్వర్యంలో అగ్రిటెక్ సౌత్ 2024– అగ్రివిజన్ 2024 సదస్సును నిర్వహించారు. ఈ సదస్సును ప్రారంభించిన మంత్రి అక్కడే సీఐఐ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు, ఎగ్జిబిషన్లు నగరాలు, పట్టణాల్లో కాకుండా మండల స్థాయిలోని రైతు వేదికల్లో ఏర్పాటు చేసి రైతుల వద్దకు నేరుగా నూతన పరిజ్ఞానాన్ని తీసుకెళ్లాలని కోరారు. నూతన ఆవిష్కరణలు నేరుగా రైతులకు ప్రయోజనం కలిగేలా ఉండాలని తుమ్మల చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కొన్ని నిబంధనలు రైతులకు నష్టం చేకూర్చే విధంగా ఉన్నాయని ఆరోపించారు. వ్యవసాయ కార్యదర్శి రఘునందన్‌రావు మాట్లాడుతూ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయరంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,(ఏఐ) రిమోట్ సెన్సింగ్ రోబోటిక్స్, వివిధ డిజిటల్ టూల్స్‌తో సీఐఐ తెలంగాణ విభాగం రాష్ట్రంలో వ్యవసాయాన్ని విప్లవాత్మకం చేయడంపై ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేసింది.కార్యక్రమంలో సీఐఐ తెలంగాణ చైర్మన్ సీఎండీ శేఖర్‌రెడ్డి, అమెరికాలోని వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ రోని, వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి గోపి, ఉద్యానశాఖ డైరెక్టర్ అశోక్‌రెడ్డి, సీఐఐ అగ్రిటెక్ సౌత్ 2024 స్టీరింగ్ కమిటీ చైర్మన్ ప్రవీణ్‌రావు పాల్గొన్నారు.

కామారెడ్డి వైద్య సిబ్బంది సస్పెన్షన్ రద్దు

- రోగుల్ని ఎలుకలు కరవడంపై త్రిసభ్య కమిటీ విచారణ
- వైద్య సిబ్బంది నిర్లక్ష్యం లేదని కమిటీ నివేదిక

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులను ఎలుకలు కరిచిన సంఘటనకు బాధ్యుల్ని చేస్తూ ఇద్దరు వైద్యులు, ఒక స్టాఫ్ నర్సుపై డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఈ నెల 11న విధించిన సస్పెన్షన్‌ను రద్దు చేస్తూ డీఎంఈ అధికారిణి బి.త్రివేణి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆస్పత్రిలో ఈనెల 10న రోగులను ఎలుకలు కరిచిన సంఘటన తెలిసిందే. ఈ సంఘటనపై ఈనెల 13న డీఎంఈ త్రిసభ్య కమిటీ విచారణ చేపట్టింది. కమిటీ సమర్పించిన నివేదికను నిశితంగా పరిశీలించిన తర్వాత.. సస్పెండైన వైద్యులు వసంత్ కుమార్, కావ్య, స్టాఫ్ నర్సు మంజుల విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం చూపలేదని నిర్ధారణ కావడంతో సస్పెన్షన్‌ను రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ మేరకు ఈ ముగ్గురు ఆస్పత్రిలోనే యధావిధిగా విధుల్లో చేరాలని, ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలని ఆస్పత్రి సూపరింటెంటెంట్‌ను ఆదేశించారు. ఎలుకలు రావడానికి అసలు కారణం పారిశుధ్య కాంట్రాక్టర్ నిర్లక్ష్యమేనని త్రిసభ్య కమిటీ తేల్చింది. ఈ మేరకు కాంట్రాక్టర్‌కు షోకాజ్ నోటీసును జారీ చేశారు.

'యాదాద్రి' ప్లాంట్ పనులు త్వరగా పూర్తిచేయండి

- సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి



సాక్షి, హైదరాబాద్: యాదాద్రి థర్మల్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి నిర్దేశించుకున్న గడువు నాటికి 1,600 (2 x 800) మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. శుక్రవారం డా. బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ పనుల పురోగతిపై ఆయన సమీక్షించారు. స్టేజీ–1లోని రెండు యూనిట్లు, స్టేజీ–2లో నిర్మిస్తున్న మూడు యూనిట్ల పురోగతి పనుల గురించి ఆరా తీశారు. స్టేజీ–1లో నిర్మిస్తున్న రెండు యూనిట్లకు సంబంధించి ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో ఉండి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. బొగ్గు రవాణా కోసం రైల్వే లైన్ నిర్మాణం పనులను కూడా సమీక్షించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు 75 శాతం రైల్వే లైన్ పనులు పూర్తయ్యాయని, మిగతా 25 శాతం పనులు పూర్తి కావడానికి ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు జెన్‌కో అధికారులు వెల్లడించారు. మూడేళ్లుగా జరిగిన పనుల పురోగతి గురించి జెన్‌కో అధికారులు సమావేశంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పర్యావరణ అనుమతులు వచ్చిన తర్వాత యుద్ధ ప్రాతిపదికన నిర్ణీత కాలంలో పనుల పూర్తికి ప్రణాళికలు రూపొందించాలని భట్టి ఆదేశించారు. సమావేశంలో ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సయ్యద్ అలీ మూర్తజా రిజ్వీ, టీఎస్‌ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ, డిప్యూటీ సీఎం సెక్రటరీ కృష్ణ భాస్కర్, జెన్‌కో డైరెక్టర్లు సచ్చిదానందం, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రావెల్ ఎక్స్‌పో–2024 లక్కీడిప్ విజేతల ప్రకటన



సాక్షి, హైదరాబాద్: ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 45 రోజుల పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించిన ట్రావెల్ ఎక్స్‌పో–2024కు అనూహ్య స్పందన లభించింది. ఈ నేపథ్యంలో కూకట్‌పల్లిలోని ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ పక్కనే ఉన్న ఓ హోటల్‌లో శుక్రవారం లక్కీ డిప్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తనికెళ్ల భరణి చేతుల మీదుగా 10 మంది లక్కీడిప్ విజేతలను ప్రకటించారు. మొదటి ఐదుగురు విజేతలకు యూరప్, దుబాయ్, చార్‌ధామ్, షిమ్లా, మనాలి, కశ్మీర్ ట్రిప్‌ని ఉచితంగా అందించారు. మొదటి విజేతగా ఎస్.రఘునాథరావు, రెండవ విజేత సి.వి.ఎస్.సాయినాథ్, మూడవ విజేత మూర్తిరెడ్డి, శేఖర్ రెడ్డి, నాల్గవ విజేత నీలి అశోక్‌కుమార్, ఐదవ విజేతగా సీహెచ్ లక్ష్మీదేవిని ప్రకటించారు. అలాగే తిరుమల తిరుపతి దర్శనానికి సంబంధించిన ప్యాకేజీ విజేతలుగా గుజ్జ గంగారావు, కె.శశిరేఖ, వెంపటి రాధాకృష్ణ, ఎస్.నరసింహులు, ఉల్లి విజయ్‌కుమార్‌లను ప్రకటించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కస్టమర్లకు, శ్రేయోభిలాషులకు, మీడియా ప్రతినిధులకు ఆర్‌వీ సంస్థ అధినేత ఆర్‌వీ రమణ కృతజ్ఞతలు తెలిపారు.

గొర్రెల సరఫరాలో అంతా గోల్‌మాల్

- కోట్లలో లెక్కలు చూపించి... ఫైల్స్ కాల్చేశారు: మల్లు రవి



సాక్షి, న్యూఢిల్లీ: గత ప్రభుత్వ హయాంలో యాదవులకు గొర్రెల సరఫరాలో అంతా గోల్‌మాల్ జరిగిందని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి ఆరోపించారు. గొర్రెలు తరలించామని కోట్లలో లెక్కలు చూపించి.. తరువాత ఆ ఫైల్స్ కాల్చేశారని దుయ్యబట్టారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాగ్ రిపోర్ట్ చూస్తే ఆ ఫైల్స్ ఎందుకు కాల్చేశారో అర్థమవుతుందన్నారు. మాజీ ముఖ్యమంతి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులకు ప్రజలు ఇప్పటికే శిక్ష వేశారని, ఇప్పటికైనా చేసిన తప్పులను సరిదిద్దుకోవాలని హితవు పలికారు. బీఆర్ఎస్ నేతల వైఖరి ఇదేవిధంగా ఉంటే లోక్‌సభ ఎన్నికల్లో రెండు, మూడు సీట్లు కూడా రావని ఎద్దేవా చేశారు. ఒక రహస్య ఎజెండాతో ముందుకువెళ్తున్న బీజేపీ, బీఆర్ఎస్ వచ్చే ఎన్నికల్లో కలిసి పోటీచేసే అవకాశం ఉందని అన్నారు. కాళేశ్వరం బీఆర్ఎస్‌కు ఏటీఎంగా మారిందని గతంలో ఆరోపించిన ప్రధాని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం అవినీతిపై గతంలో రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రధానికి ఫిర్యాదు చేసినా ఎందుకు విచారణ జరపలేదని మల్లు రవి నిలదీశారు.

కులగణన తీర్మానంతో బీసీల్లో ఆత్మవిశ్వాసం

సాక్షి, హైదరాబాద్: కులగణనకు అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానించడం బీసీల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ గౌడ్ అన్నారు. ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రకటించిన బీసీ మేనిఫెస్టోకి కట్టుబడి ఉందన్నారు. బీసీలకు రానున్న రోజుల్లో విద్య, వైద్య ఉపాధి, రాజకీయ రంగాల్లో అవకాశాలు వస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో కుల గణన తీర్మానం దేశంలోనే చారిత్రక నిర్ణయమని కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ కులగణనతో కుల జనాభాపై స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు.

బీజేపీతో పొత్తు ఉన్నా మల్కాజ్‌గిరి మాదే

- మల్లారెడ్డి



సాక్షి, హైదరాబాద్: మల్కాజిగిరి లోక్‌సభ స్థానాన్ని తన కుమారుడు భద్రారెడ్డికి కేటాయించాలని బీఆర్ఎస్ అధిష్టానాన్ని కోరుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి శుక్రవారం అసెంబ్లీ ఆవరణలో పలు కీలక వ్యాఖ్యలు చేశారు. మల్కాజిగిరి టికెట్ తన కుమారుడికి భద్రంగా ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీకి బీజేపీతో లోక్‌సభ ఎన్నికల్లో పొత్తు ఉంటుందట కదా అని విలేకరులు ప్రశ్నించగా 'బీజేపీతో పొత్తు ఉన్నా మల్కాజిగిరి బీఆర్ఎస్ టికెట్ మాకే వస్తుంది'అని వ్యాఖ్యానించారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తన అల్లుడైనా తమది, వారిది వేర్వేరు కుటుంబాలుగా పరిగణించాలన్నారు. అందరూ ఒకే కుటుంబానికి చెందినవారే అనే వాదనలో పసలేదని, కోమటిరెడ్డి సోద రులు, గడ్డం వివేక్ సో దరులు ఒకే కుటుంబానికి చెందినవారని, తమకు అలాంటి వాదన వర్తించదని పే ర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమతో టచ్ లో ఉన్నారని బీజేపీ ఎంపీ బండి సంజయ్ చేసిన వ్యా ఖ్యలను ఆయన కొట్టిపారేశారు. 'సంజయ్‌తో అ య్యేది లేదు, పొయ్యేది లేదు'అని వ్యాఖ్యానించా రు. తమ యూనివర్సిటీలో అక్రమ కట్టడాలు ఉంటే ప్రభుత్వం చర్యలు తీసుకోవచ్చని, కక్ష సాధించాలనుకుంటే మాత్రం తాను చేసేదేమీ లేదన్నారు.

బీజేపీతో టచ్‌లో బీఆర్ఎస్ నేతలు

▶ మొదటి పేజీ తరువాయి

చేర్చుకునేది లేదని మోదీ తెగేసి చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని ఆయన బహిరంగంగానే చెప్పారు. బీజేపీకి సొంతంగానే 400 సీట్లు రాబోతున్నాయి. కేసీఆర్ అవినీతిని వ్యతిరేకించే వాళ్లు, బీజేపీ సిద్ధాంతాలు, మోదీ నాయకత్వంపై నమ్మకం ఉన్నోళ్లు ఎవరు వచ్చినా పార్టీలోకి స్వాగతిస్తాం. అవినీతిపరులను మాత్రం రానీయం. ఇది మోదీ విధానం.

కాంగ్రెస్ పార్టీని ప్రజలు బహిష్కరించబోతున్నారు

కేసీఆర్ పాలనకు, కాంగ్రెస్ పాలనకు తేడా ఏమీ లేదని ప్రజలు గ్రహించారు. ఈసారి బీజేపీకి ఓటేయాలనే నిర్ణయానికి వచ్చారు. బీజేపీ వైపు రాముడున్నాడు.. నరేంద్రమోదీ ఉన్నాడు..కాంగ్రెస్, బీఆర్ఎస్ వైపు రజకార్లున్నరు..ఎంఐఎం నేతలున్నరు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని బహిష్కరించిన కాంగ్రెస్ పార్టీని దేశ ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో బహిష్కరించబోతున్నరు. బీఆర్ఎస్ అవినీతిపై కళ్ల ముందు ఇన్ని ఆధారాలున్నా కేసీఆర్, అప్పటి మంత్రులు, బాధ్యులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు కేసులు పెట్టడం లేదు? ఎన్నికలకు ముందు కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపిస్తామని చెప్పిన కాంగ్రెస్ ఎందుకు మాట తప్పుతోంది? సిట్టింగ్ జడ్జితో విచారణ సాధ్యం కాదని చీఫ్ జస్టిస్ తేల్చిన తరువాత కూడా సీబీఐతో విచారణను ఎందుకు కోరడం లేదు? బీజేపీ అధికారంలోకి వచ్చి ఉంటే కేసీఆర్, కేటీఆర్‌ను జైల్లో వేసి, వాళ్ల ఆస్తులు జప్తు చేసే వాళ్లం..' అని సంజయ్ అన్నారు.

కాంగ్రెస్, బీజేపీ మధ్యే ప్రధాన పోటీ

'తొలిదశ ప్రజాహిత యాత్రకు మంచి స్పందన లభించింది. ఈనెల 25 నుంచి మలి విడత యాత్రను కొనసాగిస్తాం. మధ్యలో మూడురోజుల పాటు (ఈ నెల 20 నుంచి) రాష్ట్ర నాయకత్వ ఆదేశాల మేరకు బస్సు యాత్రల్లో పాల్గొంటాం. తెలంగాణలో 17కు 17 ఎంపీ స్థానాలు గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. హైదరాబాద్ పార్లమెంట్‌లో బోగస్ ఓట్లు ఏరివేస్తే ఈసారి అక్కడ గెలుపు బీజేపీదే. బీఆర్ఎస్‌కు ఒక్కసీటు కూడా దక్కే పరిస్థితి లేదు. కాంగ్రెస్, బీజేపీ మధ్యే ప్రధాన పోటీ ఉంటుంది..'అని సంజయ్ చెప్పారు.

మంథనిలో నెగ్గిన అవిశ్వాసం

ఇబ్రహీంపట్నంలో వీగిన తీర్మానం



మాట్లాడుతున్న ప్రిసైడింగ్ అధికారి అనంతరెడ్డి, కమిషనర్ రవీంద్రసాగర్

మంథని/ఇబ్రహీంపట్నం: పెద్దపల్లి జిల్లా మంథనిలో బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్‌పై తొమ్మిది మంది కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గింది. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ డివిజనల్ అధికారి హనుమా నాయక్ ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా 9 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా చేతులు ఎత్తడంతో అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీవో ప్రకటించారు.

'పట్నం'లో వీగిపోయిన అవిశ్వాసం

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి(కాంగ్రెస్)పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. స్రవంతిపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని 15 మంది బీఆర్ఎస్, ఇద్దరు బీజేపీ సభ్యులతో కలిపి 17 మంది కౌన్సిలర్లు జనవరి 8న నోటీసులు ఇచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆర్డీఓ అనంతరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవిశ్వాస సమావేశానికి చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్మన్ ఆకుల యాదగిరితోపాటు సభ్యులంతా గైర్హాజరయ్యారు. ఉదయం 11 గంటల నుంచి 11.30 వరకు, ఆ తదుపరి మరో అవకాశం కల్పిస్తూ మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.30 వరకు ప్రిసైడింగ్ అధికారి అనంతరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ సభ్యుల కోసం నిరీక్షించారు. అయినప్పటికీ ఎవరూ హాజరవ్వలేదు.

అవిశ్వాసం వీగిపోయింది: ప్రిసైడింగ్ అధికారి

అవిశ్వాస సమావేశానికి నోటీసులిచ్చిన సభ్యులెవరూ హాజరుకాలేదని.. దీంతో ఓటింగ్ జరగలేదని ప్రిసైడింగ్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. అనంతరం ఆయన చైర్‌పర్సన్ కప్పరి స్రవంతిపై పెట్టిన అవిశ్వాసం వీగిపోయిందని ప్రకటించారు.

ఆ భూములు అటవీ శాఖవే

- సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం పిటిషన్
- 'భూపాలపల్లి భూముల'పై తీర్పు రిజర్వు చేసిన జస్టిస్ సుందరేశ్ ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: భూపాలపల్లిలో వివాదాస్పద భూములు అటవీ శాఖవేనని తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది. భూములు మావే అంటున్న ప్రైవేటు వ్యక్తి సీలింగ్ సమయంలో ఎందుకు వెల్లడించలేదో చెప్పాలని కోరింది. భూపాలపల్లిలో 106 ఎకరాల విలువైన భూములు మావేనంటూ మహమ్మద్ అబ్దుల్ ఖాసీం తదితరులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు తొలుత ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికీ రివ్యూ పిటిషన్ సమయంలో ఖాసీంకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ ఆదేశాలు సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఖాసీం తరపు సీనియర్ న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ వాదనలు వినిపిస్తూ.. క్లయింటు కుటుంబ సభ్యులకు ఆ ప్రాంతంలో 700 ఎకరాలుందని.. 106 ఎకరాలు క్లయింటువేనని ధర్మాసనానికి వివరించారు. క్లయింటు పేరు మీదే రెవెన్యూ రికార్డులు కూడా ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి, న్యాయవాది కరణం శ్రావణ్‌కుమార్‌లు వాదనలు వినిపిస్తూ... ప్రైవేటు వ్యక్తివే భూములనుకుంటే సీలింగ్ సమయంలో ఆ వివరాలు ఎందుకు వెల్లడించలేదో చెప్పాలని కోరారు. నాడు ప్రకటించని వ్యక్తులు ఇపుడు తమవేనని ఎలా అంటారని ప్రశ్నించారు. 106 ఎకరాలు ప్రైవేటు వ్యక్తివేనని జిల్లా కలెక్టర్ నివేదిక ఇచ్చినప్పటికీ పూర్తిగా పరిశీలించి ఆ భూములు అటవీ భూములని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నివేదిక ఇచ్చారని వివరించారు. ఆ భూములు రిజర్వు ఫారెస్టుగా నోటిఫై చేశారని తెలిపారు. హైకోర్టు కూడా రివ్యూ అప్లికేషన్‌లో తప్పులు ఏమైనా ఉంటే చూడాలి కానీ మొత్తం తీర్పునే మార్చడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది.

మద్యం కేసులో కవిత పిటిషన్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ వాయిదా వేసింది. ఈ కేసులో ఈడీ తనపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా చూడాలని ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్, అభిషేక్ బెనర్జీ, నళిని చిదంబరం దాఖలు చేసిన పిటిషన్లు.. జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ పంకజ్ మిట్టల్‌లతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చాయి. రిట్ పిటిషన్లలో ఎలాంటి మధ్యంతర ఆదేశాలు లేవని, మరోవైపు పిటిషన్లన్నీ ఎందుకు జత చేశారో అర్థం కావడం లేదని జస్టిస్ త్రివేది పేర్కొన్నారు. అందరి సమస్య ఒకటేనని కవిత తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తెలిపారు. సమస్యలన్నీ వేర్వేరుగా కన్పిస్తున్నాయని జస్టిస్ త్రివేది అభిప్రాయపడ్డారు. మార్చి 27, 2023న కవిత కేసు విచారణ సమయంలో పిటిషన్లన్నీ జత చేశారని సిబల్ గుర్తుచేశారు. అనంతరం తుది విచారణ ఫిబ్రవరి 28న చేపడతామని ధర్మాసనం తెలిపింది. అయితే అన్ని పిటిషన్లను కలిపి విచారించాలని భావించడం లేదని, వేరుగానే విచారిస్తామని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ఐఈఎస్ అధికారుల శిక్షణ ముగింపు



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహకారంతో ఎంసీఆర్ హెచ్చార్డీ ఆధ్వర్యంలో ఇండియన్ ఎకనమిక్ సర్వీస్ (ఐఈఎస్) అధికారులకు నిర్వహించిన ఇండక్షన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ (ఐటీపీ) ముగిసింది. కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన అధికారి, ఐఏఎస్ శశాంక్ గోయల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఈఎస్ అధికారులు ఆర్థిక విధానాల రూపకల్పనలో చేస్తున్న కృషి ఆర్థికాభివృద్ధిలో పారిశ్రామికీకరణ, వాణిజ్యం, సమాజంలోని అన్నివర్గాలకు చేరేలా చూడటంలో కీలకపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

సొంతంగా ఇంటి అలంకరణలో ఎదుర్కొన్న ఇబ్బందులు పిల్లల కోసం కొత్తగా ఏదైనా సృష్టించాలనే ఆలోచన రిధి ఖోస్లా జలాన్‌ని ఈ రోజు ఉన్నతంగా నిలబెట్టింది. హోమ్ డెకార్‌లో డిజైన్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా పేరొందిన రిధి పిల్లల కోసం లిటిల్ నెస్ట్ పేరుతో ఏర్పాటు చేసిన డిజైన్ స్టోర్‌తో మార్కెట్లో ఆమెను వ్యాపారవేత్తగా మార్చింది.

మన జీవితానికి మనమే డిజైనర్లం..



రిధి ఖోస్లా జలాన్

ముంబై నుంచి ఇటీవల హైదరాబాద్‌లోని ఫిక్కీ వైఎఫ్‌ఎల్‌ఓ ఏర్పాటు చేసిన సెషన్‌లో పాల్గొన్న ఈ యంగ్ ఎంట్రప్రెన్యూర్ తన జీవితాన్ని ఎలా డిజైన్ చేసుకుందో వివరించింది. 'మనలో ఉన్న అభిరుచి ఏంటో తెలుసుకుని, దానిని అమలులో పెడితే విజయం మన వెన్నంటే ఉంటుంది' అంటుందామె. స్ఫూర్తివంతమైన ఆమె మాటలు...

సాధారణ గృహిణిగా ఉన్న రిధి తన జీవితాన్ని ఈ రోజు ఉన్నత స్థితికి చేరుకోవడానికి ఎలాంటి మలుపులు తిప్పిందో వివరించింది. ఇంటీరియర్ డిజైనర్ నుండి కిడ్స్ ఫర్నీచర్ స్టోర్ యజమాని వరకు రిధి పేరొందింది.

''ఫైనాన్స్, మార్కెటింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ చేశాక పెళ్లవడంతో ముంబై వెళ్లిపోయాను. మొదటి బిడ్డ పుట్టాక నాలో తన కోసం ప్రత్యేకమైన డిజైనింగ్ రూమ్ ఉంటే బాగుంటుందనే ఆలోచన వచ్చింది. అంతేకాదు పిల్లల బట్టలు, వారికి కావల్సిన వస్తువుల విషయంలోనూ ఆలోచన పెరిగింది. అప్పుడే ఇంటీరియర్ డిజైన్‌కు సంబంధించిన కోర్సు చేయాలనుకున్నా. రెండవసారి ప్రెగ్నెంట్ అయిన టైమ్‌లోనే ఇంటీరియర్ డిజైనింగ్ కోర్సులో చేరాను. అలా ఆ అభిరుచే వృత్తిగా మారింది. నా లైఫ్‌లో ఇదొక స్పెషల్ జర్నీ అని చెప్పవచ్చు.

పిల్లల గదులను డిజైన్ చేయడం అనే నా హాబీ నన్ను చాలామందికి చేరువ చేసింది. మొదట ఈ రంగంలో పెరుగుతున్న డిమాండ్‌ను గుర్తించాను. ఫర్నీచర్, డెకార్ వస్తువుల కోసం ఎక్కడ షాపింగ్ చేయాలనే దానిపై స్నేహితులు తరచూ సలహాలు అడుగుతుండేవారు. వ్యక్తిగతంగానూ, నా స్నేహితులు పడుతున్న కష్టాన్ని గమనించినప్పుడు నా డిజైనింగ్‌లో ఎలాంటి మార్పులు ఉంటే బాగుంటుందో స్వయంగా తెలుసుకున్నాను. స్నేహితులకు సూచనలు ఇచ్చే క్రమంలో నాకూ చాలా విషయాల పట్ల అవగాహన పెరిగింది. కిడ్స్ డెకార్ బ్రాండ్‌ను ప్రారంభించడానికి ముందు మార్కెట్ పోకడలను గమనించాను. అప్పుడు 'లిటిల్ నెస్ట్' పేరుతో స్టోర్ ప్రారంభించాను. ఈ క్రియేటివ్ డిజైన్ నన్ను చాలా మందికి చేరువ చేసింది.

ముందు కుటుంబమే

నాకు అందుబాటులో ఉన్న సమాచారాన్ని, చేస్తున్న వర్క్ ప్రోగ్రెస్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తుంటాను. ఒక ప్రశ్న–సమాధానంతో సోషల్ మీడియా వీడియోను ప్రారంభించాను. ఏడాది లోపు ఐదు లక్షలకు పైగా ఫాలోవర్లకు చేరువయ్యాను. ప్రజలు కోరుకునే సమాచారాన్ని అందించడంపై పెట్టే దృష్టి నన్ను ఇంతమందికి చేరువ చేసింది. అయితే, ఇల్లే నా మొదటి ప్రాధాన్యత. ఇంటిని మేనేజ్ చేయగలగితే చాలు, బయట అన్ని పనులను సులువుగా చక్కబెట్టవచ్చు. ఇందుకు నా పిల్లల సాయం కూడా ఉంటుంది. నా బిజీ వర్క్, ప్లానింగ్ చూస్తూ పెరుగుతున్న నా పిల్లలు కూడా వారి పనులు వారు చేసుకుంటారు. నా వర్క్ వల్ల సోషల్‌గా అందరితోనూ అంతగా కలిసే సమయం ఉండదు. మొదట్లో అన్నీ బ్యాలెన్స్ చేయగలిగాను. కానీ, డెకార్ వర్క్, కంటెంట్ క్రియేటివ్‌కు ఎక్కువ టైమ్ పడుతుంది. ఇదొక డైనమిక్ జర్నీ అవడంతో నా ముందున్న మార్పులను కూడా ఉత్సాహంగా చేసుకుంటూ వెళుతున్నాను. గ్లోబల్ డిజైన్ మ్యాప్‌లో మన దేశం నుంచి నేను ఉండాలన్నది నా కల. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఎంతో మందికి చేరవయ్యాను. ఆఫ్‌లైన్‌లో వ్యక్తిగతంగా చాలా మందికి రీచ్ కావాలని కోరుకుంటున్నాను.

రెండు వారాలకు ఒకసారి..

ఎంత పని ఉన్నా రెండు వారాలకు ఒకరోజు పూర్తి విశ్రాంతి తీసుకుంటాను. నా కోసం నేను అన్నట్టుగా ఉంటాను. ఆ రోజులో ఎక్కువ సమయం బుక్స్ చదవడానికి సమయాన్ని కేటాయిస్తాను. రోజువారీ పనితో ఏ మాత్రం సంబంధం లేని పనులను చేస్తాను. దీంతో మరింత ఉత్సాహంగా మారిపోతాను'' అని తన విజయానికి వేసుకున్న బాటలను ఇలా మన ముందు ఉంచారు రిధి.

– నిర్మలారెడ్డి

అప్‌డేట్‌గా ఉంటాను..

ఇంటీరియర్ డిజైన్ స్టూడియో మెయింటెయిన్ చేయాలంటే ఎప్పుడూ అప్‌డేట్‌గా ఉండాలి. ప్రతిరోజూ నాలుగు పేజీల షెడ్యూల్‌ని వేసుకుంటాను. ఇల్లు, వర్క్ స్పేస్, అప్‌డేట్స్, నా వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేవి ప్రోత్సాహాన్ని కలిగించే కోట్స్ నోట్ చేసుకుంటాను. దీని వల్ల ప్రతిదీ ఏ రోజు కా రోజు ప్లానింగ్‌గా జరిగిపోతుంటుంది. భవిష్యత్తు గురించి అంటే మరో ఐదేళ్లలో నా ప్రాజెక్ట్స్ గ్లోబల్ లెవల్‌కి వెళ్లాలి. ప్రపంచంలోని అత్యుత్తమ డిజైన్ ఇన్‌ఫ్లుయెన్సర్‌లలో ఒకరిగా ఉండాలన్నదే నా లక్ష్యం.

ఇంటిప్స్



- తుప్పు పట్టేసిన తాళంచెవిని కిరోసిన్‌లో ముంచి తుడిస్తే కొత్తదానిలా తయారవుతుంది.
- బియ్యం పురుగు పట్టకుండా ఉండాలంటే... వాటిలో ఎండిన కాకరకాయ వేయాలి.
- చెప్పులను క్లాత్‌తో తుడిస్తే పై లేయర్ రాలిపోతుంది. షైనింగ్ తగ్గుతాయి. స్పాంజితో తుడిస్తే మంచి షైనింగ్‌తో ఎక్కువ కాలం మన్నుతాయి.
- టాల్కమ్ పౌడర్ పెద్ద టిన్ కొన్నప్పుడు పూర్తయ్యే లోపుగా వాసన తగ్గుతుంది. అలాంటప్పుడు టిన్‌ను కొద్దిసేపు ఎండలో పెడితే తిరిగి సువాసనలు వెదజల్లుతుంది.



కొత్తదారి

కెరీర్‌లో దూసుకుపోతే ఆ కిక్కే వేరు. 'అంతమాత్రాన సామాజిక బాధ్యత మరచిపోతే ఎలా' అనుకునేవారు కొద్దిమంది ఉంటారు. అలాంటి వారిలో రేఖ–రిజ్వాన్ దంపతులు ఒకరు. తాము పనిచేస్తున్న రంగాలలో మంచి పేరు తెచ్చుకున్న రేఖ–రిజ్వాన్‌లు స్వచ్ఛందసేవారంగంలోకి వచ్చారు. 'కోయిట ఫౌండేషన్' ద్వారా హెల్త్‌కేర్ రంగంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

నై'పుణ్యా' సేవ



రేఖ
రిజ్వాన్

మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్, స్టార్టప్ ఫౌండర్స్‌గా విజయపథంలో దూసుకుపోయిన రిజ్వాన్, రేఖ కోయిటలు దాతృత్వం దారిలో ప్రయాణం ప్రారంభించారు.

ఎన్నో స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేసిన రేఖకు వారు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటో తెలిశాయి. ఈ నేపథ్యంలోనే స్వచ్ఛంద సంస్థలకు సాంకేతిక సహాయం తోడైతే ఎలా ఉంటుంది అనే అంశంపై దృష్టి పెట్టింది. సాంకేతిక సహకారంతో ఎన్నో సమస్యలకు పరిష్కారాలు దొరుకుతాయనే విషయాన్ని అవగాహన చేసుకుంది.

నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్(ఎన్‌ఏబీహెచ్)లో సభ్యుడిగా ఉన్న రిజ్వాన్ డిజిటల్ హెల్త్ స్పేస్‌లో ఎన్నో ఆస్పత్రులతో కలిసి పనిచేశాడు. విలువైన అనుభవాన్ని సొంతం చేసుకున్నాడు.

'కోయిట ఫౌండేషన్' తరఫున ఐఐటీ–ముంబైలో కోయిట సెంటర్ ఫర్ డిజిటల్ హెల్త్ (కెసీడీహెచ్)ను ప్రారంభించారు.

క్లినికల్ అప్లికేషన్స్, హెల్త్‌కేర్ డాటా మేనేజ్‌మెంట్(హెల్త్‌కేర్ డాటా ప్రైవసీ, సెక్యూరిటీ), హెల్త్‌కేర్ ఎనాలటిక్స్... మొదలైన వాటిని తన ప్రాధాన్యత అంశాలుగా ఎంపిక చేసుకుంది కెసీడీహెచ్. ఆసుపత్రుల నిర్వహణ, ఆరోగ్య సంరక్షణకు సంబంధించి శిక్షణ ఇవ్వడానికి ప్రణాళికలు కూడా రూపొందించుకుంది కేసీడీహెచ్.

హెల్త్ కేర్ కెరీర్‌కు సంబంధించి యంగ్ ప్రొఫెషనల్స్‌ను ఉత్సాహపరచడం తన ప్రధాన లక్ష్యం అంటున్నాడు రిజ్వాన్. లీడింగ్ ఇంజనీరింగ్ కాలేజీలు, హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్‌లు పూనుకొని తగిన కోర్సులకు అవకాశం కల్పిస్తే తన లక్ష్యం నెరవేరడం కష్టమేమీ కాదంటాడు రిజ్వాన్.

'టాటా మెమోరియల్ సెంటర్'లో క్యాన్సర్ ఆస్పత్రులు డిజిటల్ హెల్త్‌టూల్స్‌ను ఎడాప్ట్ చేసుకోవడంలో సహాయపడటానికి 'కోయిట సెంటర్ ఫర్ డిజిటల్ ఆంకాలజీ'ని ఏర్పాటు చేశారు. ఎలక్ట్రానిక్ మెడికల్ రికార్డ్స్‌ను నిర్వహించడం అనేది ఆస్పత్రులకు సవాలుగా మారిన నేపథ్యంలో దీనికి పరిష్కార మార్గాలు కనుక్కునే దిశగా ఆలోచనలు చేస్తుంది కేసీడీహెచ్.

'మహారాష్ట్ర యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్'తో ఒప్పందం కుదుర్చుకుంది కేసీడీహెచ్. డిజిటల్ హెల్త్‌కు సంబంధించి పరిజ్ఞానం విషయంలో వైద్యులు, ఫ్రంట్‌లైన్ వర్కర్లు... మొదలైన వారికి ఈ విశ్వవిద్యాలయంలో శిక్షణ ఇస్తారు.

ఇతర రాష్ట్రాలలో కూడా ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు రూపొందించే విషయంపై చొరవ చూపుతున్నారు రిజ్వాన్–రేఖ దంపతులు.

'మెటర్నల్ హెల్త్'కు సంబంధించి ఫౌండేషన్ ఫర్ మదర్ అండ్ చైల్డ్‌హెల్త్(ఎఫ్ఎంసిహెచ్)తో కలిసి పనిచేస్తోంది కోయిట సెంటర్ ఫర్ డిజిటల్ హెల్త్. 'ఎఫ్ఎంసిహెచ్' తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని పర్యవేక్షించే లక్ష్యంగా ఏర్పడిన స్వచ్ఛంద సంస్థ. ఇందులో ప్రతి ఫీల్డ్‌వర్కర్‌కు కొన్ని కుటుంబాల పర్యవేక్షణ బాధ్యత ఉంటుంది. 'న్యూట్రీ' యాప్ ద్వారా ఫీల్డ్ ఆఫీసర్‌లకు ఇన్‌పుట్ డాటాతో ఔట్‌పుట్ డెసిషన్స్ తీసుకునే అవకాశం ఉంటుంది.

మ్యాజిక్ బస్, స్నేహా, విప్ల ఫౌండేషన్ లాంటి ఎన్నో సంస్థలతో కలిసి పనిచేస్తోంది కోయిట ఫౌండేషన్.

'చేయాల్సిన పని సముద్రమంత పెద్దదిగా ఉంది. అయినప్పటికీ చేయాలనే ఆసక్తి ఉంది' అంటుంది రేఖ.

భారీ సక్సెస్

ఢిల్లీ కేంద్రంగా వ్యాపార సంస్థను స్థాపించింది దీక్షా సింఘి. ఆమె స్థాపించిన స్టార్టప్ పేరు 'ఎ లిటిల్ ఎక్స్‌ట్రా'. వినడానికి తేలికగానే ఉంది. కానీ ఈ పేరు వెనక చాలా బరువైన కథ ఉంది. అంతకంటే బరువైన ఆవేదన ఉంది. బాల్యం నుంచి ఎదుర్కొన్న అవహేళనలే ఆమెలో అక్షరవాహినికి విషయాంశాలయ్యాయి. ఆ తర్వాత రోజూ ఏదో ఒకటి రాయకపోతే తోచని స్థితికి చేరింది. అచ్చంగా స్వచ్ఛంగా సాగే ఆమె అక్షరాలకు అభిమానులు లక్షలకు మించిపోయారు. బాడీ పాజిటివిటీ ఇన్‌ఫ్లూయెన్సర్‌గా గుర్తింపు పొందింది దీక్ష. ఆ తర్వాత ఆమె స్థాపించిన అంకుర సంస్థ అనతి కాలంలోనే విజయపథంలో దూసుకుపోవడానికి ఆమెకు ఆమే బ్రాండ్ అంబాసిడర్. ఇంతకీ ఎ లిటిల్ ఎక్స్‌ట్రా పేరుతో తయారు చేస్తున్న ఉత్పత్తి ఏమిటంటే... ఫ్యాషన్ ఆభరణాలు. ఇరవై తొమ్మిదేళ్ల దీక్షా సింఘి తన విజయగాథను ఇలా వివరించారు.

''మాది అస్సాం రాష్ట్రం, గువాహటి. చిన్నప్పటి నుంచి బొద్దుగానే ఉండేదాన్ని. తోటి పిల్లలు వేళాకోళం చేసేవారు. బోర్డింగ్ స్కూల్లో కూడా ఇదే పరిస్థితి. లావుగా ఉండడంతో పరుగెత్తలేనని వాళ్లే నిర్ణయించి ఆటల్లో కలుపుకునే వాళ్లు కాదు. పాఠశాల వార్షికోత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, నాటకాల్లో కూడా అవకాశం ఇచ్చేవారు కాదు. దుస్తులు కూడా ఆడవాళ్ల సెక్షన్‌లో నా సైజువి ఉండేవి కాదు. మగవాళ్ల సెక్షన్‌లో దొరికేవి. అబ్బాయిల దుస్తులు... పైగా వదులుగా ఉన్నవి ధరించేదాన్ని. దాంతో స్కూలు పిల్లలతో పాటు బంధువులు కూడా అల్లరి చేస్తూ టామ్‌బాయ్ అనేవాళ్లు. ఇదిలా ఉంటే లావు తగ్గడం కోసం స్విమ్మింగ్ కెళ్లాను. అక్కడి కోచ్ నా స్విమ్ సూట్ విషయంలో కొన్ని నిబంధనలు పెట్టారు. అప్పటి నుంచి స్విమ్మింగ్ మీద కూడా విరక్తి కలిగింది. ఇలాంటి అనుభవాలతో స్కూలు ముగించుకుని కాలేజ్‌లో చేరాను.

కొత్త శకం మొదలైంది!

కాలేజ్ ఎడ్యుకేషన్ కోసం 2013లో ఢిల్లీకి వచ్చాను. కాలేజ్‌లో కొత్త స్నేహితులు కలిసే లోపు బ్లాగ్ నా తొలి స్నేహితురాలయింది. బ్లాగ్ రాయడం మొదలు పెట్టిన తర్వాత నాకు తెలియకుండానే నన్ను కదిలించిన ఒక్కో సంఘటన అక్షరరూపం దాల్చింది. అందులో మానవీయ కోణాల కోసం నేను ప్రయత్నం చేసిందేమీ లేదు. కానీ నా బాల్యపు ఆవేదన నా బ్లాగ్ చదువరులను కదిలించివేసింది. నన్ను అభిమానించడం మొదలైంది. క్రమంగా బ్లాగ్‌లో నా ఆవేదనలే కాకుండా ఆలోచనలు, సమాజం గురించిన ఆందోళనలు, నా పర్యటన వివరాలను కూడా పంచుకోవడం మొదలు పెట్టాను. బాడీ షేమింగ్ ఒక వ్యక్తిని ఎంతగా బాధిస్తుందో తెలిసి వాళ్ల మనసు ద్రవించేది. కొంతమంది మహిళలు తమకూ ఇలాంటి పరిస్థితులు ఎదురయ్యాయని పంచుకునేవారు. ఈ క్రమంలో నా రచనలు దేహాకృతి కారణంగా ఎదురయ్యే మానసిక సమస్యల నుంచి సాంత్వన పొందేవిధంగా ధైర్యం చెబుతూ సాగాయి. బాడీ పాజిటివిటీ ఇన్‌ఫ్లూయెన్సర్ గా నా రచనలను ఆదరించేవారు పెరిగారు. ఇన్‌స్టాగ్రామ్‌లో నాకు లక్షకు పైగా ఫాలోవర్స్ ఉన్నారిప్పుడు.

వ్యాపార కుటుంబ నేపథ్యం

చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగమో, వ్యాపారమో చూసుకోవాల్సిన సమయంలో నేను వ్యాపారాన్నే ఎంచుకున్నాను. ఎందుకంటే మాది వ్యాపార కుటుంబం. ఏదైనా కొత్తగా చేయాలనే ఉద్దేశంతో 'ఎ లిటిల్ ఎక్స్‌ట్రా' పేరుతో ఆభరణాల తయారీ ప్రారంభించాను. మొదట ఇదే టైటిల్‌తో దుస్తుల వ్యాపారం చేయాలనుకున్నాను. కానీ దుస్తులకు సైజ్ పరిమితులుంటాయి. ఆభరణాలకు ఆ పరిమితి ఉండదు కదా! అందుకే ఆభరణాలతో మొదలుపెట్టాను. ఆభరణాలనగానే ఖరీదైన వ్యాపారం అనుకోవద్దు. చంకీ ఆభరణాలే ఎక్కువ. ఇప్పటికే మార్కెట్‌లో వందలాది ఆభరణాల తయారీదారులున్నారు. నా ఆభరణాలనే ఎందుకు కొనాలి? అంటే... నా ఆభరణాలు సందర్భాన్ని బట్టి ధరించేవిధంగా ఉంటాయి. ఉదాహరణకు నవరాత్రి సందర్భంగా పూసలతో చేసిన దుర్గాదేవి చెవి జూకాలు ధరిస్తే అందరి దృష్టి మీ చెవుల మీదే ఉంటాయి. కాదంటారా? అలాగే ఫుట్‌బాల్ మ్యాచ్ చూడడానికి వెళ్లేటప్పుడు ఫుట్‌బాల్ చెవి రింగులు, క్రికెట్ బ్యాట్ లాకెట్‌తో దండలు... ఇలాగన్నమాట. ఈ ప్రయోగాన్ని 2020 ఆగస్టులో ఐదు వేల రూపాయల పెట్టుబడితో ప్రారంభించాను. ఇప్పుడు ఐదు వందల డిజైన్లతో అరవై లక్షల టర్నోవర్‌తో వ్యాపారం సాగుతోంది. దేశంలో ఉన్న రకరకాల ఆభరణాల తయారీదారులు (కారీగారీ) నాతో కలిసి పని చేస్తున్నారు. నేను ఇచ్చిన డిజైన్‌ని ఆభరణం రూపంలో తీసుకువచ్చే అద్భుతమైన కళ వారి చేతిలో ఉంది. సందర్భానుసారంగా సేల్ అయ్యే డిజైన్‌లను రూపొందించే చురుకైన ఆలోచనలు నా బుర్రలో ఉన్నాయి. ఇదే నా సక్సెస్'' అన్నారు దీక్షా సింఘి.




దీక్షా సింఘి

సక్సెస్ స్టోరీ

వీడియోలు చేస్తే ఎంత వస్తుంది? యూట్యూబ్‌లో పెడితే ఎంత వస్తుంది? ఎంత టాలెంట్ ఉంటే అంత వస్తుంది. నితిష్ రాజ్‌పుట్‌కు నెలకు 25 లక్షలు సంవత్సరానికి ఎంత లేదన్నా 3 కోట్లు వస్తాయి. 'నాలెడ్జ్ ఈజ్ పవర్' అన్నారు. సామాజిక అంశాల పై విస్తృత సమాచారం అందిస్తూ అతడు చేసే వీడియోల వల్లే ఈ ఆదాయం. నితిష్ సక్సెస్ స్టోరీ.

వీడియో పెట్టు కోట్లు కొట్టు



నితిష్ రాజ్‌పుట్

2022లో మన దేశంలో పాన్‌మసాలా వ్యాపార లావాదేవీల మొత్తం ఎంతో తెలుసా? 43,410 కోట్లు. ఊహకు అందని భారీ వ్యాపారం. అందుకే పాన్‌మసాలా సంస్థలు తమ బ్రాండ్ పేరు జనం నాలికల మీద తద్వారా వారి పొగాకు ఉత్పత్తులు జనాల నోళ్ల లోపలకు వెళ్లాలంటే పెద్ద పెద్ద సెలబ్రిటీలతో ఎలా యాడ్స్ చేయిస్తాయో నితిష్ రాజ్‌పుట్ తన 30 నిమిషాల వీడియోలో వివరిస్తాడు. ఎలాగైతే ఆల్కహాల్ కంపెనీలు తమ బ్రాండ్ ప్రచారం కోసం మంచి నీళ్లు, మ్యూజిక్ సీడీలను తమ బ్రాండ్‌తో యాడ్స్ చేస్తాయో... పాన్ మసాలా కంపెనీలు కూడా అదే దారిలో సినిమా స్టార్స్‌ను పెట్టి లాఘవంగా 'ఇలాచీ', 'గులాబ్' అంటూ దొంగ యాడ్స్ చేస్తాయని వివరిస్తాడు. అమ్మేది మాత్రం పొగాకు ఉత్పత్తులనే అని తెలుపుతాడు. అంతేకాదు పొగాకు ఉత్పత్తుల్లో నేరుగా ప్రభుత్వం ఎలా భాగస్వామ్యం అయి ఉందో కూడా చెప్తాడు. ఇంత సవివరంగా మెయిన్ స్ట్రీమ్ మీడియా దాదాపుగా రాయదు. అందుకే నితిష్ రాజ్‌పుట్ వీడియోలకు అంత డిమాండ్.

అన్ని వైపుల సమాచారం

నితిష్ రాజ్‌పుట్ 2020లో తన పేరు మీద 'నితిష్ రాజ్‌పూట్ యూట్యూబ్ చానెల్'ను మొదలుపెట్టాడు. అందులో తనే మాట్లాడుతుంటాడు. ఏం మాట్లాడతాడు? ఒరిస్సాలో ట్రైన్ యాక్సిడెంట్‌కు కారణాలేమిటి? మణిపూర్‌లో ఏం జరుగుతోంది? ఖలిస్తాన్ ఉద్యమంలో వాస్తవం ఎంత? తాలిబన్‌లంటే ఎవరు? క్రెడిట్ కార్డ్స్‌లో మోసం ఎలా జరుగుతుంది... ఇలాంటి అంశాలతో వీడియోలు చేస్తాడు. అయితే ఇవి పైపైన చేసే వీడియోలు కాదు.దాదాపు పరిశోధనాత్మక జర్నలిజం స్థాయిలో ఉంటాయి. తీసుకున్న అంశంలో ఏదో ఒక పక్షం వహించకుండా అన్ని పక్షాల వైపు నుంచి సమాచారాన్ని రాసి పోస్ట్ చేస్తాడు. అంతే కాదు చరిత్రలో జరిగిపోయిన కొన్ని ఘటనలను కూడా వివరిస్తాడు. ఉదాహరణకు ఇజ్రాయిల్–పాలస్తీనాల మధ్య గొడవ. ఇలా ఒకటనేముంది మ్యూచువల్ ఫండ్స్ దగ్గరి నుంచి స్టాక్ మార్కెట్ పాఠాల వరకూ అన్నీ చెబుతాడు. అందుకే రెండేళ్ల కాలంలోనే అనూహ్యమైన విజయం సాధించాడు.

ఉత్తరప్రదేశ్ కుర్రాడు

నితిష్ రాజ్‌పుట్ ఉత్తర ప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ అనే చిన్న ఊళ్లో పుట్టాడు. ఇప్పుడు అతనికి 33 ఏళ్లు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో బి.టెక్. చేసి ఐ.టి. కంపెనీల్లో పని చేశాడు. కాని తనకంటూ ఒక సొంత అస్తిత్వం, ఆర్థిక అంతస్తు ఉండాలని ఆశించి 2020లో వీడియో చానల్ ప్రారంభించాడు. సగటు మనిషికి నిత్యం కనిపించే విషయాలే లోతుగా తెలియచేయడం అతడు ఎంచుకున్న ఫార్ములా. ఉదాహరణకు బిట్‌కాయిన్ కథా కమామిషు ఏమిటి అనే వీడియో చూస్తే దాని గురించి మనకు దాదాపుగా ఓ సమగ్ర అవగాహన వస్తుంది. ఎయిర్‌పోర్ట్‌లు ఎలా ఆదాయం గడిస్తాయి అనేది అతని మరో వీడియో. బాలీవుడ్‌లో భారీ సినిమాలు ఫ్లాప్ అయినా డబ్బులెందుకు వస్తున్నాయి అనేది మరో వీడియో. స్పష్టంగా, డేటా విజువల్స్‌తో మంచి ఎడిటింగ్‌తో అతను ధారగా చెప్పుకుపోతాడు.

50 లక్షల ఫాలోయెర్లు

నితిష్ రాజ్‌పుట్ యూట్యూబ్ చానల్‌కు 35 లక్షల మంది సబ్‌స్క్రయిబర్లు ఉన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టా ఇవన్నీ కలిపి మొత్తం 50 లక్షల మంది అతణ్ణి ఫాలో అవుతున్నారు. నితిష్ రాజ్‌పుట్ యూట్యూబ్‌లో ఇప్పటి వరకూ చేసిన వీడియోలకు 25 కోట్ల వ్యూస్ వచ్చాయి. ఈ వీడియోల్లో యాడ్స్ ప్లే అవుతాయి కనుక యూట్యూబ్ నుంచి అలాగే ప్రాడెక్ట్స్ ప్రమోషన్ వల్ల నెలకు అతడు 25 లక్షలు సంపాదిస్తున్నాడు. సంవత్సరానికి 3 కోట్ల ఆదాయం గడిస్తున్నాడు. రెండేళ్లల్లో సాధించిన విజయం అంటే ఆశ్చర్యమే.

సాక్షి బిజినెస్
శనివారం
17-2-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	376	72,427
నిఫ్టీ ▲	130	22,041

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	15,878	▲ 29
డోజోన్స్	38,753	▲ 20
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7712	▲ 114
డాక్స్	17,117	▲ 71
షాంఘై	2,866	▲ 36
నికాయ్	38,487	▲ 329

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	61,743	▲ 235
బంగారం (99.5 స్వచ్ఛత)	61,496	▲ 234
వెండి (కేజీ)	70,922	▲ 719

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.63	83.65
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.33	105.88
€	యూరో	ఒకటి	88.31	90.65
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.72	55.75
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.21	55.13
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.37	64.05
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.23	22.81
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	21.70	23.50
¥	చైనా యువాన్	ఒకటి	10.42	12.49

భారత్ మార్కెట్‌కు ప్రాధాన్యత

- ఇతర అవకాశాలను అన్వేషిస్తాం
- 'జీ' విలీనం రద్దు నేపథ్యంలో సోనీ

న్యూఢిల్లీ: మీడియా దిగ్గజం జీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో ప్రతిపాదిత విలీనం రద్దయిన నేపథ్యంలో ఇతర అవకాశాలను అన్వేషించనున్నట్లు జపనీస్ దిగ్గజం సోనీ తాజాగా వెల్లడించింది. దేశీ మార్కెట్లో వృద్ధి అవకాశాలరీత్యా మరొక కొత్త ప్రణాళికకు తెరతీయనున్నట్లు తెలియజేసింది. దీర్ఘకాలంలో భారీ వృద్ధికి వీలున్న దేశీ మార్కెట్లో సొంత కార్యకలాపాలకూ ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు స్పష్టం చేసింది. అత్యంత అవకాశాలున్న భారత్ మార్కెట్లో పెట్టుబడులను కొనసాగించేందుకే కట్టుబడి ఉన్నట్లు సోనీ ప్రెసిడెంట్, సీవోవో, సీఎఫ్‌వో హిరోకీ టొటోకీ పేర్కొన్నారు. వెరసి వివిధ అవకాశాలను అన్వేషించనున్నట్లు తెలియజేశారు. కొత్తగా అవకాశం లభిస్తే పాత ప్రణాళికస్థానే అమలు చేయనున్నట్లు తెలియజేశారు.



'జీ'తో ప్రతిపాదిత విలీనం రద్దయిన నేపథ్యంలో హిరోకీ భారత్ మార్కెట్లో కంపెనీ వ్యూహాలపై స్పందిస్తూ పలు అంశాలను ప్రస్తావించారు. గత పెట్టుబడుల ప్రణాళికలు లేదా ఆలోచనల్లో ఎలాంటి మార్పులూ లేవని స్పష్టం చేశారు. అయితే ప్రస్తుతానికి నిర్దిష్ట ప్రణాళికలు లేవని వెల్లడించారు. కల్వెర్ మ్యాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్(గతంలో సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్ ఇండియా) ద్వారా దేశీయంగా కార్యకలాపాలు విస్తరించనున్నట్లు హిరోకీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

'పేటీఎం పేమెంట్ బ్యాంక్' గడువు పెంపు

- మార్చి 15 వరకు పొడిగించిన ఆర్‌బీఐ
- అప్పట్లోగా వేరే బ్యాంకులకు మారాలంటూ కస్టమర్లకు సూచన
- ఎఫ్‌ఏక్యూల జారీ



ముంబై: పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ (పీపీబీఎల్) కార్యకలాపాల నిలిపివేతకు విధించిన గడువును రిజర్వ్ బ్యాంక్ 15 రోజుల పాటు పొడిగించింది. మార్చి 15లోగా పీపీబీఎల్‌లోని తమ ఖాతాలను ఇతర బ్యాంకులకు మార్చుకోవాలని కస్టమర్లకు సూచించింది. అయితే, ఆ తర్వాత కూడా సేవింగ్ బ్యాంక్, కరెంటు అకౌంట్స్, ప్రీపెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఫాస్టాగ్స్, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డులు మొదలైన వాటిలో ఉన్న బ్యాలెన్స్ మొత్తాలను ఎటువంటి ఆంక్షలు లేకుండా విత్‌డ్రా చేసుకోవచ్చని లేదా వినియోగించుకోవచ్చని పేర్కొంది. వాస్తవానికి నిబంధనల ఉల్లంఘన కారణంగా పీపీబీఎల్‌లో డిపాజిట్, క్రెడిట్ లావాదేవీలను నిలిపివేసేందుకు డెడ్‌లైన్ ఫిబ్రవరి 29తో ముగియాల్సి ఉన్నప్పటికీ కస్టమర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. కస్టమర్ల సౌకర్యార్థం పీపీబీఎల్‌తో లావాదేవీలపై గల సందేహాలను నివృత్తి చేసేందుకు ఎఫ్‌ఏక్యూలను (సాధారణంగా తలెత్తే ప్రశ్నలు, జవాబులు) కూడా రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసింది. 'మార్చి 15 తర్వాత మీరు (పీపీబీఎల్ కస్టమర్లు) మీ పేటీఎం పేమెంట్స్ బ్యాంకు ఖాతాల్లో నగదును డిపాజిట్ చేయలేరు. వడ్డీ, క్యాష్‌బ్యాక్‌లు, రీఫండ్లు మొదలైనవి జమ కావడానికి మాత్రమే అనుమతి ఉంటుంది. కాబట్టి, అసౌకర్యం కలగకుండా మార్చి 15లోగా మరో బ్యాంకుకు మారేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవడం శ్రేయస్కరం' అని ఎఫ్‌ఏక్యూలో ఆర్‌బీఐ పేర్కొంది. వాటి ప్రకారం..

- మార్చి 15 తర్వాత జీతాలు, పెన్షన్లు పీపీబీఎల్ ఖాతాల్లో జమ కావు. పీపీబీఎల్ ద్వారా ఈఎంఐలు లేదా ఓటీటీ సబ్‌స్క్రిప్షన్లు కడుతున్న వారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి.
- పీపీబీఎల్ వాలెట్ ఉన్న వారు అందులోని బ్యాలెన్స్ మొత్తం అయిపోయే వరకు మార్చి 15 తర్వాత కూడా ఉపయోగించుకోవచ్చు.
- ఫాస్టాగ్స్‌లో బ్యాలెన్స్ ఉన్నంత వరకు వాడుకోవచ్చు. కానీ మార్చి 15 తర్వాత టాప్‌అప్ చేయడానికి ఉండదు. డెడ్‌లైన్‌లోగా ఇతర బ్యాంకుల నుంచి కొత్త ఫాస్టాగ్ తీసుకోవడం మంచిది.
- పీపీబీఎల్ అకౌంట్ లేదా వాలెట్‌తో అనుసంధానమైన పేటీఎం క్యూఆర్ కోడ్, సౌండ్‌బాక్స్, పీవోఎస్ టెర్మినల్స్ ద్వారా చెల్లింపులను స్వీకరిస్తున్న వ్యాపారులు .. మరో బ్యాంకు అకౌంటు లేదా వాలెట్‌ని తీసుకోవాలి. ఇప్పటికే అవి వేరే బ్యాంకుతో అనుసంధానమై ఉంటే ఈ అవసరం ఉండదు.

ఫాస్టాగ్ నుంచి పీపీబీఎల్ తొలగింపు..

వాహనాలకు ఫాస్టాగ్‌లను జారీ చేసే బ్యాంకుల జాబితా నుంచి పీపీబీఎల్‌ను ఇండియన్ హైవేస్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఐహెచ్‌ఎంసీఎల్) తొలగించింది. హైవే యూజర్లు ఇకపై 32 అధీకృత బ్యాంకుల నుంచే వాటిని కొనుగోలు చేయాలంటూ సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ ఎక్స్‌లో పేర్కొంది. ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్‌బీఐ, యస్ బ్యాంక్, పీఎన్‌బీ మొదలైనవి ఈ లిస్టులో ఉన్నాయి. పీపీబీఎల్ కొత్త ఫాస్టాగ్‌లను జారీ చేయకుండా 2024 జనవరి 19నే ఐహెచ్‌ఎంసీఎల్ ఆంక్షలు విధించింది. దేశీయంగా 8 కోట్ల మందికి పైగా ఫాస్టాగ్ యూజర్లు ఉండగా, పీపీబీఎల్‌కు సుమారు 30 శాతం మార్కెట్ వాటా ఉన్నట్లు నేషనల్ హైవేస్ అథారిటీ (ఎన్‌హెచ్‌ఏఐ) సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. కాగా, పేటీఎం మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ తమ నోడల్ అకౌంటును పీపీబీఎల్ నుంచి యాక్సిస్ బ్యాంక్‌కి మార్చుకున్నట్లు వెల్లడించింది. కస్టమర్లు, వ్యాపారుల లావాదేవీలను సెటిల్ చేసేందుకు ఇది మాస్టర్ అకౌంటుగా ఉపయోగపడుతుంది.



గో ఫస్ట్ కోసం స్పైస్‌జెట్ అజయ్ సింగ్ బిడ్డింగ్

న్యూఢిల్లీ: దివాలా తీసిన గో ఫస్ట్ విమానయాన సంస్థను దక్కించుకునేందుకు బిడ్లు దాఖలయ్యాయి. బిజీ బీ ఎయిర్‌వేస్‌తో కలిసి స్పైస్‌జెట్ చీఫ్ అజయ్ సింగ్ బిడ్ వేశారు. స్పైస్‌జెట్ వ్యయాలు తగ్గించుకునేందుకు, నిధుల సమీకరించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో అజయ్ సింగ్.. గో ఫస్ట్ కోసం పోటీ పడుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆయన వ్యక్తిగత హోదాలో బిడ్డింగ్‌లో పాల్గొంటున్నట్లు స్పైస్‌జెట్ తెలిపింది. మరోవైపు, షార్జాకి చెందిన స్కై వన్ ఎఫ్‌జెడ్‌ఈ తాము కూడా బిడ్ వేసినట్లు వెల్లడించింది.



విదేశాలకు ఆకాశ ఎయిర్

న్యూఢిల్లీ: విమానయాన సంస్థ ఆకాశ ఎయిర్ అంతర్జాతీయ సర్వీసులు నడిపేందుకు రెడీ అయింది. ముంబై నుంచి దోహాకు తొలి అంతర్జాతీయ సర్వీసు మార్చి 28న ప్రారంభం కానుంది. వారంలో నాలుగు నాన్-స్టాప్ ఫ్లైట్స్ నడుపనుంది. 2022 ఆగస్టు 7న ఆకాశ ఎయిర్ కార్యకలాపాలు ప్రారంభించింది. కంపెనీ వద్ద బోయింగ్ 737 మ్యాక్స్ రకం 23 విమానాలు ఉన్నాయి. 150 బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలకు 2024 జనవరిలో ఆర్డర్ ఇచ్చింది.



వెయ్.. 'సిప్' వెయ్

- ఫండ్స్‌లో పెట్టుబడులకు యువత ఉత్సాహం
- వైట్‌ఓక్ క్యాపిటల్ మ్యూచువల్ ఫండ్

న్యూఢిల్లీ: మెజారిటీ యువత ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులకు సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్)ను ఎంపిక చేసుకుంటున్నారు. డిజిటల్ రూపంలో లావాదేవీలు సులభంగా నిర్వహించుకునే వీలు, ఖర్చు చేసే ఆదాయంలో వృద్ధి, ఆర్థిక అక్షరజ్ఞానం పెరుగుతుండడం ఇందుకు వీలు కల్పిస్తున్నట్టు వైట్‌ఓక్ క్యాపిటల్ మ్యూచువల్ ఫండ్ ప్రకటించింది. ఈ సంస్థ నిర్వహణలో 3.33 లక్షల ఇన్వెస్టర్లకు సంబంధించి రూ.8,400 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఏడాది క్రితమే ఈ సంస్థ మ్యూచువల్ ఫండ్స్ కార్యకలాపాలు మొదలు పెట్టింది. తన కస్టమర్లలో 56 శాతం జెనరేషన్ జెడ్, మిలీనియల్స్ (జెనరేషన్ వై) ఉన్నట్టు తెలిపింది. 1981–1996 మధ్య జన్మించిన వారు జెనరేషన్ వై కిందకు, 1997–2012 మధ్య జన్మించిన వారు జెనరేషన్ జెడ్ కిందకు వస్తారు. తనకున్న 3.33 లక్షల కస్టమర్లలో



28 శాతం మేర జెనరేషన్ జెడ్, మరో 28 శాతం మేర జెనరేషన్ వై విభాగంలోని వారేనని ఈ సంస్థ తెలిపింది. అంతేకాదు 51 శాతం మంది డిజిటల్ చానల్స్ ద్వారానే ఇన్వెస్ట్ చేస్తున్నట్టు పేర్కొంది. ''జెనరేషన్ వై, జెడ్ డిజిటల్ టెక్నాలజీ తెలిసిన వారు. కనుక వారు టెక్నాలజీ ఆధారితంగా నడిచే ఫైనాన్షియల్ సర్వీస్ ప్రొవైడర్లకు ప్రాధాన్యత ఇవ్వడం సహజమే''అని వైట్‌ఓక్ క్యాపిటల్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ ప్రతీక్ పంత్ తెలిపారు. సహేతుక రాబడులు, నిపుణుల ఆధ్వర్యంలో పెట్టుబడుల నిర్వహణ, చాలా స్వల్ప మొత్తం నుంచే పెట్టుబడికి అవకాశం, ఎన్నో రకాల పెట్టుబడి పథకాలు, సులభంగా ఉపసంహరించుకునే వెసులుబాటు ఇవన్నీ యువ ఇన్వెస్టర్లు సిప్ వేసేందుకు అనుకూలిస్తున్నట్టు చెప్పారు.

టికెట్ సైజు తక్కువే

18–35 ఏళ్ల వయసు వారు సిప్ రూపంలో చేస్తున్న పెట్టుబడి, ఇంతకంటే పెద్ద వయసులోని వారితో పోలిస్తే తక్కువగానే ఉన్నట్టు వైట్‌ఓక్ తెలిపింది. తమ పాకెట్ మనీ నుంచి లేదంటే పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేయడం ద్వారా వచ్చే మొత్తం నుంచి వీరు ఇన్వెస్ట్ చేస్తుండొచ్చని ప్రతీక్ పంత్ పేర్కొన్నారు. ప్రస్తుతం మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ నిర్వహణలో 7.92 కోట్ల సిప్ ఖాతాలు ఉన్నాయి.

నాలుగో రోజూ లాభాలు

- ఐటీ, ఆటో షేర్లకు డిమాండ్
- 22,000 పైకి నిఫ్టీ
- సెన్సెక్స్ లాభం 376 పాయింట్లు

ముంబై: ఐటీ, ఆటో షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు నాలుగో రోజూ లాభాలు ఆర్జించాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లోని సానుకూల సంకేతాలు, ప్రోత్సాహకర స్థూల ఆర్థిక గణాంకాలు సెంటిమెంట్‌ను మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచాయి. సెన్సెక్స్ 376 పాయింట్లు లాభపడి 72,427 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 130 పాయింట్లు పెరిగి 22 వేల స్థాయిపై 22,041 వద్ద ముగిసింది. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు రోజంతా స్థిరంగా ముందుకు కదిలాయి.



భారత వాణిజ్య లోటు 9 నెలల కనిష్టానికి దిగిరావడంతో క్యాపిటల్ గూడ్స్, మెటల్, పారిశ్రామిక రంగాల షేర్లకు కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. ఇటీవల ర్యాలీ చేసిన ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆయిల్‌అండ్‌గ్యాస్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 72,218 వద్ద కనిష్టాన్ని, 72,545 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 21,969 – 22,069 శ్రేణిలో ట్రేడైంది. బీఎస్‌ఈలో స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 0.68%, 0.78 % చొప్పున రాణించాయి.

- ఎంటెరో హెల్త్‌కేర్ సొల్యూషన్స్ లిస్టింగ్ నిరాశపరిచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.1,258)తో పోలిస్తే 1% డిస్కౌంట్‌తో రూ.1245 వద్ద లిస్టయ్యింది. 9.22 % నష్టపోయి రూ.1142 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 8.50% క్షీణించి రూ.1149 వద్ద ముగిసింది.
- వరుస పతనాల నుంచి పేటీఎం షేరు కోలుకుంది. దిగువ స్థాయిల్లో కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్‌ఈలో 5% ఎగసి రూ.341.50 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకింది.

సాక్షి స్పోర్ట్స్



భారత్‌కు మూడో విజయం

పురుషుల ప్రొ హాకీ లీగ్ టోర్నీలో భారత జట్టుకు మూడో విజయం దక్కింది. ఐర్లాండ్‌తో శుక్రవారం భువనేశ్వర్‌లో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 1–0 గోల్‌తో గెలిచింది. మ్యాచ్ చివరిదైన 60వ నిమిషంలో గుర్జంత్ సింగ్ గోల్‌తో భారత విజయాన్ని ఖరారు చేశాడు. భారత్ తమ తదుపరి మ్యాచ్‌ను సోమవారం స్పెయిన్‌తో ఆడుతుంది.

మహీప్ కుమార్, రికీ భుయ్ అర్ధ సెంచరీలు: ఆంధ్ర 260/7

కేరళ జట్టుతో శుక్రవారం మొదలైన రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'బి' చివరి లీగ్ మ్యాచ్‌లో... ఆంధ్ర జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 89.3 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 260 పరుగులు సాధించింది. మహీప్ కుమార్ (81; 12 ఫోర్లు), కెప్టెన్ రికీ భుయ్ (79 బ్యాటింగ్; 12 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. కరణ్ షిండే (43; 8 ఫోర్లు) రాణించాడు. కేరళ బౌలర్లలో బాసిల్ థంపి, వైశాఖ్ చంద్రన్ రెండు వికెట్ల చొప్పున తీశారు. గ్రూప్ 'బి' నుంచి ఇప్పటికే ముంబై, ఆంధ్ర జట్లు క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాయి.

ఐహిక, శ్రీజ సంచలనం

ప్రపంచ నంబర్‌వన్, రెండో ర్యాంకర్‌లకు షాక్





బుసాన్: ప్రపంచ టేబుల్ టెన్నిస్ (టీటీ) టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళల జట్టు స్ఫూర్తిదాయక ప్రదర్శనతో అదరగొట్టింది. డిఫెండింగ్ చాంపియన్ చైనాతో జరిగిన లీగ్ మ్యాచ్‌లో భారత్ 2–3తో ఓడిపోయింది. అయితే భారత క్రీడాకారిణులు ఐహిక ముఖర్జీ, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ పెను సంచలనం సృష్టించారు. తొలి మ్యాచ్‌లో ఐహిక 12–10, 2–11, 13–11, 11–6తో ప్రపంచ నంబర్‌వన్ సన్ యింగ్‌షాను ఓడించింది. రెండో సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ మనిక బత్రా ఓడిపోగా... మూడో సింగిల్స్‌లో ఆకుల శ్రీజ 11–7, 11–9, 13–11తో ప్రపంచ రెండో ర్యాంకర్ వాంగ్ యిదిపై గెలిచింది. దాంతో భారత్ 2–1తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే నాలుగో మ్యాచ్‌లో మనిక బత్రా, ఐదో మ్యాచ్‌లో ఐహిక ఓడిపోవడంతో భారత్‌కు నిరాశ తప్పలేదు.



ముగిసిన 92 ఏళ్ల నిరీక్షణ

హామిల్టన్: ఎట్టకేలకు టెస్టు ఫార్మాట్‌లో దక్షిణాఫ్రికా జట్టుపై న్యూజిలాండ్ జట్టు తొలిసారి సిరీస్‌ను సొంతం చేసుకుంది. శుక్రవారం జరిగిన రెండో టెస్టులో దక్షిణాఫ్రికా నిర్దేశించిన 267 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ ఛేదించి సిరీస్‌ను 2–0తో క్లీన్‌స్వీప్ చేసింది. 1932 నుంచి రెండు జట్ల మధ్య 18 టెస్టు సిరీస్‌లు జరిగాయి. దక్షిణాఫ్రికా 13 సార్లు నెగ్గగా, నాలుగు సిరీస్‌లు 'డ్రా'గా ముగిశాయి. 18వ ప్రయత్నంలో మొదటిసారి న్యూజిలాండ్‌కు సిరీస్ దక్కింది. ఓవర్‌నైట్ స్కోరు 40/1తో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ 94.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 269 పరుగులు చేసి గెలిచింది. కేన్ విలియమ్సన్ (133 నాటౌట్; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ సెంచరీ సాధించాడు. విల్ యంగ్ (60 నాటౌట్; 8 ఫోర్లు)తో కలిసి విలియమ్సన్ నాలుగో వికెట్‌కు 152 పరుగుల అభేద్యమైన భాగస్వామ్యాన్ని జోడించాడు.

డకెట్ ధనాధన్...

- ఇంగ్లండ్ ఓపెనర్ మెరుపు సెంచరీ
- తొలి ఇన్నింగ్స్‌లో 207/2
- భారత్ 445 ఆలౌట్
- అశ్విన్‌కు 500వ వికెట్

35 ఓవర్లలో 5.91 రన్‌రేట్‌తో 207 పరుగులు. పిచ్‌ను, ప్రత్యర్థిని లక్ష్య పెట్టకుండా ఇంగ్లండ్ మూడో టెస్టులోనూ తమ 'బజ్‌బాల్' మంత్రాన్ని చూపించింది. ఫలితంగా 445 పరుగుల భారీ స్కోరు కూడా భారత్‌కు సురక్షితం కాదనిపిస్తోంది. భారత గడ్డపై ఒక విదేశీ బ్యాటర్ ఆడిన అత్యుత్తమ ఇన్నింగ్స్‌లో ఒకటిగా నిలిచిపోయే శతకంతో ఓపెనర్ బెన్ డకెట్ చెలరేగాడు. దాంతో రెండు రోజుల ఆట తర్వాత రాజ్‌కోట్ టెస్టు సమంగా నిలిచింది. అశ్విన్ టెస్టుల్లో 500 వికెట్ల మైలురాయిని అందుకోవడం శుక్రవారం ఆటలో గుర్తుంచుకోదగ్గ మరో హైలైట్. మూడో రోజు ఇంగ్లండ్‌ను భారత బౌలర్లు ఎలా నిలువరిస్తారన్నదే ఆసక్తికరం.



డకెట్

రాజ్‌కోట్: భారత్‌తో మూడో టెస్టులో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ దూకుడుగా సాగుతోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ 2 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. బెన్ డకెట్ (118 బంతుల్లో 133 బ్యాటింగ్; 21 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో సత్తా చాటాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 326/5తో ఆట కొనసాగించిన భారత్ 445 పరుగులకు ఆలౌటైంది. ధ్రువ్ జురేల్ (46), అశ్విన్ (37) ఎనిమిదో వికెట్‌కు 77 పరుగులు జత చేశారు. ఇంగ్లండ్ మరో 238 పరుగులు వెనుకబడి ఉంది.

కీలక భాగస్వామ్యం...

రెండో రోజు ఆరంభంలోనే భారత్ రెండు వికెట్లు కోల్పోయింది. ఓవర్‌నైట్ స్కోరుకు మరో ఐదు పరుగులు జోడించగానే ఒకే స్కోరు వద్ద కుల్దీప్ (4), జడేజా (112) వెనుదిరిగారు. ఈ దశలో అశ్విన్, జురేల్ భాగస్వామ్యం భారత్‌ను 400 పరుగులు దాటించింది. అశ్విన్ జాగ్రత్తగా ఆడగా, అరంగేట్ర ఆటగాడు జురేల్ కొన్ని దూకుడైన షాట్లతో ఆకట్టుకున్నాడు. అయితే తన తొలి మ్యాచ్‌లో అతను అర్ధ సెంచరీని చేజార్చుకున్నాడు. ఈ భాగస్వామ్యం తర్వాత చివర్లో బుమ్రా (28 బంతుల్లో 26; 3 ఫోర్లు, 1 సిక్స్) కొన్ని విలువైన పరుగులు జోడించాడు. శుక్రవారం 44.5 ఓవర్లు ఆడిన భారత్ మరో 119 పరుగులు జత చేసింది.

దూకుడే దూకుడు...

ఇన్నింగ్స్ ఆరంభంలో డకెట్ కాస్త తడబడ్డాడు. కానీ బుమ్రా వేసిన ఐదో ఓవర్లో రెండు ఫోర్లతో ధాటిని మొదలు పెట్టిన అతను ఏ బౌలర్‌నూ వదలకుండా చివరి వరకు దూకుడు కొనసాగించాడు. సెంచరీ వరకు కూడా ఒక్క తప్పుడు షాట్ లేకుండా అతని ఇన్నింగ్స్ అద్భుతమైన స్ట్రోక్‌లతో దూసుకెళ్లింది. టీ తర్వాత తొలి ఓవర్‌నుంచి స్పిన్నర్ కుల్దీప్‌తో బౌలింగ్ వేయించిన ప్రణాళిక ఫలించలేదు. కుల్దీప్ తొలి 4 ఓవర్లలో డకెట్ స్వీప్, రివర్స్ స్వీప్‌లతో 7 ఫోర్లు బాదడం విశేషం. సిరాజ్ ఓవర్లో కొట్టిన రెండు ఫోర్లతో 39 బంతుల్లోనే అతని అర్ధ సెంచరీ పూర్తయింది. మరో ఎండ్‌లో దాదాపు ప్రేక్షక పాత్రకే పరిమితమైన క్రాలీ (15)ని అవుట్ చేసి ఎట్టకేలకు అశ్విన్ ఈ భాగస్వామ్యాన్ని విడదీశాడు. తర్వాత వచ్చిన ఒలీ పోప్ (39; 5 ఫోర్లు, 1 సిక్స్) కూడా ఇంగ్లండ్ జోరును కొనసాగించాడు. అశ్విన్ ఓవర్లో వరుస బంతుల్లో 6, 4 కొట్టి 90ల్లోకి చేరుకున్న డకెట్... సిరాజ్ ఓవర్లో బౌండరీతో 88 బంతుల్లోనే కెరీర్‌లో మూడో శతకాన్ని అందుకున్నాడు. చివరకు సిరాజ్ చక్కటి బంతికి పోప్ వికెట్ల ముందు దొరికిపోయాడు.

ఐదు పరుగులు పెనాల్టీ...

భారత బ్యాటర్లు నిబంధనలకు విరుద్ధంగా పిచ్‌పై పరుగెత్తడంతో అంపైర్లు చర్య తీసుకున్నారు. తొలి రోజు ఆటలో జడేజాను ఈ విషయంపై అంపైర్లు హెచ్చరించగా... రెండో రోజు అశ్విన్ కూడా అలాగే చేయడంతో భారత ఇన్నింగ్స్ 102వ ఓవర్లో 5 పరుగులు పెనాల్టీగా విధించారు. దాంతో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 5/0తో మొదలైంది.

అశ్విన్ @ 500



ఇంగ్లండ్ ఓపెనర్ క్రాలీని అవుట్ చేయడం ద్వారా అశ్విన్ టెస్టుల్లో 500 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. తన 98వ టెస్టులో ఈ ఘనత సాధించిన అశ్విన్... ఓవరాల్‌గా 9వ ఆటగాడిగా, అనిల్ కుంబ్లే (619) తర్వాత రెండో భారత బౌలర్‌గా నిలిచాడు. మ్యాచ్‌లు, బంతుల పరంగా చూస్తే... అత్యంత వేగంగా 500 వికెట్ల మార్క్‌ను చేరిన బౌలర్లలో అశ్విన్ రెండో స్థానంలో నిలవడం విశేషం. 2011లో విండీస్‌పై టెస్టుల్లో అరంగేట్రం చేసిన అశ్విన్ ఇప్పటి వరకు ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు 24 సార్లు... ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు 34 సార్లు... మ్యాచ్ మొత్తంలో 10 వికెట్లు 8 సార్లు తీశాడు.

టెస్టు నుంచి తప్పుకున్న అశ్విన్

రాజ్‌కోట్ టెస్టులో అనూహ్య పరిణామం సంభవించింది. తన కుటుంబంలో ఏర్పడిన అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో అశ్విన్ మూడో టెస్టు నుంచి మధ్యలోనే తప్పుకున్నాడు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి (సి) రూట్ (బి) వుడ్ 10; రోహిత్ (సి) స్టోక్స్ (బి) వుడ్ 131; గిల్ (సి) ఫోక్స్ (బి) వుడ్ 0; పటిదార్ (సి) డకెట్ (బి) హార్ట్‌లీ 5; జడేజా (సి) అండ్ (బి) రూట్ 112; సర్ఫరాజ్ (రనౌట్) 62; కుల్దీప్ (సి) ఫోక్స్ (బి) అండర్సన్ 4; జురేల్ (సి) ఫోక్స్ (బి) రేహన్ 46; అశ్విన్ (సి) అండర్సన్ (బి) రేహన్ 37; బుమ్రా (ఎల్బీ) (బి) వుడ్ 26; సిరాజ్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (130.5 ఓవర్లలో ఆలౌట్) 445. వికెట్ల పతనం:** 1–22, 2–24, 3–33, 4–237, 5–314, 6–331, 7–331, 8–408, 9–415, 10–445. **బౌలింగ్:** అండర్సన్ 25–7–61–1, వుడ్ 27.5–2–114–4, హార్ట్‌లీ 40–7–109–1, రూట్ 16–3–70–1, రేహన్ 22–2–85–2. **ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** క్రాలీ (సి) పటిదార్ (బి) అశ్విన్ 15; డకెట్ (బ్యాటింగ్) 133; పోప్ (ఎల్బీ) (బి) సిరాజ్ 39; రూట్ (బ్యాటింగ్) 9; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (35 ఓవర్లలో 2 వికెట్లకు) 207. వికెట్ల పతనం:** 1–89, 2–182. **బౌలింగ్:** బుమ్రా 8–0–34–0, సిరాజ్ 10–1–54–1, కుల్దీప్ యాదవ్ 6–1–42–0, అశ్విన్ 7–0–37–1, జడేజా 4–0–33–0.

చరిత్ర సృష్టించిన సింధు బృందం

ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో తొలిసారి పతకం

షా ఆలమ్ (మలేసియా): అంచనాలకు మించి రాణించిన భారత మహిళల జట్టు ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో తొలిసారి పతకాన్ని ఖాయం చేసుకుంది. హాంకాంగ్‌తో శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో పీవీ సింధు బృందం 3–0తో గెలిచి సెమీఫైనల్‌కు చేరుకుంది. తద్వారా కనీసం కాంస్య పతకాన్ని ఖరారు చేసుకుంది. నేడు జరిగే సెమీఫైనల్లో జపాన్‌తో భారత్ ఆడుతుంది. హాంకాంగ్‌తో జరిగిన పోరులో తొలి మ్యాచ్‌లో పీవీ సింధు 21–7, 16–21, 21–12తో లో సిన్ యాన్‌పై నెగ్గి భారత్‌కు 1–0తో ఆధిక్యం అందించింది. రెండో మ్యాచ్‌లో అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో ద్వయం 21–10, 21–14తో యెంగ్ టింగ్–యెంగ్ పుయ్ లామ్ జోడీని ఓడించింది. మూడో మ్యాచ్‌లో అష్మిత 21–12, 21–13తో యెంగ్ సమ్ యీపై గెలిచి భారత్‌కు చిరస్మరణీయం విజయాన్ని అందించింది.



గెలుపు వాకిట శ్రీకాంత్ బోల్తా



భారత పురుషుల జట్టు మాత్రం క్వార్టర్ ఫైనల్లో 2–3తో జపాన్ చేతిలో ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించింది. స్కోరు 2–2తో సమమయ్యాక నిర్ణాయక ఐదో మ్యాచ్‌లో కిడాంబి శ్రీకాంత్ 21–17, 9–21, 20–22తో ప్రపంచ మాజీ చాంపియన్ కెంటో మొమోటా చేతిలో ఓడిపోయాడు. మూడో గేమ్‌లో శ్రీకాంత్ 19–12తో ఆధిక్యంలో నిలిచి విజయానికి రెండు పాయింట్ల దూరంలో నిలిచాడు. అయితే ఇప్పటి వరకు శ్రీకాంత్‌ను 15 సార్లు ఓడించిన మొమోటా ఏమాత్రం ఆందోళన చెందకుండా ఆడి వరుసగా 8 పాయింట్లు గెలిచి 20–19తో ఆధిక్యంలోకి వచ్చాడు. ఆ తర్వాత శ్రీకాంత్ 20–20తో స్కోరును సమం చేశాడు. అయితే వెంటనే మొమోటా వరుసగా రెండు పాయింట్లు గెలిచి గేమ్‌ను 22–20తోపాటు మ్యాచ్‌ను 3–2తో జపాన్‌కు అందించి భారత శిబిరాన్ని నిరాశలో ముంచాడు. అంతకుముందు తొలి మ్యాచ్‌లో ప్రణయ్ ఓడిపోగా... రెండో మ్యాచ్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీ గెలిచింది. మూడో మ్యాచ్‌లో లక్ష్యసేన్ నెగ్గగా... నాలుగో మ్యాచ్‌లో ధ్రువ్ కపిల–అర్జున్ జంట ఓటమి పాలైంది.

మద్యంతో మహిళల జట్టు కోచ్

విద్యుత్ జైసింహపై హెచ్‌సీఏ వేటు



సాక్షి, హైదరాబాద్: ఆయన రాష్ట్ర సీనియర్ మహిళల క్రికెట్ జట్టు కోచ్... టీమ్‌తో పాటు మ్యాచ్ కోసం బస్సులో ప్రయాణిస్తున్నారు... ఎంతో బాధ్యతగా, హుందాగా వ్యవహరించాల్సిన వ్యక్తి కట్టు తప్పారు. బస్సులోనే మద్యం బాటిల్ తీసి దర్జాగా సేవించారు. ఆపై ముందు సీట్లో దానిని పెట్టుకొని అదే కొనసాగించారు! ఈ వీడియో వెలుగులోకి రావడంతో వ్యవహారం బయటపడింది. హైదరాబాద్ మహిళల టీమ్‌కు హెడ్ కోచ్‌గా ఉన్న విద్యుత్ జైసింహ చేసిన నిర్వాకమిది. ఈ ఘటనపై హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) వెంటనే స్పందించింది. జైసింహను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. పూర్తి స్థాయిలో విచారణకు ఆదేశించడంతో పాటు విచారణ ముగిసే వరకు హైదరాబాద్ క్రికెట్‌కు సంబంధించిన ఎలాంటి వ్యవహారాల్లో పాలుపంచుకోరాదని ఆదేశించింది. ఈ ఘటన ఎప్పటిదనే విషయంపై స్పష్టత రాలేదు. బస్సులోకి ఆల్కహాల్‌ను ఎవరు తీసుకొచ్చారు, ఎలా అనుమతించారనే దానిపై కూడా విచారణ చేస్తామని హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు ప్రకటించారు. పాతతరం క్రికెట్ దిగ్గజం ఎంఎల్ జైసింహా కుమారుడైన విద్యుత్ గతంలో హెచ్‌సీఏలో వేర్వేరు బాధ్యతల్లో పని చేశారు. తండ్రి పేరుతోనే సికింద్రాబాద్‌లో చాలా ఏళ్లుగా ఒక ప్రైవేట్ క్రికెట్ అకాడమీని కూడా నిర్వహిస్తున్నారు. అయితే తనపై వచ్చిన ఆరోపణలను విద్యుత్ జైసింహా ఖండించారు. తానెప్పుడూ టీమ్ బస్సులోకి మద్యాన్ని తీసుకురాలేదని, తాగలేదని స్పష్టం చేశారు. తనపై ఆరోపణలు నిరాధారమని... ఒక హైదరాబాద్ మాజీ క్రికెటర్ కుమార్తెను జట్టులోకి ఎంపిక చేయకపోవడంతో ఉద్దేశపూర్వకంగా తనను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని జైసింహా వివరణ ఇచ్చారు.





వలవేసి.. క్రేన్‌తో చేరవేసి!


చెరువు మాదారంలో ఒక్కో చేప బరువు 10 కిలోలకుపైనే..

నేలకొండపల్లి: మూడేళ్లుగా ఆ చెరువులో చేపలవేట సాగలేదు. దీంతో ఒక్కోటి పది కిలోల పైనే బరువుకు చేరింది. వాటిని మత్స్యకారులు వలలతో పట్టి లారీల్లో చేరవేయడానికి క్రేన్ ఉపయోగించాల్సి వచ్చింది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని చెరువుమాదారం చెరువుకు సంబంధించి సొసైటీ సభ్యుల నడుమ విభేదాలతో మూడేళ్లుగా చేపలవేట సాగడంలేదు. దీంతో చేపలు ఒక్కొక్కటి పదికిలోలకుపైగా బరువుకు చేరగా, ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో చెరువులో నీరు అడుగంటింది. దీంతో కొత్తగా ఎన్నికైన పాలకవర్గం చొరవతో శుక్రవారం చేపల వేట మొదలుపెట్టారు. చెరువు లీజ్ దక్కించుకున్న వ్యాపారి ఆధ్వర్యాన మత్స్యకారులు పట్టిన చేపలను చెరువులోంచే నేరుగా క్రేన్ ద్వారా లారీల్లోకి చేరవేశారు. ఆపై లారీలను కోదాడలోని వ్యాపార కేంద్రానికి తరలించి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. చేపలు భారీ సైజ్‌లో ఉండటం, పెద్దసంఖ్యలో వలకు చిక్కడంతో స్థానికులు వాటి కోసం పోటీపడే అవకాశమున్నందున ఒడ్డుకు తీసుకురాకుండా నేరుగా లారీల్లోకి ఎక్కించినట్లు తెలిసింది.

అగ్ని పర్వతం ప్రేమ ఇది!

వాలెంటైన్స్ డే రోజున సోషల్ మీడియాలో హల్‌చల్ చేసిన 'లవ్ సింబల్' సరస్సు చిత్రమిది. అంత కచ్చితంగా హృదయాకారంలో సరస్సు ఉండటమేంటి? అదేదో గ్రాఫిక్స్‌లో చేసి ఉంటారేమో అన్న అనుమానపు కామెంట్లకూ కొదవలేదు. అయితే ఈ సరస్సు నిజంగానే ఉంది. దాని వెనుక చిత్రమైన చరిత్ర కూడా ఉంది.

1979: నాసా తీసిన శాటిలైట్ చిత్రం 2023: ఏప్రిల్ నాటి శాటిలైట్ చిత్రం



అమెరికాలోని వాషింగ్టన్ రాష్ట్రంలో 'మౌంట్ సెయింట్ హెలెన్స్' అగ్ని పర్వతానికి సమీపంలో ఉన్న సరస్సు పేరు 'స్పిరిట్ లేక్'. కొండల మధ్య ఉన్న ఆ సరస్సు మొదట్లో వేరే ఆకారంలో ఉండేది. జనం దానిలో ఈత కొట్టేవారు, పడవల్లో తిరిగేవారు, చేపలు పట్టేవారు. కానీ 1980 మే 18వ తేదీన హెలెన్స్ అగ్నిపర్వతం బద్దలవడంతో పరిస్థితి మారిపోయింది.

అగ్ని పర్వతం బద్దలైనప్పుడు వచ్చిన ప్రకంపనలతో కొండ చరియలు విరిగి సరస్సులో పడ్డాయి. అగ్నిపర్వతం నుంచి వెలువడిన లావా కూడా సరస్సులోకి వెళ్లింది. దీంతో సరస్సులో నీటి మట్టం 60 మీటర్లు పైకి వచ్చింది. ఆ నీరంతా చుట్టూ ఉన్న ప్రాంతంలోకి చేరి.. సరస్సు హృదయం ఆకారంలోకి మారింది. ప్రేమికులకు సందర్శనీయ స్థలంగా మారింది.

అగ్నిపర్వతం బద్దలైన తర్వాత అక్కడ ఏర్పడిన మార్పులు, భూమి పొరలు తిరిగి సర్దుకునే పరిస్థితిపై విస్తృత పరిశోధనలు చేపట్టారు. ఇందుకోసం నాటి నుంచి ఈ సరస్సులోకి దిగడం, ఈత కొట్టడం, చేపలు పట్టడం వంటివన్నీ నిషేధించారు. సందర్శకులు కేవలం కొంత దూరంలోని వ్యూపాయింట్ నుంచి చూడటానికి మాత్రమే చాన్స్ ఇచ్చారు.

తుపాకీతో 21 వీధికుక్కల కాల్చివేత!

మహబూబ్‌నగర్ జిల్లా పొన్నకల్‌లో దుండగుల దురాగతం

అడ్డాకుల: మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం పొన్నకల్‌లో గుర్తుతెలియని వ్యక్తులు రెచ్చిపోయారు. గురువారం అర్ధరాత్రి వీధికుక్కలపై దాడికి తెగబడ్డారు. దుండగులు అర్ధరాత్రి కారులో గ్రామానికి వచ్చి అందులోనే వీధుల్లో తిరుగుతూ కనిపించిన కుక్కనల్లా తుపాకీతో కాల్చివేశారు. ఈ ఘటనలో 21 కుక్కలు చనిపోగా, మరికొన్ని గాయాలతో బయటపడ్డాయి. శుక్రవారం ఉదయం గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. క్లూస్‌టీం ఆధారాలను సేకరించింది. కుక్కలను చంపినచోట కొన్ని బుల్లెట్ల ఆనవాళ్లు పోలీసులకు లభించాయి. మండల పశువైద్యాధికారి డాక్టర్ రాజేశ్ ఖన్నా కుక్కలకు పోస్టుమార్టం నిర్వహించి శాంపిళ్లను పోలీసులకు అందజేశారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.